


యుగావతారి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య జీవిత చరిత్ర మరియు వారి అవతార కార్యక్రమము **1969 - 1972** సంవత్సరాలకు సంబంధించి, ముఖ్యంగా స్త్రీ విద్యయొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ స్త్రీలకొరకు విద్యాసంస్థలను నెలకొల్పడం 'సత్యం శివం సుందరం' గ్రంథముయొక్క ఈ తృతీయ భాగములో వర్ణింపబడింది.

**Prasanthi Nilayam**

T00TEL001906
SSSBPT
7474
Rs. 35

ISBN: 978-81-7208-555-1
978-81-7208-533-9(Set)



# సత్యం శివం సుందరం

## 3వ భాగం

# సత్యం శివం సుందరం

(తృతీయ భాగము)

**(SATYAM SIVAM SUNDARAM)**
**PART III**

ఆంగ్ల మూలం:

ఎన్.కస్తూరి

**భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి**

**దివ్య చరిత్రము**

PRASANTHI NILAYAM

శ్రీ సత్యసాయ్ బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్
ప్రశాంతి నిలయం, ఇండియా. పిన్ కోడ్ - 515 134
అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.
యస్.టి.డి. : 08555 ఐ.యస్.డి : 91-8555
ఫోన్ : 287 375, ఫ్యాక్స్ : 287 236

# సత్యం శివం సుందరం

(తృతీయ భాగము)

**(SATYAM SIVAM SUNDARAM)**
**PART III**

ఆంగ్ల మూలం:

ఎన్.కస్తూరి

**భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి**

**దివ్య చరిత్రము**

PRASANTHI NILAYAM

శ్రీ సత్యసాయ్ బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్
ప్రశాంతి నిలయం, ఇండియా. పిన్ కోడ్ - 515 134
అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.
యస్.టి.డి. : 08555  ఐ.యస్.డి : 91-8555
ఫోన్ : 287 375,  ఫ్యాక్స్ : 287 236

© శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్
ప్రశాంతి నిలయం - పోస్ట్, 515 134.
అనంతపురం జిల్లా. ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ప్రచురణ సర్వ హక్కులు శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్ వారివే.

ప్రచురణాధికారము మరియు ఏ ఇతర బాషలలోకి అనువదించు అధికారము లన్నియు ప్రచురణ కర్తలవే. ఈ పుస్తకమునకు సంబందించిన ఏ భాగము కాని, పూర్తిగా కాని, చిత్రపటములు గాని, కళా కౌశల్యము గాని, నకలు తీయరాదు. కన్వీనరు, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతి నిలయం, ఆంధ్రప్రదేశ్, ఇండియా - 515 134, వారి వ్రాత మూలముగా అనుమతి లేనిదే ఈ పుస్తకము అనువదించుట, ఉపయోగించుట, ఈ భాషలోకి గాని మరి ఏ ఇతర భాషలోకి అనువదించుట, మరి ఏ ఇతర రూపములోనైనా, ఫోటోకాపీ, రికార్డింగ్ మరి ఏ ఇతర సాధనము వలన గాని ఈ పుస్తకములోని ఏ భాగము ఉపయోగించరాదు. గ్రంథ సమీక్షకు మాత్రము ఈ నిషేధము వర్తించదు.

ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నెం. 978-81-7208-555-1
978-81-7208-533-9 (SET)

| | | |
|---|---|---|
| పునర్ముద్రణ | : | ఫిబ్రవరి, 1999 |
| పునర్ముద్రణ | : | ఫిబ్రవరి, 2000 |
| పునర్ముద్రణ | : | ఆగస్టు, 2000 |
| పునర్ముద్రణ | : | జూన్, 2001 |
| పునర్ముద్రణ | : | మే, 2002 |
| పునర్ముద్రణ | : | మే, 2003 |
| పునర్ముద్రణ | : | జూన్, 2004 |
| పునర్ముద్రణ | : | మార్చి, 2006 |
| తృతీయ ముద్రణ | : | ఏప్రిల్,2008 |

ప్రచురించువారు:
కన్వీనర్, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్సు ట్రస్ట్
ప్రశాంతి నిలయం, ఇండియా, పిన్‌కోడ్-515 134
యస్.టి.డి. : 08555, ఐ.ఎస్.టి.డి.: 91-8555
ఫోన్: 287375, ఫ్యాక్స్ : 287236

ముద్రణ:
విష్ణ కంప్యూటర్ సర్వీసెస్
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాదు - 500 044.
ఫోన్: 27654003, 27676910, 27677078



# తొలి పలుకు

*ప్రియమైన పాఠకులారా!*

'నేతి, నేతి' ఇది కాదు అది కాదు అని తప్ప ఉపనిషత్తులు సహితము నిర్వహించలేని మాటలకూ ఊహలకూ అతీతమైనటువంటి బాబాను గురించి వ్రాయబడినదీ గ్రంథము. "నేను మీ అందరిలో వున్నాను. మీరందరూ నాలో వున్నారు. నా దివ్యతత్వమును గ్రహించుట మీ తరము కాదు" అని బాబా ప్రకటించిరి.

"నే మనిషికి కాను; దేవుణ్ణి కాను, దేవతను కాను, దేవదూతనుకాను, నాకు వర్ణాశ్రమములు లేవు. నన్ను సద్గురువుగా, సత్యం శివం సుందరముగా తెలుసుకొనుడు" అని ఒకనాడు బాబా అన్నారు.

తాను సత్యం, శివం, సుందరం అని బాబా స్పష్టముగా తెలిపిరి. ఈ మూడు ప్రేమ యొక్క రూపాంతరములే. అంటే ప్రేమ స్వరూపులైన బాబాకు యివి మారు పేర్లు. ప్రేమ యొక్క భావనయే సత్యం, ప్రేమ యొక్క ఆచరణయే శివం; ప్రేమ యొక్క స్వరూపమే సుందరం.

బాబా యొక్క బహుముఖ దివ్యచరిత్రను వ్రాయుట ఎంతటి పండితునికైనను సాధ్యమా! బాబా యొక్క ప్రేమామృతమించుక గ్రోలిననూ ఆ దివ్యానందానుభూతిని అందరితోనూ పంచుకొనవలెననియెడి తీవ్రమైన వాంఛ నిరక్షరాస్యుని సహితము వ్రాయుటకు పురిగొల్పును.

బాబా మానవాళి ప్రార్థనల ఫలితముగా అవతరించిరి. "దారి చూపు దిక్కులేక, నిరాశ నిట్టూర్పులతో రక్షకుని కొరకు మొరపెట్టుకొనగా నేనీ రూపము ధరించి దిగివచ్చితిని" అని బాబా చెప్పుచుందురు.

కథకుని భాషాశైలిలో లోపములున్ననూ, కథా వస్తువు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యచరిత్ర, లీలలూ, ప్రబోధలు కాబట్టి, ఇది చదివి ఆనందించు అధికారమందరికీ వున్నది.

ప్రథమ భాగము 1960 సం॥లోనూ, ద్వితీయభాగము 1968 సం॥లోనూ మీ హస్తముల నుంచబడినది. మిమ్మానందపారవశ్యమున తేలియాడించు ఈ తృతీయ భాగమును ఇప్పుడు సవినయముగా సమర్పించుచున్నాను. ఈ విధముగా వారి మహిమలనూ లీలలనూ కూర్చి గుచ్చి మాలగా వారి చరణముల మ్రోల సమర్పించు భాగ్యము ప్రసాదించిన బాబా కరుణని ఏమని కొనియాడగలను!

బృందావన్<br>బెంగుళూరు

**కస్తూరి**<br>16-3-1972

# అరుణోదయం

ఉరవకొండ హైస్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతున్న పధ్నాలుగు సంవత్సరముల ప్రాయముగల సత్యనారాయణరాజనే విద్యార్థి ఒక సాయంకాలం పుస్తకముల సంచి గిరవాటు పెట్టి "మీకూనాకూ సంబంధము లేదు. నా భక్తులు నన్ను పిలుస్తున్నారు. నా ధర్మము నెను నెరవేర్చవలెను" అనుచూ తన అన్నగారి గృహమును విడచి ఒక మర్రిచెట్టు క్రింద కూర్చుని తన చుట్టూ చేరిన వారితో తనతో కలిసి పాడమని "మానస భజరే గురుచరణం, దుస్తరభవసాగర తరణం" అనుచూ పాటపాడ నారంభించెను. ఈవిధముగా ఈ యద్భుత అవతార ప్రకటన జరిగెను.

మహారాష్ట్రలో సమాధిపొందిన షిర్డీ సాయిబాబా తన వాగ్దానానుసారం, తిరిగి అవతరించినట్లు శుభవార్త ప్రాకినది, షిర్డీకి వెళ్ళదల్చుకున్న భక్తులు తండోపతండములుగా పుట్టపర్తికి తరలివచ్చి, బాల్యము నుండి ఆటలతో, పాటలతో, మహిమలతో అలరారుచున్న బాలబాబాను సందర్శించిరి. పరిసర ప్రాంతముల నుంచీ దూర ప్రాంతముల నుంచి వికలాంగులూ, వ్యాధిపీడితులూ, వ్యధితహృదయులూ వందలకొలదీ వచ్చిరి. ఓదార్చి, వ్యాధులు కుదిర్చి, కర్తవ్యమును బోధించి, పేదలు, ధనికులు అను భేదము లేకుండా వారందరిపైన బాబా ప్రేమను వర్షించె; మానవతీతమైన మహిమలను, మహాజ్ఞానులను మించిన ప్రజ్ఞాపాండిత్యములను ఆ బాలునిలో చూచి పరిశీలించుటకు వచ్చినవారు పరవశించి, తమ అదృష్టమును యితరులతో పంచుకొనుటకు ఉవ్విళ్ళూరిరి. అనతి కాలములోనే ప్రభువు యొక్క ప్రభావము ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతమునకు ప్రాకినది. ఆ విధముగా భూమిని దున్ని సిద్ధము చేసిరి.

కన్యాకుమారి నుండి చిలాస్ మార్గ్ వరకూ పర్యటించి తమ 32వ యేట ధర్మ సంస్థాపనోద్యమము విస్తృతము చేయ సంకల్పించి తెలుగు, ఇంగ్లీషు, హిందీ, తమిళము, కన్నడము, మళయాళము, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ భాషలలో "సనాతన సారథి" అనే మాసపత్రికను ప్రారంభించి జయభేరీ మ్రోగించి మానవుని మేల్కొలిపిరి. మానవుని అంతశ్శత్రువులైన కామ, క్రోధ, మోహ, లోభ, మద మాత్సర్యములపై దండెత్త పురిగొల్పు శంఖారావమది.

బాబా అందరిని భగవన్నామ సంకీర్తన చేయమని ప్రోత్సహించెను. సందిగ్ధము, సంశయము, నిరాశాలతో దహించబడి ఎండి బీటలు వారిన హృదయములపై చల్లని అనుగ్రహము వర్షించి, సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను విత్తనములను నాటిరి.

ఆ ప్రేమ స్వరూపుని అనుగ్రహ కిరణములు సోకినంతనే కొందరు ఆధ్యాత్మిక సాధనల కుపక్రమించిరి; కొందరు జీవిత పరమావధిని అన్వేషింప దొడగిరి. ఎందరో భజనలో పాల్గొనుచూ దివ్యానందము ననుభవించిరి. ఆ సమయముననే మద్రాసులో జరిగిన అఖిల భారత సత్యసాయి సేవాసంస్థల సమావేశములో సంఘ సేవ యొక్క ప్రాధాన్యతనూ, సేవాతత్పరత ద్వారా ఆత్మసాక్షాత్కారము పొందుమార్గమును బాబా ప్రబోధించి సంస్థల కార్యకర్తలకు నూతనోత్సాహమునూ, నూతన దృక్పథమునూ ప్రసాదించిరి. ఆ విధముగా సాయి అరుణ కిరణములతో నాడు నాటిన విత్తనములు అంకురింప దొడగెను.

'సత్యం, శివం, సుందరం' మొదటి రెండు సంపుటులలోనూ ఈ దివ్యగాథను సమర్పించితిని.

మన హృదయముల శాంతి నింపు ఈ భాగవత గాథను మనకు జీవన్ముక్తి ప్రసాదించు మన ప్రభువు యొక్క పావన చరితమునందలి మరి కొంత భాగము నిందు సమర్పించుచున్నాను.

# ప్రకరణ వివరణ


| | | పేజి |
|---|---|---|
| 1. | ప్రచారము : ఆచరణ | 1 |
| 2. | సంకేతము : సంతకము | 16 |
| 3. | దీపావళి | 24 |
| 4. | విదేశీయులు - వారి విశ్వాసము | 40 |
| 5. | షిరిడీ పాదములు | 58 |
| 6. | ఆనంద సీమ | 72 |
| 7. | సర్వం - సర్వమయం | 89 |
| 8. | బహిర్గతమైన జ్యోతి | 99 |
| 9. | అంధకారములో ఆశాకిరణము | 116 |
| 10. | ఎంతటి కరుణ | 129 |
| 11. | ప్రేమయే జీవనసారము | 135 |
| 12. | మరొక అద్భుతము | 140 |
| 13. | కాంతి పథము | 152 |
| 14. | ఏ నామమైన నేమి | 165 |
| 15. | మరొక్క మాట | 174 |

ఓమ్ శ్రీ సాయిరామ్

# సత్యం శివం సుందరమ్

## ప్రచారము : ఆచరణ

''మనోభావములలో మార్పు రావలెనన్న విద్యా విధానములో మార్పు తీసుకురావలెను'' అన్నారు అరవింద మహర్షి. శ్రీరామునకు కోదండము, శ్రీకృష్ణునకు చక్రము వున్నట్లుగా ఈ యువతారమున కెట్టి ఆయుధమూ లేదు. ఈ యవతారములో మంచిని పెంచుటకు, చెడును త్రుంచుటకు ప్రభోధమే ఆయుధము; శిక్షణ ద్వారానే ధర్మరక్షణ, భయము పిరికితనము విసర్జించి దుష్టులు శిష్టులుగా పరివర్తన చెందుటకు శిష్టుల సత్ప్రవర్తన పరాకాష్ఠ నందుకుని వారు భగవదనుగ్రహ పాత్రులుగా మారుటకు కావలసిన ప్రోత్సాహ బలము బాబా సమకూర్చెదరు.

బాబా ఈ యుగములో మానవోద్ధరణకై జన్మించిన మహత్తర విద్యాదాత, వారి ప్రతిమాట ఒక మంత్రము, ప్రతి ఉపన్యాసము ఒక ఉపనిషత్తు, ప్రతి ప్రబోధము ఒక భగవద్గీత, ప్రతి మాట ఒక పాఠము. వారి దర్శనమే హృదయాంతరంగమున తీర్థయాత్ర, వారితో సంభాషణయే దివ్యమైన ఆత్మజ్ఞాన స్నానం. పసిపాప నుండి పరమ మూర్ఖునివరకూ బాబా ఆధ్యాత్మిక సాధన బోధించెను. అన్ని రకాల వారినీ బాబా తమ వద్ద చేర్చుకొనెదరు. వారి వారి అభిరుచులు, అవసరములు, ఆతురత గ్రహించిన బాబా వారికి తగిన ఆధ్యాత్మిక ఆహారము నందించి, సందేహములు తీర్చి ఆనంద పరచెదరు.

కష్టనష్టములందు ఓదార్చుటలో, ప్రవర్తనలో పరివర్తన తెచ్చుటలో, ఉపదేశ భాగ్యము కలిగించుటలో బాబా తరచు జాబులు వ్రాస్తూ వుంటారు. వారిపై ప్రేమామృతము వర్షించియో, సహచర్య మాధుర్యమును గ్రహించుటవలననో, తీవ్రమైన మందలింపు ద్వారానో సాధకులకు చేయూత నిచ్చి ముందుకు కొనిపోయెదరు. వారు రచించిన ప్రేమవాహిని, జ్ఞానవాహిని, ధ్యాన వాహిని, ధర్మవాహిని, సందేహ నివారిణి, గీతావాహిని, భాగవత వాహిని మొదలైన గ్రంథములలో బహుక్లిష్టమైన ఆధ్యాత్మిక అంశములు సహితము అత్యంత సులభ గ్రాహ్యములుగా బోధించ బడినవి. అవి సాధకుల పాలిట పెన్నిధులు. **కాలప్రవాహంలో** కవుల భావావేశముల మూలము గానూ, ఊహాగానము వలననూ ఇతిహాస పురాణ గాధలందు వచ్చిన మార్పులూ చేర్పులూ మౌలిక గ్రంథములందలి సహజ సౌందర్యమును మట్టుబెట్టుచున్నవి. అందువలననే, నేడు సత్యాన్వేషాభిలాషులైన సాధకులు వాటిని పఠించి జ్ఞానామృతమును గ్రోలుటకు

బదులు విసుగు చెందు చున్నారు. ఈ కారణముననే బాబాయే స్వయముగా భాగవత రామాయణములను క్రోడీకరించి తిరిగి రచించినారు. ఇవి మోక్ష కాముకులకు మార్గదర్శకములైన అమూల్య గ్రంథములు.

ఎంత మారుమూల కుగ్రామములైననూ బాబా ఉపన్యాసమనిన వేలకువేలు జనులు చేరి ఆనందపరవశులయ్యెదరు. భాష తెలియక పోయిననూ ఆ దివ్యోపన్యాసము వినినవారి జీవితంలో నాటి నుండి నూతన శకము ప్రారంభమగుచుండును. ''హృదయమునకూ హృదయము నకూ మధ్య ప్రేమ ప్రవహించుచుండగా భాష ప్రతిబంధకమే కాని సాధనము కానేరాదు'' అని బాబాయే అనుచుందురు.

భక్తులు నిదురించే సమయమున అవసరమయిన బలవంతముగా నిదురలేపియైననూ ప్రబోధించు దివ్య ప్రబోధకులు బాబా తిరువన్నామలై రమణాశ్రమములో నిద్రించుచున్న అభేదానందస్వామి హృదయము మీద తట్టి లేపగా, అదిరిపడి, ''ఎవరూ? ఏమిటి? ఎందుకు?'' అంటూ ఆయన కండ్లు తెరచిచూచిరి. కండ్లయెదుట బాబా! చూచుచుండగనే బాబా రూపము రమణమహర్షి రూపముగ మారెను. పిదప, బాబా రమణ మహర్షుల రూపము కలసి తిరిగి జ్యోతి రూపమున వెలుగొందు దృశ్యము కనబడెను. పిదప, బాబా రమణ మహర్షుల అభిన్నత్వమును నిరూపించుటకే ఈ దృశ్య కల్పనమని అభేదానంద గ్రహించెను. తరువాత అభేదానందునితో తెలుగులో మాట్లాడి అతని మనస్సుని వెంటాడు సంశయములూ సంఘర్షణలూ దూరము చేయుటకు అవసరమైన ధ్యాన విధానమును బోధించెను.

కొందరు సాధకులకు బాబా స్వప్నములందు దర్శనమిచ్చి సకాలములో అవసరమైన సలహోలిచ్చెదరు. ఒక సాధకునకు ''విశుద్ధ చక్రముపై మనస్సు లగ్నము చెయ్యి'' అని స్వప్నమున సలహా యిచ్చిరి. ఈ చక్రము ఆహారకోశ మధ్యమున నుండునట. సరిగ ఆ సమయమున, ఆ సాధకుడు జీర్ణాశయమునకు సంబందించిన వ్యాధితో బాధపడుచుండెను. మరొక సాధకునకు ''మహన్యాసము కూడ చదువుము'' అని వినవచ్చెను. అతడు బహు శ్రద్ధగా దేవీ భాగవతమును పారాయణము చేయుచుండునట. బాబా ధ్యానమునందు సాక్షాత్కరించి వ్యక్తుల ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన సందేహములు తీర్చి సరియైన దారి చూపెదరు. కాలిఫోర్ని యాలో వున్న చార్లెస్ పెన్ అను భక్తునకట్లే ధ్యాన సమయమున కనిపించి సంశయము బాపెను.

ఒక సాధకునికి బాబా స్వప్నమున చేసిన బోధలో రెండు భాగములను క్లుప్తముగా ఈ క్రింద వివరించితిని. ఆ సాధకుడు మేల్కొనిన వెంటనే యీ ప్రబోధమును పుస్తకమున వ్రాసుకొనెనట. ''భయమునుండే కాకుండా నీవు ఆశా ప్రతీక్షల నుండి కూడ విముక్తుడవు కావలెను. నాలో విశ్వాస ముంచుము. నేను తప్పు చేయను. నాలోని అనిశ్చలతను కూడా ప్రేమింపుము. అది పొరపాటు కాదు. అది నా యిచ్ఛ; నా సంకల్పము. నా ఆజ్ఞ లేనిదే ఏమీ జరగదని గుర్తించుకొనుము. స్థిర మనస్కుడవై యుండుము. నన్ను అర్థము చేసుకొన కోరవద్దు; మిమ్ముల నర్థము చేసుకొనమని కూడ కోరవద్దు. అర్థము చేసుకొను ప్రయత్నమును విసర్జించి, అర్థము చేసుకొను యిచ్ఛను త్రుంచుకొనుము.''



''జాగ్రత నిద్రావస్థల మధ్య కలుగు భావమును ధ్యానించుము. అది యెంత సన్నిహితమో ఎంత అవ్యవధానమో, ఎంత శాంతి ప్రదాయకమో తెలిసికొనుము. వైరాగ్య భావము కలుగును. శరీరమూ మెదడూ మొద్దు బారినట్లుండును. నిద్రవలె దైవచింతన నిన్ను ఆవహించనిమ్ము.''

స్వప్నములో భక్తుల యెదుట సంగీతోపాధ్యాయునివలె బాబా కూర్చుని క్రొత్త పాటలు నేర్పి పుట్టపర్తిలో జరుగు దసరా ఉత్సవములో పాడమని ఆదేశించును. తరువాత వారు పుట్టపర్తికి వచ్చినప్పుడు ఆ పాటనే పాడమని ప్రోత్సహించును. ఒక భక్తుడు కోర్టు వ్యవహార ములలో చిక్కుకొనగా దివాలా తీయు పరిస్థితికి వచ్చెను. అతనికి నిద్రలో కనిపించి "Properties are not proper ties" (ఆస్తి పాస్తులు సరియైన పాశములు కావు) అని బాబా హెచ్చరించెను. జ్ఞానదాతగా అవతరించిన బాబా నిరంతరం ప్రపంచమంతటా జ్ఞానబోధచేయు కార్యక్రమములోనే నిమగ్నులై యుందురు.

ప్రతి ఉపన్యాస ప్రారంభమందూ ''దివ్యాత్మ స్వరూపులారా!'' అని సంబోధించెదరు. అదే వారి సర్వ ప్రబోధముల సారము. మానవుడు తాను అనంతమైన, నశ్వరమైన అజేయమైన ఆత్మయని సచ్చిదానందమని దైవమను సాగరమున తానొక తరంగమని గ్రహించవలెను. ఈ సత్యమును అనుభవ పూర్వకముగా తెలుసుకొనుటయే భక్తి. 'స్వరూప అనుసంధాన భక్తిరీతి అభిధీయతే'' అని ఆది శంకరులు వచించెను.

అద్దములో తన ప్రతిబింబమును చూచునట్లు, ప్రతివ్యక్తి తన స్వస్వరూపమును దర్శించ వలెననీ అప్పుడే ఆ వ్యక్తి శక్తి, విశ్వాస ధైర్య, శాంతులతో జీవించగలడనీ బాబా పదేపదే చెప్పుచుందురు. అశ్వత్థ మనబడు జీవిత వృక్షమునకు వ్రేళ్ళు ఆత్మయందుండనని బాబా **యందురు**. ఆ విశ్వాసమే లేకున్న మనము శుష్కించి, అనిత్య భోగభాగ్యములను గాలి తాకిడికి యిటునటు ఊగుచుండెదము. జీవిత వృక్షము యొక్క కాండము, శాఖోపశాఖలు ఆకులు అనునవి బాహ్య ప్రపంచములోని, మన బంధుజనులూ, అహంకార మమకారములూ, లాభనష్టములూ వంటి బంధములు; ఈ వృక్షము యొక్క పుష్పములు ప్రేమ పూర్వకమైన మన మనోవాక్కాయ కర్మలు; వాటి నుండి పొందిన ఆనందమే ఫలము. పవిత్రమైన సచ్ఛీలమే ఆ ఫలమునందలి మాధుర్యము. ఫలమునకు మాధుర్యము నిచ్చు ఆ సౌశీల్యము. వ్రేళ్ళ రూపమున

ఆధారభూతమైన ఆత్మ లేకున్న ఎడారి దున్నినట్లు జీవితము వ్యర్థమగును, అని బాబా చెప్పుదురు.

మానవుడు ఆత్మ స్వరూపుడను నిజతత్త్వము మానవాళి హృదయ ఫలకములపై ముద్రించు నుద్దేశముతో, బాబా వివిధ సేవా సంస్థలను స్థాపించెను. బాబా యెడల అచంచల భక్తి విశ్వాసము కలిగి వారి ప్రబోధ సారమును కడుపార గ్రోలిన భక్తులే యీ సంస్థలను బాబా ఆదేశానుసారము నడుపుచుందురు . తప్పటడుగులు వేయు పసిపిల్లల కొరకు ప్రేమతో లాలించి పాలించు బాలవికాస్‌లున్నవి. బాలబాలికల చేత భజనలు చేయించుట; పురాణేతిహాసముల నుండి మహాపురుషుల జీవితముల నుండి తీసుకొనిన ఇతివృత్తముల నాధారముగా రచించిన చిన్న చిన్న నాటకములను వేయించుట, గీతాశ్లోకములను పఠించుట మొదలగు మనోవికాసము కలిగించు కార్యక్రమములను చేబట్టిన యీ సంస్థకు బాలవికాస్ అను నామము సార్థకమైనది. ఈ బాలవికాస్ పిల్లల కొరకు బాబా స్వయముగా ఎన్నో నాటకములను రచించెను. అంతేకాక తల్లితండ్రులను, పెద్దలను గౌరవించుట, క్రమ శిక్షణతో వీధుల వెంట నడుచుట, జీవితములో నైతిక విలువలు పెరుగుటకుపయోగకరమైన అంశములను దృశ్యములను గుర్తించి చిత్రించుట మొదలగు విషయములలో వారికి తర్ఫీదిచ్చెదరు. వారు పరస్పరము 'ఓం' 'సాయిరామ్' అనుమా పలకరించుకొనెదరు. "అ" అనిన అరటి పండు అను స్థితి నుండి "అ" అనిన అర్జునుడు అను ఉత్తమ స్థితికి వచ్చెదరు. "Baba Baba! Black Sheep! Have you any wool!?"అనే పాటలు మరచిపోయి ''రఘుపతి రాఘవ రాజారామ్'' లేక ''సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం: షణ్ముఖనాథా సుబ్రహ్మణ్యం'' వంటి పాటలు పాడుకొనెదరు.

ఈ బాల బాలికలు క్రమేణా జూనియర్ సేవాదళ్‌లో చేరి భజన పాటలు, గీతాశ్లోక పఠనము, ధ్యానము, సభలలో బాబా దివ్య చరిత్ర వారి ప్రబోధనలను గురించి ప్రసంగించుట మొదలయినవి నేర్చుకొనెదరు.

18 సంవత్సరములు వయస్సు వచ్చిన పిదప జూనియర్ సేవాదళ్‌లో చేరెదరు. స్త్రీ పురుషులకు ప్రత్యేక సేవా దళ్ విభాగములున్నవి. వారందరికి ప్రథమ చికిత్సయందు తర్ఫీదిచ్చెదరు. వారిలో సేవాతత్పరత త్యాగ బుద్ధి, సహనం, వినయం పెంపొందుటకు వలయు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక సాధనలను నేర్పెదరు. ఆస్పత్రులకు వెళ్ళి రోగులకు పరిచర్యలు చేయుట, జైళ్ళకు వెళ్ళి ఖైదీల చేత భజనలు చేయించుట, పల్లెలో, పేటలలో పట్టణములలో పారిశుధ్యము అలవరుచుట, రక్తదానము చేయుట, వికలాంగులు కుష్టురోగులు వుండే శరణాలయములకు వెళ్ళి వారిచే భజనలు చేయించి మనశ్శాంతి కలిగించుట, ప్రత్యేకపర్వదినములందు భోజన ఫలహారములు పెట్టుట, మొదలగు కార్యక్రమములలో విధిగా పాల్గొనెదరు. నీతిదాయకమైన నాటక ప్రదర్శనముల



ద్వారా పవిత్ర గ్రంథముల పఠనము ద్వారా ప్రజలలో నైతిక విలువలు పెంచు ప్రయత్నము చేసెదరు. వారి వారి శక్తి సామర్థ్యముల ననుసరించి అవకాశములను బట్టి పలు విధములుగా పేదలకు బాధితులకు సేవలు చేసెదరు.

ఇక పెద్దవారు సేవా సమితుల నేర్పాటు చేసి భజనలూ నగర సంకీర్తనలూ జరుపుట, అధ్యయన కేంద్రములూ, సత్సంగములూ, సభలూ, సమావేశములూ ఏర్పాటు చేయుట, పర్వదినములలో మహాత్ముల పవిత్ర చరిత్రలను దివ్య సందేశములను వ్యక్తము చేయు కార్యకలాపములతో ఉత్సవము జరుపుట మొదలగు కార్యక్రమములు చేపట్టెదరు. సమితికి అనుబంధముగా నున్న మహిళా విభాగ్‌లోని స్త్రీ, యువతుల కొరకు మహిళా సేవాదళ్, బాల బాలికల కొరకు బాలవికాస్ ఉద్యమములను కొనసాగించెదరు. బాబా దివ్య సంకల్పానుసారము నెలకొన్న ఈ సంస్థల కార్యకలాపముల ద్వారా ఆధ్యాత్మిక చైతన్య స్రవంతి ఉప్పొంగి వెల్లువలై దేశమును ముంచెత్తుచున్నది.

లోకములో అధర్మమును నిర్మూలించి, ధర్మమును స్థాపించి మానవుని నైతిక, ధార్మిక జీవనమును పునరుద్ధరించుటకే తాననవతరించినట్లు బాబా ప్రకటించిరి. ఈ సాయి యుగము నందు, పవిత్ర ఆశయ భరితములైన నూతన సాయి భావములకు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నూతన విద్యా కేంద్రములుగా వెలసినవి.

''నిర్మలమైన మీ ప్రేమను పలువురకు పంచుటకు, సేవాదీక్షను పెంపొందించి మీచేత సత్కర్మలు చేయించుటకు ఈ సంస్థలు నెలకొల్పబడినవి. భక్తులను ప్రోగుచేయుటకు కాని, భక్తి విశ్వాసముల ఆడంబర ప్రదర్శనకు కాని, ప్రజల అండదండలతో నూతన మత సంస్థను స్థాపించుటకు కాని కాదు. మానవుడు తాను ఆత్మస్వరూపుడని గ్రహించి ఆదివ్య తత్త్వములోనే విలీనమగుటకు వలయు ఆధ్యాత్మిక సాధన సంపత్తి నందచేయుటయే ఈ సంస్థల లక్ష్యము'' అని బాబా ఒక సందర్భమున విశదీకరించిరి.

'విద్యాదదాతి వినయం'. విద్య యొసగును వినయము. జ్ఞానులు తాము తెలుసుకొనవలసిన దెంతయోయున్నదని వినయముతో నుందురు. మూర్ఖులు తమకంతయూ తెలియునని గర్వించెదరు. భక్తి వినయములు సద్విద్యయిచ్చు ఫలములు. ఈనాటి పాఠశాలలందూ కళాశాలలందూ వినయ విధేయతలు అంతరించినవి. 'పండితాః సమదర్శనః' అనే గీతా వచనమును స్వామి తరచు గుర్తుచేస్తూ వుంటారు, పండితులు విభజనలను ప్రోత్సహించరు. ఏ దివ్యతత్త్వమును తెలుసుకొనిన సర్వమూ తెలియునో, దాని నన్వేషించెదరు. వారి హృదయములలో ద్వేషభావములకు చోటివ్వక, శాంతమును కోరుదురు. కాని యీనాటి పండితులలో అసూయ, విరోధము, ద్వేషము, జాడ్యమువలె వ్యాపించినవి. ధర్మ సంస్థాపనా మహోద్యమం విద్యా సంస్థల స్థాయిలోనే ప్రారంభించవలెనని బాబా సంకల్పము. ప్రతియేటా లక్షలాది మంది యీ విద్యా సంస్థలలో చదువు పూర్తి

చేసుకొని నూతన జీవిత పథములోనికి అడుగుపెట్టుచున్నారు. అట్టివారిలో క్రమశిక్షణ, గౌరవమర్యాదలు, శక్తిసామర్థ్యములు, సంస్కారము అధోగతికి దిగజారుచున్నవి. అందుచేత విద్యార్థి దశలోనే వారిని సంస్కరించుట అత్యవసరము.

వేదాధ్యయనము చేయు విద్యార్థితో నిత్యమూ పాఠము ప్రారంభించుటకు పూర్వము ''విద్య అనునది గురుశిష్యుల మధ్య ఒక అనుభవము. అందు యిద్దరూ భాగస్వాములే. అందుచేత గురుశిష్యుల మధ్య కించిత్తయిననూ క్రోధము అభిప్రాయ భేదములూ ఉండరాదు. అట్లున్న విద్యాదాత, విద్యా గ్రుహీత, వారితో బాటు విద్య కూడ అపవిత్రము కాగలదు'' అని గురువు హెచ్చరించుట సాంప్రదాయము.

నేటి విద్యార్థులు ఉపాధ్యాయులనే భయపెట్టుచున్నారు. ఉపాధ్యాయులు తమ ధనాదాయమునే లెక్కించుకొనుచూ, పాఠములు బోధించుటయును వారి విద్యుక్త ధర్మమును విస్మరించుచున్నారు. సమాజముపట్ల వారి బాధ్యతనూ, సమాజము వారిపట్ల చూపవలసిన గౌరవమునూ, అట్టి గౌరవము వారి హక్కు అనియూ, దానిని పాత్రతో నిలబెట్టుకొనవలె ననియూ వారు గుర్తించకున్నారు.

ఉపనిషత్కాలమందు అధ్యయనము పూర్తియైన పిదప విద్యార్థిని యింటికి పంపుచూ ''సత్యం వద; ధర్మం చర; మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్య దేవోభవ! అని గురువు బోధించును. కాని ఈ నాడు, రెండు తరముల మధ్యనున్న అంతరము దృష్ట్యా తల్లిదండ్రులను అభివృద్ధి నిరోధకులుగా పరిగణించి పరిహసించుట పరిపాటయినది. గతించిన కాలము వారిని నాటి మూఢవిశ్వాసములకు ప్రతినిధులనుచూ, వారిని హేళన చేసెదరు. ఇక ఉపాధ్యాడనిన మరింత చులకన చేసెదరు. లంచమిచ్చికాని, భయపెట్టికాని కుటిలమార్గమున మార్కులు వేయించుకుని పరీక్షలందు ఉత్తీర్ణులై డిగ్రీలను సంపాదించుకొనవచ్చునని వారి అభిప్రాయము.

తప్పుదారిపట్టుచున్న విద్యార్థులను వెనుకటి మంచి దారిలో పెట్టవలెనని బాబా సంకల్పము. భవిష్యత్తులో వారెదుర్కొనబోవు విపత్తునూ వారి ద్వారా భారతదేశమునకే కాకుండా తదితర దేశములకు కూడ సంభవించు హానిని గురించి వారిని హెచ్చరించవలెను. ప్రపంచ మంతటా విద్యార్థులలో అరాచక చర్యలు వ్యాపించుచున్నవి. వారిలోని అంతర్గతమైన అశాంతి కిది బాహ్య విప్లవము. వారు పెరుగుచున్న వాతావరణమూ తల్లితండ్రులూ, పెద్దలూ, ప్రభుత్వమూ, వారికొరకు సిద్ధము చేసిన జీవితము వంచన సంకుచిత్వములతో కలుషితమై వున్నది.

ప్రచారము కన్న ఆచరణ ఉత్తమమైనది. ఆచరణకు మించిన ప్రచారమే లేదు. నేటి పెద్దలు చెప్పునదొకటి, చేయున దొకటి. ఈ నాటి యువతరము దుస్థితికి వారి



తల్లితండ్రులూ, ఉపాధ్యాయులూ సమాజమూ, బాధ్యులు. ఆదర్శములు అంతరించిన విద్యను, దైవమునకు దూరమైన నిస్సారమైన విద్యను నేటి విద్యాలయములు యువతీ యువకులకు అందించుచున్నవి.

''భగవదవతారము ఇది చేయగలదు. అది చేయలేదు. అని నిర్ణయించు అధికార మెవ్వరికీ లేదు.'' అని బాబా పలికిరి. శ్రీకృష్ణుడు తానవతరించిన ప్రయోజనమును సత్వరముగ సాధించుటకు రథసారథ్యము వహించెను. శ్రీరాముడు బంగారు లేడిని వెంట తరుముతూ పోవుటకు కారణము అది మాయాహరిణమని తెలియక పోవుటకాదు. రావణ సంహారణమునకు ఇది నాందియని తెలియుట చేత. ''నేను కాలేజి ప్రారంభించుటకు అడ్డమేమియుండును? పుష్పము తన సహజ పరిమళమును మారుతమున కందించుట నెవరు నిరోధించగలరు. జ్ఞాన బోధయే నా సంకల్పము. మానవుడు తన సహజ దివ్యతత్వమును తెలుసుకొనునట్లు చేయుట కవసరమైన అన్ని మార్గములూ అవలంబించెదను.'' ''తమసోమా జ్యోతిర్గమయ అని మీరు ప్రార్థించుచుందురు కాదా!'' అనెదరు బాబా.

మొట్ట మొదట స్త్రీ విద్యను సంస్కరించవలెనని బాబా ఉద్దేశ్యము. అందులకే 'ధర్మవాహిని'లో బాబా ఈ విధముగా వ్రాసిరి. ''జాతి యొక్క ఔన్నత్యమూ, సుస్థిరత స్త్రీల యొక్క ఆధ్యాత్మిక సంస్కృతి మీద ఆధారపడి వుండును. నేడు సమాజములో ప్రబలుచున్న అన్యాయ అధర్మ అక్రమ అత్యాచారములకు కారణము తల్లుల పెంపకములోని లోపమే. దానికి కారణము వారి అశ్రద్ధ కావచ్చును.లేదా వారి యజ్ఞానము కావచ్చును. లేదా పిల్లలలో సదాలోచన సత్ప్రవర్తన పెంపొందించు బాధ్యతను పురుషులు స్త్రీల కిచ్చి యుండరు. జరిగినదేదో జరిగిపోయినది. భావితరముల వారి శ్రేయస్సు దృష్ట్యా ఇకనైననూ స్త్రీలను ఆదర్శమైన మాతృమూర్తులుగా రూపొందించు విద్యను వారికి అందించుట అత్యవసరము. వారు నిర్వహించవలసిన బాధ్యతల కనుగుణ్యమైన జ్ఞానమూ, సహనమూ, విశ్వాసమూ అందించు విద్య వారికి గరపవలెను.''

అనంతపురం పుట్టపర్తికి సుమారు అర్వై మైళ్ళ దూరములో వుంది. అది జిల్లా ముఖ్యపట్టణము. జూన్ 1966 సంవలో బాలికల పాఠశాల ఆహ్వానము నందుకుని బాబా అక్కడకు వెళ్ళెను. కాలేజి విద్య కొరకు వారు దూర ప్రాంతములకు వెళ్ళవలసి వచ్చుటయూ, వ్యయప్రయాసల కోర్చి వెళ్ళిననూ నేటి కాలేజిలలోని అవాంఛనీయమైన వాతావరణము చూచియూ బాబా జాలిగొనెను.

అనాదిగా ధర్మమునకు స్త్రీ పుట్టినిల్లు, ఉగ్గుపాలతో ధర్మమును రంగరించి పసి పిల్లలకు పోయును. ధర్మ సంస్థాపనోద్యమములో స్త్రీలను సంస్కరించుట ప్రధాన

కర్తవ్యము. అందుచేత అనంతపురములో త్వరలోనే మహిళా కళాశాల వెలయునని బాబా నాడే ప్రకటించెను. ఆవిధముగా అనంతపురం స్త్రీల కొక ఆదర్శ విద్యాకేంద్రముగా రూపొందినది. విప్లవాత్మకమైన విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టిన ఆ కళాశాల మానవ కుటుంబమున కొక అమూల్య కానుక.

1968వ సంవత్సరములో జూలై 22వ తేదీన అనంతపురములో శ్రీ సత్యసాయి మహిళా కళాశాలకు ప్రారంభోత్సవము జరిగినది. ఏ కాలేజి ప్రారంభోత్సవమూ అంత శుభప్రదముగా జరిగి వుండదు. ఆ కాలేజి యొక్క ఉజ్వల భవిష్యత్తునకు అదే మంగళ చిహ్నము. ఆరంభముననే కాలేజికి కావల్సిన సాధన సామగ్రి, సదుపాయములూ, సామర్థ్యమూ శ్రద్ధాసక్తులూ గల ఉపాధ్యాయులూ సమకూడుటచే ప్రారంభోత్సవ దినమునకు కళకళలాడుచుండెను.

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామంత్రి నాటి సభాముఖమున తన అధ్యక్షోపన్యాసములో ''ఈనాడు ప్రారంభోత్సవము జరుపబడుచున్న దొక కళాశాలకు కాదు, స్త్రీ విద్యా చరిత్రలో ఒక నూతన శకమునకు,'' అని కొనియాడిరి. మున్ముందు మరి యెన్నో యిట్టి కళాశాలలు దేశము నలుమూలలా వెలయునని ఆయన యెరుగుదురు. ఎందుకనగా బాబాయే ఒక సందర్భమున ప్రతి రాష్ట్రములోనూ ఒకటి రెండు కాలేజిలు నెలకొల్పి వాటినన్నిటినీ కలుపుచూ ఒక విశ్వవిద్యాలయమును స్థాపించ సంకల్పించినట్లు ప్రకటించిరి.

ఆ సందర్భమున బాబా తమ దివ్యోపన్యాసములో ఈ కళాశాలను, కీర్తి సంపాదించుటకు కాని, నూతన సిద్ధాంత ప్రచారమునకు కాని, ధనార్జనకు కాని నెలకొల్పలేదు. కీర్తి ప్రతిష్టలు అస్థిరములు, లాభమును రూపాయలలో లెక్కించుట నీచము. ఇచ్చటి విద్యార్థుల హృదయములలో సత్య ధర్మశాంతి ప్రేమలు సుస్థిరము చేయు సంకల్పమే యిక్కడ కాలేజి ప్రారంభించుటకు కారణము. వేద పురాణేతిహాసములు నొక్కి వక్కాణించిన ఈ పవిత్ర జీవితాశయములను అభ్యసించి అనుభవించి అవి వ్యక్తిగత జీవితమునకు సమాజాభ్యుదయమునకు అవసరమని గ్రహించవలెను. భారతదేశమున జన్మించిన ప్రతి శిశువు ఈ పవిత్రాశయములకు వారసుడే.

''క్షేత్రజ్ఞానము భుక్తికీ, ఆత్మజ్ఞానము ముక్తికీ మానవుల కవసరము. ఏకైక ఆశ్రయమూ బంధువూ, సఖుడూ, రక్షకుడూ అయిన భగవంతుని దూరముచేయు విద్యను గరపు విద్యాలయము వెలుతురు కోరివచ్చిన వారి కండ్లుపొడిచి అంధులను చేయు అంధులు నడుపు సంస్థవంటిది.

''ఆధ్యాత్మిక సంస్కృతికి స్త్రీలు కోట బురుజులువంటివారు. కాని నేటి విద్యావంతులయిన స్త్రీల ప్రవర్తన, వారి అభిరుచులు, వారి చదువు సాహిత్యము,



వారు చూచు అసభ్యమైన చలన చిత్రములు జుగుప్స కలిగించక మానవు.

''పుట్టిన ప్రతివ్యక్తి తన జీవితమున కొక అర్థమూ పరమార్థమూ లభింపజేసినందుకు ఐదుగురు మాతృదేవతలకు ఋణపడివుండును. మొదటిది దేహమాత అనగా కన్నతల్లి, రెండవది గోమాత, పాలిచ్చు గోవు, భూమిని దున్ను ఎద్దు, మూడవది భూమాత, తినుటకు తిండి ఉండుటకు చోటు యిచ్చి రక్షించిన తల్లి, నాలుగవది దేశమాత: సంస్కారం. సాంప్రదాయం, జీవితమున కొక లక్ష్యం అందించిన తల్లి, అయిదవది వేదమాత, ఆధ్యాత్మిక జ్ఞాననిధి. జన్మ యిచ్చి మిగిలిన మాతృదేవతలతో సంబంధము కలిగించిన దేహమాత అత్యంత పూజ్యురాలు, అందువలననే ప్రప్రథమముగా మహిళలకు కళాశాల స్థాపించి సర్వతోముఖమైన సనాతన ధర్మమునకు నాందివచనము పలుక సంకల్పించితిని'' అని బాబా నుడివిరి.

'ఆత్మ విద్య యొక్కటే మనస్సును ధర్మమునందు నిలుపగలుగును'' అని బాబా అనుచుండురు. ప్రశాంతి నిలయములోవున్న సత్యసాయి వేద పాఠశాలలో ఎందరో విద్యార్థులకు ప్రాచీన భారతీయ మహర్షులు పరిశోధించిన ఆధ్యాత్మిక రత్న గర్భమనదగు వేద సారమును బోధించెదరు. ఆ విద్యార్థులు ఆశ్రమ నిబంధనల ననుసరించి ప్రశాంతి నిలయములో నిశ్శబ్దమును పాటించెదరు. అది ఉద్రేకములనూ కోరికలనూ అణగద్రొక్కుకొనుచు అభ్యసించిన బాహ్యమైన మౌనము కాదు; బాబా యొక్క సర్వవ్యాపకత్వమును గుర్తెరిగి మనస్సు మౌనము వహించగా ఫలించిన సంతృప్తితో కూడుకున్న నిశ్శబ్దత.

ప్రఖ్యాతిగాంచిన అఖిలభారత ప్రశాంతి విద్వన్మహాసభను స్థాపించి అందు అనేక శాస్త్రవేత్తలను, సంస్కృత పండితులను, వేద విద్వాంసులను చేర్చి వారి ద్వారా బాబా వ్యధిత హృదయములకు ప్రశాంతి చేకూర్చి దివ్య పథమును జూపుచున్నారు. ఆత్మ విద్య కేవలమూ పండితులకూ, ఆశ్రమములకూ పరిమితి కాకూడదు. ఇది అందరికీ చెందిన నిధి. వివేక విచక్షణ వైరాగ్యములు గల ప్రతి వ్యక్తికి ఈ విద్య కరతలామలకమై సుఃఖ శాంతులను ప్రసాదించును.

పాలకంటే నీరు చౌక, నీరు శరీరమునకు అత్యవసరమైనది. పాలు పుష్టినిచ్చి వ్యాధి నిరోధక శక్తినిచ్చి ఆరోగ్యమును కాపాడును. సాంకేతిక నైపుణ్యము, వృత్తిలో ప్రావీణ్యము కలుగ జేయు నేటి ఆధునిక విద్య కాలేజిలలోనూ స్కూళ్ళలోనూ గరుపబడుచున్నది. అది నీరు వంటిది, ఆత్మ విద్య గురుకులములలోనూ ఆశ్రమములోనూ వర్ధిల్లు చున్నది. ఆత్మ విద్యపాల వంటిది. పాలతో కలసిన నీటికి కూడా విలువ పెరుగును; అప్పుడు నీరు కూడా పోషక పదార్థముగ చలామణియగును. కళాశాలలో ఆధునిక విద్యతోబాటు ఆత్మ విద్యను కూడా బోధించిన యెడల విద్యార్థులు తమ భావి

జీవితములో కలుగు సుఖ దుఃఖములను సమన్వయము చేసుకుని శాంతియుత జీవితమును సాధించు సామర్థ్యము సంపాదించెదరు.

''చరిత్రాత్మకమైన ఏడు సంవత్సరముల యుద్ధము. ముప్పది సంవత్సరముల యుద్ధము, నూరు సంవత్సరముల యుద్ధమును గురించి మనము వినియున్నాము. అంతేకాకుండా మనిషికీ మనస్సుకూ మధ్యనూ, జీవికి మాయకూ మధ్యనూ, వ్యక్తికీ సామాజిక జీవితము మధ్యనూ యుద్ధము అనాదిగా నిరంతరమూ జరుగుచునే యున్నది. ఆది మానవుడు మొదలు ఆఖరి మానవుని వరకూ ఈ సంఘర్షణ తప్పదు. అర్జునునివలె భగవంతునే జీవిత రథసారధిగా భావించి, ఇంద్రియములు, కోరికలు, మనస్సు, బుద్ధీ వాటి ఆద్యంతములూ భగవంతునికి అర్పణము చేసిన కాని జీవిత సంగ్రామములో విజయము సాధించుట సాధ్యము కాదు. ఆత్మ విద్య బోధించు పాఠమే యిది. ఈ పాఠమును నేర్చుకొను హక్కు ఈ యువతరమునకున్నది.'' అని బాబా చెప్పిరి.

విశ్వ విద్యాలయమును నిర్ణయించిన పాఠ్య గ్రంథములను పఠించుటే కాక ఈ కళాశాలలోని విద్యార్థినులు ధ్యానమూ, ప్రార్థన, సంకీర్తనములో శ్రద్ధాసక్తులతో పాల్గొనెదరు. ప్రాచీన భారతీయ సంస్కృతి యొక్క విశిష్టతను తెల్పు పెద్దల ప్రసంగములు వారు నిత్యము వినుచుందురు. శారీరక ఆరోగ్యమును మానసిక శాంతిని అందించు యోగసాధనలో కూడ వారికి తర్ఫీదిచ్చెదరు. ఈ వాతావరణ ఫలితముగా సినీమాలపట్ల, అసభ్యమైన సాహిత్యము పట్ల వారికి సహజమైన విముఖత కలిగి వాటిని దగ్గరికి చేరనివ్వరు. వారు వస్త్రములూ ఆభరణములు ధరించుటలోనూ కేశ సింగారములోనూ నిరాడంబరతను తప్పని సరిగా అలవరచుకొనెదరు. పురాణ యితిహాసముల లోనూ చరిత్రలనూ ప్రసిద్ధికెక్కిన వనితల అడుగుజాడలలో జీవించేటట్లు ప్రోత్సహింపబడెదరు.

కాలేజి వాతావరణము బాబా ఆశీస్సులతో నిండి నిర్మలమై సత్య గుణాభివృద్ధికి దోహదము చేయును. బాబా తరచు ఆ కాలేజికి వెళ్ళి స్వయముగా విద్యార్థినులకు సలహాలిచ్చి, బోధనలు చేసి దీవించెదరు. అప్పుడప్పుడు సుప్రసిద్ధులైన విద్యావేత్తలను వెంట తీసుకొని వెళ్ళి వారిచే ఉపన్యాసము లిప్పించి సాయి ఆదర్శములలో ఆసక్తిని పెంపొందించెదరు.

అందరి మనస్సులలోని భావములూ బాబాకి తెలియును. ఈ సత్యమును అనుభవరీత్యా గ్రహించిన వారగుటచేత విద్యార్థినులూ ఉపాధ్యాయినులూ బాబా ఉపదేశముల కనుగుణ్యముగా వారి ప్రవర్తనలను మలచుకొందురు. ''సత్య ధర్మ శాంతి ప్రేమలను గురించి యిదివరలో ఎందరో ప్రబోధించిరి. అయితే బాబా ఒక్కరే ఆచరణ పూర్వకముగా ఉపదేశించినది'' అని డాక్టర్ గోకాక్ అనిరి. శాంతి కావలెనా



బాబా వద్ద నుంచి నేర్చుకొనుము. ప్రేమ తత్త్వమును గురించి తెలుసుకొనవలెనా ఆ ప్రేమ స్వరూపుని ఆశ్రయించిన చాలును. అన్నిటి కంటెనూ ముఖ్యమైనది బాబా అద్వితీయ శక్తి, పరిస్థితులనూ మార్చగలరు, మార్గమునూ, గమ్యమునూ సృష్టించగలరు; త్రోవ చూపి పురోగమనమునకు తోడ్పడెదరు. రోగమును పట్టి చికిత్సయునునట్లు, అవసరమైన యెడల అడుగడుగునా అవరోధములు కల్పించి అపమార్గము నుండి తప్పించెదరు. వారు ప్రారంభించిన కాలేజి వారి ఆశయములు సిద్ధించు మార్గమును వెదకుకొనుచూ నిరాఘాటముగా పురోగమించును. దానికి కారణము వారి దివ్యసంకల్ప శక్తి. విశ్వకల్యాణ నిమిత్తము ప్రారంభించిన ఈ విద్యా విధాన సంస్కరణ మహోద్యమంలో ఈ విద్యార్థినులు పరికరములగు అవకాశము కలుగుట వారి పూర్వపుణ్యఫలము.

''నన్ను మీ జీవిత రథసారధిగా చేసుకొనుడు. ఈ ఉత్తమావకాశమును జారవిడువకుడు. ముక్తిమార్గముకై నన్నర్థింపుడు. ముందు ముందు నా దరిచేరుట దుర్లభము. నలుదిశల నుండి ప్రజావాహినులు నన్ను చుట్టుముట్టుచున్నవి. ఈ దివ్యశక్తి మానవాళికి ఆశ్రయ మిచ్చి రక్షించు విశ్వవృక్షముగా పెరుగుట తథ్యము. ఆ లక్ష్యముతోనే ఈ ఆకారమును ధరించి అవతరించితిని. నా సంకల్పము నిర్వికల్పము, నా పేరే సత్యము సత్యమే నా ప్రచారము. సత్యమే నా మార్గము. నేనే సత్యము'' అని బాబా భక్తులను మేల్కొల్పును.

ఈ కాలేజికి బాబాయే సారధి. అందుచేత ఇందలి విద్యార్థినులు సద్గుణవంతులై ధీమంతులై ధీరులై జీవిత యాత్రను కొనసాగించెదరు. వారు సత్పుత్రికలుగనూ, బాధ్యతగల పౌరులుగనూ, ఆదర్శ గృహిణులుగనూ, ప్రేమానురాగములు వర్షించు మాతృమూర్తులుగనూ, సమర్థులైన గురువులుగనూ తయారగుటకు సందేహము లేదు. తల్లి బిడ్డలను లాలించి పెంచి తండ్రిని గౌరవించమని బోధించును. ఏలననగా ప్రకృతి సిద్ధముగా పిల్లలకు తల్లియెడల వుండునంతటి అనురాగబంధము తండ్రి యెడల వుండదు.

''బాబా బోధించుట కవతరించెను. మన మీ అవకాశమును సద్వినియోగము చేసుకొనవలెను. వారి దివ్య సమక్షములో పొందు మహదానందమును హృదయములందు పదిలపరచుకొని మన గృహములకు గొనిపోవు ప్రయత్నము చేయవలెను. మనము యింటికి వెళ్ళినప్పుడు భౌతికముగా మనము బాబాకి దూరమగుదుము. బాబా ప్రబోధనలు ఆచరణలో వుంచు చుండిన అంతరంగికముగా బాబా మనకి చేరువలోనే వుందురు. భౌతికమైన దూరము మనలను బాబా నుండి వేరు చేయజాలదని మనము మరువరాదు. మన ప్రతియొక్క సమస్యనూ పరిష్కరించమని బాబానే వేడుకొనవలెను. అటుపైన ఏ క్షణమునైనా వారి అమూల్యమైన సమాధానము రావచ్చును. ఆ సమాధానము స్పష్టముగనూ నిర్దుష్టముగనూ ఉండును. ప్రార్థించితిమా దాని యర్థము మరింత

విపులముగ తెలియగలదు'' అని చార్లెస్‌పెన్ తెలియజెప్పిరి. బాబా స్థాపించిన కళాశాలలోని విద్యార్థినీ విద్యార్థులందరకూ యిట్టి అనుభవములు సామాన్యమే. వారెంత అదృష్టవంతులు!

విద్యా విధాన పునరుద్ధరణ గురించి బాబా ఎప్పుడు మాట్లాడినా ఆ మాటలలో ఆందోళన ఆతురత వ్యక్తమగుచుండును. బాలబాలికలు తమ జీవిత సమరమునకు సంసిద్ధులగు ఈ తరుణమున వారి హృదయములను శుష్కింపజేసి మెదడలను మాత్రం అభివృద్ధి చేయు ఈ అధునిక విద్యావిధానము దారుణమైన పరిస్థితులకు దారి తీయును. ఒక వైపున అనంతపురంలో క్రొత్త కాలేజి భవన నిర్మాణము చక చక సాగుచుండగా, మరొక వైపున ఆలస్యమును సహించని బాబా ఆ యేడే హైస్కూలులో కొన్ని గదులు సేకరించి లెక్చరర్లను నియమించి వెంటనే కాలేజి ప్రారంభించమని ఆదేశించిరి. నమ్మశక్యము కానంత శీఘ్రముగానే ప్రారంభించబడిన కాలేజి చూచి పురజనులూ పెద్దలూ సంభ్రమాశ్చర్యభరితులైరి.

అదేవిధముగా బాబా సంకల్పించినదే తడవుగా బాలురకొక కళాశాల బెంగుళూరులో తమ నివాస భవనమైన బృందావన్ ఆవరణలోనే తాత్కాలికముగా కట్టిన భవనములలో ప్రారంభించ బడినది. ''కాలేజి అనిన ఇటుక, ఇసుక, సిమెంట్‌తో కట్టు భవనముకాదు. పెద్ద బిల్డింగ్ కట్టినంత మాత్రమున అది గొప్ప కాలేజి కానేరదు. కాలేజి యొక్క ఔన్నత్యము, అందలి విద్యార్థుల శ్రద్ధాసక్తులూ, ఇంటా బయట వారి ప్రవర్తన, సౌశీల్యము, క్రమశిక్షణ, వారు తల్లిదండ్రుల యడల, పెద్దల యడల చూపు గౌరవము, వారి భావి జీవితాశయములు - వీటిన్నిటి మీద ఆధారపడి వుండును'' అనెదరు బాబా.

బృందావన్‌లో కాలేజి ప్రారంభించుటకు క్లాసు రూములూ, లైబ్రరీ, లేబరేటరీల నిర్మాణమూ, వాటికి కావలసిన ప్రతి వస్తు సామగ్రిని సమకూర్చు బాధ్యత బాబాయే స్వయముగా స్వీకరించి వేయికన్నులతో చూచుటచే ప్రారంభోత్సవము నాటికి కాలేజి సర్వాంగ సుందరముగా కళకళలాడుచుండెను.

1969వ సంవత్సరములో జూన్ 9వ తేదీన, నాటి మైసూరు ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్ర పాటిల్ ప్రారంభోత్సవము జరిపిరి. ఆ సందర్భమున వారు ''ధర్మ సంస్థాపనార్థము బాబా అవతరించిరి. మానవాళి మనుగడకు ధర్మమే పునాది. ధర్మమే అధ్యాత్మిక నైతిక విలువలకు మూలము. బాబా స్థాపించిన ఈ కాలేజిలో చదువు విద్యార్థులలో యిట్టి విలువలు తప్పకుండా అభివృద్ధి కాగలవు'' అనిరి. బెంగుళూరు విశ్వవిద్యాలయము యొక్క వైస్‌ఛాన్స్‌లర్ డా॥ గోకాక్ ''ఈ కళాశాల మా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల లన్నిటిలోనూ ఒక గొప్ప మణిపూస కాగలదు. విద్యారంగములోనే కాక నైతిక ఆధ్యాత్మిక రంగములలో కూడా మిగిలిన కళాశాలలకిది మార్గదర్శికాగలదు'' అన్నారు.



ఈ కళాశాల బాబా సంకల్పమునకొక రూపకల్పనము'' వారి దూరదృష్టికి అనుగ్రహమునకు చిహ్నము. నిర్మల నిస్వార్థ సేవకు గీటురాయి. ఈ కళాశాలలోని విద్యార్థులు ఆధునిక విద్యతోబాటు సమదృష్టి, సహనము, శాంతియుత జీవనము అభ్యసించుటకు ఎంతయినా అవకాశము కలదు.

తమ గ్రామములో కాలేజి ప్రారంభించబడుచున్నదన్న ఆనందోత్సాహములతో అక్కడకు వచ్చిన గ్రామ ప్రజల నుద్దేశించి, ''ఇప్పటికీ మీ గ్రామీణులలోనే అన్యోన్య సహకారము, సౌభ్రాతృత్వము, భగవద్భక్తి, పెద్దల యెడల గౌరవము నిలచియున్నవి. ఈ యాదర్శములను నిలబెట్టు కొనుచూ పట్టణములలోని కలుషిత వాతావరణము మీ పిల్లలకు సోకనీయకుండా జాగ్రత్తపడిన యెడల ఆ పిల్లలు మీ భవిష్యత్తులో సుఖశాంతులతో జీవించు పౌరులుగా తయారుకాగలరని'' బాబా ఉద్ఘాటించెను.

''ఈ కళాశాలలో చదువు విద్యార్థులకు సంపూర్ణ విద్య, అనగా కర్మ మార్గమూ, ధర్మ మార్గమూ, బ్రహ్మ మార్గమూ, నేర్పుదురు.'' విద్యార్థుల నుద్దేశించి బాబా ఈ కాలేజి విద్యార్థులైన మీరు ఈ కాలేజిలోనే తరగతిలో చేరవచ్చు, లేదా మరో కాలేజీలో చేరవచ్చు, లేక పోయిన చదువు పూర్తి చేసుకుని యింటికి తిరిగి వెళ్ళ వచ్చును. మీరెక్కడ వుండిననూ ఈ కాలేజి విద్యార్థులుగా మీ రందుకొనిన ప్రత్యేకమైన తర్ఫీదు వలన మీ జీవితములలో మీరు రాణించవలెనని నా కోరిక. అభిప్రాయ భేదములతో, ద్వేషములతో అధికారోన్మాదములతో, ఉద్రేకములతో, పరస్పర విరోధములతో నిండియున్న రాజకీయ నరకములో మాత్రం ప్రవేశించ వద్దు. యుగయుగాలుగా భారతావని పొందుపరచిన జ్ఞానదీపికను చేతబూని ఉజ్వల భవిష్యతువైపు పురోగమించే నాయకులుగా మీరందరూ తయారు కావాలి'' అని బాబా ఆశీర్వదించెను.

కాలేజిని గురించి వివరములు తెలుపు పుస్తకములో బాబా యిచ్చిన సందేశం యిది ''ఇది పుణ్యభూమి, యోగభూమి, అనాదిగా ఆధ్యాత్మిక జ్ఞాన సంపదకు ప్రసిద్ధి కెక్కినది. ఈనాడు తొంబది తొమ్మిది అజ్ఞానులు, లేదా ఆధ్యాత్మిక జ్ఞానమును నిరశించువారు, ప్రజలు వారి సంస్కృతిని వారే న్యూనత పరచుచున్నారు. ఇకనైనను మీ తప్పులు మీరు తెలుసుకుని మీ జీవితములను సంస్కరించుకుని పావన భారతావని ప్రతిష్ఠను పునరుద్ధరించుడు. ఇతరులలో దోషములు వెదకుటమానుడు. మీ బంధుమిత్రుల యడల తోటి మానవుల యడల గౌరవముతో ప్రవర్తింపుడు. దేశసేవ చేయుడు. సర్వజన శ్రేయస్సు కొరకు ప్రార్థించుడు''.

ఈ కాలేజి కొరకు బాబా నిర్ణయించిన చిహ్నము. ఈ కాలేజి త్రికరణ శుద్ధిగా పాటించు ఆదర్శములకు ప్రతిరూపము. అందు ఐదుదళములుగల కమలము దానిచుట్టూ ఒక వృత్తమూ కలదు. ఐదు దళములు ఐదు ముఖ్యమైన మతములు తెలియజేయును.

విపులముగ తెలియగలదు'' అని చార్లెస్‌పెన్ తెలియజేసిరి. బాబా స్థాపించిన కళాశాలలోని విద్యార్థినీ విద్యార్థులందరకూ యిట్టి అనుభవములు సొంతమౌతున్నవే. వారెంత అదృష్టవంతులు!

విద్యా విధాన పునరుద్ధరణ గురించి బాబా ఎప్పుడు మాట్లాడినా ఆ మాటలలో ఆందోళన ఆతురత వ్యక్తమగుచుండును. బాలబాలికలు తమ జీవిత సమరమునకు సంసిద్ధులగు ఈ తరుణమున వారి హృదయములను శుష్కింపజేసి మెదడులను మాత్రం అభివృద్ధి చేయు ఈ అధునిక విద్యావిధానము దారుణమైన పరిస్థితులకు దారి తీయును. ఒక వైపున అనంతపురంలో క్రొత్త కాలేజి భవన నిర్మాణము తక తక సాగుచుండగా, మరొక వైపున ఆలస్యమును సహించని బాబా ఆ యేటే హైస్కూలులో కొన్ని గదులు సేకరించి లెక్చరర్లను నియమించి వెంటనే కాలేజి ప్రారంభించమని ఆదేశించిరి. నమ్మశక్యము కానంత శీఘ్రముగానే ప్రారంభించబడిన కాలేజి చూచి పురజనులూ పెద్దలూ సంభ్రమాశ్చర్యభరితులైరి.

అదేవిధముగా బాబా సంకల్పించినదే తడవుగా బాలుర కొరకు కళాశాల బెంగుళూరులో తమ నివాస భవనమైన బృందావన్ ఆవరణలోనే తాత్కాలికముగా కట్టిన భవనములలో ప్రారంభించ బడినది. ''కాలేజి అనిన ఇటుక, ఇసుక, సిమెంట్‌తో కట్టు భవనముకాదు. పెద్ద బిల్డింగ్ కట్టినంత మాత్రమున అది గొప్ప కాలేజి కానేరదు. కాలేజి యొక్క ఔన్నత్యము, అందలి విద్యార్థుల శ్రద్ధాసక్తులూ, ఇంటా బయట వారి ప్రవర్తన, సౌశీల్యము, క్రమశిక్షణ, వారు తల్లిదండ్రుల యెడల, పెద్దల యెడల చూపు గౌరవము, వారి భావి జీవితాశయములు - వీటన్నిటి మీద ఆధారపడి వుండును'' అనెదరు బాబా.

బృందావన్‌లో కాలేజి ప్రారంభించుటకు క్లాసు రూములూ, లైబ్రరీ, లేబరేటరీల నిర్మాణమూ, వాటికి కావలసిన ప్రతి వస్తు సామగ్రి సమకూర్చు బాధ్యత బాబాయే స్వయముగా స్వీకరించి వేయికన్నులతో చూచుటచే ప్రారంభోత్సవము నాటికి కాలేజి సర్వాంగ సుందరముగా కళకళలాడుచుండెను.

1969వ సంవత్సరములో జూన్ 9వ తేదీన, నాటి మైసూరు ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్ర పాటిల్ ప్రారంభోత్సవము జరిపిరి. ఆ సందర్భమున వారు ''ధర్మ సంస్థాపనార్థము బాబా అవతరించిరి. మానవాళి మనుగడకు ధర్మమే పునాది. ధర్మమే ఆధ్యాత్మిక నైతిక విలువలకు మూలము. బాబా స్థాపించిన ఈ కాలేజిలో చదువు విద్యార్థులలో యిట్టి విలువలు తప్పకుండా అభివృద్ధి కాగలవు'' అనిరి. బెంగుళూరు విశ్వవిద్యాలయము యొక్క వైస్‌ఛాన్స్‌లర్ డా॥ గోకాక్ ''ఈ కళాశాల మా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల లన్నిటిలోనూ ఒక గొప్ప మణిపూస కాగలదు. విద్యారంగములోనే కాక నైతిక ఆధ్యాత్మిక రంగములలో కూడా మిగిలిన కళాశాలలకిది మార్గదర్శికాగలదు'' అన్నారు.



ఈ కళాశాల బాబా సంకల్పమునకొక రూపకల్పనము'' వారి దూరదృష్టికి అనుగ్రహమునకు చిహ్నము. నిర్మల నిస్వార్థ సేవకు గీటురాయి. ఈ కళాశాలలోని విద్యార్థులు ఆధునిక విద్యతోబాటు సమదృష్టి, సహనము, శాంతియుత జీవనము అభ్యసించుటకు ఎంతయినా అవకాశము కలదు.

తమ గ్రామములో కాలేజి ప్రారంభించబడుచున్నదన్న ఆనందోత్సాహములతో అక్కడకు వచ్చిన గ్రామ ప్రజల నుద్దేశించి, ''ఇప్పటికీ మీ గ్రామీణులలోనే అన్యోన్య సహకారము, సౌభ్రాతృత్వము, భగవద్భక్తి, పెద్దల యెడల గౌరవము నిలచియున్నవి. ఈ యాదర్శములను నిలబెట్టు కొనుచూ పట్టణములలోని కలుషిత వాతావరణము మీ పిల్లలకు సోకనీయకుండా జాగ్రత్తపడిన యెడల ఆ పిల్లలు మీ భవిష్యత్తులో సుఖశాంతులతో జీవించు పౌరులుగా తయారుకాగలరని'' బాబా ఉద్ఘాటించెను.

''ఈ కళాశాలలో చదువు విద్యార్థులకు సంపూర్ణ విద్య, అనగా కర్మ మార్గమూ, ధర్మ మార్గమూ, బ్రహ్మ మార్గమూ, నేర్పుదురు.'' విద్యార్థుల నుద్దేశించి బాబా ఈ కాలేజి విద్యార్థులైన మీరు ఈ కాలేజిలోనే తరగతిలో చేరవచ్చు, లేదా మరో కాలేజీలో చేరవచ్చు, లేక పోయిన చదువు పూర్తి చేసుకుని యింటికి తిరిగి వెళ్ళ వచ్చును. మీరెక్కడ వుండినను ఈ కాలేజి విద్యార్థులుగా మీ రందుకొనిన ప్రత్యేకమైన తర్ఫీదు వలన మీ జీవితములలో మీరు రాణించవలెనని నా కోరిక. అభిప్రాయ భేదములతో, ద్వేషములతో అధికారోన్మాదములతో, ఉద్రేకములతో, పరస్పర విరోధములతో నిండియున్న రాజకీయ నరకములో మాత్రం ప్రవేశించ వద్దు. యుగయుగాలుగా భారతావని పాందుపరచిన జ్ఞానదీపికను చేతబూని ఉజ్వల భవిష్యతువైపు పురోగమించే నాయకులుగా మీరందరూ తయారు కావాలి'' అని బాబా ఆశీర్వదించెను.

కాలేజిని గురించి వివరములు తెలుపు పుస్తకములో బాబా యిచ్చిన సందేశం యిది ''ఇది పుణ్యభూమి, యోగభూమి, అనాదిగా ఆధ్యాత్మిక జ్ఞాన సంపదకు ప్రసిద్ధి కెక్కినది. ఈనాడు తొంబది తొమ్మిది అజ్ఞానులు, లేదా ఆధ్యాత్మిక జ్ఞానమును నిరశించువారు, ప్రజలు వారి సంస్కృతిని వారే న్యూనత పరచుచున్నారు. ఇకనైనను మీ తప్పులు మీరు తెలుసుకుని మీ జీవితములను సంస్కరించుకుని పావన భారతావని ప్రతిష్టను పునరుద్ధరించుడు. ఇతరులలో దోషములు వెదకుటమానుడు. మీ బంధుమిత్రుల యడల తోటి మానవుల యడల గౌరవముతో ప్రవర్తింపుడు. దేశసేవ చేయుడు. సర్వజన శ్రేయస్సు కొరకు ప్రార్థించుడు''.

ఈ కాలేజి కొరకు బాబా నిర్ణయించిన చిహ్నము. ఈ కాలేజి త్రికరణ శుద్ధిగా పాటించు ఆదర్శములకు ప్రతిరూపము. అందు ఐదుదళములుగల కమలము దానిచుట్టూ ఒక వృత్తమూ కలదు. ఐదు దళములు ఐదు ముఖ్యమైన మతములు తెలియజేయును.

'ఓం' సనాతన ధర్మమునకును, 'శిలువ' క్రైస్తవ మతమునకును, చంద్రవంక, నక్షత్రములు ఇస్లాము మతమునకును, అగ్నిజ్వాల జొరాస్ట్రియన్ మతమునకును, చక్రము బౌద్ధ మతమునకును గుర్తులు. పద్మము ప్రాచీన ఆర్యచిహ్నము. పద్మము బురదలో పుట్టినను బురదను తాకదు. నీటిలో పెరిగి నీటియందు తేలియాడును. కాని నీటిని దరిచేరనీయదు. పద్మము శుభ శాంతి సౌందర్యములకు చిహ్నము. ఆ పద్మములో జ్ఞానజ్యోతి ప్రకాశించుచుండును. ఆ జ్యోతియే లేకున్న జ్ఞానము భారమే యగును. ఈ స్థూపాకార లాంఛనముపై అష్టదళాకృతిలో 'ధర్మో రక్షతి రక్షితః', 'సత్యాన్నాస్తి పరోధర్మః' అను వేదసార మహితగు ధర్మోపదేశ వాక్యములు వ్రాయబడి వుండును. ధర్మ మెప్పుడు మానవుల హృదయములను స్పందింపజేసి సంస్కరించి సత్ప్రవర్తులను చేయజాలదో అప్పుడు ప్రపంచము బాధలకు భయమునకు గురికాక తప్పదు.

కాలేజి ప్రాస్పెక్టస్‌లో ప్రచురించిన నియంత్రణావళిలోని కొన్ని వాక్యము లీ క్రింద ఉదహరింప బడినవి.

''భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య సన్నిధిలో వారి ప్రత్యక్ష రక్షణలో ఈ కళాశాల విద్యార్థులగునట్టి భాగ్యము మీకు అబ్బినది. దీనికి పాత్రులగునట్టి విద్యార్థులుగా రూపొందుటకు క్రమశిక్షణతో మెలగు దీక్ష వహింపుడు. బాబా సూక్తులను సదా జ్ఞప్తి యందుంచుకొనుడు.''

'శీలములేని విద్య అత్యంత ప్రమాదకరము' అని గుర్తించుకొనుడు.

''విద్యార్థులు ముఖ్యముగా మర్యాద, వినయము, పరోపకార పరాయణత అలవరచుకొన వలెను. బాబా పంచ సూత్రములు అనగా సత్య ధర్మ శాంతి ప్రేమ అహింసలు విద్యార్థుల ప్రవర్తనలోను, ఉపాధ్యాయుల దినదిన ప్రవర్తనలలోనూ ప్రతిబింబించవలెను.''

ఇక్కడ కూడను, అనంతపురం మహిళా కళాశాలలో వలె, విద్యార్థులూ, ఉపాధ్యాయులూ భజన ధ్యానములలోనూ, నిత్యమూ కాలేజి దినచర్య ప్రారంభించుటకు ముందు జరుగు ప్రార్థనలలోనూ విధిగా పాల్గొనెదరు. విద్యార్థులెంత మంది యున్నను ప్రతియొక్క విద్యార్థిని బాబా వ్యక్తిగతమైన ప్రేమతో చూచెదరు. ఆ ప్రేమకు పరవశులై విద్యార్థులు కూడ బాబాకి అత్యంత విధేయులగుచున్నారు. బాబా తమ పట్ల అలక్ష్యభావము, ఉపేక్ష చూపెదరేమో అను భావముతో విద్యార్థులు క్రమశిక్షణా బద్ధులై మెలగెదరు.

విద్య గరపుటకు విద్య నేర్చుకొనుటకు అతి ముఖ్యమైనది అనుకూలమైన వాతావరణము. అట్టి నిర్మలమైన వాతావరణము సృష్టించుటకై బాబా స్వయముగా కాలేజి కార్యకలాపము లన్నిటి యందు పాల్గొనెదరు. కాలేజి వున్నది కూడా బృందావన్



ఆవరణలోనే వుండుటచే బాబా తరచు నడచి వెళ్ళి ప్రార్థన సమావేశమును తిలకించెదరు, లేదా నీతి ప్రబోధన కొరకు ప్రత్యేకముగా ఏర్పాటు చేసిన ఉపన్యాస సమయమున అధ్యక్షత వహించెదరు. కాలేజి నాటక సమాజము కొరకు బాబా స్వయముగా నాటకములు వ్రాసి దర్శకత్వము వహించెదరు.

బాబా కాలేజికి వచ్చుట రహస్య తనిఖీ వంటిది. వచ్చే ముందు యెవరికీ తెలియదు. అటువంటి సందర్భములలో ఒక తెలివైన విద్యార్థి వీపుపై ప్రేమతో చరచుటయో, ఒక ఉపాధ్యాయుడు కొద్ది నిమిషములు ఆలస్యముగా వచ్చినందుకు సున్నితముగా మంద లించుటయో, ఒక సోమరియైన విద్యార్థితో పరీక్షలలో వచ్చిన మార్కులను గురించి ప్రస్తావించుటయో, శ్రద్ధగా చదువుకొను విద్యార్థికి ఫౌంటెన్ పెన్ కాని రిస్ట్‌వాచి కాని సృష్టించి బహుకరించుటయో, లైబ్రేరియన్‌తో పుస్తక ప్రదర్శన క్రమమును గురించి సలహా లిచ్చుటయో లేబరేటరీలకు వెళ్ళి అక్కడ విద్యార్థులు ప్రయోగములు చేయు పద్ధతిని గమనించుటయో చేయుచూ సదా విద్యార్థుల హృదయములందు సంచరించెదరు. బాబా నెలకొల్పిన ఆ కాలేజిలో, దీని ఫలితముగా విద్యార్థులలో గుప్తముగా వున్న మంచితనము, సదాలోచన, సానుభూతి, చదువు యందు శ్రద్ధ, దైవభక్తి బహిర్గతమై కార్యరూపమును ధరించుచుండును.

# సంకేతము : సంతకము

''మీ పరుపులు చుట్టబెట్టి నా వెంట రండు'' అని బాబా అనినప్పుడు అది నగర సంకీర్తనకై పిలుపు అని బహుకొద్ది మంది గ్రహించిరి. ఉదయము నాలుగు గంటలకు అనగా బ్రహ్మ ముహూర్తమున నిద్రలేచి ''భగవన్నామ స్మరణము చేయుచూ వీధుల వెంట నడుచుచూ  భగవత్ చింతనతో ప్రజలు నిదుర మేల్కొనునట్లు చేయుడు'' అని బొంబాయిలో జరిగిన ప్రపంచ మహా సభయందు బాబా భక్తుల కుపదేశించిరి. అటువంటి సంకీర్తనము గ్రామములో పూర్వముండెడిది. నిర్లక్ష్యము చేతనూ పరిహాసముల వలననూ ఈ సత్సాంప్రదాయము ఇటీవల అదృశ్యమైనది. ఈనాడు ఆలస్యముగా నిదురలేచు అభ్యాసము వలన చాలామంది సూర్యోదయమును కూడా చూచియుండరు. అట్టివారు సహితము బాబా ఆదేశానుసారము ప్రత్యూష కాలమునందు నిర్మలమైన చల్లనిగాలి మేనును సోకుచుండగా తోటి సోదరీ సోదరులతో చేరి వీనులకు విందుగా భగవన్నామ సంకీర్తనము చేయుచూ వారాదినమున అనుభవించిన ఆనంధమును ఇతరులకు కూడా పంచిరి. ''నా వెంట రండు'' అన్న బాబా పలుకుల లోని భావము ఈ యనంత రూప నామములన్నియూ తనవే యని విశదమయ్యెను. ఆ సందర్భమున ఏ దేవతామూర్తి చిత్రపటమూ తీసుకు వెళ్ళవద్దనియూ, భగవంతుని వివిధ రూపములు స్ఫురించు భజన, కీర్తనలు పాడమనియూ బాబా ఆదేశించిరి, 'నా వెంట రండు' అనగా భగవంతుని వెంట రండు అనియే బాబా ఉద్దేశ్యము.

ఆత్మ విద్య యొక్క జటిలమైన తత్వము సాధారణ మానవునికి అర్థము కాదు. దానిని గ్రహించగలిగినవారు కూడ జీవితములో కించిత్తయిననూ అనుభవములోనికి తెచ్చుకొను ప్రయత్నము చేయక, కేవలము దానిని గురించి వాగ్వాద ప్రదర్శనలలో పాల్గొనుచూ, ఆనందించెదరు. దుర్గ్రాహ్యమైన కర్మకాండకు చెందిన నిబంధనలూ, నిషేధములూ, భయము కలిగించును. ఆచరణలేని జ్ఞానము శాస్త్రములను శల్య పరీక్ష చేయు తర్క వితర్కములలో పాల్గొనగల వ్యర్థ పాండిత్యమునకు మాత్రమే ఉపకరించును. అట్లుగాక కర్మాచరణ ద్వారా ఉపాసించువాడు జ్ఞాని కాగలడు. సాధన ద్వారానే జీవిత గమ్యమును చేరవచ్చును.

నామస్మరణ మహాత్మ్యమందు విశ్వాసమును బాబా పునఃప్రతిష్ఠ చేయుచూ ''మీకు కష్టము కలిగిన నన్ను పిలువుడు. నా అనుగ్రహమును అర్థించుటకు మీకు హక్కు వున్నది'' అని అభయమిచ్చిరి. టాంజా నియాలో అరుషా పట్టణములో అగాఖాన్ హాస్పిటల్ పనిచేయు డా॥ సి.జె.గాధియా వారి యనుభవము నిట్లు వివరించిరి. ''1971 మే నెలలో జమన్‌దాస్. యమ్. పటేల్ అను నాతనికి జబ్బు ప్రమాద స్థితికి వచ్చినదని తెలిసి వెంటనే బయలుదేరి వెళ్ళినాను. నేను వెళ్ళునప్పటికే హృదయచలనము



ఆగిపోయినది. అతని ఛాతిమీద పరమ పవిత్రమైన విభూతితో హృదయ పూర్వకముగా ప్రార్థిస్తూ రుద్దినాను. అద్భుతముగా హృదయ చలనము ప్రారంభమైనది.'' అతడు పుట్టపర్తి వెళ్ళినప్పుడు దగ్గరకు వచ్చి ''సకాలములో మీ డాక్టరు నన్ను ప్రార్థించుటచే నీకు - జీవము పోసితిని'' అని బాబా మందహాసము చేసిరి.

బాబా అనుగ్రహం సంపాదించుటకు నామస్మరణము సులభ మార్గము అనీ, అది నిష్ఫలము కాదనీ భక్తు లెరుగుదురు. నగర సంకీర్తనలో పాల్గొను విషయములో కొందరికి కొన్ని సందేహములు కలిగినవి. అంత వేకువ జామున నిద్ర మేల్కొనుట సాధ్యమా? ఆ ప్రాంతమునకు చెందిన అధికారులూ ధనికులూ ఇందు పాల్గొనుటకు సంకోచించ కుందురా? పాటలు పాడిన యడల ఇరుగు పొరుగు వారు నిద్రాభంగమనుచు అభ్యంతరము పెట్టెదరేమో? పోలీసులు ఊరుకొనెదరా? కుక్కలు అరచుచు మీదపడిన చేయునదేమి? ఇట్టి ప్రశ్న లింకనూ యెన్నో! చాలామందికి తాము వీధుల వెంట పాడుచు కనబడుట యనిన సిగ్గు: బాబా ఆజ్ఞ నుల్లంఘించుట యనిన భయము. అట్టివారు ఉదయమున మూడు గంటలకే బయలుదేరి నిర్మానుష్యముగ నున్న వీధులంట ఎవరి కంటాబడకుండా పురజనులు గాఢ నిద్రలో వుండగనే ఈ కార్యక్రమము ముగించుకొని యింటికి తిరిగి వచ్చెడివారు. కాని త్వరలోనే ఆ వాతావరణము మారినది. నగర సంకీర్తనము పట్ల వినూతానోత్సహము వెల్లువయ్యై దేశము నలుమూలలా ముంచెత్తినది. ఆ మధుర గీతములు ఆయా ప్రాంతములలో నివసించు వారి నమితముగా ఆకర్షించినవి. పోలీసులు కూడ ఈ యానందము పంచుకొనుటలో చేతులు కలిపిరి, వారమున కొక దినము జరుగు ఈ కార్యక్రమము రెండు దినములు, మూడు దినములు కొన్ని చోట్ల ప్రతి దినము వరకూ పెరిగెను. పాల్గొను వారి సంఖ్య, సంకీర్తనము చేయుచూ వెళ్ళు దూరము వృద్ధియయ్యెను. తుదకు పట్టణములలో ఏ ప్రాంతమున కా ప్రాంతములోనే నగర సంకీర్తన కేంద్రములు ప్రారంభమయ్యెను. సాధారణముగ నగర సంకీర్తన చేయువారు ఒక దేవాలయము వద్ద సమావేశమై అచ్చట ఓంకార సుప్రభాత పారాయణములు ముగించి తదుపరి సంకీర్తనము చేయుచూ తరలి వెళ్ళెదరు.

సత్యవాడలో ఒక అజ్ఞాత వ్యక్తి తెల్లవారు ఝామున యింటింటికీ వెళ్ళి తలుపులు తట్టి నిదురలేచి నగర సంకీర్తనలో చేరమని పిలచెనట. చెంబూర్‌లో మంచి వర్షాకాలములో కూడ ఒక్క రోజు కూడ వర్షము మూలముగా నగర సంకీర్తనకు ఆటంకము కలుగలేదు. అస్సాములో వున్న గౌహతి పట్టణములో శ్రీదత్ గుప్తా మామూలు టైముకు లేచి అందరితోనూ కలసి నగర సంకీర్తనకు సన్నాహమౌతుండగా ఉరుములు మెరుపులతో గాలి ప్రారంభమైనది. అయినా వారు మానలేదు. త్రోవలో ట్రెజరీ ఆఫీసువద్ద వుండే కాపలదార్లు కొద్ది క్షణముల్లో భయంకరమైన తుఫాను రానున్నదనీ వెంటనే సంకీర్తన సంచారమునకు స్వస్తి చెప్పి ఆ వరండాలో తలదాచు కొనమని హెచ్చరించిరి. వారు

ఖాతరు చెయ్యకుండా నిత్యమువలెనే వారి నిర్ణీతమైన స్థలమునకు వెళ్ళి హారతి యిచ్చి ఎవరి త్రోవను వాళ్ళు వెళ్ళిరి. వారిపై చినుకులు పడలేదు, జుట్టు చెదర లేదు. కార్యక్రమము యధావిధిగా కొనసాగినది.

చేతికర్ర లేనిదే నడవలేనివారు రెండు మూడుసార్లు నగర సంకీర్తనలో పాల్గొని, అటు పిమ్మట కర్ర లేకుండా ఠీవిగా నడుచుచూ వెళ్ళిన సందర్భములున్నవి. మైసూరులోని చన్నరాయ పట్నంలోని ఒక వ్యక్తి యిట్టి పరివర్తనకు ప్రత్యక్ష నిదర్శనము. రాత్రి నిదురలో నిదురించిన ఇంద్రియములు మేల్కొని దినచర్యలయందు నిమగ్నము గాకముందే చల్లనిగాలి మెల్లగా వీచుచుండగా తెల్లవారక ముందే భగన్నామముతో పురజనులకు వీనులకు విందు చేయును. తాము తరించి యితరులను తరింపజేయు మహత్తరమైన సేవ ఇది. ఇది శరీరమునకు ఆరోగ్యం, మనస్సునకు చైతన్యం సమకూర్చును. ముఖ్యముగా ఇది బద్ధకమునకు గొడ్డలి పెట్టు. అంతేకాదు, మరొక దినము మనకు ప్రసాదించిన భగవంతునికి కృతజ్ఞత తెలుపుకొనమని ఇరుగు పొరుగు వారికి గుర్తు చేయు ప్రేమపూర్వక సందేశము, క్రోధం గర్వం దుఃఖంతో చేసిన సంభాషణల మూలముగా కలుషితమైన ఈ వాతావరణమును పరిశుభ్రము చేయు పవిత్ర యజ్ఞము.

హైదరాబాద్, సికిందరాబాద్ జంట నగరములందలి వివిధ ప్రాంతములలోని సంస్థలన్నియూ, అన్ని దిక్కుల నుండి నగర సంకీర్తనము చేసికొనివచ్చి బాబా దివ్యచరణారవిందములు వ్రాల కలసినవి. కనులకూ, వీనులకూ విందు చేయు ఈ కార్యక్రమమునకు బాబా మెచ్చి ఈ సాధనను మరింత పట్టుదలతో అభివృద్ధి చేయుమని ఆదేశించి ఆశీర్వదించిరి.

జూలై యిరవై అయిదవ తేదీన లాల్‌బాగ్ గార్డెన్స్‌లో పుష్ప గ్లాస్ హౌస్‌వద్ద బెంగుళూరులో వున్న వివిధ భజన మండలులు సమావేశమై అఖండ నామ సంకీర్తన జరిపిరి. ఆ గ్లాస్‌హౌస్ ముఖద్వారమున (పుష్పముల వనము దేవుని ఆలయము) అని వ్రాయబడి వున్నది; భగవాన్ బాబా దివ్య సమక్షములో అక్కడ భజన జరుగుచుండగా చూచిన పిదప ఆ వాక్యము చదివిన వారికి ఆ సందర్భమునకు తగినట్లు అత్యంత సమంజసముగా తోచును. ఆ భజన ప్రారంభ చిహ్నముగా జ్యోతిని బాబా వెలిగించిరి. అంత్యమున పవిత్ర మంత్రోదకములను అక్కడ చేరిన వేలాది భక్తులపై జల్లిరి. ఆ సాయంత్రం బాబా అక్కడికి వచ్చినప్పుడు వర్షము పడుచుండెను. ఎండవలన కాని, వర్షమువలన కాని, భక్తులు యిబ్బంది పడితే బాబా సహించ లేరు. భక్తుల మధ్యకు వెళ్ళి అందరినీ మందిరములోనికి రప్పించి కూర్చుండబెట్టి, తామొక సాధారణ కుర్చీని అందరికీ దర్శనమగునట్లు వేదికపై వేసుకుని తమ దివ్యోపన్యాసమును ప్రారంభించిరి.

1968లో శ్రీకృష్ణ జయంతి ఉత్సవము ప్రశాంతి నిలయములో మూడురోజులు



జరిపిరి. సత్యసాయి సంస్థలలో ఈ పండుగను సాయికృష్ణ జయంతి అంటూ బాలబాలికలకు క్రొత్త బట్టలు కుట్టించి వారిచేత భజనలు చేయించి చిన్న చిన్న నాటికలు వేయించి బాలల పండుగగా పరిగణించెదరు. ప్రశాంతి నిలయములో శ్రీకృష్ణుని లీలలోని అంతరార్థమును బోధిస్తూ బాబా మూడు దివ్యోపన్యాసము లిచ్చిరి. నామము యొక్క మహిమను గురించి చెప్పుచూ 'కృష్ణ' అనే శబ్దము యొక్క అర్థములలో దివ్య అకర్షణ అను అర్థము ముఖ్యమైనదని వివరించిరి.

మధుర అను నాభిస్థానమందుద్భవించిన దివ్యత్వమే కృష్ణుడు. దానిని గోకులమనే నోటి వద్దకు చేర్చి అచట నుండి దాని మాధుర్యమును గ్రహించగలిగిన యశోద అను నాలుకపై నిలుపవలెను. కృష్ణుడు సర్పముపై నాట్యమాడుట చేత కాళింగుడు తన విషము నెట్లు బయటకు గ్రక్కెనో అటులనే కృష్ణనామము నాలుక మీద నాట్యమాడిన దురాలోచనలు హృదయము నుండి గెంటివేయబడును.

భగవంతుని చేరుటకు విభిన్న మార్గములుగా కనబడు వేదాంత సిద్ధాంత త్రయమును సమన్వయముగావించు యోగ మార్గమును అభివ్యక్తము చేయుటయే కృష్ణావతారము యొక్క లక్ష్యము. వ్యక్తుల యొక్క మనస్తత్వములను యోగ్యతలను అనుసరించి శంకరాచార్యుని అద్వైత సిద్ధాంతమును, రామానుజాచార్యుని, విశిష్టాద్వైతమునూ మధ్వాచార్యుని ద్వైత సిద్ధాంతమును శ్రీకృష్ణుడు భక్తులకుపదేశించెను.

ధర్మగ్లాని సంభవించినప్పుడు తిరిగి ధర్మమందు విశ్వాసమును పునఃప్రతిష్ఠించుటకు ప్రతియుగములోనూ భగవంతుడవతరించు చుండును. చిత్త శుద్ధిద్వారా జ్ఞానసిద్ధి అనగా సద్వర్తన ద్వారా దైవత్వం సిద్ధించును. సత్వగుణ సంపన్నులైన వారిని అవతార పురుషుడు దివ్యా నందములో నింపును. ఇది ద్వైతుల కన్వయించు ప్రకటన. ఇక విశిష్టాద్వైత సిద్ధాంత దృష్ట్యా పరిశీలించెదము. విషయవాసనలనే రైలుపెట్టెలు జీవుడు దేవుడు అనే రైలు పట్టాల మీదుగా మనస్సనే యింజన్ లాగుచున్నది. ఈ రైలు పెట్టెలో బుద్ధి ఇంద్రియములు మొదలైన 'లగేజి' నిండి వున్నది. మనస్సనే ఇంజన్ నడుపు డ్రైవరు ఆత్మ. ఈ రైలు పెట్టెలను ఇంజన్‌కు బంధించకున్న అవి పట్టాల మీదనే నిలబడి పోవును. అందుచేత భక్తి శ్రద్ధలనే గొలుసులతో విషయ వాసనలనే రైలు పెట్టెలు మనస్సు అనే యింజనుకు బంధింపబడును. అది భక్త అవిచ్ఛిన్న బ్రహ్మము మీద దృశ్య ప్రపంచమును నిలిపి చూడగలుగుట శుద్ధ అద్వైత సిద్ధాంతము. మేఘములలోని నగర శిఖరాగ్ర దృశ్యము లెంత సత్యమో దృశ్య ప్రపంచము అంతే. ఎవరైనను గాలిలో మేడలు కట్టి అందు నివసించగలరా? ఈ మేడలూ గోపురములూ కేవలము మన ఊహా హర్మ్యములు, అర్థరహితములు. ఈ ఆకాశమనే పరబ్రహ్మములో ఈ జగత్తు అనే ఒక కల్పిత దృశ్యము వ్యాపించివున్నది. అది ఆధారరహితమైనది. మిధ్య సర్వం

సర్వత్రా, అద్వైత సదానంద పరబ్రహ్మ చైతన్యమే. దీనిని సూక్ష్మముగా ''ఇతరుల దృష్టిలో నీ వెవ్వరివో - అది ద్వైత దర్శనము, నిజముగా నీవెవ్వరివో - అది అద్వైత దర్శనము.'' అని బాబా బోధించిరి.

1967 దసరా మరపురాని అనుభవం. సేవాదళ్ వలంటీర్ల నుద్దేశించి చేసిన ప్రత్యేక ప్రసంగములో తానే సనాతన సారథి, పార్థసారథి అని స్పష్టపరిచిరి. ''నాకును కొన్ని నెరవేర్చవలసిన శపథములున్నవి, అవి భగవద్గీతలో చెప్పబడి యున్నవి. ధర్మము యొక్క మహోన్నత స్థానమును నిలిబెట్టవలసి యున్నది. సంపూర్ణ విశ్వాసముతో నన్నే ఆరాధించువారి యోగక్షేమముల బాధ్యతను నేను వహించవలెను. నన్ను మెప్పించవలెనన్న సమస్త జీవులలోనూ నన్ను చూచి, నాకు సేవ చేయదలచిన రీతిగ వారికి సేవచేయుటయే.'' అన బాబా ప్రకటించిరి.

భగవద్గీతలో తనను గురించి తాను చేసిన ప్రకటనను వివరించుచూ ''నన్నెవరూ నిర్బంధించ లేరు. నేను చేయుపనివల్ల నాకెట్టి లాభమూ లేదు. అయిననూ, వక్రమార్గమును పట్టుచున్న పరిస్థితులను సరిదిద్దుటకు, ప్రజలకు బోధించి దారి చూపుటకు నిర్విరామకృషి జరుపుచునే యున్నాను. నేను పనిచెయ్యకుండిన ఈ విశ్వచక్రము లెట్లు తిరుగును. నాకు కార్యదర్శి కాని, సహాయకారుడు కాని సేవకుడు కాని యెవరునూ లేరు. ఇక్కడయిననూ ఎక్కడయిననూ ఎంత చిన్న పని అయిననూ నేను స్వయముగా చూచుకొనెదను. మీ అందరి ఆనందమే నాకు ఆహారము. నేనానంద స్వరూపుడను. నా స్వభావమే ఆనందము; ఆనందమే నా సంకేతము; ఆనందమే నా సంతకము'' అని బాబా పలికిరి.

మరియొక దినమున బాబా ఇట్లు ప్రకటించిరి. ''నాకు నిశ్చింత, విశ్రాంతి, సంతృప్తి ఎప్పుడు కలుగునో తెలియునా. మీరందరూ ఆధ్యాత్మిక చింతన, వైరాగ్యము, సేవాతత్పరత అలవరచుకుని ఆనందముగా వున్నప్పుడు. నేను నిరంతరము ఏదో ఒక కార్యకలాపము నందు నిమగ్నుడనై యుండుట మీ మేలుకొరకే, నేనేమీ చేయక పోయినను నన్నడుగ గల వారెవరును లేరు. నాకు వచ్చు నష్టమూ లేదు. నేను ఎట్టి కర్మనూ ఆచరించ నిచ్ఛగించను. అయిననూ, నిరంతరమూ మీ కుత్సాహము, ఉత్తేజమూ కలిగించి మిమ్ము దైవోన్ముఖులుగా చేయు నుద్దేశ్యముతో ఆదర్శ రూపముగ మార్గదర్శిగా యుండుటకిట్లు సదా కార్యాచరణ యందు నిమగ్నుడనై యుండెదను.''

మరొక గీతావాక్యమును వ్యాఖ్యానించుచూ ''సర్వధర్మములను పరిత్యజించమన్నది కాని సర్వకర్మలను పరిత్యజించ మనలేదు. కర్మలు ఆచరించక తప్పదు. మీరు ప్రతి కర్మనూ భగవత్ప్రీతి కొరకు, భగవంతుని ద్వారా, భగవంతుడే కర్తగా భావించినప్పుడు ఆ కర్మ ధర్మముగా మారి భగవదను గ్రహమునకు పాత్రత చేకూర్చును, అప్పుడు మీ



కర్మల కెట్టి పాపము అంటదు. కాబట్టి గీత సోమరితనమును కాని అవినీతిని కాని అధర్మమును కాని ప్రబోధించుట లేదు. అహంకారము పరిత్యజించి నీ సర్వకర్మలనూ భగవంతుని కర్పించి శరణాగతుడవుకమ్మ అని గీత ప్రబోధించుచున్నది'' అని విశదీకరించిరి.

ఒక వ్యక్తియందైననూ, సమాజమునందైననూ, ధర్మము భగవంతుని అంతర్వాణి. గొంగళి పురుగు రెక్కలు వచ్చి స్వేచ్ఛగా ఆనందము లోనికి ఎగిరిపోవు వరకు దానియందున్న చైతన్యము దాని చుట్టూ గూడు కట్టి భద్రపరచును. అట్లే మానవుని అజ్ఞానావస్థ నుండి సచ్చిదానంద స్థితికి చేర్చు చైతన్యమే ధర్మము. యజ్ఞ సప్తాహమునకు అంతిమ దినమున పట్టు చందన స్వర్ణ నవరత్నాదులతో పూర్ణాహుతి జరుపు సందర్భమున దాని అంతరార్థము నీ విధముగా బాబా వివరించిరి. ''ప్రకృతి వేరు బ్రహ్మము వేరు అను అజ్ఞానదృష్టిని ఈ యెగయుచున్న మంటల నెడు జ్ఞానాగ్నికి ఆహుతి చేయుటయే దీని అంతరార్థము. సర్వమూ బ్రహ్మమయము, ఈ ఆహుతి చేయబడు పదార్థములూ బ్రహ్మమే. అగ్ని బ్రహ్మమే; ఆహుతి చేయువాడూ బ్రహ్మమే; దీని లక్ష్యమూ బ్రహ్మమే. ఈ చరాచర సృష్టిలో బ్రహ్మమున కితరమైన దేదియులేదు. విభిన్నముగా గోచరించుటకు కారణము అజ్ఞానమనెడు దృష్టిదోషము. ఒక వెండి విగ్రహములో కిరీటమూ వెండియే, దుస్తులూ వెండియే, పీఠమూ వెండియే, శరీరమూ వెండియే, ముఖమూ, కన్నులూ వెండియే వేరు వేరు భాగములుగా కనబడునిది యంతయూ వెండియే, అదే విధముగా సర్వమూ బ్రహ్మమయమని గ్రహించుడు.''

మరియొక ప్రసంగమున భక్తి, జ్ఞాన, కర్మ మార్గముల మూడింటిని చక్కగా సమన్వయము చేసి ప్రజలకు సులభగ్రాహ్యమగునట్లు విశదీకరించిరి. ''ఎవరైననూ నీ పేరేమని అడిగినప్పుడు, ఇతర శరీరముల నుండి నీ శరీరము వేరుగా గుర్తించుటకు ఈ జన్మలో నీవు ధరించిన పేరు చెప్పుదువు, అసలు నామము చెప్పవు, ఎన్నో జన్మములుగా, ఎన్నో జనన మరణముల ద్వారా, నిన్ను వెంటాడుతూ వచ్చిన నీ అసలు పేరు ఆత్మ. మల, విక్షేప, ఆవరణలనే తెరల మరుగున ఆత్మ దాగియుండుట చేత దానిని విస్మరించెదవు. అవినీతి దురభ్యాసములు క్రౌర్యము యొక్క సంయోగ దుష్ఫలమే మలము. దీనిని కర్మమార్గము ద్వారా తొలగించ వచ్చును. ఫలాపేక్ష లేకుండ, నిరహంకారియై, నిరాడంబరుడై స్వార్థ రాహిత్యముతో జరిపెడు పవిత్ర కర్మల ద్వారా దీనిని తొలగించుట సాధ్యము. ఇక రెండవది విక్షేపము, అనగా అవిద్య. ఇది సత్యమును దాచి, బుద్ధి వివేక విచక్షణలను దూరము చేసి అసత్యమును ఆకర్షణీయముగా అలంకరించును. దీని ప్రాబల్యము నుండి తప్పించుకొనుటకు భక్తియే మార్గము. సృష్టి స్థితి లయకారుడు, సత్యం శివం సుందరం, సచ్చిదానంద స్వరూపుడు సర్వ స్వరూపుడు సర్వాంతర్యామియైన ఆ సర్వేశ్వరుని నిరంతరము ఆరాధించుటయే భక్తి మార్గము.''

ఇక మూడవ తెర ''ఆవరణ'' త్రాడును సర్పమువలె, ఎండమావులను కొలనువలె భ్రమగొల్పునట్లు తన ప్రభావముచే మిథ్యను సత్యముగా చూపి కన్ను కప్పును; సర్వం బ్రహ్మమయమను సత్యమును ప్రాపంచికమైన వైవిధ్య భావనతో కప్పిపుచ్చును. ఈ ఆవరణను తొలగించవలెనన్న జ్ఞానమార్గ మవలంబించవలెను. ఆత్మ యొక్క సత్య నిత్య సర్వవ్యాపకత్వమును అనుభవరీత్యా గ్రహించిన మానవుడు జ్ఞానోదయము పొంది బంధవిముక్తుడగును. అంత్యమున, ఏ పరమాత్మ నుండి విడివడి, నిశిరేయి వంటి జనన మరణ చక్రభ్రమణములో పడెనో, ఆ పరమాత్మనే చేరును.

దసరా, శక్తి యొక్క విజయోత్సవమును సూచించు పర్వదినము. ఈ ఉత్సవమున మూడు రూపములను ఆరాధించుచూ మూడేసి దినములు జరుపుకొనెదరు. మొదటిది మహాకాళి (క్రోధము, ప్రతీకారము, సాహసము, అహంకారము మొదలయిన తామసిక గుణములు మూర్తీభవించిన రూపము) రెండవది మహాలక్ష్మి (ధనము, అధికారము, ఐశ్వర్యం మొదలయిన రాజసిక లక్షణములు మూర్తీభవించిన రూపము) మూడవది మహాసరస్వతి (దూరదృష్టి, జ్ఞానము, క్రమశిక్షణ, న్యాయము, ఆదర్శము మొదలయిన సాత్విక గుణములు మూర్తీభవించిన రూపము).

ప్రశాంతి నిలయంలో జరిగే దసరా ఉత్సవము అందరినీ భక్తిపారవశ్యంలో ఉర్రూతలూగిస్తుంది. ప్రపంచ మంతట నుంచీ, తమ తమ హృదయాంతరాళాలలో తమకు అత్యంత ప్రియమైన సాయి రూపమును ప్రతిష్ఠించుకున్న వేలాది భక్తులు అక్కడకు వచ్చెదరు. వారి వారి జీవిత గ్రంథాలలో బాబా అనుగ్రహముతో కూడిన అనుభవములు స్వర్ణాధ్యాయములు, బాబాను గురించి తలంచిన మాత్రముననే వారి హృదయములలో పదిలపరచుకున్న కృతజ్ఞత ఆనందాశ్రువుల రూపమున వెలువడును.

దసరా ఉత్సవ సందర్భముగా నిత్యము విద్వన్మహాసభలు జరుగును. పరుసవేది తాకినంతనే సకల పదార్థములూ బంగారుగా ఎట్లు మారునో అట్లే, బాబా ఆదేశానుసారము ప్రసంగించు పండితులు బాబా దివ్య సన్నిధిలో, వారెట్టి క్లిష్టమైన వేదశాస్త్రాంశములను గూర్చి ముచ్చటించినను సరళమూ అగాధమైన ఏకైక దివ్యశక్తి యొక్క తత్వ వివరణయే యని గ్రహించెదరు. తదుపరి తమ దివ్యోపన్యాసములో క్లిష్టమైన ఆవేదశాస్త్రసారములను బాబా సులభమధురముగా విశదపరచెదరు. బాబా అద్వితీయ విద్యాదాతగా ఈ యుగమున అవతరించి, మనలను పాటలతో, నాటకములతో, ఉపన్యాసములతో, భావ విన్యాసములతో విచిత్ర సూక్తులతో, ఛలోక్తులతో, మధురోక్తులతో, కఠినోక్తులతో, అనుగ్రహము చూపించి ఆగ్రహము నటించి, పలువిధములుగా అజ్ఞానాంధకారము నుండి జ్ఞాన ప్రకాశము లోనికి కొనిపోవుచున్నారు.

ఈ దసరా నవరాత్రి ఉత్సవ సందర్భములో ఏడు దినములు వేద యజ్ఞ సప్తాహము



జరుగును. ఆధ్యాత్మిక సాధనలో అదియొక అపూర్వమైన అనుభవముతో కూడుకున్న పాఠము; ఒక దివ్య ఆనంద సందోహము, ఉపనిషత్తులలో వర్ణించిన నిరాకార నిర్గుణ పరబ్రహ్మమును స్మరించుటలోని ఆనందమునూ, ప్రాణమునకూ ప్రకాశమునకూ ఆధార భూతముగా సూర్యుని పూజించుటలోని ఆనందమునూ, నిర్గుణ నిరాకారుడైన సృష్టి స్థితి లయకారుని సాకారునిగా దర్శించు ఆనందమూ, అసాకార పరబ్రహ్మమును నిరాకార ప్రతీకమైన లింగ రూపమును ఆరాధించు ఆనందమునూ అనుభవించవలెనే కాని వర్ణించ నలవి కాదు. శక్తిని విగ్రహ రూపములో మంత్రయుక్తముగా ఆహవనము చేసి ప్రతిష్ఠించి పూజించి శాంతింప జేయుటలో కలుగు ఆనందము వేదమంత్ర పఠనములో, పురాణ పద్య పఠనములో కలుగు ఆనందము అనుభవైక వేద్యము. ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము గురించి పరిపరి విధముల చేసిన బాబా ప్రబోధములు హృదయమున ప్రతిధ్వనించుచునే యున్నవి.

ప్రతి దసరా ఉత్సవ సందర్భములోనూ బాబా ఒక నాటికను రచించి దానిని వేద పాఠశాల విద్యార్థులచే ప్రదర్శింప జేసి తద్వారా ఆధ్యాత్మిక ప్రబోధనలను భక్తుల కందించుట పరిపాటి. ఈ దసరాకు ధృవుని గురించి నాటిక ప్రదర్శించబడినది. రాజకుమారుడైన ధృవుడు అయిదేళ్ళ పసిబాలుడు. తండ్రి ప్రేమకు పాత్రుడు కావలెనన్న దృఢ నిశ్చయముతో అడవులకు పోయి భగవంతుని గూర్చి తపస్సు చేసెను. తపస్సుతో అతని హృదయము నిర్మలమై, పరాభవాగ్ని, ద్వేషము అదృశ్యమైనవి. తుదకు తనలో లీనము చేసుకొనుమని భగవంతుని ప్రార్థించెను. ''ఏ దీర్ఘరోగ నివారణకొరకో నా వద్దకు వచ్చెదరు. నా తత్వమును గ్రహించిన పిదప భవరోగ నివారణ కొరకు నన్నా శ్రయించెదరు. దానికి నేనెప్పుడూ సిద్ధముగనే వున్నాను.'' అని ఆ నాటకములోని నారాయణుడు అనును. బాబా వద్దకు వచ్చువారి అనుభవమున కది ప్రతిబింబమే.

దసరా పండుగ అనంతరం ఇరవై వేల భక్తులు భారమైన హృదయములతో ప్రశాంతి నిలయము నుండి తిరిగి వెళ్ళినారు. బాబా దివ్యవాణి వారి హృదయాంత రాళమున ప్రతిధ్వనించుచునే యుండును. ''నేను ప్రేమపూర్వకముగా మీ శ్రేయస్సు కొరకు దివ్యౌషధను వంటి సలహాల నిచ్చినాను. వాటిని గూర్చి నిత్యమూ మననము చేసుకొనుడు. పశ్చాత్తాపముతో మీ హృదయములను పరిశుద్ధము చేసుకొనుడు. దుశ్చింతలను దరిచేరనీయకుడు. దృఢ సంకల్పముతో మీ జీవితములను సంస్కరించు కొనుటకు పూనుకొనుడు. భగవదనుగ్రహముతో మీ నిండు హృదయములు పుష్పించు మార్గమును త్రికరణ శుద్ధిగా అవలంబించుడు.''

# దీపావళి

ఉత్తర మైసూర్ జిల్లా ప్రాంతములో ఒక వారము పర్యటించుటకు అనంతపురం నుండి అక్టోబర్ 20వ తేదీన బాబా ధార్వార్ వైపు ప్రయాణమైరి. ''మధుర స్మృతిగా నిలచే ఈ యాత్రను మనం ఏమనాలి?'' అని ఒకరు ప్రశ్నించగా 'అమరపుర ఆనంద యాత్ర' అన్నారు బాబా తక్షణం. అవును, అది వారి సంకల్పము, వారే ఆధ్వర్యం వహించేరు. సర్వత్రా కర్తా వారే, భోక్తా వారే, మార్గమూ వారే. లక్షలాది ప్రజలకు ఈ యాత్ర ఆనందంతో విందు చేసిన దంటే ఆశ్చర్యమేముంది. శ్రీవారి కారు, వారి వెంటనున్న వారికార్లు మైసూరు రాష్ట్రపు పొలిమేరలోని మొదటి పట్టణమైన బళ్ళారి దాటిన వెంటనే ఈ శుభవార్త వినినవారినీ, వారి ద్వారా బంధుమిత్రులనూ ఆనందమున ముంచివేసినది. చూచుచుండగనే క్షణములో ఈ ఆనంద వార్త నలుదిశలా వ్యాపించింది. అది దీపావళి ముందురోజు. ప్రతి హృదయములోనూ దీపము వెలిగింది.

గడగ్ పట్టణములో బాబా అనుగ్రహమునకు పాత్రులై వారి దివ్యరూపనామములను స్మరించు భక్తులనేకులున్నారు. వారు, వారిద్వారా బాబాను గురించి విని ఉత్తేజితులైన వారూ, ఎందరో పట్టణము ప్రవేశించు రాజబాట వద్ద బాబా దర్శనార్థము సమావేశమైరి. హుల్‌కోటి, అన్నాగేరి పట్టణములందు బాట కిరుప్రక్కల తండోపతండములుగా భక్తులు నామ సంకీర్తనము చేయుచూ నిలబడిరి. హుబ్లీ పట్టణములో ఆ నగరపు మేయరూ మూడువేలమంది భక్తులు ఎదురేగి పూలమాలలతో స్వాగతమిచ్చి హుబ్లీ నగరవాసులకు ఆరోగ్య ఆనంద ఐశ్వర్యములను ప్రసాదించమని ప్రార్థించిరి.

ధార్వార్ అక్కడకు 12 మైళ్ళు దూరము. బాబా ధార్వార్ ప్రవేశించుచుండగా, అనేక కళాశాలలకూ, శిక్షణాలయములకూ ఆలవాలమై 'విద్యాగిరి' యను నామమును సార్థకము చేసుకొనిన విద్యా కేంద్రమును నిర్వహించుచున్న ప్రిన్సిపాల్ శ్రీ ధార్వాడ్కర్ తదితర విద్యావేత్తలూ, పెద్దలూ ద్వారము వద్దనే నిలబడి జై జై ధ్వనుల మధ్య స్వాగతించి తోడ్కొని పోయిరి. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ భవనము చేరుకొనునప్పటికి రాత్రి 9.30 గం॥ అయినది.

బాబాను ప్రార్థించి ఈ పర్యటనకు సన్నాహములు చేసిన ముఖ్యుడు, ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయిన డాక్టరు అన్నాసాహెబ్ అడికె బి.ఇ.,పి.హెచ్.డి. యూనివర్సిటీ పనిమీద వారామధ్యనే ఆస్ట్రేలియా వెళ్ళి వచ్చి అస్వస్థులై ఇంటి నుండియే బాబా రాకకై వేచియుండిరి. వారి విధముగా నాతో అనిరి. ''బాబా పర్యటన కార్యక్రమము తయారు చేయుట సులభమనుకొంటిని. అన్ని ప్రాంతముల నుండి వచ్చిన వొత్తిడికి తట్టుకొనలేక నిశ్చేష్టుడనైతిని. నా పరిస్థితి గమనించి చిరునవ్వుతో బాబా ''ధార్వార్‌లో



అంతా సరిచేస్తాను'' అని సముదాయించిరి. బాబా ధార్వార్ వచ్చునప్పటికి తీవ్రమైన అనారోగ్య స్థితిలో దిగులుగా వున్నాను. వారి రాకతో నా అస్వస్థత అదృశ్యమైనది. ఆ క్షణము నుండి నాకెక్కడలేని శక్తి వచ్చి మామూలుగా కంటే ఎంతో ఉత్సాహముతో తిరుగుచూ పనులు చేయగలిగితిని. నా ఆరోగ్యము గురించి జాగ్రత్తగా వుండమని ఎవరైనా హెచ్చరించినను గుర్తుచేసిననూ నవ్వు వచ్చెడిది'' అన్నారు డాక్టరు అడికె.

ఆ విశాలమైన బంగళా ఆవరణలో ఆ రాత్రి మరునాటి ఉదయం సమావేశమైన వేలాది జనులకు బాబా దర్శనమొసగి ఆనందపరచిరి. మరునాటి సాయంత్రము నాలుగు గంటలకు సేవసమితి కార్యకర్తల సమావేశము నందు తమ పర్యటన కార్యక్రమమునకు సంబంధించిన వివరములు నిర్ణయించిరి.

ఆ సాయంకాలము సుమారు ఇరవై వేలమంది శ్రీవారి దివ్యోపన్యాసము వినుటకు బహిరంగ సభకు వచ్చిరి. డాక్టరు అడికె శ్రీవారికి స్వాగత వచనములు పలుకుచూ ''ఈ విశ్వవిద్యాలయ మీనాడు భగవదనుగ్రహముతో పావనమైనది. మన విద్యాలయము లలో మనము అనిత్యమైన ప్రాపంచిక వస్తువుల పరిమాణ పరిణామములూ, సంయోగ విశ్లేషనలూ మొదలయిన విషయములను పరిశీలించి పఠించుట యందు నిమగ్నులమై యుందుము. మన పుస్తకములు మస్తకములయినవి; గుండెలు బండ బారినవి. అసలయిన జ్ఞానము మనకి శూన్యము. ఇది దురదృష్టము. ప్రాపంచిక భోగముల నాశించి శిలగా మారిన అహల్య శ్రీరాముని పాదస్పర్శతో సజీవ సౌందర్య ఆనందములను తిరిగి పొందెను. మేమూ అట్టి దివ్య స్పర్శ నాశించుచున్నాము. బాబా! మమ్ము మేల్కొల్పి సత్యం శివం సుందరమైన మా స్వస్వరూపములలో జీవించి ఆశీర్వదించుడు''

కర్నాటక విశ్వవిద్యాలయమునకు, ధార్వార్ పట్టణమునకు చిరపరిచితులైన డాక్టర్ గోకాక్ సభలో ప్రసంగించుచూ మీ మీ బాధలనూ, వ్యధలనూ, బలహీనతలనూ, లోపములనూ బాబాకి అర్పించి మీ హృదయ భారమును దింపుకొని వాటిస్థానే బాబా ప్రసాదించు అనుగ్రహ ఆనందములు నింపుకొనుడు.

బాబా కన్నడ భాషలో తమ ఉపన్యాసమును ప్రారంభించిరి. అనూహ్యమైన అనుగ్రహ చిన్నాము. అక్కడ చేరిన పురుషులు, స్త్రీలు, పిల్లలు బాబా చూపిన అపార ప్రేమకు పులకితులైరి. కరతాళ ధ్వనులు మిన్నుముట్టి పరిసర పర్వతములలో ప్రతిధ్వనించినవి. ''కస్తూరి యిక్కడ లేదా? తర్జుమా చేయువారు లేకుండ నేనిప్పుడు ప్రసంగించవలెను. కన్నడ ప్రాంతముతో నాకు 25 సంవత్సరములుగా సంబంధమున్నది. అయినను కన్నడములో ఉపన్యసించుట యిదే ప్రప్రథమము. మీ భాష కస్తూరివలె నుండునని మీరు కొనియాడుకొందురు. మీ భాషకున్న ప్రతిష్టకు భంగము రానీయనను కొనెదను'' అంటూ బాబా ప్రారంభించిరి.

మన నోటినుండి మాటలు తీసి వాటితోనే బాబా తమ దివ్య సందేశము నందించి ఆనందోద్రేకములందు ముంచెదరు. దీనికి మన యెడల వారికివున్న అవ్యాజ్యమైన ప్రేమయే కారణము. వారు యీ మొట్టమొదటి కన్నడ ఉపన్యాసము గంటన్నర కావించిరి. సాధారణముగా వారు మాట్లాడు తెలుగువలెనే కన్నడము కూడా మధురాతి మధురముగ నుండెను. ధార్వారు ప్రజలు ఆనందాశ్చర్యములతో నిశ్చేష్టులైరి. ఎవరినోట విన్నను 'ఏమి ఆ గంగా ప్రవాహము ఎంత చక్కగా బోధించేరు' వంటి ఆశ్చర్య ప్రకటనలే. యూనివర్శిటీ ఆవరణలోని వాతావరణ మిట్టి మాటలతో నిండి గింగురు మనుచుండెను.

ఉపన్యాసానంతరము బాబా తమ మధుర కంఠముతో కొన్ని పాటలు పాడగా అక్కడ చేరినవారందరూ గొంతులు కలిపి పాడిరి. ఆ పాటలలో మహర్షులు భగవంతుని వివిధ రూపములుగా వర్ణించిన శివ, రామ, శక్తి, కృష్ణ, సుబ్రహ్మణ్య, విష్ణు మొదలయిన నామములు స్తుతి నిండి యుండెను. వీణాతంత్రుల వంటి గాత్రముతో బాబా ఆ పాటలు పాడుచుండగా వారందరూ ఆనంద సంభ్రమ సమ్మోహితులై తలలూపుచూ గళములు కలిపిరి.

అక్కడ చేరిన వారిలో చాలామంది ఒకే రూపనామముతో భగవంతుని ఆరాధించు ఆచారము కలవారు. ఇతర నామములు వర్ణించుటయే అపచారమనుకొందురు. ''ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'' అనే పవిత్ర వాక్యమెరింగినప్పటికీ వారి సాంఘిక వాతా వరణము వారి విశ్వాసమును దృఢపరచునుద్దేశ్యముతో ఒకే రూపనామములకు బద్ధులను కావించినది. బాబా భజనలతో వారందరి హృదయములలోని మూఢనమ్మకములనెడి సాలెగూడులను తుడిచివేసి సంకోచము భయము అనెడి దుమ్మును దులిపి శుభ్రపరచి ఆనంద పరిమళముతో నింపినట్లయినది. ''ఎన్నో తరాలుగా మా గుండెలలో నిండిన మూఢాచారమును బయటకు గెంటి జ్ఞానమనెడి ఆనంద బిందువులను చిందించుట బాబా ఒక్కరికే సాధ్యమయినది'', అనుచు వారందరూ వేనోళ్ళ స్తుతించిరి. పురుషుడైనా స్త్రీ అయినా యువకుడైనా, వృద్ధుడైనా, హిందూ, క్రిష్టియన్, ఇస్లాం, బౌద్ధ, జైన్ మొదలైన ఏ మతస్థుడైనా చివరికి ఆస్తిక వాదియైనా, నిరీశ్వరుడైనాసరే, బాబా వారి అంతర్గత విశ్వాసవాహినిని స్పృశించి చైతన్యం కలిగించి వారికి జ్ఞానోదయం కలిగించెదరు.

ఆ నాటి నుండి బాబా పర్యటన నిర్ణీత కార్యక్రమము ప్రకారం జరిగినది. విద్యాగిరిలోని ఆర్ట్స్ కాలేజి కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన పెద్ద బహిరంగ సభలో ప్రసంగించిన పిదప తమ రాకతో పావనము చేసిన ఈ సందర్భము యొక్క స్మృతి చిహ్నముగా, వారికోరికపై ఒక మొక్క నాటిరి. ప్రిన్సిపాల్ ధార్వాడ్కర్‌కు నీలం పొదుగబడిన



బంగారు ఉంగరమును సృష్టించి బహూకరించిరి. తరువాత క్రమశిక్షణ, సౌశీల్యమును గురించి ప్రసంగించిరి.

''నా సందేశమిది. ప్రేమస్వరూపులు కండు; భయము ద్వేషము దరికిరానీయకుడు. అందరి యెడల ప్రేమను అభివృద్ధి పరచుకొనుడు. ఇతరుల సుఖదుఃఖములను అర్థము చేసుకుని ఇతరుల సుఖమే మీ సుఖముగ ఇతరుల దుఃఖమును మీ దుఃఖముగ భావించుడు.

''ఈ విద్యాభ్యాస కాలమందే మౌనము, ధ్యానము అభ్యసించుడు. జీవితమనే పాఠశాలలో ఇవి మీ విజయమునకు తోడ్పడును. ఈ పాఠము మీరు జ్ఞప్తియందుంచు కొనుడు. సనాతన ధర్మ పునఃస్థాపన తథ్యం. దాని ద్వారానే ప్రపంచమున సుఖశాంతులు లభించును. ఆ లక్ష్యముతోనే నేనవతరించినది.'' అని బాబా అభయమిచ్చెను.

విద్యాగిరి నుండి మోటారుకారులో బాబా హుబ్లి ఏతెంచిరి. అక్కడ కర్నాటకవైద్య కళాశాల ఆవరణ అంతయూ బాబా దర్శనము కొరకు వారి దివ్యవాణి వినుటకు చేరిన వారితో క్రిక్కిరిసియుండెను. బాబా కన్నడమున ప్రసంగించెదరన్న శుభవార్త అంతటా వ్యాపించుటచే ఆనందోత్సాహములతో అందరూ ఎదురు చూచుచుండిరి. ''ఈనాడు దీపావళి యగుటచేత రకరకములైన తీపులు మీరు తినియుందురు. వివిధ రూపములతో వున్ననూ అన్నిటియందూ వుండు మధుర పదార్థ మొక్కటియే చక్కెర. అటులనే అన్ని పదార్థములందూ అన్ని ప్రాణులందు సచ్చిదానంద రూపమున వున్న పదార్థ మొక్కటియే; అదే ఆత్మ. రూపనామములు సంతరించుకున్న ఆత్మయే దైవము'' అని బాబా వివరించిరి.

క్రోధ ద్వేషములను దరిచేరనీయక, మానవునకు వరప్రసాదమైన వివేక విచక్షణలతో వర్తించమని బాబా విద్యార్థులకు ఉపదేశించెను. మననము చేయునదియే మంత్ర మనియూ, సదా సత్పురుషుల నందించు సదాలోచనలనే మననము చేసుకొనవలెననియూ, నిర్మలమైన భావములతో హృదయములు నింపుకొనవలెననియూ బోధించిరి. అచ్చట చేరిన వారిలో చాలామంది వైద్య విద్యార్థులున్నందున ''నాలుగక్షరములగల డిగ్రీకొరకు అమూల్యమైన మీకాలమును వ్యయపరచుచున్నారు. సకల చరాచర పదార్థములందూ, అణువణువున ద్యోతకమగుచున్న ఆ భగవంతుని దివ్యశక్తి వైభవములను గుర్తించి అతని అనుగ్రహము కొరకు రోజుకు అయిదు నిముషములు నిశ్శబ్దముగా ప్రార్థించలేరా?'' అని ప్రశ్నించెను.

23వ తేదీన ఉదయము 9 గంటలకు ధార్వార్ వదలి సిర్సిమార్గము గుండా పశ్చిమ తీర ప్రాంతమునకు బాబా పయనమయ్యిరి. 45 నిమిషముల తరువాత ముంద గోడ్ అను గ్రామమును సమీపించిరి. ఈ ప్రాంతములో రహదారి కొన్ని గ్రామముల

మీదుగా వెళ్ళెను; అక్కడక్కడ రెండుమూడిండ్లు దూరముగా తోటలలో చెట్ల వెనుక నుంచీ పొలముల వెనుకనుంచీ పొంచి చూచునట్లగపడును. ఇక్కడ అన్ని చోట్లవలె వీధి కిరుప్రక్కలా యిండ్లుండవు; దట్టమయిన తోటలు పంట పొలముల మధ్య దాగి యుండును. ఇక్కడకు యిర్వై, యిర్వై ఐదు మైళ్ళ దూరమున వున్న గ్రామముల నుండి నడచివచ్చి ఈ యుగావతారి అయిన బాబాను దర్శించ వేచియుండిరి.

అక్కడ నిరాడంబరులైన 400మంది కార్మిక కర్షకులు చేరిరి. బాబా వారి మధ్య తిరుగుచున్నప్పుడు వారి కన్నులు ఆనందముతో మెరిసినవి. వారిలో ముగ్గురు వికలాంగులకు సర్వరోగ నివారిణియైన విభూతిని సృష్టించి ప్రసాదించిరి. నామస్మరణ, సంకీర్తనలను గురించి వారికి బోధించి భజనలవలన కలుగు ఆనందమును వారికి రుచి చూపించుటకు బాబా మూడు కీర్తనలు పాడిరి. బాబా దివ్యగానము వారి నున్మత్తులు చేయగా శక్తి కొలది గొంతెత్తి వారు ఆనందముగా పాడిరి.

అటుపైన రోడ్ పొడుగునా రెండు మూడు ఫర్లాంగుల కొకచోట ఆనందముగా నామ సంకీర్తన చేసుకుంటున్న భజన గుంపులు బాబా కారు చూసి జై జై ధ్వానాలు చేసేవారు. మలగి, ఎక్కాంబి, ఇసాలూర్, గౌడల్లి గ్రామాలలో ఆ పల్లె ప్రజల క్రమశిక్షణ చిత్తశుద్ధికి మెచ్చి కారు ఆపి దిగి వారి మధ్య రెండు మూడు నిమిషములు నిలబడి ఆశీర్వదించిరి. అంతవరకూ బాబా మధుర నామమునే రుచి చూచిన వారికి బాబా దివ్య సుందర రూపము కూడా దర్శించే భాగ్యము లభించింది. డాక్టర్ ఆడికే ఈ సందర్భంలో ఇలా వ్రాసేరు. ''త్రోవలో పెద్ద పెద్ద గుంపులుగా చేరిన చోట కారు తలుపులు తీసి బాబా పుట్‌బోర్డు మీద నిలబడి అందరికీ దర్శన మిచ్చెడివారు. అటువంటి సమయములలో బాబావారిని దగ్గరగా చూడవలెననీ వారి పాదపద్మములను తాకవలెనని ఆతురతతో ఆ పల్లె ప్రజలు కారు తలుపుమీద త్రోసుకు పడేవారు ఆ తాకిడికి కారు పట్టీలు కొట్టవలసినదే, అయితే అద్భుతములలో అద్భుత మేమియనిన తెరచిన ఆ కారు తలుపు ఒక అంగుళము కూడ కదలకుండ నిశ్చలముగా, కోటగోడ వలె అంతవత్తిడిని ఆపగలిగెడిది.''

పదకొండు గంటలు కొట్టునప్పటికి సిర్సి గ్రామములోని గోపాల కృష్ణస్వామి దేవాలయ ప్రాంగణములో వున్న సత్యసాయి సేవా సమితి కార్యాలయము చేరిరి. అంతకు చాలా కాలము క్రితము ''యధాలాపముగా పదకొండు గంటలకు సిర్సీ చేరెదననీ'' బాబా యనినారట. గడియారము కూడా బాబా ఆజ్ఞ నెట్లు శిరసావహించినది చూచి ఆశ్చర్యపడినట్లు డా॥ అడికె వ్రాసినారు.

ఊరు బయట వేలాదిమంది బాబాకు స్వాగతము చెప్పుటకై సమావేశమైనారు. ''వారందరూ అలాగ మండుటెండలో ఉండుట చూడలేక బాబా కొద్ది నిమిషములు



భజన చేయుడు. చల్లని మేఘములు ఆకాశమున అలముకొని మీకు నీడ నిచ్చును'' అనిరి. వాళ్ళు భజన చేసిరి; నీడ వచ్చినది.

వారి దివ్యోపన్యాసములో ప్రసిద్ధి చెందిన బసవన్న ప్రవచనములు, తదితర వీరశైవుల కవిత్వముల నుండి విరివిగా ఉదహరించి, బాబా అక్కడ చేరిన వారి హృదయములను ఆనందాశ్చర్యములతో రంజింప జేసెను. **"Love is God; Live in Love, Start the day with love; Spend the day with love and end the day with love; and that is the way to God"** అని వచించి మిమ్ములను నాతో బంధించినది మన మధ్యనున్న ప్రేమయను సూత్రము, నేను అందరియందూ వున్నాను. అందువలన అందరినీ ప్రేమించుడు'' అని ప్రభోదించెను. నామస్మరణ ప్రభావమును తెలుపుచూ ''కొద్ది నిమిషములు నామస్మరణ చేయుటవలన మేఘముల అనుగ్రహమునకు పాత్రులైనారు. నిరంతరము నామస్మరణ చేసిన ఎంత లాభము కలుగునో మీరే యోచించుకొనుడు'' అనిరి. ఉపన్యాసాంతమున ''మీ మనస్సులలో నన్ను దర్శించవలెనన్న కోరిక నేడు ఫలించింది. నా ప్రేమను మీరు, మీ ప్రేమను నేనూ ఆనందముగా పంచుకుంటిమి. ఈ ఇచ్చి పుచ్చుకొను ఆనందము ఇక ముందు కూడ ఇటులనే వుండవలెనని ఆశించుచున్నాను'' అనిరి. బాబా సభావేదిక దిగు సమయమున 4000 మంది ఆనందపారవశ్యమున సజల నేత్రులైరి. గోపాలకృష్ణాలయమునకు తిరిగి వచ్చి బాబా వివిధ కార్యక్రమములలో పాల్గొని వున్న సందర్భములలో తీసిన చిత్రపటముల ప్రదర్శనమును తిలకించిరి. అక్కడ నుండి విశ్రాంతికైననూ ఆగకుండగ సరాసరి ఆరేబియా సముద్ర తీరముననున్న కార్వార్ పట్టణమునకు ప్రయాణమైరి.

రోడ్డుకిరువైపులా గోడకట్టినట్లు నిలబడి భక్తులెంతో ఆతురతతో బాబా దర్శనమునకై నిరీక్షించుచున్నారు. నెలికాని, హనుమంతి, మారుగర, అమ్మినహళ్ళి, జన్మనే, కానగె, కతగళ, హిరెగుట్టి మొదలయిన గ్రామముల పేర్లు రోడ్ ప్రక్కనున్న బోర్డులమీద కనబడు చుండగా ప్రయాణము సాగుచున్నది. చాలాచోట్ల బాబా కారుదిగి ఒకటి రెండు నిమిషములుండి అందరినీ ఆశీర్వదించుచుండగా బాబా ముఖ పద్మము నలంకరించిన చిరునవ్వు భక్తుల ముఖముల ప్రతిబింబించుచుండెను. అంకోలా గ్రామస్తులు మితిమీరిన ఉత్సాహముతో క్రమశిక్షణ అతిక్రమించగా కారు నిలుపకుండా బాబా చేయి వూపుచూ వెళ్ళగా వారంతటితోనే తృప్తిపడవలసి వచ్చెను.

అవెర్స అను చిన్న గ్రామము చక్కని అలంకరణలతో పచ్చతోరణములతో పండుగట్లు కళకళలాడుచుండగా, అయిదువేల మంది భక్తులు అత్యంత క్రమశిక్షణతో కూర్చుని వుండగా, వారి మధ్య బాబా నడుచుచూ, దీర్ఘ రోగులకు అంగవిహీనులకు విభూతి ప్రసాదించెను. అంతేకాక వారి ప్రార్థన మన్నించి వేదిక నలంకరించి సంక్షిప్తముగా అద్వైత సిద్ధాంతము గూర్చి ''ఏకత్వము సత్యము, భిన్నత్వము, మధ్య, సర్వమూ

భగవంతుడనే ఒకే ఒక పదార్థమే అని తెలుసుకొన్న తర్వాత భయమంతరిస్తుంది; ధైర్యం కలుగుతుంది. నిదుర నండి లేచిన వెంటనే భగవంతుని తలంచుడు; నిత్య కర్మ లాచరించునప్పుడతనిని జ్ఞప్తియందుంచుకొనుడు. రాత్రి నిదురించబోవు ముందు హృదయమున ఆచంచల విశ్వాసముంచి ప్రార్థించుడు; తద్వారా మనస్సు ఇంద్రియములు బుద్ధి నిద్రావస్థయందున్నప్పుడు ఆత్మానందము ననుగ్రహించును'' అని ఉపదేశించిరి.

బాబా, వారి పరివారమూ, కార్వార్ ప్రజలు మధ్యాహ్నము నుండీ కాచుకుని వుందురన్న తొందరలో వుండుట గ్రహించి అవెర్స గ్రామస్థులు బాబా తమ మధుర కీర్తనలు వినిపించరేమోనని నిరుత్సాహపడిరి. కాని గానామృతముతో బాబా అందరి హృదయములూ నింపి వారిని తృప్తిపరచిరి.

''ఒక ప్రక్క విశాల జలవాహిని, మరొక ప్రక్క విశాల జనవాహిని, మధ్య అనంత అనుగ్రహవాహిని'' అని బాబాయే సముద్రతీరాన ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగిస్తూ ఆదృశ్యాన్ని వర్ణించేరు. ''అది గంగ, ఇది యమున, అంతర్వాహినియై మీ హృదయముల గలగల ప్రవహించు నా అనుగ్రహమే సరస్వతి'' అంటూ మరొక ఉపమానముతో అక్కడ చేరిన 25000 మందిని అనందాబ్ధిలో ముంచి తేల్చేరు.'' ఈ సభ కొన్ని గంటలకు పూర్వమే జరుగవలసి యున్నది. త్రోవ పొడవునా నిలబడిన భక్తులు మీ సమయమును కొంత పంచుకున్నారు. మీ వలెనే వారూ ఆత్మస్వరూపులే కదా! అందుకే అంత సమయము మీ తరపున యిచ్చేను. ఆ పుణ్యమంతా మీదే!'' అని వారిని ఉత్సాహపరిచేరు.

బాబా సంకీర్తనలు కార్వార్ కంఠమున మారుమ్రోగుచుండగా తమ నిశ్శబ్దతకి మురిసిపోయి సాగర తరంగములు శంఖములతో గుసగుసలాడినవి. ఆ రాత్రి కలెక్టరు భవనములో విశ్రమించిరి. అక్కడ నుండి అలలపై తేలియాడు వెన్నెల సొగసు కన్నుల పండుగగా కన్పట్టును. కార్వార్ హృదయమనదగు సీతారామేశ్వర్ ఆలయమునకు మరునాటి ఉదయము బాబా వెళ్ళి అక్కడ నుండి కోడిబాగ్ వెళ్ళిరి. అక్కడ తమ పూర్వ శరీరమైన షిరిడిసాయి కొరకు ఒక ఆలయము, విగ్రహము చక్కని శిల్పముతో తయారై వున్నవి. కోడిబాగ్ వాస్తవ్యుల ఆనందమునకు అవధులు లేవు. తమ హృదయాలయములు నిండిన ఈ సాయి. మేమిరువురమూ ఒక్కటేయని తెల్పుచూ తమ పూర్వ శరీరరూప శిలావిగ్రహమును ఆ ఆలయములో ప్రతిష్ఠించుట ఎంత మధురమైన సన్నివేశం! కోడిబాగ్ నుండి సముద్రతీరముననే రోడ్డుమీద ప్రయాణము చేయుచూ బాబాను, వారి పరివారమునూ కార్లనూ సముద్ర పాయను దాటించుట కొరకు సిద్ధముగా వుంచిన మోటారు లాంచి చేరినారు.

ఇక్కడ కాళీనది సంగమ మగుటచే నీరు ఉప్పుగా నుండదు. లాంచిలో వున్న డా॥ అడికే వారి కుమారుడు మనోహర్ తదితరులందరి దృష్టిని దూరముగా ముత్యాలముగ్గవలె



తళతళ మెరయు సాగర జలముల దృశ్యమువైపు మళ్ళించిరి. ''సంసారసాగరమును దాటుచున్నారు. మీ ప్రభువే మీతో వున్నాడు. మీకు విజయం తథ్యమని నమ్మండి. నేను మీ వెంట వుండగా భయమేల,'' అన్నారు బాబా.

లాంచి దిగి కార్లు వేగంగా ప్రయాణం సాగించి సుమారు పదిగంటలకి గోవారాష్ట్రం ప్రవేశించేరు. మరొక అరగంటలో మార్గావ్ చేరునప్పటికి వేలాది భక్తులు బాబా అనుగ్రహము కోసము వేచియున్నారు. మానవులకి సహజమైన ప్రయాణబడలిక విసుగు లేకపోగా కరుణారసభరితులైన బాబా భక్తుల వరుసల మధ్య నడుచుచుండిరి. ఆనందోద్రేకములతో వారి పాదపద్మములను స్పృశించి కండ్ల కద్దుకొనుచుండిరి. ఒక వ్యాధిగ్రస్తునకు క్రీస్తుబొమ్మను సృష్టించి యిచ్చిరి. అతడు క్రైస్తవుడను సత్యము అంతవరకు యెవరికీ తెలియదు. మరొక వ్యక్తికి విభూతి ప్రసాదించిరి. అచ్చట గుణత్రయమును గూర్చి సుమారు ఇరవై నిముషములు ఉపన్యసించిరి. మానవుడు తమోగుణము నుండి రజోగుణమునకు, రజోగుణము నుండి సత్వగుణమునకు ఆరోహించు క్రమమును వివరించిరి.

ఆ తరువాత బాబా గోవా ముఖ్యపట్టణమైన పానాజి వెళ్ళిరి. పానాజి సేవాసమితి వారు ప్రభుత్వ సచివాలయము పై అంతస్తులో వున్న వివేకానంద హాలులో బహిరంగ సభ ఏర్పాటు చేసిరి. బాబా ఉపన్యాసమును వినుటకు వచ్చు ప్రేక్షకులకు అనుకూలమైన విశాల సభామంటపములు భూమి మీద వుండవు. అందుకే బాబా అంటూ వుంటారు. ''నేను ప్రసంగించు సభలకు ఆకాశమే పందిరి'' అని మొత్తము మీద ఏది అనివార్యమో అదే జరిగింది. చాలామంది హాలులో స్థలము చాలక బయటనే వుండిపోయిరి. వారికి దర్శనము కూడ లభించలేదు. బాబా కొంతసేపు ఉపన్యసించి పిమ్మట నామ సంకీర్తన చేసిరి. హాలులో వారి ఆనందమునకు అవధులు లేవు. వెలుపల వుండిపోయినవారు బాబా ఉపన్యాస సంకీర్తనలు వినుచు ''మనకీసారి ఈపాటి అదృష్టమయినా లభించింది అదే పదివేలు'' అనుకుని సమాధానపడిరి.

డాక్టర్ అడికె యీ విధంగా వ్రాసిరి. ''గోవాను సమీపించు చుండగా ఫియట్ కారుయొక్క స్ప్రింగు చెడిపోయినది. మరొక కారులోకి మారుదమని సూచించితిని'' ''ఈ కారులోనే ప్రయాణము సాగిద్దాము''అన్నారు బాబా. గోవా నుండి బెల్గాముకు పోవుదారి పొడవునా దట్టమయిన అడవులూ, కొండగుట్టలూ, వర్షము చేత పడిన గండ్లు. మేము గోవా విడిచిపెట్టునప్పటికే ప్రొద్దు గ్రుంకినది. బెల్గాము చేరునప్పటికి తొమ్మిది గంటలయింది. కారు ఆగిపోకుండా ఆ దుర్గమమైన మార్గము గుండా ఎలా సురక్షితముగా ప్రయాణము చేసితిమో మాకు తెలియదు. అది కేవలము బాబా అనుగ్రహము వల్లనే సాధ్యమయినదని మాత్రము మాకు తెలుసు.

బెల్గాములో నేరుగా తన దర్శనము కొరకు ఆతురతతో వేచియున్న 70,000 మంది వద్దకు బాబా వెళ్ళేరు. బెల్గామ్ పెద్ద నగరము, బాబా సర్వాధీశ్వరుడైన ఆర్తజన రక్షకుడు. ఈ జనసమూహాము త్రొక్కిడికి గురికాకుండా, క్రమశిక్షణతో కూర్చుని అదరూ బాబా దర్శనము చేసుకొనుటకు వీలుగా సత్యసాయి సేవా సమితి వాలంటీర్లు గట్టి వెదురు కఱ్ఱల సహాయముతో దళ్ళు కట్టి కట్టుదిట్టము చేసేరు. బాబా వచ్చినట్లు వార్తవిని ఒక్కసారిగా అందరూ లేచి కోలాహలంతో బాబావచ్చు త్రోవవైపు త్రోసుకు వెళ్ళేరు. సమితి మెంబర్లు, వాలంటీర్లు, స్కౌట్లు, హోంగార్డులు ఒక్కసారి కార్యరంగంలోకి దూకి తిరిగి అందరూ యధాస్థానాలలో కూర్చుండచేయు ప్రయత్నము శక్తివంచన లేకుండా చేస్తున్నారు.

ఈలోపుగా బాబా వేదిక మీదికి వచ్చి నిలబడిరి. వారి మధుర స్వరం ఉత్తుంగ తరంగములవలె నలుదిశల వ్యాపించినది. అందరి దృష్టి ఒకే దిక్కునకు మళ్ళినది. సుధా మాధుర్యమును గ్రోలుచు నిలబడ్డారు. ఈ సంఘటనను వర్ణిస్తూ బాబా పర్యటనలో వెంట వచ్చిన యింజనీరు శ్రీ నార్కో ఇలా అన్నారు. ''భగవాన్ హస్తము పైకెత్తేరు. నిశ్శబ్దముగా ఎక్కడివాళ్ళు అక్కడే నిలబడ్డారు. భగవాన్ హస్తము క్రిందికి దించేరు. ఎక్కడివాళ్ళక్కడే కూర్చున్నారు.''

''గోవా నుండి సకాలములో బయలుదేరలేక పోయినాము. త్రోవలో ప్రతి గ్రామము వద్ద దర్శన కాంక్షతో భక్తులు నిరీక్షించుచుండగా వారి దాహము తీర్చకుండా వుండు టెట్లు? అందుచేత మీవద్ద కొద్ది సమయమును అప్పుగా తీసుకుని వారికిచ్చితిని'' అని తమ నేరమును ఒప్పుకొనిరి. జనం సద్దు మణిగి నిశ్శబ్దముగా వున్నారు. ''మిమ్మల్ని మీరు సంస్కరించుకొని దైవానుగ్రహమునకు పాత్రులు కావలెననెడి ఆధ్యాత్మిక పిపాసతో ఇక్కడ సమావేశమైన మీ అందరికీ ఒక బాధ్యత వుంది. మీరందరూ ఆత్మస్వరూపులన్న సత్యాన్ని ముందు గుర్తించి, ఈ విశ్వాసము దృఢపడునట్లుగా నిత్యము కొన్ని నిమిషముల పాటు ధ్యానము చేయుడు'' అని బోధించిరి. ''కొండ మీద బండ గుడిలోని విగ్రహముగ రూపొందినది. సుత్తి, శానముద్వారా ఆ బండ, జీవితమును పవిత్రము ఆనందమయము చేయు ఆరాధ్యదేవతగా సుందర రూపమునకు, పరిణామం చెందింది. అదే విధముగా క్రమశిక్షణ అనే సుత్తి దెబ్బలకు ఓర్చి, కష్ట సుఖములను శానము పోట్లకు తట్టుకున్న యెడల మీరు కూడ జడపదార్థమనెడి భ్రమ నుండి భగవంతుని ప్రతిబింబములైన ఆత్మస్వరూపులుగా పరిణామము చెందెదరు'' అని ఉద్ఘాటించిరి. ''గత అయిదు దినములుగా కర్ణాటక రాష్ట్రమున పర్యటించుచున్నాను. ఒక ముఖ్యమైన విషయము మీకు చెప్పవలసి వుంది. వేలకొలది ప్రజలిట్టి సమావేశములకు వచ్చుచున్నారు. వేలకొలది త్రోవలో వేచివుంటున్నారు. మీ అందరిలోనూ తీవ్రమైన భగవదనుగ్రహాభిలాష వున్నదని నాకు తెలుసును. ఈ అభిలాష ఈ ఆరాధన క్రమశిక్షణ ద్వారా సరిదిద్దవలెను. హద్దు



మీరినా పెడదారి పట్టినా నిష్ఫలము. ఈ జనసమూహములో వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, స్త్రీలు, పిల్లలు వున్నారనైనా గమనించకుండ నా పాదములు ముట్టుటకో నా యెదుట సాష్టాంగ పడుటకో త్రోసుకుని ముందుకు వచ్చెదరు. ఇది ఎంత ప్రమాదం! ఎంత అపచారం! మీ భక్తిని ఈ సాయి ముందు ప్రదర్శించుటకు వారియందుండు సాయిని హింసించకుడు. నన్ను చూచుటకు నా సంభాషణ వినుటకు మీరుపడు శ్రమ, కఠినమైన తపస్సు వంటిదైననూ వారిలో నివసించు సాయికి బాధ కలిగించుటచే నిష్ఫలమగును'' అని బాబా హెచ్చరించిరి.

లజ్జా, పశ్చాత్తాపములతో చాలా మంది తలలు వంచుకొనికి. ''బలహీనులు, వికలాంగులు, వ్యాధిపీడితులు, దుఃఖితులు వీరి యెడల ప్రేమ, సహనము, గౌరవము అలవరచుకొనుడు. వారిపై-దయ సానుభూతి చూపండి. వారిలోనూ మీలోనూ వుండేది ఒకే దివ్యత్వమని గుర్తించండి'' అని ఆదేశించిరి.

మరునాటి ఉదయము బాబా తిరిగి పర్యటన ప్రారంభించి ఉత్తర కర్ణాటకములోని మరొక జిల్లాకు ముఖ్యపట్టణమైన బిజాపూర్‌వైపు ప్రయాణము సాగించిరి. అనతి దూరములోనే వున్న బెయిల్ హంగల్ అనే గ్రామమున కారుదిగిరి. అక్కడ బాబా వారి దర్శన స్పర్శన సంభాషణ కొరకు భక్తుల హృదయములు తహతహలాడుచున్నవి. వేలాది మంది అక్కడ గుమికూడి యుండుట చేత దర్శన సంభాషణలు మాత్రమను గ్రహించిరి. అంతర్ శౌచమును గురించీ, తద్వారా అంతరంగమున వున్న సర్వేశ్వరుని సాక్షాత్కారము గురించి ఉపన్యసించిరి.

ఆ దినమంతా బీజాపూర్ వెళ్ళు మార్గమున మైలు మైలుకూ, ఎక్కడ చూచినా నామసంకీర్తన కోలాహలమే! గంటల కొలది వారు భజన చేయుచూ ఆ త్రోవనవచ్చు ప్రతి స్కూటర్నీ ప్రతి లారినీ ఆపి బాబా బయలుదేరినారా, త్రోవలో వున్నారాయని ప్రశ్నించుచుండిరి. గ్రామస్తులు వారి వారి అభిరుచుల ననుసరించి మేళతాళ జానపద నృత్యములతోనూ, సాంప్రదాయసిద్ధమైన బాకా భజంత్రీలతోనూ, ఉత్సవ సంరంభముతో గ్రామ పరిసరములను చైతన్యవంతము గావించిరి. మరికొందరు ఆలయమునుండి తెచ్చిన ఛత్ర వింజామరలు పూర్ణ కుంభములు మొదలయిన సామగ్రిని సిద్ధము చేసికొని వేదాధ్యయనము కావించు చుండిరి. బాబా పరివారము ప్రయాణము చేయు కార్లకు ముందూ వెనుక పోలీసు కార్లు రక్షణకై ఏర్పాటు చేయబడెను. బాబా నిరాఘాటముగా ముందుకు సాగుటకు సహాయపడుటకు నియమించిన పోలీసు ఆఫీసర్లు సహితము వీలయినప్పుడల్లా అవకాశము చూచుకొని బాబా పాదములు స్పృశించు చుండిరి.

బాబా మధ్యాహ్నము గోకాక్ వద్ద సుమారొక గంట ఆగిరి. అచట నుండి బీజాపూర్‌కు వేగవముగా ప్రయాణవము సాగించిరి. అయినను అటు భక్తుల ఆనందోత్సాహము, ఇటు బాబా దయార్ద్ర హృదయము మూలముగా మధ్య మధ్య

ఎన్నో పర్యాయములు కార్లు నిలుపక తప్పలేదు. బాబాతో అదే కారులో కూర్చున్నవారి ఆనంద మింతింతకాదు. బాబా భజనపాటలు పాడుచు వారిచేత పాడించుచూ, ఒకరిద్దరి చేత అనువుగ ఆ మధుర సన్నివేశము వర్ణించుచు పద్యములను చదువ ప్రోత్సహించు చుండగా అందరూ బాహ్య ప్రపంచమునే మరచిరి.

బీజాపూర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పోవు త్రోవలో మైళ్ళకొలది జనసమూహము వ్యాపించి యుండుట చూచి భయపడి ధైర్యము చిక్కబట్టి బాబాతో ''ఈ కార్యక్రమము రద్దుచేసి ముందుకు సాగిపోవుదము'' అని యుంటిని. ''వద్దు అనిరి బాబా'' అని డాక్టర్ అడికె వ్రాసిరి.

సుమారు 75000 మంది అన్ని దిశల నుండి పరుగు పరుగున వచ్చుచుండిరి. మేము నిశ్చేష్టులమై చూచుచుండగా బాబా సరాసరి ఆ జనసముద్రము మధ్యకు వెళ్ళిరి. ఆ అల్లకల్లోలమునకు వెరచి కలవరపడితిమి. కాని కొన్ని నిమిషములలో వేదిక మీద మిరుమిట్లు గొలుపు విద్యుద్దీపముల వెలుగులో మైక్ ఎదురుగ బాబా చిరునవ్వుతో ప్రత్యక్షమైరి. మృదు మధుర మంజుల స్వరముతో పద్యము ప్రారంభించగనే అంతటా నిశ్శబ్ద మావరించినది. పురుషులు, స్త్రీలు, బాల బాలికలు సంతోషమున సమ్మోహి తులైరి. మా ఆందోళన ఉపశమించినది'' అని డాక్టర్ అడికె ఈ సంఘటనను గురించి వ్రాసిరి.

''మీరు జన్మించినదెందుకు? మానవులలో మానవులై ఇంతవరకూ జీవించి ఏమి సాధించితిరి? మీరు మరణించు పూర్వము మీ జీవిత చిహ్నముగా ఈ భూమి మీద ఏమి విడచిపెట్టి వెళ్ళదలచితిరి? అని బాబా సభాముఖముగా జనావళిని ప్రశ్నించిరి.

బాబా పరివారములో ఒకరైన వినీత రామచంద్రరావు ఈ విధముగా పేర్కొనిరి. ''కృష్ణుని వేణునాదము విని వేయి పడగల సర్పము సహితము తలవంచినట్లు విన్నాము. బాబా మనోహర కంఠస్వరము విన్నంతనే మంత్ర ముగ్ధవలె ఈ డెబ్బై అయిదువేల పడగల సర్పమూ బాబా పలుకులు ములుకులవలె గుచ్చుకున్ననూ, శిరము వంచి ఆత్మ పరిశీలనలో మునిగినది.''

''ప్రేమయే ఈ విశ్వమునకు కారణభూతము ప్రేమయే దైవము, భగవదనుగ్రహము పొందుటకూ భగవంతునిలో లీనమగుటకూ ప్రేమయే సాధనము'' అనుచు బాబా ప్రేమయొక్క విశిష్టతన గూర్చి బోధించిరి. నామ సంకీర్తన యొక్క ప్రభావమును తెలియ జెప్పి బాబా భజన పాటలు పాడగనే ఆ మురళీ నాదమునకు వారందరూ పరవశులై ఆనందముగ పాల్గొనిరి. వారి హృదయ క్షేత్రములందు ఉత్తమ ప్రవృత్తులు మొలకలెత్తి, ఆకులు వేసి, మొగ్గలు తొడిగి పుష్పించి దివ్య చైతన్యము కలిగించినవి.



ఆ రాత్రి ప్రభుత్వ విశ్రాంతి భవనములో గడిపిరి. బాబా వేకువ జాముననే లేచి ఆ నాటికి నిర్ణయించబడిన కార్యక్రమములను పూర్తి చేయుటకు సిద్ధముగా వుండిరి. ఇరవై నిమిషములు వారు ప్రయాణము సాగించక ముందే మార్గమందు పసుపుపచ్చ ఆకుపచ్చ లతలూ, తోరణములు, జండాలు పూలమాలలతోనూ అలంకరించిన పందిరిలో నేలమీద కూర్చుని షుమారు వంద మంది ప్రశాంతి నిలయం కీర్తనలు పాడుచూ భజన చేయుచుండిరి. అప్పుడక్కడ ఏమి జరిగినదీ డాక్టర్ అడికేగారు వర్ణించగా విందాము.

''రోడ్డుకు రెండు మైళ్ళ దూరములో వున్న వారి గ్రామమునకు రావల్సినదిగా వారందరూ నమ్రతతో ప్రార్థించిరి. ఆ గ్రామమునకు పోవు త్రోవ కారు వెళ్ళుటకు సదుపాయముగా మరమ్మత్తు చేసితిమనీ, అందరూ నిశ్శబ్దముగా క్రమశిక్షణతో మెలగె దమనీ, గ్రామస్తులందరూ ఆశతో ఎదురుచూచుచుందురనీ ప్రాధేయపడిరి. నిర్ణయించు కొనిన నాటి కార్యకలాపములు కాలక్రమము తప్పకుండ జరగవలెనని నా ఆవేదన. 'సరే, వెళ్ళి అయిదు నిమిషములక్కడ వుండి వద్దాము'' అన్నారు బాబా.

త్రోవపొడవునా నీరుజల్లి తుడుచుటచే దుమ్ము లేకుండా శుభ్రముగా వున్నది. కార్లు ముందుకు సాగుచుండగా పూలు జల్లిరి. హారతులిచ్చిరి. కొమ్ము బూరాలను పూరించిరి. డప్పులు వాయించిరి. కొమ్ములను రంగు పట్టీలతో అలంకరించి మెడలో గంటలు కట్టిన వృషభములను త్రోవ ప్రక్కన నిలబెట్టిరి. బారులు తీరికూర్చున్న వారందరి కన్నులలో మెరసే ఆనందము బాబా ముఖారవిందమున ప్రతిబింబించెను. కొన్ని భజన కీర్తనలు పాడి వారందరినీ సంతృప్తిపరచిరి. అక్కడ సుమారు నలభై అయిదు నిమిషములు గడిపిన పిదపకాని మేము తిరిగి రాలేదు.''

భక్తి ఉప్పొంగి వెల్లువయ్యై ప్రవహించి ఆ ప్రాంతములోని ప్రతి గృహమును ప్రతి హృదయమును ప్రవేశించి ఫలవంతం చేసింది. బాబా తన భక్తులు మండుటెండలో కూర్చుండుటకాని, నిరుత్సాహపడుట కాని చిన్న బుచ్చుకొనుట కాని సహించలేరు. భక్తులకు బాబాకు మధ్యనున్న అమబంధమే ఆత్మకు పరమాత్మకు మధ్య నున్న సంబంధము.

బాబాతో కారులోవున్న వైస్‌ఛాన్స్‌లర్ తదితరుల చాలా అదృష్టవంతులు. అలనాటి పురంధరదాసు కనకదాసులు రచించిన పాటలను బాబా శ్రావ్యంగా పాడేరు. కనకదాసు కథ చెప్పేరు. ఉడిపిలో మధ్వాచార్యులు ప్రతిష్టించిన కృష్ణ విగ్రహం వున్న ఆలయం వున్నది. నిమ్న జాతిలో జన్మించిన వాడగుటచేత ఆనాటి సమాజం కనకదాసుని ఆలయాం తర్భాగములోనికి వెళ్ళనివ్వలేదు. ఆలయం వెనుక భాగమందు పరితపించుచూ గానం చేయుచున్న కనకదాసుకు దర్శన మిచ్చుటకు శ్రీకృష్ణ విగ్రహం వెనుకకు తిరిగినది.

అనువుగా అప్పటికప్పుడు కన్నడ భాషలో కొన్ని పాటలల్లి బాబా పాడిరి. వారందరి భాషాభిమానము భక్తి కూడా ఫలించినవి.

త్రోవలో కెరూన్ మొదలయిన గ్రామములలో అసంఖ్యాకులైన భక్తులు నయనానందంగా బాబాని దర్శించిరి. నార్గుండ్‌వద్ద సుమారు పన్నెండు వేలమంది పరిసర గ్రామాల నుండే కాకుండా హుబ్లీ ధార్వార్‌ల నుండి కూడ వచ్చిచేరిరి. భగవంతుడు అంతర్యాభుతుడై విశ్వమంతా వ్యాపించియున్నాడనీ, శరీరములోని వివిధ అంగములలో ఒక్క జిహ్వేంద్రియము మాత్రమే నీటిలో కరిగిన చక్కెర రుచి గ్రహించగలిగినట్లు భగవంతుని సర్వవ్యాపకత్వమును మహాజ్ఞానులు మాత్రమే గ్రహించగలరనీ వారందరికీ బోధించిరి.

చల్లగాలికి పంటచేలు తలలూపుచుండగా, పశువులూ పచ్చని పచ్చిక బయళ్ళు పలకరించుచుండగా మా ప్రయాణము సాగి ఆ సాయంత్రమునకు నావిల్‌గుండ్ చేరితిమి. తండోపతండములుగా వచ్చిన భక్తులు క్రమశిక్షణతో నిశ్శబ్దముగా కూర్చుని వున్నారు. కరుణాస్వరూపులైన బాబా ఉపన్యాస సంకీర్తనలతో వారిని ఆనందపరవశులను చేసిరి. ''స్థూల ప్రపంచము సర్వదా చంచలమైనది. ఆత్మ శాశ్వతమైనది, స్థిరమైనది. మార్పుచెందునట్లు భ్రమగొల్పునేకాని, కాలము, పరిసరాలు, పరిస్థితులూ వాటి ప్రభావానికి ఆత్మ అతీతమైనది. ''ఏకం ఏవా అద్వితీయం బ్రహ్మ'' అనే సత్యమును అనుభవరీత్యా తెలుసుకొనుటకు మంత్ర, నామస్మరణ, యోగ, ధ్యాన, సమాధి అను ఐదు సాధనలను చేబట్టవలెను, ఆకాశమున శబ్దతరంగముల రూపమున వ్యాపించియున్న సంగీతమును రేడియోద్వారా వినుట యెటుల సాధ్యమో, ఈ సాధనల ద్వారా వాఙ్మానస గోచరమైన భగవంతుని దివ్యశక్తిని గ్రహించవచ్చు'' అని ఆనాడు ప్రసంగ సందర్భమున బాబా వచించిరి.

త్రోవలో, భక్తులర్పించిన పూలగుత్తులు అన్నిగిరిలో అందుకుని, వారి నాశీర్వదించి సాయంత్రం ఆరుగంటలకే హుల్‌కోటి చేరుకున్నారు. అక్కడ కనివిని యెరుగనంతటి భక్తజనసమూహము ప్రోగయినది. వారికి దర్శనముతో బాటు అభయమొసగి సంతృప్తి పరచిరి.

అక్కడనుండి గడగ్ పయనమైరి. అలనాడు కన్నడ కవులు స్తుతించిన వీరనారాయణాలయము గడగ్ నగరమునకు ఖ్యాతి తెచ్చెను. ఈనాడు గడగ్ పరిశ్రమలకు వాణిజ్యమునకు ముఖ్య కేంద్రము. బాబా దర్శనము కొరకక్కడ చేరిన జన సందోహము దిగ్భ్రాంతి కలిగించెను. లక్షమందికి పైగా అక్కడ సమూహమైరి.

శ్రీ కె.హెచ్. పాటిల్ బాబాకు స్వాగతము చెప్పుచూ ''గడగ్ పట్టణము మందు ఈ రోజున స్వర్గద్వారములు తెరచుకున్నవి. ఈ ప్రాచీన నగరము మళ్ళీ జ్యోతిర్మయ



మైనది'' అన్నారు. ఈ జగత్తున మానవ చరిత్ర ప్రారంభమైనది లగాయతు మానవుని ఆశయము ఒకటే. అదే వేదములో పేర్కొనబడిన ప్రార్థన. అసతోమా సద్గమయ. తమ సోమా జ్యోతిర్గమయ. మృత్యోర్మా అమృంతగమయ' అని ఈ ప్రార్థన యొక్క ప్రాశస్త్యమును వివరించి భిన్నత్వము మిథ్య, అహంకారము అంధకారము, వాంఛయే మృత్యువు అనియూ పరబ్రహ్మమే ఈ దృశ్యాదృశ్యమునంతా పరివేష్టించి నిర్వహించు చున్నదనియూ, ఆ పరబ్రహ్మము యొక్క అంశయే తానని మానవుడు గ్రహించవలె ననియూ బాబా బోధించిరి.

బాబా సంకీర్తనలను భక్తులు పునరుచ్చరణ చేయుచుండగా ఆ శబ్ద తరంగములు మిన్ను ముట్టి వాతావరణమును పరిశుద్ధము చేసినవి. సాయి పాదపద్మముల మ్రోల జరుగుచున్న ఈ భజనలో రామ, కృష్ణ, శివ, శక్తి, విష్ణు, సాయి మొదలయిన నామము లన్నీ సమ్మిళతములై స్వరమాధుర్య మనెడి ఏకైక శబ్ద బ్రహ్మముగా పరివర్తన చెంది అన్ని రూపములూ అన్ని నామములూ ఒకే భగవంతునికి చెందినవని నిరూపించినది.

ధార్వారు చేరునప్పటికి చాలా ప్రొద్దుపోయింది. దీపములార్పి నిదురించుచున్న ఆ నగర వీధులలో పశువులు తీరుబడిగా చతికిలబడి నాటి ఆహారం నెమరువేస్తున్నవి. సూర్యోదయం అయినది. ఆనాడు అక్టోరు 27వ తేది.

ఎంత దూరము, నిర్విరామముగా ప్రయాణము సాగించిననూ సూర్యునివలెనే బాబాలో కూడ అలసట చిహ్నమైనను కానరాదు. ఎన్ని లక్షల మంది, ఎన్ని బాషలలో ఎంత స్తుతించిననూ, ఎన్ని చోట్ల నుండి ఎంత ఆర్తితో ఎందరు ప్రార్థించిననూ సూర్యుని దినచర్యవలె బాబా తమ నిర్దిష్ట కార్యక్రమమునకు అభిజ్ఞులై ధర్మోద్ధరణోద్యమమును నిరాడంబరముగ నిర్వహించెను.

బాబాతో కూడా వచ్చినవారు మానవ మాత్రులు కదా. వారి యెడల జాలిగొని డా॥ అడికే తదితరులను విశ్రాంతి తీసుకొనుడని చెప్పి ఆరోజు హుబ్లీ ధార్వార్ పట్టణములోని భక్తుల గృహములు పావనము చేయుటలో గడిపిరి. ''మీ ఆనందమే నా ఆహారము'' అని తరచు బాబా అనుచుందురు. ఇదియే దానికి ప్రత్యక్ష నిదర్శనము.

బాబా భక్తుల గృహములకు వెళ్ళినప్పుడు అక్కడ కొద్ది నిమిషములు మాత్రమే గడిపినా ఆ గృహమున శాంతి ప్రేమ ఆనందములు వెదజల్లి స్వర్గము చేసెదరు. భక్తులకు యిబ్బంది కలుగకుండా వుండుటకు వంటరిగా వెళ్లుచుందురు. ఆడంబరముతో కూడిన అతిధ్యమును, వ్యయముతో కూడిన అలంకరణలూ, పూలమాలలూ, విందుల ఆర్భాటములు, ఇంటినిండా బంధుమిత్రులను ప్రోగుచేసి అట్టహాసము చేయుటవలదని బాబా భక్తులను హెచ్చరించుదురు. ఇట్టి అనవసరపు వ్యయప్రయాసలకు భక్తులు గురి కాకుండటకె ముందుగనే చెప్పకుండా, సాధారణముగా అవ్యవధిగా వారిండ్లకు వెళ్ళి

వారికి సంభ్రమాశ్చర్యములు కలుగ జేసెదరు. అత్యంత ఆప్తబంధువు ఎంతో కాలము తర్వాత మా యింటికి వచ్చినట్లు అనుపమానమైన ఆనందానుభూతి కలిగించెదరు. పేరు పేరునా భక్తుని బంధు జనులను పలుకరించి చిరపరిచితునివలె వారి అంతరంగిక సమస్యలను గురించి ప్రస్తావించి, సలహానిచ్చి, ఆశీర్వదించి, అభయమిచ్చి, కష్టములను ఓదార్చి ధైర్యము చెప్పి ఉత్సాహపరచెదరు. కరుణా కిరణములు ప్రసరించి అనుగ్రహ సుధతో వారి వ్యాధులు వ్యధలు ఉపశమింపజేసెదరు. బాబా రాకతో భక్తుల గృహములలో అనారోగ్యము అసంతృప్తి వ్యాకులతలతో కూడుకున్న అధ్యాయము ముగిసి, ధైర్యము సంతృప్తి, ఆనందములతో కూడుకున్న నూతనాధ్యాయము ప్రారంభమగును. అట్టి చిరస్మరణీయములైన అనందానుభూతులు వారి ఆత్మవిశ్వాసములను పరిష్టము చేసి అధ్యాత్మిక సాధనాభ్యున్నతికి దోహదము చేయును.

28వ తేదీ సోమవారం - నాటి సాయంత్రమునకు బృందావన్ తిరిగి రావలసి వుంది. హుబ్లీ దావన్‌గిరి రోడ్ గుండా వస్తూ అనేక గ్రామములకు దర్శన భాగ్యాన్ని ప్రసాదించేరు. శ్రీ సత్యసాయి సేవా సమితి అధ్వర్యాన కుంద్‌గోల్ గ్రామమున నేలయీనినట్లు పాతికవేల మంది గుమికూడిరి. ఫుట్‌బాల్ గ్రౌండ్ జనంతో క్రిక్కిరిసి పోయింది. అక్కడ భారతీయ సంస్కృతిని గురించి ఉపన్యసించుచూ 'భా' అను పదమునకు జ్ఞానజ్యోతియను అర్థము అన్వయమగు ననియూ అధ్యాత్మిక జ్ఞానమే భారతీయ సంస్కృతికి పునాదియనియూ సెలవిచ్చిరి. వారందరూ ఉదయము నుండియూ తమ దర్శనము కొరకై వేచియున్నందున వారితో ''మీరు నాపై చూపిన ఈ అవ్యాజమైన ప్రేమను తోటిమానవులందరి మీదా చూపండి. అందరియందూ నేనున్నాను. నా యెడల మీ కుండు భక్తికి నిదర్శనముగా పరదూషణ, నేరారోపణ, ద్వేషములను విసర్జించి పరుల యెడల ప్రేమ, సేవాతత్పరత పెంచుకుని వారికి సహాయ సహకారము అందజేయుడు'' అని హితోపదేశము కావించిరి..

కారబిగి గ్రామమునకూడ భక్తుల నాశీర్వదించి, శేషాచలస్వామియను యోగి సమాధి పొందిన అగడి గ్రామమునకు వచ్చిరి. ఆశ్రమ ముఖద్వారమున వేదమంత్రములు పండితులు పఠించుచుండగా, స్త్రీలు హారతు లిచ్చుచుండగా పూర్ణకుంభముతో బాబాకు స్వాగత మిచ్చిరి. యోగులు మహర్షులు, అవతారాగమనమునకు ముందు తదనుగుణ్యముగ వంతెనలు నిర్మించి బాటలు వేసి సిద్ధము చేయు నిపుణులవంటివారు భజన చేయుచుండగ భక్తుల వరుసల మధ్య నడచుచూ ఆశీర్వదించి, పిదప తమ ప్రసంగమున నామస్మరణ యొక్క ప్రభావమును బోధించి ఆ ఆశ్రమమునూ అక్కడ చేరిన వేలాది భక్తుల హృదయములను పావనము చేసిరి.

హవేరి వద్ద కొంత ఆలస్యం అనివార్యమైనది. అక్కడ గ్రామ సేవా మంటపము వద్ద వ్యవసాయ కళాశాల విద్యార్థులు తదితర కాలేజి విద్యార్థులు సమావేశమై బహిరంగ



సభ ఏర్పాటు చేసిరి. ఆ స్థలము యొక్క సహజ సౌందర్యమును కొనియాడి ''ప్రకృతి సౌందర్యముతో కనుల పండుగ చేసుకొనుటకు అందరికీ ఎట్టి హక్కు వున్నదో అదే విధముగ భగవంతుని అనుగ్రహమును కూడ అందరూ పంచుకొను అధికారమున్నది, మీరు చక్కగా చదువుకుని డిగ్రీలు సంపాదించుకొనుటతో బాటు నామస్మరణ నలవర చుకుని మనస్సులలో విశ్రాంతి నింపుకుని భగవదనుగ్రహమును పొందు ప్రయత్నము చేయుడు'' అని వారికి ప్రభోధించారు.

రానెబెన్నూర్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజికి తమ దివ్యహస్తముతో శంఖుస్థాపన చేసి అచ్చట నుండి కాటన్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేయబడిన బహిరంగ సభలో ఉపన్యసించిరి. 25000 మందికి పైగా బాబా దర్శనార్థము వేచియుండిరి. ''మీ మాటలను సత్యముతో నింపుడు. మీ కర్మలను ధర్మబద్ధము చేయుడు. సత్యం వద, ధర్మం చర అను సూక్తిని అనుసరించి మీ జీవితములు సార్థకము చేసుకొనుడు''. అని వారికి చల్లని మాటలతో తియ్యని పాటలతో హృదయముల సేదదీర్చిరి.

''నేను బాబాతో కూడా వుండి బాబా యెడల ప్రజల అచంచల భక్తి విశ్వాసములూ, వారిపై బాబా వర్షించిన అనుగ్రహామృతము చూచు భాగ్యము నాకు లభించినది. నా జీవితములో అది చిరస్మరణీయమైన మధురానుభూతి, వైట్ ఫీల్డ్‌లో వున్న బృందావన్ వరకు వెళ్ళి బాబావద్ద శలవు తీసుకొనుచుండగా, ''నీవు వంటరిగా తిరిగి వెళ్ళుచున్నావని భావించవద్దు. నేను నీతోనే వుంటాను. మనమిద్దరమూ కలిసియే వెళ్ళుదము'' అనిరి. బాబా సర్వశక్తి సమన్వితులు, సర్వాంతర్యామి ప్రేమ స్వరూపులు, అనిర్వచనీయమైన దివ్యత్వము. అందువలననే వారట్లు అభయమిచ్చిరి.'' అని డా॥ అడికే వ్రాసిరి.

అది పట్టణమైనా, గ్రామసీమయినా, కళాశాలయినా, వాణిజ్య కేంద్రమయినా, చరిత్రాత్మిక స్థలమైనా, పుణ్య క్షేత్రమయినా; ఎక్కడికి వెళ్ళినా ప్రజలు తండోప తండములుగా సమావేశమై బాబాను సందర్శించుటకు చూపిన తహతహ, నిర్మల హృదయములతో బాబాను పూజించిన సంవిధానము, అనుగ్రహ పూర్వకమైన బాబా సందేశము పట్ల చూపిన శ్రద్ధాసక్తులు వర్ణనాతీతము; భావి సంఘోద్ధారకాభిలాషులకు కనువిప్పు. తమ అభ్యున్నతికి మానవాళి కోరునది వారికి ప్రశాంతిని ప్రసాదించు అధ్యాత్మిక చైతన్యమే కాని అనిత్యమైన లౌకిక భోగములు కాదనుటకిది ప్రబల నిదర్శనము. అ సత్యమునే బాబా ఈ పర్యటన ద్వారా రుజువు చేసిరి.

జ్యోతిర్మయమైన దీపావళి పర్వదినమున బాబా ఆనందయాత్ర ప్రారంభించిరి. ''యోగ సంకలనము'' అను గ్రంథములో శ్రీ అరవిందు లిట్లు వ్రాసిరి. ''గురువు దివ్యజ్యోతిని వెలిగించి దివ్యశక్తిని మేల్కొల్పవలెను'' బాబా ప్రతి హృదయమునందు దివ్య దీపికను వెలిగించి చైతన్యమును ప్రసాదించెను.

# విదేశీయులు-వారి విశ్వాసము

''మానవజాతి చరిత్రలో అత్యంత ప్రమాదభరితమైన ఈ సమయములో భారతీయ ధర్మ మొక్కటే మానవాళికి ముక్తి మార్గము.'' అన్నాడు అధునిక చరిత్ర కారులలో ప్రసిద్ధుడయిన అర్నాల్డ్ టాయిన్‌బి. ఇది నిరాశ, నిస్పృహ, భయము, అభూతకల్పనయుగము. సమాజములో నేడు నేరము, అపచారము, వివాహవిఘటన, ఆత్మహత్య, జూదము, మద్యపానము, సర్వత్రా అధికమగుచున్నవి. రాజకీయముగా నేడు ద్రోహము, మోసము, మతాతత్త్వము, **లంచగొండితనము** పిడివాదము మితిమీరి వ్యాపించుచున్నవి. పేదరికము, భోగలాలసత, స్వలాభాపేక్ష, దోపిడి మొదలగు అనర్థములు ప్రపంచమంతటా వ్యాపించుచున్నవి. కరడు కట్టిన ఈ జాడ్యములన్నింటికీ మూల కారణము మానవునకు ఆత్మ విశ్వాసము లేకుండుటయే అని బాబా అభిప్రాయము.'' మానవుడు **ఆత్మ** విశ్వాసమును కోల్పోయినాడు. దుర్బలత్వము, మనోచాంచల్యము, సందేహము, అసంతృప్తికిలోనై తన సహజతేజోబల సంపదలను, సౌందర్య **సద్బుద్ధులను** ఆత్మ తృప్తిని విస్మరించుచున్నాడు.''

అయిన్‌రాండ్ ఇట్లనిరి. ''జీవించుటకు మానవుడు కర్మచేయవలెను. కర్మచేయ వలెనన్న విచక్షణ అవసరం. విచక్షణ యోగ్యతా యోగ్యతల పరిశీలనకు ముందు తానెవ్వరో తన నిజస్థితి ఏదో తెలుసుకొనవలెను. అనగా మానవునకు తత్త్వవిచారణ, నైతిక జ్ఞానము ఆత్మ విద్య ఎంతో అవసరము. వీటి సమాహారమే వేదాంతము.'' దీనినే శ్రీటాయిన్‌బి భారతీయ వేదాంతముగా అభివర్ణించెను. భారతదేశములో వేదాంత శాస్త్రమెన్నడూ సమసిపోలేదు. అది నిరంతరమూ భారతీయ జీవనమున ప్రచలితమై యున్నది. ప్రతివ్యక్తి రక్తమందూ మిళితమై కుటుంబము, సంఘము, జాతి మనుగడకది ఆధార భూతమగుచునే యున్నది. వేదాంతమునే సత్యదర్శనమని కూడా అందురు. ఇది జీవన విధానము-అంతేకాని కేవలము జీవన దృక్పథము కాదు; ధర్మము నాధారము చేసుకుని ఇది మానవుని నైతికవర్తనుని చేసి ముక్తిని ప్రసాదించు జీవన విధానము.

ఇంగ్లండు అమెరికా మొదలగు ధనధాన్యములతో ధగధగ మెరయు దేశముల నుండి శాంతి సౌఖ్యములకు దూరులైన దీనజనులెందరో బాబా సందర్శనముతో పునీతులై తుష్టిని పుష్టిని పొందుచున్నారంటే ఆశ్చర్యము లేదు. దాసోహమనుచూ విషయ వ్యామోహముల చిక్కుకుని చివరకు వాటి నిస్సారతను గ్రహించి విసుగు చెంది శాంతిని వెదకుచూ వచ్చిన వారే. అట్టి వారితో ''నేను పిలవనిదే మీరు నా వద్దకు వచ్చివుండెడి వారుకాదు, మీలో ప్రతి వ్యక్తి భూతభవిష్యత్తులూ నాకు తెలియును, మీరిప్పుడేమి కోరుచున్నదీ, అది ఎట్లు ఎప్పుడు మీకు లభించునదీ నాకు తెలియును'' అని అనుచుందురు.



మనలో చాలామంది సాయిబాబాను గురించి ఎవరో చెప్పగా విందుము. విన్న తర్వాత బాబాను గురించి తెలుసుకొన ప్రయత్నింతుము. లాస్ ఏంజెలిస్ నివాసి అయిన జాన్ హిస్లోప్ ఈ విధముగా చెప్పెను. ''కాలిఫోర్నియాలో బాబాను గురించి ప్రప్రథమముగా బాబ్‌రేమర్ అతని స్నేహితుల నుండి తెలిసినది. అటుపైన ఇంద్రాదేవి అమె సహచరుల ద్వారా తెలిసిది. వారు మద్రాసులోవున్న మర్ఫెట్ చెప్పగా వినిరి. మర్ఫెట్ బాబ్‌రేమర్ వద్ద వినిరి. బాబ్‌రేమర్ ఒక స్నేహితురాలివద్ద నుండి బాబాను గురించి తెలుసుకొనెను. ఆమె మరొక స్నేహితుని వద్ద వినియుండెను. ఈ విధముగా ప్రచారమైన ఈ సమాచారమున కంతటికీ కారణము బాబా అనుగ్రహమును చవిచూచిన వ్యక్తులే. వారికి మూలము బాబాయే.''

ఎల్సీకోవన్ బాబాను మొదటిసారి ఏ విధముగా కలిసికొనెనో వినండి. ''మా దంపతులము ఎన్నో సంవత్సరములుగా సత్యాన్వేషణలో గడిపితిమి. ఒక మార్గము తర్వాత మరొక మార్గము ననుసరించితిమి. మాకు మార్గమూ గమ్యమూ కానరాలేదు. ఎందరెందరో గురువుల నాశ్రయించితిమి. మహనీయులెందరో బోధించిన సత్యమునేవారూ బోధించిరి. క్రిస్తు మనలోనే వున్నాడని అతడే గమ్యమును చేర్చుననీ బోధించిరి. కాని అంతర్యమున ఆధ్యాత్మిక సంఘర్షణ కొనసాగుచునే యున్నది. మన మెందుకు భగవంతుని కనుగొనలేము? ఆత్మ విచారణ చేసుకొనవలెనన్న ఏమిచేయవలెను? అడుగడుగునా మాకు నిరుత్సాహమెదురుకాదొడగెను. ఇక చేయునదిలేక ఒక నిర్ణయమునకు వచ్చి మమ్ము గమ్యమునకు చేర్చు సద్గురువును ప్రసాదించమని చిత్తశుద్ధితో ఎలుగెత్తి దైవమును ప్రార్థించితిమి.''

వారి మనస్తాపము నెరిగిన ఆ దైవమే సద్గురువుగా వారి కభయ మిచ్చెను. వారి అవతార లక్ష్యమే అట్టివారిని దరిచేర్చుట కదా! ఈ విషయమున హిస్లోప్ చెప్పునది వినెదము. ''ఆ మరునాటి ఉదయమున మా మిత్రుడొకడు మా ఇంటికి వచ్చి ఒక పుస్తక మిచ్చెను. అది సత్యసాయిబాబా జీవితమునకు సంబంధించిన గ్రంథము. ఆ పుస్తకము నా మూలాగ్రము చదివితిమి. ఏదో అనిర్వచనీయమైన శాంతి హృదయముల నిండినది. మా ప్రార్థన భగవంతుడువిని అనుగ్రహించినట్లు తెలుసుకొంటిమి.

''బాబా భక్తకారుణ్య కార్యక్రమము త్వరితముగా ప్రారంభమైనది. ఆ మిత్రుని కలుసుకుని బాబా యితర గ్రంథములను సేకరించి చదివితిమి. బాబా ప్రబోధలు మమ్ము తన్మయులను చేసినవి. ఆ తరువాత ఆదివారము మేము పూజ చేసుకొను ఆలయమునకు వెళ్ళితిమి. కొన్ని వారములుగా కనబడని మిత్రురాలు మా చెంతనే వచ్చి కూర్చున్నది. తమ పర్స్‌లో భద్రపరచుకొన్న ఒక పొట్లము నుండి భస్మము తీసి నోటిలో వేసుకుని, అది సాయిబాబా ప్రసాదమనియూ, దానిని మాకిచ్చుటకే మమ్ము వెదకుచూ అక్కడికి వచ్చినట్లూ చెప్పి ఆ పొట్లమును మాకిచ్చి నిత్యమూ రాత్రి

నిదురించుటకు ముందు అందలి భస్మము నించుక నాలుకపై వేసుకొనవలెనని కూడా ఆమె చెప్పెను. ఆ విధముగా బాబా అనుగ్రహము మాపైన ప్రసరించుట ప్రారంభమయ్యెను. చర్మచక్షువులతో మేము చూడక పోయిననూ అనేక విధములుగా బాబా మాకు సన్నిహితులు కాజొచ్చిరి. బాబాను ప్రత్యక్షముగా చూడవలెనన్న తీవ్రమైన కాంక్షతో ప్రశాంతి నిలయమునకు ప్రయాణమైతిమి.''

జాన్ హిస్లాప్ భార్య, మాగ్దలేనా, చాలా పిన్న వయస్సులోనే సాయిబాబా అనుగ్రహము పొందినది. ఆమె ఒక యేడాది పసిపాపగా వున్నప్పుడే ఆమె హృదయమున తన దివ్యజ్యోతి వెలయింప జేయుటకు బాబాయే క్యూబాలోని హవానాలో దర్శనమిచ్చిరి. అప్పుడప్పుడే తప్పటగులు వేయుచూ ఆమె నడుచుట కారంభించినది. ఆ సమయమున వారి తోటలో ఒక మూల షిరిడి సాయిబాబా నిలచియుండుట చూచినది. 'డాడా! డాడా! యనుచు అతని వైపు అడుగులేయుచూ గుమ్మమున కడ్డముగా నిలబడిన తన 'డాడీ'ను చూచి తికమకబడి నిలచిపోయినది. విచిత్రమేమనగా ఆ దృశ్యమానాటి నుండి ఆమె స్మృతిని వీడక వెంటాడుచునే యున్నది. ''అత్యంతాశ్చర్య కరమైన విషయమేమనగా 35 సంవత్సరముల క్రితము జరిగిన ఈ సంఘటన కండ్లకు కట్టినట్లుగా ఆయింటినీ ఆ తోటనూ, బాబా నిలబడిన స్థలమునూ, ఆమె చూచిన రూపమునే వేషమునూ యధాతధముగా వర్ణించి మాగ్దలీన్ మనస్సున నాటుకొన్న అనుభవము నిజమని ధృవపరచిరి'' అని జాన్ హిస్లాప్ వ్రాసిరి.

యోగ శాస్త్రములో ప్రపంచ ఖ్యాతి గడించిన ఇంద్రాదేవి అమెరికా దేశస్తురాలు. ఆమె రష్యాలో పుట్టింది. యునైటెడ్ స్టేట్స్, మెక్సికో దేశాల మధ్య సరిహద్దులో ఆమె యోగాశ్రమము నిర్వహించుచున్నది. మైసూర్‌లో ఆమె యోగాభ్యాసము చేసి ఇంద్రాదేవి యను భారతీయ నామధేయమును ధరించింది. షాంఘై, లండన్, మాస్కో, బొంబాయి మొదలయిన నగరములలో యోగాభ్యాస కేంద్రములు నెలకొల్పి, తరచు ఆయా దేశములన్ని పర్యటించుచుండును.

1966 సం॥లో బాబా ఒక వారము రోజుల పాటు బొంబాయిలో వున్న గ్వాలియర్ ప్యాలస్ నుండి నిత్యమూ తమ అనుగ్రహము కోరు అసంఖ్యాకులైన భక్తులకు దర్శన మిచ్చుచుండెడివారు. సరిగా అదే సమయమున ఇంద్రాదేవి ఆ భవనమునకు కనుచూపు మేరలో నివసించు చుండెడిది. కాని ఆమె అప్పుడు బాబాను చూచుట తటస్థించలేదు. అయితే తను సిటీకి వెళ్ళునప్పుడు గ్వాలియర్ ప్యాలస్‌కు పోవు 'రోడ్డు' బాబాను దర్శించుటకూ, ప్రసంగములు వినుటకు, భజనలలో పాల్గొనుటకు వచ్చు భక్తులతో క్రిక్కిరిసియుండి రాకపోకల కంతరాయము కలిగించుచుండుట ఆమె గమనించెను. తర్వాత సైగాన్ వెళ్ళే ముందు ఒక మిత్రుని కలియుటకుగాను మద్రాసులోని దివ్యజ్ఞాన సమాజ ప్రధాన కార్యస్థానమునకు వెళ్ళగా అక్కడ మర్ఫెట్ దంపతులను కలుసుకున్నది.



బాబా ప్రేమతత్వము, లీలలు మహిమలు, ప్రబోధనలను గురించి ముచ్చటించుకొనుచూ వారానందముతో ఉప్పొంగిరి. ఆమె సైగాన్ నుంచి తిరిగి వచ్చింది. బాబా పిలుపు ఆమెకు స్పష్టముగా వినవచ్చెను. బాబా అవతరణతో అమరత్వము చెందిన ఆ కుగ్రామమునకు వెంటనే బయలుదేరినది. మధ్యలో కేంద్రమంతి డా॥ త్రిగుణసేన్‌గారిని కలుసుకున్నది. ఆయన బాబా ఆశీస్సులు అందుకుని అప్పుడే తిరిగి వచ్చుచున్నారు. అక్కడికి వెళ్ళిన యెడల ఆ ప్రశాంతి నిలయమే గమ్యముగ భావించి అక్కడే స్థిర నివాస మేర్పరచుకొందురేమోనని శ్రీ త్రిగుణసేన్ ఇంద్రాదేవిని హెచ్చరించిరి. చివరకు అదే నిజముగా జరిగినది. ఆమె హృదయమును బాబాకు అప్పగించి ఆమె యెక్కడున్ననూ, ఏమి చేయుచున్ననూ సాయి మంత్రమునే శ్వాసించుచూ, సాయి నామమునే జపించుచూ, సాయినే కలయందు గనుచూ సాయి యందే నిమగ్నమై పోయినది.

న్యూయార్క్ నివాసి హిల్డా చార్లటన్ అను నామె శ్రీలంకలో అనేక సంవత్సరములు గడిపి ఢిల్లీకి వచ్చినది. ఆమె''మాతను' పూజించి ధ్యానించుటకు ప్రారంభించెను. ఒకసారి ఆమె షిర్డీ సందర్శించు భాగ్యము కలిగినది. అక్కడకు 500 మైళ్ళ దూరములోనున్న పుట్టపర్తిలో బాబా సజీవ రూపమున దర్శనమిచ్చుచున్నారని తెలిసినది.

క్రిందటి అవతారమునకు కార్యక్షేత్రమైన షిరిడీ నుండి బాబా వద్దకు వచ్చిన మరొక విదేశీయుడు. నార్వే దేశస్తుడైన ఆల్ఫ్‌టిడ్‌మండ్ జొహన్‌సన్. అతడు బొంబాయి హార్బర్‌లో ఒక ముఖ్యమైన షిప్పింగ్ ఏజన్సీకి అధినేత. అతని విరోధులు అతని వ్యాపారమును పలుకుబడిని చూచి అసూయ చెంది అతనిని మట్టుబెట్టుటకు చేతబడి చేయించిరి. అతని స్నేహితులు ఒక పార్శీ మత గురువు, కలిసి అతనిని కష్టముల నుండి రక్షించుటకు షిరిడీ తీసుకువెళ్ళిరి. తరువాత ఆయన అనేక పర్యాయములు షిరిడీ సందర్శించెను.

1966 ఫిబ్రవరిలో షిరిడీలో వుండగా ఒక వింత సంఘటన జరిగెను. సమాధి యెదుట కూర్చుని ధ్యానించు చుండగా నీలము చొక్కా ధరించిన ఒక్క పొట్టి వ్యక్తి అతని వీపుపై చరచి ''సత్యసాయిబాబా నెప్పుడైనా దర్శించితివా?'' అని అడిగెను. ఆల్ఫ్ ఆపేరు నెన్నడూ వినలేదు. ఆ పొట్టి వ్యక్తి అతని చెవిలో ''భగవంతుడు ఎన్నడైనా మానవ రూపమున అవతరించెనన్నచో అది సత్యసాయి బాబాయే'' అని చెప్పి ఒక లాకెట్ యిచ్చెను. అందులో బాబా బొమ్మ అమర్చి వున్నది ఆవ్యక్తి అంతటితో ఊరుకొనలేదు. ''నీవు వారిని మార్చి 14వ తేదీన బొంబాయిలో చూడవచ్చును'' అని చెప్పి వెళ్ళిపోయెను.

''భువిలో అవతరించిన దైవమును గూర్చి ఆల్ఫ్ తనకు తెలిసిన వారి నందరినీ అడిగెను. కొందరు బాబానే యెరుగమనిరి. మరి కొందరు 14వ తేదీన బాబా

వచ్చుచున్నట్లే తెలియదనిరి. అసలు జరిగినదేమియనగా ఆ పొట్టి మనిషి ద్వారా ఆల్ఫ్‌కు తెలిసిన వారము రోజుల తర్వాతనే బాబా బొంబాయి ఆగమన వార్త బొంబాయిలోని సత్యసాయి సేవా సమితికి అందినది. మరి ఆ నీలం చొక్కా వేసుకున్న పొట్టి వ్యక్తి ఎవరో అదిబాబాకే తెలుసు.

మార్చి 13వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత బాబా బొంబాయి చేరుకున్నారు. 14వ తేదీన గ్యాలియర్ ప్యాలస్‌లో ఉదయపు భజన సమావేశము వేళ ఆల్ఫ్‌ను గుర్తించినట్లుగా అతనివైపు చూచి బాబా చిరునవ్వు చిందించిరి. ఆ తర్వాత బాబాతో లభించిన మొదటి సమాగములోనే ''నీకు జ్ఞాపకమున్నదా! నీపై శత్రువులు చేతబడి చేసినప్పుడు నేను సహాయము చేసితిని'' అని అడిగి వ్యాపార రంగములోనూ, మానసికముగానూ అతడు గురి అయిన బాధలనూ వాటి నుండి తప్పించుకొనుటకు అతడు పడిన శ్రమలనూ బాబా కండ్లకు కట్టినట్టుగా వర్ణించి గుర్తుచేసి చివరకు ''ఇక మీదట అన్ని విషయములలోనూ నీ యోగ క్షేమములను నేను చూచుకొనెదను'' అనుచు అభయ మిచ్చిరి.

హాలీవుడ్‌లోనూ, న్యూయార్క్‌లోనూ, అందరికీ ప్రీతి పాత్రుడగు సుప్రసిద్ధ సినీమా, నాటకముల రచయిత ఆర్నాల్డ్ స్యూమన్ వైట్‌ఫీల్డ్‌లో ఒకసారి బాబాను కలిసి అమెరికా తిరిగి వెళ్ళిపోయెను. అతని అనుభవము గురించి అతడు వ్రాసినదిది.

''ఎట్టి కారణము లేకుండగనే బాబాను గురించి ఒక పుస్తకము వ్రాయవలెనన్న తీవ్రమైన కోర్కె కలిగినది. దానిని త్రోసివేయుట నాకే మాత్రమూ చేతకాలేదు.'' అతడు పుస్తకము వ్రాసి భారతదేశము వచ్చి బాబాను దర్శించవచ్చినప్పుడు బాబా అతనిని గదిలోకి పిలిచి ''సమయము వచ్చినప్పుడు, నా అవసరము కలిగిన వారందరిని నా దగ్గరకు నేనే పిలచుకుందును, పుస్తకము వ్రాయు సంకల్పము నీలో కలిగించినది నేనే. ఎందుచేత ననగా నీవు నాకు కావలయును, అర్థమైనదా, నీవు నాకు కావలయును; అంతేకాని నీ పుస్తకము కాదు.'' అని చెప్పిరి.

ఆ విధముగా ఎందరెందరో అన్ని వైపుల నండి బాబా సన్నిధికి చేరెదరు. హిస్లోప్ వలె ఎందరో ఆధ్యాత్మిక సాధనలు చేసినవారున్నారు. వారి వారి దేశములలో సంవత్సరముల తరబడి వారి విశ్వాసములను అవకాశముల ననుసరించి జిజ్ఞాసతో పెద్దల నాశ్రయించిన వారున్నారు. రామకృష్ణ మిషన్, హరేకృష్ణ ఉద్యమం, క్రియాయోగ సమావేశము మొదలయిన సంస్థలతో పరిచయము ద్వారా కొందరిలో ఆధ్యాత్మిక జిజ్ఞాస రేకెత్తెను; ఆత్మ సంశోధన, ఆత్మ సంయమనము, ఆత్మ పరిజ్ఞానము నందాసక్తి పెరిగెను. ఇట్టివారు బాబా వద్దకు వచ్చెదరు. కొందరు స్వార్థపరులయిన గురువుల బాధలకు గురియై భంగపడిన అమాయకులూ బాబా వద్దకు వచ్చెదరు. పరస్పర విరుద్ధమైన అభిప్రాయములతో విసుగు చెంది నిరాశతో కొందరూ, శాంతి మార్గము నన్వేషించుచూ



కొందరూ బాబా సన్నిధి చేరెదరు. చివరకు వీరందరూ సచ్చిదానంద స్వరూపుడైన చల్లని ప్రభువునూ, ఆజ్ఞాన స్వరూపుని అమృతవాణి ద్వారా వారన్వేషించెడు సత్యమునూ దర్శించి ధన్యులయ్యెదరు.

''చెట్టును పూసిన మొగ్గలన్నీ వికసించవు. వికసించిన మొగ్గలన్నీ కాయలు కాయవు. కాయలన్నీ మధురమైన పండ్లుగా మారవు'' అనుచుందురు బాబా. అదే విధముగా ఎందరో బాబా వద్దకు వచ్చినా వారందరి మానసిక పరిణామ స్థాయి ఒకలాగ వుండదు. మిడిమిడి జ్ఞానముతో తృప్తిపడువారు, వాచాలురు, గర్వాంధులు, మధ్యలోనే రాలిపోదురు; వారిస్థాయి యెట్లున్ననూ బాబా అనుగ్రహ ప్రభావము వారికి చిరస్మరణీయము.

లాస్ ఏంజల్స్‌లోని ఈస్ట్‌వెస్ట్ కల్చరల్ సెంటర్‌కు చెందిన డా॥జూడిత్ ఎం.టైబర్గ్ ''నేను పుట్టపర్తికి వచ్చి దాదాపు మూడు సంవత్సరములైనది. శ్రీ సత్యసాయిబాబా అనుగ్రహము నాకు లభించినది. నిరంతరము అన్ని రంగములలోనూ వారి అనుగ్రహము యొక్క దాఖలా అనుభవ పూర్వకముగా గ్రహించుచునే యున్నాను'' అని ''నా హృదయము తీవ్రమైన సంక్షోభముతో నిండివుండగా నేను బాబా సన్నిధిని చేరితిని. నా వ్యధలన్నీ మాయమైపోగా నేను శాంత చిత్తతను పొందితిని. వెనుకటి జీవితమునకు ఈ జీవితమునకు సంబంధము లేనంతగా మారిపోతిని'' అని జాక్ హకీం జాడె అనే టెహరాన్ నివాసి వ్రాసిరి.

పది మాసములుగా ప్రశాంతి నిలయములో వున్న గ్రీన్ తన అనుభవము నీ విధముగా వ్రాసెను. బాబా నన్ను పిలిచి ''ఇక డాక్టర్లూ వద్దు: మందులూ వద్దు, వాటిని విడిచిపెట్టు. ఇక మీదట నేనే నీ డాక్టర్ని'' అన్నారు. అప్పటి నుండి వారి అనుగ్రహము యొక్క ప్రభావము అనేక పర్యాయములు ప్రత్యక్షముగా చూచితిని. ఒక రోజున చీకటిలో వచ్చుచుండగా పాదము గతుకున బడి తీవ్రమైన గాయమయ్యెను. బాధతో మూల్గుచుండగా నన్ను నా గదికి తీసుకొనిపోయిరి. రెండు గంటల తర్వాత పాదము యొక్క స్పర్శజ్ఞానశక్తి పోయి మొద్దుబారి పోయినది. త్రోపుడు కుర్చీలో కూర్చుని వైట్ ఫీల్డులో జరుగుచున్న భజనకు హాజరైతిని. కొంతసేపయిన తర్వాత పాదము వెచ్చగా నుండుట గమనించితిని. పాదమును భూమిపై మోపితిని; వాపు, బాధ తగ్గిపోయి పూర్తిగా నయమైంది''.

బాబా రచించిన గ్రంథముల ద్వారా, వారి ఉపన్యాసముల ద్వారా, భజనలు పూజలు ధ్యానము ద్వారా ఎందరో సంతృప్తిని మనశ్శాంతినీ, ఆత్మ విశ్వాసమునూ పొందుచున్నారు. అమెరికా పసిఫిక్ తీరమునందు గల శాంతాబార్బారా నుండి జాన్ ఎవర్‌సోల్ నాకు ఈ విధముగా వ్రాసిరి ''నా మనస్సు బాబాపై మళ్ళిన తర్వాత నా గృహాంగణమును బాబా చిత్రపటములతో నలంకరించితిని, బాబా విభూతి నిరంతరము నా జీవితమున మాధుర్యము నిలుపగలదు. సత్యస్వరూపులైన బాబా మార్గముననే

నేము చరించుచు మా ఆనందాశ్రువులతో బాబా పాదపద్మముల కభిషేకము గావించెదము''.

బాబా సన్నిధానములో కొన్ని మాసములుండుటకు భారత దేశమునకు వచ్చిన తన విద్యార్థికి న్యూయార్కు నుండి హిల్డా చార్లటన్ ఈ విధముగా జాబు వ్రాసినది. ''అందరూ అన్యోన్య భావంతో సంచరించుట బాబా ఆదర్శము. ఎవరిని ద్వేషించినను బాబాను ద్వేషించినట్లే భావింపుము. ఎందువలననగా, అందరిలోనూ ఆత్మ స్వరూపుడుగా బాబా వున్నారు. నీ పర్యటనలో 'బాబా!' యనుచు భక్తి ప్రదర్శన చేయుచూ వారి ప్రబోధనలను ఆచరణలో పెట్టని దురదృష్టవంతులు కూడ కనబడెదరు. అందరి హృదయాంతరాళములందలి భావములూ కోరికలూ బాబాకు తెలుసును. బాబా ఈభువి నవతరించిన దైవము.''

ఒకప్పుడు హిల్డా చార్లటన్ నాకొక లేఖలో ''మా ధ్యాన శిక్షణా కేంద్రములో ధ్యాన సమయమందు బాబా ప్రత్యక్షముగా యిక్కడ మా మధ్యనే వున్నట్లు అనుభూతి కలుగుతూ వుంటుంది. ఒక విద్యార్థి బాబా రూపమును గదిలో చూచెను, ఒక విద్యార్థి బాబాను అనంత స్వరూపునిగా దర్శించెను. ధ్యాన సమయమందు కొందరు పట్టలేని ఆనందముతో నవ్వుచుందురు. బాబా వారికి స్వప్నములందూ, దృశ్యాదృశ్య రూపములందు కనిపించు చుందురు. ఎందరి వ్యాధులో కుదిర్చిరి. ఎందరో విద్యార్థులు మత్తుపదార్థములను నిద్ర మాత్రలను విసర్జించి మనోబలము చిత్తస్థైర్యము కోల్కొను చున్నారు.'' అని వ్రాసెను, మరొక లేఖలో ఆమె ''ప్రశాంతి నిలయమున బాబా దివ్య సమక్షమందు గడిపిన మధుర క్షణములు మరపురాని అనుభవములు. మళ్ళీ అటువంటి అదృష్టమెప్పటికో! పాశ్చాత్య దేశమునకు తిరిగి వచ్చినప్పటి నుండి బాబా యొక్క సర్వవ్యాపకత్వమును మరింత ధృవపరచు నిదర్శనములు, అనుభవములు ఎప్పటికప్పుడు కలుగుచునే యున్నవి. నేను ప్రశాంతి నిలయము విడిచి పెట్టుటకు ముందు బాబా నాతో ''నామాతీతం! రూపాతీతం!'' అనిరి. అవును సర్వాంతర్యామికి ఒక రూపమా! ఒక నామమా! అని వ్రాసెను.

ఫ్రాన్స్ దేశమునకు చెందిన డయినా మెర్క్యోయిర్ తన మిత్రుని వద్ద బాబా చిత్తరువును చూచినది. దాని క్రింద "why fear when I am here!" అని వున్నది, పరిహసించు ధోరణిలో హు! అన్నది ''ఎవరీ వ్యక్తి? ఏమి అతని వుద్దేశ్యం''; అని నవ్వుకున్నది. కాని బాబాను గూర్చి మరికొందరు చెప్పగా వినిన తర్వాత ఆమెలో కుతూహలము జనించినది. కుతూహలం జిజ్ఞాసగానూ, జిజ్ఞాస భక్తిగానూ మారినది. ఆమె ఒక సంఘటన గూర్చి వ్రాసింది. ''ఒకసారి నా భర్తను 300 డాలర్లు అడిగితిని. వీలుపడదన్నాడతడు. బాబాపై విశ్వాసముంచి ధైర్యముగా నా భర్తతో ''నీవు నాకిప్పుడు 300 డాలర్లు ఇస్తే బాబా నీకు పదింతలు ఇచ్చును అని ధైర్యముగా అంటిని. 300



డాలర్లు నా చేతిలో పడినవి, అదే సాయంత్రము తలవనితలంపుగా అతనికి 3000 డాలర్లు లాభించినవి. అందరూ ఆశ్చర్యపడిరి... ఒక నేను తప్ప.''

శాంతాబార్బారాకు చెందిన మురెయిల్ జె.ఎం.గిల్ బాబాను గూర్చి వ్రాసినది. ''నేనెన్నడూ భగవంతునికింత సన్నిహితముగా నిలచి యుండలేదు. మీరు నమ్మండి నమ్మకపొండి, ఆయన జీసస్ క్రీస్తే, ఒక్కసారి చూడగనే మన మెవరమో ఎందుకొరకు వారిచెంత చేరుచున్నామో, మనము నోరు తెరవకముందే, వారు తెలుసుకొనెదరు. ఆయన కరుణామూర్తి కాబట్టి, మనము చిన్నబుచ్చుకోకుండా, మనల్ని గురించి తెలిసిన దంతా బయట పెట్టరు.''

భక్తురాలైన ఒక జర్మనీ వనిత ''బాబా నిర్మలమూర్తి, ప్రేమ స్వరూపులు, అని అభివర్ణించినట్లు హవార్డ్ మర్ఫెట్ చెప్పిరి. అతనికి ఆమె ఇట్లు వ్రాసినది. అలనాటి పరిపూర్ణ వైభవముతో జీసస్ క్రీస్తే సత్యసాయిబాబాగా అవతరించినట్లు నా విశ్వాసము రానురాను ధృడమగు చున్నది.''

జాన్ స్కైలెర్ తన మానసిక సంఘర్షణను తన జాబులో ఇట్లు వివరించిరి. ''41 సంవత్సరములు జటిలమైన సమస్యలతో నిరాశ నిస్పృహలనుభవించిన నాకు మానవ రూపమున అవతరించిన పరమాత్మను దర్శించినప్పుడు పొందిన ఆనందము నేచందమున వర్ణించగలను. పరస్పర సంబంధ బాంధవ్యముల ద్వారా అనేక రకములైన ప్రేమను రుచి చూచితిని. ఇవి యేవీ, ఇవియన్నీ కలిసినా బాబా ప్రేమకు సాటిరావు, అది దివ్యప్రేమ.'

''1970 డిశెంబరు 9వ తేదీన అన్నాలీసా, ఇంద్రాదేవి నేనూ కలసి బాబా ఆదేశానుసారము అద్భుతమైన పామ్‌జీసస్ క్యాథలిక్ కెథెడ్రల్‌కు వెళ్ళితిని. ఇది గోవాలో వున్న సెయింట్ ఫ్రాన్సిస్ ఎక్సేవియర్ యొక్క సమాధిస్థలము, జీసస్ అనంత ప్రేమామృతము నాపై వర్షించింది. ఆ కరుణామూర్తి ప్రతిమముందు మోకరిల్లితిని. ఎన్నో సంవత్స రములుగా జీసస్ చూపిన త్రోవనే అనుసరించిన క్రైస్తవ మతస్తుడను. ఇప్పుడు నా హృదయము పూర్తిగా సత్యసాయి బాబా వశమైయున్నది.

''జీసస్! ఏమిటిది! నేను యిద్దరు ప్రభువులను సేవించుచున్నానా? ఇటువంటిది జరుగుటకు వీలులేదని నీవు శెలవిచ్చితివి. బాబా కూడా అదే చెప్పుచున్నారు. నేను నిన్ను ప్రేమించుచున్నట్లు నీకు తెలియును. అయినా నా హృదయమంతా బాబా మయమైయున్నది. నన్నీ మానసిక సంఘర్షణ నుండి కాపాడుతండ్రీ'' యని ప్రార్థించితిని.

''ఇంతలో బాబా పాశ్చాత్యభక్తులతో మాట్లాడుచున్న ఒకానొక దినము తటాలున స్ఫురణకు వచ్చెను. జీసస్‌ను గురించి బాబా మాట్లాడినప్పుడు అనువాదకుడు ''మీ జీసస్...'' అను మాటలతో ప్రారంభించగా బాబా అడ్డు తగిలి ''మీ జీసస్ కాదు... మన జీసస్'' అని సవరించిరి. ఆ క్షణమున జీసస్సే నన్ను బాబా వద్దకు పంపెనేమో

నని భావించితిని. రానురాను బాబా ప్రబోధలకు మూలాధారమైన విశ్వమానవ సౌభ్రాతృత్వము. సేవాతత్పరత, ప్రేమ, నమ్రత, భక్తియని గ్రహించగా బాబాయే జీసస్, జీసస్సే బాబా అనుభావము మనస్సు నందు దృఢపడసాగెను.

''ఒక్కొక్కప్పుడు నా మనస్సున అనేక సందేహ ప్రభంజనములు లేచుచుండెను. అయిననూ అంతరాళము నుండి ఏదో అనిర్వచనీయమైన ప్రశాంతి స్రవంతియై మనస్సును ముంచెత్తుచుండును. 'అంతాబాగానే వున్నది' అనే భావము కలుగుచుండెను. ఆనాడు జీసస్ విగ్రహము ముందు మోకరిల్లిన తర్వాత దివ్యమైన ప్రశాంతి నన్నావరించినది. ప్రేమ భరితమైన హృదయముతో కెథ్రెడల్ నుండి బయటకు వచ్చితిని.''

'Sai baba, the man of miracles' అను గ్రంథములో దాని రచయిత హోవార్డ్ మర్ఫెట్ తన అనుభూతుల నిట్లు వివరించెను. ''సాయి బాబాకు క్రీస్తుకు ఎన్నో పోలికలున్నవి. మహిమలను చూపుటలోనే కాదు. బోధనా పద్ధతి యందు కూడ ఈ సారూప్యత కానవచ్చును. బాబా మానవుని వూహకు అతీతులు. ప్రకృతిపై వారికిగల అధికారము వారి మహిమల ద్వారా విదితమగును. వారి సర్వవ్యాపకత, సర్వజ్ఞత, ఆర్తత్రాణ పరాయణత, అన్నిటికీ మించిన వారి నిస్వార్థ ప్రేమ క్రీస్తువంటి వారి దివ్యత్వమునకు తార్కాణము.

'రెవెలేషన్ ఆఫ్ సెయింట్ జాన్ ది డివైన్' అను గ్రంథమును ఏడుగురు పాశ్చాత్యులు ఒక సాయంత్రము పఠించుచూ వ్యాఖ్యానించుకొను సమయమున వారితో నేను కూడ అక్కడ ఉండుట సంభవించినది. ఎడ్గార్ కేసీ మహాశయుడు పవిత్ర బైబిల్ గ్రంథమునకు వ్రాసిన బృహత్ వ్యాఖ్యానమును వారు కూలంకషముగా అధ్యయనము చేసి యుండుట వలన అతి సూక్ష్మమైన అధ్యాత్మిక విషయములను కూడ అవగాహన చేసుకోగల సమర్థులువారు. అందులో కొందరు తమ సహజ జ్ఞానమును పురస్కరించుకుని బాబా అవతారమును గురించి వ్యాఖ్యానము చేయుచు క్రీస్తుకు బాబాకు మధ్య వున్న పోలికలను గమనించు చుండిరి. ఆ గ్రంథములో న్యూ జెరూసెలం నగరము యిట్లు వర్ణించబడినది. ''అచ్చట ఆలయము లేదు ఎందువలననగా సర్వశక్తి సమన్వితుడైన భగవంతుడే అచ్చట ఆలయము. అక్కడ తిరస్కారమునకు దుర్మార్గమునకు చోటు లేదు. సమస్త జాతుల ప్రజలు ఈ నగర కీర్తి వైభవములను పెంపొందించగలరు ఆధ్యాత్మిక దాహమున్న ప్రతివ్యక్తి యిచ్చట అమృతమును గ్రోలవచ్చును.'' ఈ వర్ణన యందు ప్రశాంతి నిలయము పోలికలు వారికి స్ఫురించినవి.

బాబా దర్శనార్థమై అరుదెంచిన అమెరికనులతో ''మీలో చాలా మందికి తల్లి ప్రేమ తెలియకుండుటచే మీరు నా వద్దకు వచ్చుచుందురు.'' అని బాబా అనిరి. వారిలో ఒకరు వ్రాసిన గేయము బాబా చేతిలో ఆ సమయమున వున్నది. ''ఓమాతా! కారుణ్యమూర్తీ! నీలో ఐక్యము కాగలుగుటకు అవసరమైన జ్ఞానమును మాకు



ప్రసాదింపుము'' అని అందలి అర్థము, జీవిత పరమార్థము కొరకు అన్వేషణ సలుపు వారందరూ వాస్తవమునకు పసివారే, అటువంటి వారిని సత్య పథమున ప్రవేశపెట్టి గమ్యమును చేర్చి ఉద్ధరించు ప్రేమ మూర్తియే నిజమైన మాతృదేవత. సుప్రసిద్ధ ఆంధ్ర పండితులు, కవి, తత్వజ్ఞాని అయిన వేలూరు శివరామ శాస్త్రిగారు బాబా సన్నిధానములో పెక్కు సంవత్సరములు గడిపిరి. ''ఈ విశ్వమందలి సమస్త జనులు తమ పిల్లలపై చూపు ప్రేమను త్రాసులో ఒక వైపునను, దీనులు, దుర్బలులు, వ్యధితులపై బాబా వర్షించు ప్రేమను మరొక వైపునను ఉంచి తూచిన యెడల బాబా ప్రేమ వుంచిన పళ్ళెము అత్యధిక భారముతో కృంగుట తథ్యము.'' అని శ్రీ శివరామ శాస్త్రి గారు బాబా వారి అపార ప్రేమను గురించి వర్ణించిరి.

క్రీస్తు యితరుల పాపముల శిక్షను తానే భరించిన త్యాగమూర్తి. బాబా ఇతరుల బాధలను తానే స్వయముగ స్వీకరించిన అనేక దృష్టాంతములున్నవి. 1970 క్రిస్టమస్ పండుగ రోజున 'ఎపెండిసైటిస్' బాధ భరించజాలని ఒక భక్తుని బాధను తానే భరించి అతనికి ఉపశమనము కలిగించిన సంఘటన గురించి, బొంబాయి బహిరంగ సభలో బాబా యిట్లు వివరించిరి. ''సమస్తము నాకు అర్పించి నన్ను శరణువేడిన భక్తుల బాధలను స్వీకరించుట నా కర్తవ్యము. నాకు బాధలేదు. నా కర్తవ్యమును నిర్వర్తించుటలో నేను అనుభవించు బాధ నాకు ఆనందదాయకమైనది. ఆ పరిస్థితులలో నా బాధను జూచి మీరు బాధ పడకూడదు. తనయందు విశ్వాసము చూపిన వారి కొరకు క్రీస్తు తన ప్రాణమునే త్యాగము చేసెను. సేవాధర్మమే భగవత్స్వరూపము. త్యాగమే ప్రేమకు పరాకాష్ట; అదే దైవము. ఈ సత్యమును బోధించుటకై క్రీస్తు తన జీవితమును అంకితము చేసుకొనెను.''

''మీరు పాపులతో కూర్చుని ఎందుకు భుజించితిరి?'' అని కొందరు క్రీస్తును అడుగగా ఆయన ''నేను పాపుల కొరకే వచ్చియుంటిని. ఆరోగ్యవంతునికి వైద్యుని అవసరమేమియుండును.'' అని సమాధాన మిచ్చెను. అదే విధముగా అధర్మమార్గమున సంచరించు వారిని సంస్కరించుటకే బాబా అవతరించినది. ''ఆరోగ్యవంతులుగా నుండుటకు వైద్యుని సలహాలను మీరెట్లు పాటించెదరో, నా అనుగ్రహము పొందుటకు నా సలహాను పాటించి నిర్మలచిత్తులై వర్తించవలెను'' అని బాబా ప్రవచించుదురు. సాధువులైన గొర్రె పిల్లలు క్రూరమృగముల మధ్య సంచరించుట వలె మానవులు ఇంద్రియ భోగములను దుష్టశక్తులకెర కాకుండా జీవించుట కష్టము. ఈ దుష్ట శక్తులను ఎదిరించుటకు సదా భగవన్నామ స్మరణయే మానవునికి రక్షయని బాబానుడువుదురు. ''ఇక్కడ మీరు పొందిన దివ్యానుభూతిని మీ హృదయములో పదిలపరచుకుని ఈ యానంద శాంతులను ఇతరులకు కూడా పంచుడు; అందరూ నా అనుగ్రహమునకు పాత్రులే; అందరూ నావారే; అందరినీ కాపాడుటకే నేవచ్చినది'' యని బాబా చెప్పుచుందురు.

కెనడా ప్రధానికి సోదరుడైన యం. థోర్డో సతీసమేతముగా, కెనడా రాయబారిని వెంటబెట్టుకుని పుట్టపర్తి వచ్చినప్పుడు బాబా క్రీస్తు రూపముగల శిలువనొకదాని నక్కడ కక్కడే సృష్టించి ఆయనకు ప్రసాదించెను. టాక్సానియాలోని గోరోం గోరోకు తాము వెళ్ళినప్పుడు ఆ విమానమును నడిపిన బ్రిటిష్ పైలట్‌కు బాబా అందమైన శిలువను సృష్టించి ఇవ్వగా అతడు పూర్తిగా సంతోషించినట్లు కనబడలేదు. సర్వజ్ఞులైన బాబా మందహాసముతో ''నీకు కావలసినదిదిగో'' యనుచు హస్తచాలనముతో తమ చిత్ర మొకటి సృష్టించి ఇవ్వగనే అతని ముఖము ప్రఫుల్లమయ్యెను.

అచంచలము ప్రగాఢము అయిన విశ్వాసముగల భక్తులు బాబా కరుణాకటాక్షము లకు పాత్రులగుదురు. తమ రూపనామములనే ఆరాధించవలెనని బాబా ఎప్పుడూ చెప్పరు, ధర్మ వర్తనులై, నిర్మల చిత్తముతో, ప్రేమ భావముతో ఏ రూపనామముల నారాధించిననూ బాబా అనుగ్రహమునకు పాత్రులగుదురు. అనుభవము ద్వారా ఈ సత్యమును భక్తులు గ్రహించగలరు.

న్యూయార్కు వాస్తవ్యుడు జాన్ మొఫిట్ కొన్ని సంవత్సరములుగా రామకృష్ణ మిషన్‌తో సన్నిహిత సంబంధమున్నవాడు. ఆయన ప్రశాంతి నిలయములో బాబాను కలిసిన తర్వాత ఈ విధంగా వ్రాసిరి. ''గంభీరముగానూ సుస్పష్టముగానూ అలరారు వారి మృధుమధుర వాక్కులను నేనెన్నటికీ మరువజాలను, శ్రీరామకృష్ణ పరమహంస పాదముల చెంతకూర్చున్నట్లుగా నాకు అనుభూతి కలిగింది. ఆ సుందర రూపము, మధుర మందహాసము, వర్షించిన ప్రేమామృతమును నా హృదయమున నింపుకొంటిని. వారి దర్శనమునకు మరొకసారి వచ్చునట్లుగా ఆశీర్వదించవమని కోరితిని. ''ఇక్కడికెందుకు! ఇక్కడికి రావలసిన అవసరము లేదు. నేనెల్లప్పుడూ నీ హృదయవాసియై నీలోనే యందును.'' అని అన్నారు. క్రీస్తు క్రైస్తవ మతము యొక్క అవధులను దాటి మన కగుపించును, అనెడి మాటల యందలి సత్యమునకు బాబాయే నిదర్శనము. అన్ని మతములూ వారికి సమ్మతమే, ఇంతకు ముందు రామకృష్ణ పరమహంస, ఈనాడు బాబా! నామనస్సిప్పుడు నిర్మలమైనది. నా సందేహములన్నీ తీరినవి. వారి సంకల్పాను సారము నేను **నడచుకొనదలచితిని.**

తమ భక్తుల ఆధ్యాత్మిక జిజ్ఞాస, అనుభవములు, వారు చేసిన సాధనలు, వారు పొందిన ఉపదేశములు వారు చెప్పనవసరము లేకుండగానే బాబాకు తెలియును. ఒక అమెరికన్ యువకుడు బాబా యెడల తనకు గల భక్తి శ్రద్ధలను గురించి మితిమీరి పొగుడుకొనుచుండెను. బాబా అతనితో ''మీ గురువు బెంగుళూరులో ఉన్నారు. అక్కడికి వెళ్ళు.'' అని మందహాసముతో పలికిరి. ''లేదు నా గురువు నా కంటెదుటనే యున్నాడు'' అని అతడు వాదించెను, అంత బాబా ఆయువకుడు కొంత కాలము క్రితము శ్రీ మహేష్ యోగివద్ద ధ్యానవిధాన మభ్యసించెననియూ, ఆ సమయమున



మహేష్ యోగి బెంగళూరులోనే వున్నందున అట్లంటిననియూ చెప్పగా, బాబా సర్వజ్ఞతకు ఆ యువకుడు ఆశ్చర్యచకితుడయ్యెను.

''సాయిబాబా! సాయిబాబా! దీనదయాళో! నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే సోదరుడవు, నీవే సోదరివి, నీవే సమస్తము'' అను భావము వచ్చు పల్లవితో పాశ్చాత్య దేశభక్తులు ఆంగ్లమున రచించినపాటను ఒకే రాగవరసలో వారి వారి దేశములలో బృందగానము చేసికొనెదరు. బాబాయే అన్ని అవతారములని బాబా భక్తుల ప్రగాఢ విశ్వాసము, బాబాయే రాముడు, కృష్ణుడు, క్రీస్తు, బుద్ధుడు, శంకరుడు, గౌరంగుడు, రామకృష్ణ పరమహంస, జొరాష్టర్. బాబాలో ఈయవతార పురుషులను ఎందరో దర్శించిరి.

సుఖ ప్రయాణములకు వసతి సదుపాయములకు అలవాటుపడిన వారు పుట్టపర్తి వచ్చినప్పుడు ఇబ్బందులకు గురికావలిసివచ్చును. వారికి కావలసిన వసతి సౌకర్యములు, అనుకూల ఆహారము, ప్రయాణసదుపాయములు లభించకపోయినప్పటికీ, అట్టి యిబ్బందులకు లెక్కచేయక బాబా దర్శన స్పర్శన సంభాషణల కొరకు పరితపించు చుందురు. వారి దర్శనముతో సారూప్య, సామీప్య, సాలోక్యసిద్ధి కలిగి అసౌకర్యముల మాటయే మరచెదరు.

''ఇంత ప్రేమతో కరుణతో బాబా మమ్మల్ని ఆదరించిచూచుట మాకెంతటి భాగ్యమో ఎలా వర్ణించగలను!'' అనుచున్నది శ్రీమతి మైకేల్ సుల్జ్. ''బాబా యొక్క పరిపూర్ణ ప్రేమామృతము గ్రోలవలెనన్న వారికి సంపూర్ణ శరణాగతుడై చరించవలెను. శ్రీరామచంద్రునికి హనుమంతుడువలె సంపూర్ణశరణాగతితో బాబాను ఆరాధించి వారి యందే లీనమైపోవునట్లను గ్రహించమని నేను నిత్యము ప్రార్థనలు జరుపుచుందును అన్నాడు ఎడ్డీఫ్రాయర్.

ప్రశాంతి నిలయమును గురించి వర్ణించుచూ ''ఆ స్థలమున మనకెదురగు అంతరాయములు అసౌకర్యములు ప్రకృతి ప్రాతికూల్యత బాబా అపార ప్రేమతో మాయమై పోవును'' అని గేబ్రియెలా స్టేయర్ వ్రాసెను. ''నేను బుద్బుదమును, నన్ను నీ అనుగ్రహముతో మహాంబుధితో చేర్చిమహాంబుధిగా మార్చుము ప్రభూ'' అని జార్జీనియా ప్రార్థించుచున్నట్లు చెప్పెను.

మైఖేల్ మెల్విస్ యిట్లు వ్రాసెను. ''ఇచ్చట ప్రేమకు అవధులు లేవు. సంకుచిత్వమునకు తావులేని పవిత్ర స్థానమిది. ఈ వాతావరణమందు మాయ పటాపంచలై ఆత్మజ్ఞానము భాసించును. బాబా! జగజ్జననీ! నీ చెంతకు చేర్చుకొని చిరశాంతిని ప్రసాదించు అని ప్రార్థించుచుందును.''

గత జీవితానికి స్వస్తి చెప్పి రామన్‌గా పేరుమార్చుకొన్న మరొక సాధకుడు ఈ

విధముగా వ్రాసెను ''ఆత్మోన్నత్య సాధన కొరకు, బాబా అనుగ్రహముతో ఆధ్యాత్మిక పథములో పురోగమించుటకు మాలోపెక్కు మంది యిక్కడికి వచ్చుచుందుము. మా చిత్త స్థైర్యములు పరిశీలించుటకు బాబా మాకెన్నో పరీక్షలు పెట్టుదురు. మా వైపు చూడరు. మమ్ములను పలకరించరు. మాకిటూ అటూ వున్న వారిని మందహాసముతో పలకరించుచూ, చేతితో చరచుచూ పరవశింప జేసి మేమచ్చట వున్నది గమనించనట్లు ప్రవర్తించెదరు. మావైపు తప్ప వారి అనుగ్రహదృష్టి అన్ని వైపులా ప్రసరించును. ఇట్లు కొన్ని వారములు గడచును. దానితో మాలోని అహంకారము అణగారిపోవును. పరితాపములో మా హృదయములు క్షాళనమగును. అంత వారే తమంత తాముగా కటాక్ష వీక్షణమును సారించి మందస్మితవదనముతో పలుకరించెదరు. ఆ మధురానుభూతి కొన్ని వారములట్లే హృదయముల నిలచిపోవును. ఆ మందహాస వీక్షణతో సన్నిహిత భావము కలుగును. ఆనందాతిరేకము వలన మాకు కన్నీరు జాలువారును. నిరుత్సాహము మటుమాయమగును.

''ఆ మధుర మందహాసములో, మాలో కలిగిన భావములు, మా బలహీనతలు, మాలో వచ్చిన పరివర్తనలు వారు గ్రహించి మా గతాన్ని క్షమించి మమ్మను గ్రహించినట్లు స్ఫురించును.''

''నిష్కామస్థితిని నేన్నెడైనా చేరుకొనగలిగితే, నా చిట్టచివర కోరిక బాబా వారి అనుగ్రహ వీక్షణను పొందుటయే కాగలదు.''

ప్రశాంతినిలయ మందుకాని వైట్‌ఫీల్డ్‌లోని బృందావనమున కాని పాశ్చాత్యులకు బాబా దర్శనమిచ్చినపుడు వారికి కలుగు అనుభూతులను, భావములను జాన్ హిస్లాప్ ఈ క్రింది విధముగా వివరించెను.

''బాబా మా మధ్య కూర్చుని మా ఆధ్యాత్మిక సంశయములను తెలుపవలసినదిగా కోరుచుందురు. అటువంటి సమయములందు నీలమేఘ శ్యాముడైన శ్రీరాముని లేక శ్రీకృష్ణుని సమక్షమునందున్నట్లు మా కనిపించును. ఆ అపురూప దర్శనముతో మా సర్వేంద్రియములు చైతన్యవంతమగును. వారి భావములను అభివ్యక్తపరచు వారి ముఖకవళి కలను మేమీ గమనించుచుందుము. అన్నెము పున్నెము నెరుగని పసిపాపవలె వారి మధుర మంజుల దరహాసము వీక్షింతుము. వారి నేత్రములు జ్ఞానదీప్తితో వెలుగొందు **చుండును.** కన్నతల్లి పలుకులకంటే వారి పలుకులు మధురాతి మధురముగా నుండును. ఒక్కొక్కప్పుడు ఆప్తమిత్రులతో వలె హాస్యవంతముగా నుండును. ఒక్కొక్కప్పుడు తండ్రివలె కఠినముగా హెచ్చరించుదురు. వారేమి చేయుచున్ననూ లాలిత్యము ద్యోతకమగు చుండును. మల్లెమాలతీ సుగంధము పరివ్యాప్తమగుచుండును. ఇదే విధమైన సుగంధముతో ఒకనాడు నేనే హోనోలూలూలో **మేల్కొంటితిని.** పదిపన్నెండు సెకండ్ల వరకూ అది అట్లేయున్నది. మరొకసారి బొంబాయిలో ధర్మక్షేత్రమందు బాబా ప్రసంగించు



సమయమున వారి శీర్షమున తేజోమండలమును గాంచి ఆశ్చర్యచకితుడనైతిని. దానిని బాబా గమనించి నీవెంతో అదృష్టవంతుడవని నన్నాశీర్వదించిరి.''

బాబా భక్తులకు ఏ విధముగా కన్పించునది శ్రీ హిస్లాప్ తన అనుభూతి నిట్లు వ్రాసెను. ''మనము వారిచెంత కూర్చున్నప్పుడు అందమైన ఒక భారతీయుని కంటే అత్యంత ఆకర్షణీయముగా మనకు కనుపించును. ఇది అతీంద్రియానుభూతి. ఆ దివ్యమంగళ రూపము గదినంతటిని నింపి వేసినట్లు మనకు తోచును. మనోహరమైన ఆ రూపమునందు దయ, ప్రేమ, దివ్య తేజస్సు సమ్మిళితమై మనకు కనబడును. వాటికి మూలాధారము బాబాయే యని మనము గ్రహింతుము. హఠాత్తుగా మన హృదయము నందు శాంతి నెలకొనును; ఆనందము వెల్లివిరియును.''

ప్రఖ్యాత హాలీవుడ్ సినీరచయిత ఆర్నాల్డు ఫుల్‌మన్ తన అనుభూతి నిట్లు వర్ణించెను. ''ఒక్క క్షణములో నాలో యేదో అనిర్వచనీయమైన మార్పు కలిగినది; వారి సన్నిధిలో కలుగు మహదానందము మాత్రము వాస్తవమైనది. ఈ అనుభూతితో కొందరి నేత్రములు చెమ్మగిల్లును. మరికొందరు ఆనందాతిరేకమున వెక్కి వెక్కి ఏడ్చెదరు.''

భక్త సమూహములకు బాబా యుగయుగములుగా వేదశాస్త్రములందించిన అధ్యాత్మిక సత్యములను సాధనలను చక్కని ఉపమానములు గాధలు, వ్యాఖ్యానముల ద్వారా సులభగ్రాహ్యమగునట్లు బోధించుచుందురు. క్లేశభూయిష్టమైన గత అనుభవములను తలచుకొని విచారించుచూ కాలము వృధా చేయవలదు. ఆధ్యాత్మిక చింతనకు ప్రతిక్షణమూ విలువైనదే. అల్ప విషయములను పట్టించుకొనక తారలవలె నిశ్చలముగా నుండుడు. సర్వజీవుల పట్ల మీ ప్రేమాభిమానములను చూపు మార్గముల నన్వేషించుడు ఎవరితోనూ అతిగా సంభాషింపకుడు. మీకు నిజమైన మిత్రుడూ, బంధువూ దేవుడే. మీ అంతరాత్మ ప్రబోధానుసారము వర్తించుడు. పేదలకు, రోగులకు సహాయము చేయుడు. మీ మనస్సుల నుండి కల్మషమునూ, భ్రమలనూ, అహంకారమునూ, వ్యసనములనూ, తొలగించుడు. అప్పుడు మీ మనస్సు దీప్తివంతమై స్పష్టముగా వికసించును. వజ్రము సానపట్టినప్పుడు మాత్రమే అమూల్యమగును. అట్లే సాధనతో హృదయమాలిన్యమును తొలగించినప్పుడు సచ్చిదానంద స్వరూపమైన పరమాత్మ సాక్షాత్కారము లభించును. భ్రమలను ఇంద్రియ వాంఛలను వీడినపుడు నాతో మీరు తాదాత్మ్యము పొందగలరు. ఈ విధముగా అనేక రకములైన గాధలతో ప్రబోధించెదరు.

తన జీవితమే తన సందేశమని బాబా ప్రకటించిరి. కావున బాబా సన్నిధి యందుండి, వారి దయ, నిరాడంబరత, త్యాగము పరిశీలిస్తూ వాటిని తమ జీవితములో సాధించ ప్రయత్నించు భక్తులు బంధవిముక్తులు కాగలరు. ప్రతి భక్తుడు తనకు బాబా బోధించు విషయములు అత్యంత ప్రధానమైనవిగా భావించును. బాబా ప్రతి యొక్కరి

సమస్యలను వేరు వేరుగా పరిశీలించెదరు. మానవుల వివిధ వ్యాధులకు చౌకబారు ఔషధముల వంటి చికిత్సా విధానమును సూచించరు. ''రోగము నీయందున్నట్లే చికిత్సా విధానమూ నీయందే వున్నది. నీ మార్గమూ గమ్యమూ నీలోనే వున్నవి. గమ్యమును చేరుటయనగా కన్నులు తెరచుకొనుట, మేల్కొనుట, ఆత్మజ్యోతిని వెలిగించుకుని దుస్వప్నములను తొలగించుకొనుట, శతాబ్దముల తరబడి వ్యాపించి వున్న అంధకారము ఒక చిరుదీపపు వెలుగుతో తొలగిపోగలదు'' అనుచూ ఆత్మతత్వమును బోధించెను.

బాబా ప్రవచించు సత్య ప్రేమలను అనుష్ఠించుటయే మన ప్రధాన కర్తవ్యము. ఈ సత్య ప్రేమలు మనయందు కూడ అంతర్నిహితమై యున్నవి. సాధన ద్వారా ద్వైత భావము నధిగమించి సాక్షాత్కారము, తద్వారా భగవంతునిలో విలీనమగుటకు నిరంతరము కృషి జరుపవలెను.

న్యూయార్క్ సేవా సమితికి చెందిన హిల్డా చార్లటన్ తన శిష్యులకు వ్రాసిన ఒక లేఖలో ధ్యాన విధానమును గురించి ఈ విధముగా వ్రాసెను. ''హృదయ కేంద్రమును ఒక నిశ్చల సరోవరముగా ఊహించుకొనుము. ఆ సరోవరము నండి ఒక పద్మము ఆవిర్భవించునట్లూహింపుము. ఆ పద్మము వికసించుట గమనింపుము. ఆ పద్మమున దేదీప్యమానమగు జ్యోతిని, ఆ జ్యోతియందు సద్గురు సాయిబాబాను దర్శింపుము. హృదయాధిష్ఠితుడైన బాబా యొక్క దివ్యప్రేమ యొక్క జ్యోతి నీశరీరమంతటా నిండి నిబిడీకృతమైనట్లూ హింపుము. అటుపైన ఆ ప్రేమ జ్యోతిని నీతోటి మానవుల యందు పరివ్యాప్తము కానిమ్ము.'' మరియొక లేఖలో ''బాబాలోనేనెట్లు లీనము కాగలను అని మీరు ప్రశ్నించవచ్చును. మీరు భాబా నామమును సర్వదా స్మరించుచూ వారిని ప్రేమించుడు. సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, విశ్వరూపుడు వారేయని నమ్ముడు. తేజోమండలములో విరాజిల్లు బాబా శిరస్సును ఆకాశముగను, వారి దేహమును ధరణీతలముగానూ, ఈ ధరణీతలమున గల సమస్త ప్రాణకోటిని అణువులుగనూ భావింపుము. బాబాయే పరమాత్మ, అతని యందే మనము ఐక్యమగుదుము'' అని వ్రాసెను.

కొందరు సాధకులకు బాబా స్వప్నములలో సందేశములిచ్చెదరు. ఆ సందేశములు ప్రత్యక్షముగా కట్టెదుట వుండి నేర్పిన పాఠములవలె నుండును. అటువంటి సందేశములలో ఒకదానిని గురించి ప్రస్తావించెదను.

''జీవాత్మ యొక్క పరిపూర్ణతవలన ముక్తి లభించదు. అది అసంపూర్ణత. అసంపూర్ణతల యందు చూపించు ఉపేక్షవలన లభించును. భగవంతుని యందు సంపూర్ణత అసంపూర్ణతలనునవి లేవు. విభక్తి, విచలనము విపర్యయముల యొక్క సంఘర్షణ భక్తి కానేరదు.''



దృగ్గోచరకమైన శ్రవణేంద్రియములందు ప్రతిధ్వనించుచుండు ఈ విధమైన ఉపదేశములను బాబా ప్రపంచమందనేకులకు చేయుచుందురు. సంశయాకులితచిత్తులైన వారి సందేహములకు సమాధానము లొసగి వారి హృదయ క్షేత్రములలో విశ్వాస బీజములు నాటుచుందురు. ఇందు నిమిత్తము సాధన చేయనవసరము లేదు. సందేహము మననము చేయుము. భగవంతుని ప్రార్థించిన సందేహనివృత్తియై జ్ఞాన సాక్షాత్కారము కాగలదు. చార్లెస్ పెన్ అను భక్తుని బాబా ఈ విధముగ ప్రశ్నించిరి. ''ఛార్లెస్! ఎన్ని పర్యాయములు నన్ను పిలచినావు! ప్రతిసారి నీ ప్రశ్నలకు సమాధాన మిచ్చి నీ సందేహములను తీర్చితిని కాదా!''

ఒకనాడు ధ్యాననిమగ్నుడై వుండి చార్లెస్ పెన్ బాభానను ఈ విధముగా ప్రశ్నించెను. ''తూర్పుతూర్పే. పడమర పడమరే. ఈ రెండూనూ యెన్నడూ కలియవు కదా! బాబా! ఈ రెండూ యెందుకు? ఈ నానుడియే నిజమయితే నీ కొరకై నా తపన యెందుకు? తూర్పు పడమరల మధ్య ఈ యడ్డు గోడలెందుకు? ఇది దాటరానివా స్వామీ?'' దానికి బాబా ఈ విధముగా సమాధానమిచ్చిరి. ''బాల్యదశ నుండి మనస్సు సత్యాసత్య సంక్లిష్టమై యుండును. అది ఒక్కొక్కప్పుడు యధార్థమైనవిగా భాసించినప్పటికి అభూతకల్పనలు కావచ్చును. అంటువ్యాధులు తగిలిన పెద్ద వారి నుండి ఆ వ్యాధులు సోకకుండా పసివారిని దూరముగా వుంచెదరు. అదే విధముగా నన్ను సరిగా తెలిసికొనుటకు వీరిని పెద్దల నుండి దూరముగా వుంచుటయే మంచిదని నా యభిప్రాయము. అప్పుడే వీరునన్ను సక్రమముగా అర్థము చేసుకొనుటకు అవకాశము కలుగును. సూర్యునకు తూర్పు పడమరలను భేదముండదు. దురాశా దుర్నీతిపరులు వారి స్వార్థమునకై మానవుల మనస్సులలో అగాధములను సృష్టించి తూర్పు పడమరల పేరిట విభేదములు కల్పింతురు. అందుచేత ప్రతి వక్కరు అటువంటి అసత్యములను సత్యము తోడనూ, అపోహలను వాస్తవ విషయముల తోడనూ, ద్వేషమును ప్రేమ తోడనూ, అహంకారమును అవగాహన తోడనూ ప్రతిఘటించి జయించవలెను. క్రోధము ఆవేశించెనా శాంతించు. భయ సంశయములు కలిగెనా నన్ను ప్రార్థించు. సూర్యచంద్రాదులకు సహితము గతులు కల్పించిన నా అనంత శక్తిని ఆశ్రయించితివా చార్లెస్! పెను తుఫాను సహితము చల్లని పిల్ల తెమ్మెరెలవలె సోకి నీకు హాయిని కలిగించును.''

అనేకమంది దారీ తెన్నూ తెలియని స్థితిలో తీవ్రమైన ఆధ్యాత్మిక జిజ్ఞాసతో బాబా సన్నిధికి చేరెదరు. అన్వేషణలో వేసారి నిరాశ నిస్పృహలకు గురియయ్యెదరు. అర్థమూ, పరమార్థమూలేనిది, వ్యర్థమూ నిరర్థకమైనది, మానవ జీవితమును నిరాశా భావమునకు గురియయ్యెదరు'' అని నార్మన్ మెయిలర్ వ్రాసెను.

బాబా సన్నిధికి చేరినవారిలో కెర్రీ, కెనడా అడవులలో, కొండలలో రెండు సంవత్సరములు అనేషణలో పర్యటించెను. జానెట్ అను నామె సాధనల ద్వారా కొన్ని

అద్భుత శక్తులను సంపాదించి రహస్యముగా పెంపొందించుకొనుచూ వచ్చెను. వారిరువురు బాబాను చూచుట తోడనే జానెట్ 'ఈతడు భగవంతుడు! నాకు తెలుసును' అని బిగ్గరగా అరచెను. మార్టిన్ స్టాంప్ అను యువకుడు గణితశాస్త్ర ప్రవీణుడు. ఆక్స్‌ఫర్డు కేంబ్రిడ్జ్ అతని మేధాశక్తిని గుర్తించినవి. తీవ్రమైన భగవదన్వేషణతో అతడిక్కడికి చేరెను. రామన్ అను యువకుడు తన మాతృదేశమైన అమెరికాకు భారతీయ సందేశమైన యోగశాస్త్రమును గొనిపోయి అచ్చట ఖైదీలకు కూడా బోధించెను.

ఇంద్రాదేవి వలెనే రామన్ కూడా తన యోగా సాధనా విద్యార్థులకు బాబా యొక్క దివ్యత్వమును గురించి బోధించుచుండును. స్టీవ్‌విన్ అను నాతడు లోమ్‌ఫోర్ జెయిలు నుండి రామన్‌కు ఈ విధముగా జాబు వ్రాసెను. ''....... నేను యిక్కడ నుండి బయట పడిన తరువాత క్రమశిక్షణతో నన్ను నేను సంస్కరించుకొనెదను, మన జీవితాలలోని అసంతృప్తి అశాంతిని చూసి శ్రీసాయిబాబా నవ్వుకుంటూ మనకి తరుణోపాయం చూపుటకై వేచియున్నట్లనిపించు చున్నది. త్వరలోనే బాబాను దర్శించ గలందులకు వారి పాదముల చెంత చేరి జీవిత పరమార్థమును తెలుసుకొనగలందులకు ప్రార్థించు చున్నాను. ఈ ప్రాపంచిక సంబంధమయిన ఆలోచనలనే నిజమైన ఖైదు నుంచి బయటపడి బ్రహ్మతత్వ పరిజ్ఞానములో శాంతి స్వాతంత్రములను సాధించు మార్గమును వారు నాకు చూపుదురని దృఢముగా విశ్వసించుచూ వారి చిత్రపటము యెదుట గంటల తరబడి ప్రార్థనలో గడుపుచున్నాను.''

నిరంతరము బాబా, భక్తుల చెంతనే యున్నట్లు అనేక విచిత్ర అనుభవముల ద్వారా రుజువు చేయుచుందురు. చార్లెస్ పెన్ తన స్వంత విమానము నడుపుచున్నప్పుడు పెట్రోల్ టాంక్‌కు సంబంధించిన మరమ్మత్తు రాగా అతని ప్రక్కనే 'కాక్‌పిట్'లో ప్రత్యక్షమై లోపమెక్కడ వున్నదో దాని నెట్లు సరిచేయవలెనో చెప్పి అతని ప్రాణము కాపాడిరి. మెక్సికోలో ఇంద్రాదేవి నడుపుచున్న యోగాశ్రమము, సాయి నిలయము, వున్న అడవియందు దావానలము ప్రజ్వరిల్లినప్పుడు ఇంద్రాదేవి ప్రార్థన విని బాబా ఒక్క క్షణములో అగ్ని జ్వాలలను వెనుకకు మరలించి మనుష్యులను, ఆస్తిని కాపాడిరి.

బొంబాయిలో వున్న ధర్మక్షేత్రములో ఆధ్మాత్మిక సాధన క్రమమును తెలుపు, గడియారమువలె కనబడు, సాంకేతిక చిత్రమున్నది. దాని ప్రక్క బాబా నిలబడినపుడు ఒక ఫోటోగ్రాఫర్ ఫోటో తీసెను. ఆ ఫోటో కాపీ సంపాదించుట కొరకు అమెరికా నుండి భారతదేశము వచ్చిన కోవన్ దంపతులు ప్రయత్నించి విఫలులైరి. కాలిఫోర్నియా లోని వారి స్వగృహమునకు తిరిగి వెళ్ళిన తర్వాత ఒక రోజున వారి గోడ గడియారము ఉన్నట్లుండి గోడకు గ్రుద్దుకొనినట్లు ధన్‌మని శబ్దము చేసెను. ఆ వింత ధ్వనికి ఆశ్చర్యపడి గడియారము వద్దకు వెళ్ళి పరిశీలించగా, గడియారములో ఎట్టి లోపము లేదు, దాని ఉపరితలమున వారు కోరిన ఫోటో కాపీ లభించినది. వారి కోరిక తీరి



ఆనందించిరి. తమ ప్రార్థనా మందిరములోని బాబా పటము నుండి విభూతి రాలునట్లుగా చేయుమని ప్రార్థించిరి. విభూతికి బదులు పటముపై బాబా కంఠ సీమయందు తళతళ మెరయు మరకత మణిహారము ఏర్పడినది. ఇంద్రాదేవికి ముత్యాల జపమాలను, విభూతి అక్షయముగా వర్థిల్లు భరిణను బహుకరించి వారితో ప్రార్థనా పూర్వకముగా రోగపీడితులకు ఉపశమనము కలిగించమని ఆదేశించిరి. ఈ విధముగా అనేక రీతుల సాధకుల బాధలు బాపి, వ్యసనముల బారినుండి రక్షించి, వ్యాధులను కుదిర్చి, ఆధ్యాత్మిక ప్రబోధనల ద్వారా సంస్కరించి, మనశ్శాంతిని ప్రసాదించి ఉద్ధరించు చుందురు.

ఎంత వ్రాసిననూ తరగని ఈ భక్తుల అనుభవముల జాబితాను యింతటితో ఆపి, బాబాయొక్క అనంత కరుణను చవిజూచిన వారిలో ఒకరైన ప్రసిద్ధ రంగస్థల నటి (మిమిక్రి) అయిన జెర్రీ కధనముతో ఈ అధ్యాయమును ముగించెదను.

''ఒక సంవత్సరము నుండి బాబా సన్నిధానంలో వుంటున్నాను. బాబా వద్దకు వచ్చే వారిలో విశ్వాసము లేనివారు, రోగగ్రస్తులు, వ్యధిత హృదయులూ, ఎందరో వుంటారు. వారు బాబాను దర్శించేక భక్తి విశ్వాసములతో సంతోష సంతృప్తులతో మనశ్శాంతితో తిరిగి వెడుతూ వుంటారు. నాలో వచ్చిన మార్పు నాకే ఆశ్చర్యం కలిగిస్తున్నది. నా సంస్కారము లోని లోపములు అద్దమువలె కళ్ళకు కట్టినట్లు కనబడ్డాయి. అన్ని దుశ్చింతలకూ మూలమైన నాలోని అహంకారమును బాబా దగ్ధము చేసిరి. ఆత్మపరిశీలన ద్వారా క్షాళితమైన నా మనస్సు ఈనాడు తేలికయ్యె ఆనందమయ మైంది. పరమాత్ముని సన్నిధియందుంటవలన ప్రాపంచిక కోరికల పట్ల విరక్తి, అనిర్వచనీయమైన శాంతి నా మనస్సులో స్థిరపడినవి. బాబా కరుణకిరణ ప్రసార ప్రభావము అపారము. కించిత్ ప్రయత్నముతో మన హృదయ పాత్రలను శుభ్రము చేసుకొన్న యెడల వాటిని అనుగ్రహామృతముతో బాబా తప్పక నింపగలరు.''

# షిరిడి పాదములు

మహాశివరాత్రినాడు నిర్విరామముగా రాత్రియంతా ఆఖండ నామ సంకీర్తన జరిగింది. మరునాటి ఉదయమున బాబా తమ దివ్యోపన్యాసము నందు భజన, ఉపవాసము. జాగరణల యొక్క ప్రాశస్త్యమును గురించి వివరించిరి. భక్తులు ఉపవాసము విరమించుట కొరకు బాబా స్వయముగా ప్రసాదమును పంచిపెట్టిరి. దానితో ఆ శివరాత్రి ఉత్సవము సమాప్తి. కాని అక్కడ చేరిన 25000 మంది భక్తులు అంతటితో తృప్తిపడి వెళ్ళరు. బాబా దివ్య చరణారవిందములను స్పృశించు అవకాశము కొరకు, శివరాత్రి నాటి అభిషేకము సందర్భముగా హస్తచాలనముచే అద్భుతముగా సృష్టించిన పవిత్ర విభూతి ప్రసాదము కొరకు వేచియుందురు.

స్త్రీలు, పురుషులు వేరువేరుగా బారులు తీరి కూర్చొనియుండగా, మోమున చిరునగవు చిందులాడుచుండగా బాబా నెమ్మదిగా అడుగులలో అడుగులు వేయుచూ భక్తుల వరుసలలో ప్రవేశించి ఒక్కొక్కరికి ఒకటి రెండు విభూతి పొట్లములు ప్రసాదించెదరు. మధ్య మధ్య భక్తులు హస్తములలో ప్రదర్శించుచున్న పుస్తకములను, బాబా చిత్రములను, పెద్ద విభూతి పొట్లములను అనుగ్రహపూర్వకముగా తమ దివ్య హస్తములతో స్పృశించుచూ, ''సంతోషం'' ''అచ్చా'' ''వెరీహ్యాపీ'' అనే ప్రియవచన ములతో ఆనందము వెదజల్లుచూ, దర్శన స్పర్శన సంభాషణ భాగ్యము కలుగజేసి భక్తులను సంతృప్తిపరిచెదరు.

తమ భాషకాదు, దగ్గరకాదు, వ్యయ ప్రయాసలతో కూడిన రైలు ప్రయాణము, పుట్టపర్తిలో తృప్తికరమైన వసతి సౌకర్యములా లేవు: రోజులు తరబడి చెట్ల నీడనో, రేకుల షెడ్డులోనో గడపవలెను. ఎండా వానలతో ఇబ్బందులు. అయినా వేలకు వేలు నిత్యము అక్కడికి వచ్చెదరు. వారివైపు చూచి బాబా చిరునవ్వు నవ్వినా, వారి దివ్యహస్తములతో మిఠాయికాని, విభూతికాని ప్రసాదించినా చేతితో వారిని తట్టినా వారు పడిన శ్రమ సర్వమూ మరచి వారి కష్టములు ఫలించినట్లు ఆనందించెదరు.

తమకు ప్రత్యేకదర్శనమిచ్చి సంభాషించుదురను ఆశతో కొందరు అక్కడే వుండి నిత్యమూ నిలయము ముందు, ఏ క్షణమునైననూ బాబా రావచ్చునన్న ఆత్రముతో ఎదురుచూచుచూ, నిశ్శబ్దముగా కూర్చుందురు.

బాబా కరుణామయులు, దైహిక బాధలు బాపుటలో ఎక్కువ కాలము గడిపెదరు. మొట్టమొదట ప్రమాదకరమైన వ్యాధులతో బాధపడుచున్న వారికీ, దీర్ఘ రోగులకూ, కీళ్ళవ్యాధి, పోలియో, పక్షవాతములతో నడువలేక కుర్చీలలో కూర్చున్నవారికీ, వికలాంగు లకూ, వయోవృద్ధులకూ, మతిస్థిమితము లేనివారికీ, ప్రత్యేక దర్శనమిచ్చి ధైర్యము చెప్పి ప్రసాదమిచ్చెదరు. ఈ కార్యక్రమము మొదటి రెండు మూడు దినముల వరకూ



జరిపెదరు. తదుపరి ఇండ్లలో తొందరపనులున్నవారు వెళ్ళ వచ్చుననీ, ప్రత్యేక దర్శనము కొరకు వేచియుండనవసరము లేదనీ, వారందరికీ తమ ఆశీస్సులుండుననీ అభయమిచ్చి బాబా పంపివేయుదురు.

బాబా అందరితోనూ, వారి హృదయములలో నివసించుటచేత, వారు ఎక్కడ ఏ వృత్తిలో నిమగ్నులై వున్ననూ, బాబా ఆశీస్సులు వారికి సదా వుండును కనుక బాబాను విడిచి దూరముగా పోవుచున్నట్లు భావించనవసరము లేదు. అజ్ఞాతముగా వారి వెంటనే వుండి సర్వదా యోగక్షేమములను కనిపెట్టుచునే యుండును.

కాని భక్తులలో చాలామంది ప్రత్యేక దర్శనము కొరకు ఆర్తితో వేచియుందురు. అట్టివారిని బాబా ''వీరందరూ నావాళ్ళు; నాకోసం వచ్చిన వాళ్ళు'' అని ఆదరముతో చూచెదరు. అటు పిమ్మట ప్రతిరోజూ ఉదయమూ సాయంత్రమూ ఒక్కొక్కరినీ, లేక వారి వారి కుటుంబములనూ, లేక ఒకే పట్టణము నుండి కాని ఒకే రాష్ట్రము నుండి కాని వచ్చిన వారి సమూహములను పిలిచి ప్రత్యేకముగా వారితో సంభాషించి, వారి కోరికలు తీర్చి, సమస్యలకు పరిష్కారము సూచించి, సలహాలిచ్చి ఆశీర్వదించి ఆనందపరచి పంపెదరు. తిరిగి పోవునప్పుడు వారి ఆనందోత్సాహములు చెప్పనలవికాదు.

అట్లు ప్రత్యేకానుగ్రహ ప్రాప్తిపొంది భక్తులు గృహోన్ముఖులగు చుండగా అక్కడ వేచి యుండువారి సంఖ్య దినదినమునకు పలుచబడు చుండును. అట్లు పది పన్నెండు రోజులు గడిచిన తరువాత అక్కడ వున్న భక్తులందరినీ ఆశీర్వదించి బాబా బెంగళూరుకు పన్నెండుమైళ్ళ దూరమున వున్న వైట్‌ఫీల్డులోని బృందావన్‌కు వెళ్ళెదరు.

పుటపర్తిలోని విపరీతమైన వేసవి యెండల వేడిని భక్తులు భరించలేరని మార్చి ఏప్రిల్ మాసములు బాబా అక్కడే గడిపెదరు. సహజమైన సమశీతల వాతావరణములో చక్కని చిక్కని తరుచ్ఛాయలతో అందమైన వనము బృందావన్. అందొక సుందర మందిరము. అదే బాబా నిలయము, భక్తులిక్కడ కూడా చేరి ఒక పెద్ద చెట్టు నీడని కూర్చుని భజన చేసెదరు. ఎదురుచూచుచున్న భూతలముపై కరుణించి ఉదయించు సూర్యబింబమువలె భజన జరుపుచూ వేచియున్న భక్తుల ఆవేదన నెరిగిన బాబా మందిర ప్రవేశ ద్వారము గుండా వచ్చి దర్శన మిచ్చెదరు. భజన జరుగు స్థలమునకు వచ్చి కూర్చొనియున్న భక్తుల వరుసల మధ్య నెమ్మదిగా నడుచుచూ అందరిపైన అనుగ్రహ కిరణములను ప్రసరించెదరు. ఉదయము నుండి సాయంత్రము వరకు యిక్కడ కూడ భక్తుల బాధలు బాపుటకూ, వారిని సంస్కరించుటకూ, ఆధ్యాత్మిక సాధనలో ప్రవేశపెట్టి వారి జీవితములు సుఖశాంతి ప్రదములు చేయుటకూ వారి కాయమునూ, కాలమునూ బాబా వినియోగించెదరు.

1968 సం॥ మే 12వ తేదీన బొంబాయిలో ధర్మక్షేత్రము స్థాపించబడినది. ఇది సనాతన ధర్మములకు కేంద్రము. బౌద్ధ, జైన, ఇస్లాం, జొరాస్టర్, క్రైస్తవ మతములన్నియు

సనాతన ధర్మము నుండి ఉద్భవించినవే. ఇక్కడ అన్నిమతములు గౌరవించబడుట చేత ఆ మతస్థులందరి మధ్య సఖ్యత సుహృద్భావము యిక్కడ కనబడును. ధర్మక్షేత్రము బొంబాయివాసుల కొక వరప్రసాదము. ప్రతి సంవత్సరము మే నెలలో జరుగు వార్షికోత్సవమునకు బాబా విచ్చేసి ఆధ్యాత్మిక ప్రబోధనలతో వారిని తరింప జేసెదరు.

బాబా మే 8వ తేదీన బొంబాయి చేరిరి. ఇక 12వ తేదీ వరకూ, అందరి కన్నులూ బాబా మీదే; ఏ నోట విన్నా బాబా గురించే. ప్రతి ఉదయము, సాయంత్రము ధర్మక్షేత్రము నందు జరుగు భజనలో వేలాది మంది పాల్గొని ఆనందమున పరవశించెదరు. ఒకరోజున కాలేజి ప్రిన్సిపాళ్ళు, లెక్చరర్లతోనూ, ఒకరోజున రోటరీ, లయన్స్ క్లబ్బుల సభ్యులతోనూ మరొక సాయంత్రము సాధకులతోను ఆధ్యాత్మిక గోష్టి సలిపి వారందరికి జ్ఞానోదయము కలిగించిరి.

సాధకులకు జపమాల త్రిప్పు విధానము, అష్టోత్తర శతకము యొక్క ప్రాశస్త్యము, ''సోహం'' అని ఉచ్చరించుచూ చేయు నిరంతర జప ప్రభావము అనేకత్వములోని ఏకత్వమును గురించి ఉపదేశించిరి. అమూల్యమైన భారతీయ సంస్కృతిని విస్మరించి పాశ్చాత్యులను అనురించుట సిగ్గుచేటనీ, ఈ దురభ్యాసము అంటువ్యాధివలె వ్యాపించు చున్నదనియూ రోటరీ సభ్యులను హెచ్చరించిరి. 'కొందరు భారతీయులు అమెరికన్ కళ్ళతో చూచెదరు; అమెరికన్ చెవులతో వినెదరు; అమెరికన్ మెదడుతో ఆలోచించెదరు. పరువుపేర ఎరువు తెచ్చుకున్న పద్ధతులను అవలంబించి అభిమానించుట పరిపాటి అయినది; ఇది యెంత హాస్యాస్పదము;'' అని చెప్పిరి. చరిత్ర, శీతోష్ణస్థితి, వృక్షసంపద, భాష, పరిసర దేశస్తుల సంస్కృతి, వారితో సంబంధ బాంధవ్యములు మొదలయిన అంశముల ప్రాబల్యముపై ఆధారపడి ఒక జాతియొక్క సంస్కృతి రూపొందించబడును. విచక్షణారహితమైన అట్టి అభిలాష అనుకరణలు మన వ్యక్తిత్వమును సాంఘిక శాంతి సంక్షేమములనూ ధ్వంసము చేయునని బాబా ఉద్ఘాటించిరి. మహర్షులు భగవద్విశ్వాసమను పునాదిపైన భారతీయ సంస్కృతియను విశాల భవనము నిర్మించి, అందు శాంతి సంతృప్తి సౌభాగ్యములను పొందుబరిచిరనియూ, మతము యొక్క మూల సూత్రములను అధ్యయనము చేసి వాటిని తమ నిత్యజీవితములందు ఆచరణ రూపమున పోషించవలెననియూ, కాలేజి లెక్చరర్లకు బోధించిరి. ''ప్రాపంచిక భోగములకు దూరముగానూ, భగవదనుగ్రహమునకు దగ్గరగానూ తమ ప్రవర్తనను మలచుకుని శాంతియుత జీవనమునకు మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు తయారు కావలెను. అప్పుడే ఆ వృత్తికి వారు పాత్రులగుదురు'' అని వారికి చెప్పిరి.

ధర్మక్షేత్రము కేవలము ఇటుక సిమెంటుతో కట్టిన భవనము కాదు; అది జ్ఞాన వాహిని. సత్యదీప్ అనబడు ప్రార్థనా మందిరము యొక్క ముఖద్వారముపైన తళతళ మెరయుచున్న ఇత్తడి ఫలకముపై, ముఖ్యమైన మత చిహ్నములైన ప్రణవము, నక్షత్రము,



చంద్రవంక, శంఖము, చక్రము, జ్యోతి, శిలువ, శ్రీ కలశము చెక్కబడి యున్నవి. ''ప్రతి మతము సత్య పథమును జూపు జ్యోతి, ప్రతి మతము ధర్మమను క్షేత్రమున పరిభ్రమించును.'' అని ఈ చిహ్నములు సూచించును. ధర్మక్షేత్రము ద్వారము వద్దనే ఎదురగు సందేశమిది. లోపల ప్రవేశించగనే అనాదిగా మానవుడు ''తమసోమా జ్యోతిర్గమయ'' అని చేయు ప్రార్థనకు సమాధానమా అనినట్లు, ఎదురుగా వెలుగుచున్న జ్యోతి కనబడును. ఈ దీపమున కిరుప్రక్కలా రెండు కుడ్య చిత్రములున్నవి. ఒకవైపున పృధివ్యాపస్తే జోవాయురాకాశములను పంచభూతముల సంకేత చిత్రము మరొక వైపున సత్య, ధర్మ, శాంతి, ప్రేమ అహింసలను స్ఫురింపజేయు సంకేత చిత్రము. ప్రార్థనా మందిరములో గోడల మీద బాబా ఆదేశానుసారము, వారి సూచనలననుసరించి ఆత్మ రామాయణము, ఆత్మ భారతము గాథలు చిత్రించబడినవి. ఈ రెండు దివ్యగాథలలో యిమిడియున్న అంతరార్థమును గ్రహించుట ఆధ్యాత్మిక సాధనకు సోపానమని బాబా అనుచుందురు.

ధర్మక్షేత్ర వార్షికోత్సవ ప్రారంభ దినమున వారి దివ్యోపన్యాసములో ''మానవ శరీర మొక క్షేత్రము, దీనిని ధర్మక్షేత్రముగా పరివర్తన కావించవలెను. మానవుడేనాడు మోహము, అసూయ, డంబము మొదలయిన దుష్ట ప్రేరక శక్తులను విసర్జించునో, ఆనాడే అతని కాయము ధర్మక్షేత్రము కాగలదు'' అని బాబా పలికిరి.

15వ తేదీన విమానములో బాబా గుజరాత్ రాష్ట్రములో అత్యంత పెద్ద నగరమైన అహమదాబాద్ వెళ్ళిరి. హైకోర్టు ఛీఫ్ జస్టిస్ బాబాకు స్వాగత సమావేశమేర్పాటు చేసిన సందర్భమున రాష్ట్ర గవర్నరు, ముఖ్యమంత్రి తదితర మంత్రులు, పురప్రముఖులు వచ్చిరి. బాబా యొక్క విశ్వజన శ్రేయోదృక్పథమునూ, సర్వమత సామరస్యాభిమతమునూ గ్రహించు సదవకాశమును వారు సద్వినియోగము చేసుకొనిరి. నాటి బహిరంగ మహాసభలో ''ఆధ్యాత్మికోన్నతికి యోగత్యాగములు రెండు ముఖ్యమైన ఉపకరణములు; త్యాగముతో ఈ ప్రాపంచిక బంధన నిర్బంధన నుండి విముక్తుడయ్యెదవు, యోగముతో ఈ విశ్వమే తాను అయిన సచ్చితానంద పరబ్రహ్మములో లీనమయ్యెదవు'' అనిరి. ''మీ మీ ఆధ్యాత్మిక సాధనలలో మీరు విజయము పొందునట్లు ఆశీర్వదించుచున్నాను. ఇంత వరకూ ఎట్టి సాధనయూ లేకపోయిన యెడల ఇప్పుడైనను అత్యంత సులభమైన నామ స్మరణ ప్రారంభించుడు. తల్లిదండ్రులనూ, ఉపాధ్యాయులనూ, పెద్దలనూ, గౌరవించుడు, బీదలకు, రోగులకు, వికలాంగులకు, దుఃఖితులకు శక్తి వంచన లేకుండ సేవచేయుడు. మారువేషములలో భగవంతుడే వారి రూపములలో వచ్చినట్లు, వారికి చేయు సేవ భగవంతుని పాదపద్మముల కర్పించినట్లు భావించుడు''. అని బాబా బోధించిరి. అప్పటికే విరివిగా గుజరాత్ రాష్ట్రములో పల్లెపల్లెలలోనూ వ్యాపించిన సాయి భజన బాబా రాకతో మరింత అందరినీ ఆకర్షించినది.

14వ తేదీన వ్యవసాయ శాఖామాత్యులు, శ్రీ పి.కె. సావంత్‌గారి యింట జరిగిన విద్వన్మహాసభ సభ్యులగోష్ఠిలో సాధన స్వాధ్యయనములను గురించి సభ్యులు వ్యక్తపరచిన సందేహములను తీర్చిరి. ఆ సభలో గుజరాత్ వార్తాపత్రిక ''నవకాల్'' యొక్క సంపాదకుడు కూడా ఉండెను. ఆ రోజులలో ఆ పత్రికలో 'అద్భుత లీలలు' అనే శీర్షిక క్రింద అనేక వ్యాసములు ప్రచురించుచుండెను. ఆ అంశముపై బాబాను కొన్ని ప్రశ్నలడిగి సందేహ నివృత్తి చేసుకొనవలెనని అభిలషించు నాతనిని, మందస్మిత వదనముతో ''నీ ప్రశ్నలకు వెనుకనున్న కారణము నేనెరుగుదును'' అనుచూ అతని సంశయములు తీర్చెను.

లీలలు మహిమలను గురించి ఉదాహరణ ప్రమాణములతో సహా సమగ్రముగా బాబా విశదీకరించి చెప్పుటకు అనువైన ప్రశ్నలు వేసి శ్రీ పి.కె. సవంత్, నవకాల్ సంపాదకులు, శ్రీ భార్డె (గుజరాత్ శాసన సభాధ్యక్షులు) గార్లకు మనం కృతజ్ఞులమై వుండవలసిన వున్నది. తెలిసీ తెలియని సాధకులు మిడిమిడి జ్ఞానము కలిగిన సన్యాసులు ఈ మహిమలు చేయుట దైవ ద్రోహమని, వీటివల్ల దైవాగ్రహానికి, దైవము విధించే శిక్షకి గురికాక తప్పదని చెప్పుచుందురు బాబా మహిమలను గురించి అడుగగా, ఒక వ్యక్తి ''నా కిటువంటి మహిమలంటే అసహ్యము; అవి క్రీస్తు చేసినా కృష్ణుడు చేసినా, సాయిబాబా చేసినా సరే'' అని వ్రాసెను. ఇటువంటి అభిప్రాయము చాలా మందికి వుంటుంది. వీరి అభిప్రాయముతో ఏకీభవించని శుక మహర్షి వంటివారు అవివేకులన్న మాట; అతడు తన జాబులో యింకనూ యిట్లు వ్రాసెను. పరిపూర్ణత చెందిన మహనీయునికి విశ్వసంఘటనలను అదుపులో వుంచుకొనగలిగినంత శక్తి వుంటుంది. అయినను, దైవశాసనము నుల్లంఘించుట పాపమని భావించును.

ఈ ప్రకృతి శక్తుల నుల్లంఘించుట విషయములో, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు వైజ్ఞానిక సలహాదారునిగా పనిచేయుచున్న డాక్టరు భగవంతంగారు మద్రాసులో 1967 ఏప్రిల్‌లో ఒక సభలో మాట్లాడుతూ ''నిన్న బాబా కార్యకలాపములను గురించి ప్రొఫెసర్ గోకాక్, వారు వ్రాసిన పద్యములను చదివిరి. ''పెనుతుఫానువలె వత్తురు, వర్షపాతముగా అనుగ్రహమును కురిపింతురు'' అనుచూ వర్ణించిరి. అంతరకూ బాగానే వున్నది. చివరి పద్యములో 'బాబా భౌతిక రసాయనిక శాస్త్ర సూత్రములను ధిక్కరించెదరు' అని అన్నారు.

నేను ఫిజిక్స్ విద్యార్థిని, ఫిజిక్స్ నేర్చుకున్నాను, ఎన్నో సంవత్సరములు ప్రయోగములు జరిపేను. దశాబ్దముల తరబడి ప్రొఫెసర్‌గా వున్నాను. ఉన్నత విద్యలో పరిశోధనలు జరిపాను. కాని ఈ ప్రకృతి శాసనములను ధిక్కరించి తప్పించుకోగల మనిషినింత వరకూ ఈ భూమిమీద చూడలేదు'' అన్నారు.

బహుశా, మహిమలను అసహ్యించుకున్న వ్యక్తి ఈ ధోరణిలోనే ఆలోచించు



కొనుట వలన కాబోలు ''ప్రకృతి శక్తులతో చలగాటములాడిన దృష్టాంతరములు చరిత్రలో ఎన్నో వున్నవి. కాని ఆ దివ్యశాసనాన్ని ఉల్లంఘించినందుకు శిక్ష తప్పదు. శ్రీకృష్ణుడు శరాఘాతమునకు గురియై అసువులు బాసెను. క్రీస్తు చిత్రహింసలతో శిలువమీద మృతినొందెను'' అని కూడ అతడు వ్రాసెను. అందువలన ఆ వాక్యము ''సత్యసాయి బాబా! జాగ్రత్త'' అని హెచ్చరించుటకేమో!

డాక్టర్ భగవంతంగారు ఈ విషయములో ఏమి చెప్పిరో విందాము. ''బాబా భౌతిక విజ్ఞానశాస్త్ర సిద్ధాంతములను ఒకదాని వెనుక ఒకదానిని భేదిస్తూనే వున్నారు. ఈ సందర్భమున అవసరము కనుక వారి అనుమతితో ఒకటి రెండు సంఘటనలను చెప్పెదను. నా కండ్ల యెదురుగనే శస్త్ర చికిత్స చేసిరి. పూర్తి అయిన పిదప, నా ప్రక్కనే నిలబడిన నా కుమారునితో ''ఇక్కడ బ్యాండేజి క్లాత్ వున్నదా?'' అని ప్రశ్నించిరి. అప్పుడు నేను ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సుకి డైరెక్టరుగా వున్నాను. దానికి అనుబంధముగా వున్న ఆస్పత్రి ప్రక్కనే వున్నది. అందువలన నా కుమారుడు ''హాస్పిటల్‌కు వెళ్ళి రెండు నిమిషములలో తెచ్చెదను'' అనెను. అందుకు బాబా చిరునవ్వుతో ''రెండు నిమిషములా! అంత టైము లేదు'' అనుచూ చెయ్యి తెరచినంతనే బ్యాండేజి చుట్ట ప్రత్యక్షమయ్యెను. అప్పటికప్పుడు శస్త్ర చికిత్స చేయుట కుపక్రమించుచూ హస్తచాలనము చేత, కత్తి సూది మొదలయిన పరికరములు సృష్టించిన బాబాకు దూది బ్యాండేజి సృష్టించుట అసాధ్యమా!

''ప్రొఫసర్ గోకాక్‌గారి ఆంగ్ల భాషా పాండిత్యాన్ని విమర్శించినట్లు భావించకుండా వుండిన, నా ఉద్దేశ్యములో బాబా భౌతిక రసాయనిక శాస్త్ర సూత్రములను ధిక్కరించెదరు'' (Baba defies the laws of Physics and Chemistry) అనుట కంటే ''బాబా భౌతిక రసాయనిక శాస్త్ర సూత్రములకు అతీతులు'' (Baba Transcends the laws of Physics and Chemistry) అనియన్న సమంజసముగ నుండెడిది. నాకున్న శాస్త్ర జ్ఞాన అను వము దృష్ట్యా, తర్కశాస్త్ర దృష్ట్యా పరిశీలించి చూచిన బాబా నీవలె నావలె సాధారణ మానవుడంటే నేను అంగీకరించను. బాబా భౌతిక రసాయనిక శాస్త్ర నియమములను అధిగమించగల శక్తి సమన్వితులు. ఇది ఎలాగ సాధ్యమగును? అసలు సత్య మేమి యనిన బాబా మహిమాన్వితులు, సర్వశక్త్యతీతులు, దైవస్వరూపులు.''

''సైన్సు ఏ విధముగా అభివృద్ధి చెందుచున్నది అందరికీ తెలిసిన విషయమే. క్రొత్త వింత, పాత రోత అనునట్లుగా శాస్త్రజ్ఞులు ఎప్పటికప్పుడు క్రొత్త పరిశోధనల ఫలితముగా పాత సిద్ధాంతములను తుడిచి వేయుచుందురు. నేటి శాస్త్ర ప్రమాణములే రేపటికి చెల్లవు. పరిశోధించి కనిపెట్టిన ప్రతి అంశమునకు ఒక తాత్కాలికమైన సూత్రమును నిర్వచించెదరు. ఇంతవరకూ బాబాని గురించి గ్రహించిన అంశములను

సమన్వయము చేయు సిద్ధాంతము సైన్సు పరిధిలో లేదు. అందుచేత బాబా విజ్ఞాన శాస్త్ర ప్రమాణమున కతీతులు అను నూతన సిద్ధాంతమును నేను ప్రవేశపెట్టవచ్చును'' అని డ్బాక్టరు భగవంతం బాబా మహిమలను గురించి శాస్త్రపరముగా విశదీకరించిరి.

ఈ విషయము గూర్చి అఖిలభారత సత్యసాయి సేవాసంస్థల కార్యకర్తల సమావేశ సందర్భమున తమ ఉపన్యాసములో బాబా చెప్పినది యిది. ''కొందరు పెద్దల మాటలు మిమ్మల్ని కలవరపెట్టుచుండును. శ్రీకృష్ణుడు ప్రకృతికి అతీతమైన తన శక్తిని వినియోగించి ఎన్నో మహిమలు చేసెను. వారి ఉద్దేశ్యములో అట్టి మహిమలు చేయుట వలననే తుట్ట తుదకు వేటకాని బాణము దెబ్బ బాధకు మరణించెనని. అదే విధముగ జీసస్ కూడ మహిమలు చేయుట చేత శిలువపై దుర్మరణమునకు గురియైనట్లు భావించెదరు. నేను కూడ ప్రకృతి శక్తికి అతీతమైన కార్యములు చేయుచుంటిని కనుక నేను కూడ అట్టి బాధలకు గురియయ్యెదనని వారు భావించెదరు. దాని మూలమున అమాయకులు భయాందోళన చెందెదరు. ఈ వ్యర్థ ప్రేలాపనకు కారణము వారి మనోదౌర్భల్యము, అజ్ఞానము, అసూయ.''

1970వ సంవత్సరము క్రిస్టమస్ పండుగనాడు బొంబాయిలో ఇదే అంశముపై తమ ప్రసంగములో బాబా ''నామహిమలను నా దివ్యతత్వమును ఓర్వలేని వారెందరో వున్నారు. వారు నా చర్యలకు గారడి, కనికట్లు, హస్తలాఘవము అని పేర్లు పెట్టుదురు. వారి మాటలవలెనే వారి భావములూ, అనుభవమూ పరిమితమైనవి. ఇట్టి ప్రచారములతో నాకు కళంకము ఆపాదించగలరని వారి భ్రమ. నా దివ్యశక్తి యొక్క మహా వైభవమును గ్రహించుట అట్టి అల్పజ్ఞులకు, సంకుచిత హృదయులకు అనుభవహీనులకు సాధ్యము కాదు. ఇది సర్వశక్తి సమన్వితమైన దైవ శక్తి. సమస్త శక్తులూ నా అరచేతిలో వున్నవి. నా శరీరము తదితర శరీరములవలెనే తాత్కాలికమైనది; నా శక్తి ప్రభావములు శాశ్వతము, సర్వవ్యాప్తము, నిర్వికల్పము,'' అని ప్రకటించిరి.

గుజరాత్ శాసనసభాధ్యక్షుడు శ్రీ భార్డె నవకాల్ పత్రికా సంపాదకునితో కలసి బాబాని దర్శించుచుటకు కొన్ని వారములకు పూర్వము ఆ పత్రికలోనే ''బాబా మహిమలు చేయునప్పుడవి అత్యంత స్వేచ్ఛగా, యత్నరహితముగా, సహజముగా నుండి, అట్లు చేయగలవారిని నేను మున్నెన్నడూ చూచియుండలేదు. పండరిపురమున ఆలయములో రుక్మిణి విగ్రహమున కెదురుగా నిలబడి ''ఈ విగ్రహమునకు ముఖ్యమైన ఆభరణము లేదే!'' అనుచూ ఆ వాక్యము పూర్తికాక ముందే హస్తమున మంగళకరమైన కంఠాభరణమును సృష్టించిరి. ఇప్పటికినీ ఆ ఆభరణము రుక్మిణీ విగ్రహము నలంకరించియే యున్నది.''

శ్రీ భార్డె బాబాని ''ఇట్లు వస్తువులను సృష్టించు శక్తి అవ్యయమా?'' అని అడిగిరి. ''నా శక్తికి పరిమితి లేదు ఇది అవ్యయము. సముద్రమువలె అనంతము.



ఎవరైననూ, ఎక్కడున్ననూ ఏమి కావలెనన్ననూ కావలసినంత తీసుకొనవచ్చును'' అని బాబా అనిరి. గౌరవనీయులైన మంత్రి పి.కె. సావంత్‌గారు అది విని, ''అది అనంత మయిన యెడల మానవాళి యొక్క దారిద్ర్యము, దుఃఖము బాపుటకేల ఉపయోగించ రాదు!'' అని అడిగిరి.

దానికి బాబా చెప్పిన ఈ సమాధానము నవకాల్ పత్రికలో ప్రచురించబడినది ''లేమి వలన దుఃఖము దారిద్ర్యము కలుగునను కొనుచున్నారు. లౌకికమైన భోగభాగ్యము లన్నియు వున్న రాజులు ఆనందముగా నుండగలిగారా? వారికి సంతృప్తియున్నదా? వారికి మానసిక శాంతి యున్నదా? నేనిచ్చు వస్తువుల ప్రయోజనము జనులను భాగ్యవంతులను చేయుటకుగాదు; వారిలో భక్తి విశ్వాసములు తద్వారా మానసిక శాంతి పెంపొందించుటకు.''

అప్పుడు ఒక పెద్ద వ్యాపారస్తుడు ఒక డైమండ్ పొదిగిన ఉంగరము నాకు చూపి ''ఇది బాబా సృష్టించి అనుగ్రహపూర్వకముగా నా వేలుకు తొడిగిన ఉంగరము, కస్తూరీజీ, దీనిని చూచినప్పుడల్లా బాబా ఉంగరము నా వేలుకు తొడుగుచూ గూఢార్థముతో చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చుచుండును. ''ఇది డైమండ్ కాదు; ఇది ఒక ఉపదేశము; డైమండ్ అనగా డై-మండ్. నీ మనస్సులో వున్న రాగద్వేషాలు మరణించాలి. అప్పుడే నీకు శాంతి లభిస్తుంది.''

శ్రీ సవంత్‌తో బాబా యిలా అన్నారు: ''ఒక రోగి నా వద్దకు వచ్చును. నేను విభూతిని కాని మరేదైన వస్తువును కాని సృష్టించి అతనికిచ్చెదను. దాని దివ్యశక్తిని గ్రహించగలుగుతాడు. మనశ్శాంతి పొందుతాడు. వ్యాధి తగ్గుతుంది. ఆ విశ్వాసమువలన ఎన్నో సత్ఫలితములను పొందుతాడు. నా యెడల భక్తిగలవారికి మాత్రమే వీటిని యిచ్చెదనని అనుకొనకుడు; ఎవరి బాధలు తీరుటకు దైవచింతన అవసరమో అట్టి వారందరికీ యిచ్చెదను.''

నవకాల్ సంపాదకుడు ''ఈ అద్భుతములను జరుపు శక్తియేది?'' అని బాబాని అడిగెను. ''వీటిని అద్భుతములు, చమత్కారములు అనుచుందురు. అది తప్పు, ఇవి అద్భుతములూ కాదు, నమస్కారములందు కొనుటకు చేయు చమత్కారములూ కాదు. ఇది నాకు సహజం; నా వినోదం; నా ఆనందం. ఇది నిదర్శనే కాని ప్రదర్శన కాదు. మానవుల మనస్సులను భక్తి, విశ్వాసము, విచారణ, ఆత్మజ్ఞానము వైపు మళ్ళించుటకు సహాయపడు గుర్తులే నేనిచ్చు వస్తువులు, మనస్సులో సంకల్పము కలుగగానే ఆ వస్తువు తయారగును. కావలెననుకున్న క్షణములో నా చేతిలో యుండును; లేదా నేనెక్కడ ఏది జరుగవలెనని సంకల్పించెదనో అక్కడ అది ఆ క్షణములోనే జరుగును' అని బాబా సమాధానమిచ్చిరి.

నవకాల్ సంపాదకుడు ''ఈ 'మిరకిల్స్' ద్వారా ఎక్కడనో సిద్ధముగా నున్న వస్తువును ఇక్కడికి రప్పించెదరందురు, అట్లు రప్పించెదరా? అని బాబాని తిరిగి ప్రశ్నించెను.

ఈ ప్రశ్న వెయ్యాలని చాలామంది కుతూహలపడుచుందురు. భారతీయ విద్యాభవన్ స్థాపకులు, సుప్రసిద్ధ న్యాయవాది, రాజకీయవేత్త రచయిత అయిన డా॥ కె.యమ్.మున్షీ ఈ విధంగా వ్రాసిరి. ''నా కుడిచెయ్యి కొద్దిగా వొణుకుచుండుట బాబా గమనించిరి. నాకు పార్కిన్సన్ వ్యాధి ఉండుటచే చెయ్యి వొణుకుచుండును. వారు కుర్చీ నుండి లేచి నా వద్దకు వచ్చి నా చేతిని వారి చేతిలో తీసుకుని వారు చేతిలో సృష్టించిన విభూతిని తన వేళ్ళతో నా చేతిమీద మృదువుగా రుద్దిరి. తరువాత చెయ్యి త్రిప్పి క్షణములో ఒక ఉంగరమును సృష్టించి నా కుడిచేయి చిటికిన వ్రేలుకు వారే తొడిగిరి. అది కొలత తీసుకుని తయారుచేసినట్లు సరిగ్గా సరిపోయినది. ఆ క్షణములోనే నా చేతి వ్రేళ్ళలోని బిర్రు సడలి స్వాధీనములోనికి వచ్చినవి; కుడికాలు కుడిచెయ్యి వొణుకుట కూడ నిలచి పోయెను. మేము వారివద్ద శలవు తీసుకొను సమయమున మళ్ళీ హస్తచాలనముతో విభూతి సృష్టించి నా కుడిచేతి మీద రుద్దిరి. ఒక ఉంగరమును 'ఎపోర్ట్' (అదృశ్యచలనము) శక్తిద్వారా తెప్పించుట నా కాశ్చర్యము కలిగించలేదు. ('ఎ పోర్ట్' అనగా ఒక చోట సిద్ధముగా వున్న వస్తువును అదృశ్యముగా మరొక చోటుకు తెప్పించుట) కాని బాబా నిత్యము సృష్టించు విభూతి ఒక పౌను వుండును. దీనిని ఎక్కడనో భద్రపరచి అడుగడుగునా అక్కడ నుండి రప్పించి యిచ్చుట సాధ్యము కాదు. అందుచేత యిది ఎపోర్ట్ కాదు... అంతకంటే ప్రబలమైన శక్తి.''

నిత్యము ముఖ్యముగ పర్వదినములలోనూ, ప్రత్యేక కార్యక్రమములందూ బాబా సృష్టించి యిచ్చు విభూతి పౌనుకంటే ఎక్కువే వుండునన్న విషయచము డా॥ మున్షీకి తెలియదు. అంతేకాదు; దాని మృదుత్వము మెరుముగా వుండుట మొదలు అతి సున్నితముగా నుండును. దాని రంగు తెలుపు మొదలు బూడిదరంగు వరకు వుండును, రుచి చేదుగా తియ్యగా రకరకములుగా వుండును; దాని సువాసన కూడ గులాబి, కర్పూరం, అయోడిన్ మొదలయిన పరిమళములు కలిగివుండును. ఇన్ని రకములైన విభూతిని ఒకచోట భద్రపరచి కావలసి వచ్చినప్పుడల్లా అదృశ్యముగా రప్పించుట సాధ్యమా!

అసలు ఈ 'ఎ పోర్ట్' అంటే ఏమిటి? దుర్గ్రాహ్యము; ఆ మాటతో ఈ మహిమను గూర్చి సంపూర్తిగా తెలుసుకున్నట్లు కొందరు తృప్తిపడవచ్చు. హేవార్డ్ మార్పెట్ అనునతడు రచించిన "Sai Baba the Man of Miracles" అను పుస్తకములో ఇట్లు వ్రాసెను. 'ఎ పోర్ట్' అనగా ఒక స్థలములో వున్న ఒక వస్తువును అక్కడ అదృశ్యము చేసి, ఆ అదృశ్య స్థితిలో దానిని మరొక స్థలమునకు రప్పించి తిరిగి దృశ్య



రూపమునకు తెచ్చుట అని భావించవచ్చును'' చెప్పుట చాలా సులభం! ఏ మాత్రమయినా అర్థము కాగలదా!

కావలసిన వస్తువు ఎక్కడో వున్నదో కనుగొని, దానిని అక్కడ అదృశ్యముచేసి, అదృశ్యముగానే ఇంత దూరము రప్పించి, దానిని తిరిగి దృశ్యరూపంలోకి తెచ్చి - ఈ తతంగమంతా రెప్పపాటు కాలంలో జరుపుటకంటే అప్పటికప్పుడు సృష్టించుకొనుటయే సులభమని నా వుద్దేశ్యము.

ఈ ప్రశ్నకు బాబా చెప్పిన సమాధానము చూడుడు: ''ఆ వస్తువులన్నియు క్రొత్తగా నాచేత సృష్టించబడినవి, తీసుకువచ్చుట యనగా అవి యెక్కడో ఒక చోటున వుండి అక్కడ నుండి రావలెను. అదే నిజమయినచో నేనెక్కడనూ లభించని వస్తువులను కూడ యిచ్చుచున్నాను, నేను సంకల్పించిన తక్షణమే అవి సృష్టించబడును, ఈ శక్తిని అవగాహన చేసుకొనుట అసాధ్యము.''

ఎక్కడా లేనివి దొరకనివి ఎన్నో పర్యాయములు క్రొత్త వస్తువులు సృష్టించి యిచ్చుట నేనెరుగుదును. శ్రీరామకృష్ణ పరమహంస చిత్రంలో నాలుగు మూలలందూ, మధ్యనూ బాబా చిత్రపటములున్న ఫోటోను ఒకసారి సృష్టించిరి. ఉత్తర కర్ణాటకమునకు చెందిన పంత్‌జీ డ్క్టర్ గోకాక్ తండ్రికీ తాతకీగురువు. డ్క్టర్ గోకాక్ యింట పూజా గృహ మందు ఆ పంత్‌జీ పాత ఫోటోను చూచి హస్తచాలనముచేత చిన్న సైజులో క్రొత్త ఫోటో సృష్టించి యిచ్చిరి.

నవకాల్ పత్రికా సంపాదకుడు బాబాని అడిగిన మరికొన్ని ప్రశ్నలనూ వాటికి, వారిచ్చిన సమాధానములనూ యీ క్రింద పొందుపరచితిని.

''ఎప్పటినుంచి ఈ దివ్యశక్తులను ప్రకటించుట ప్రారంభించిరి'' అని అతడు ప్రశ్నించెను.

''నా బాల్యము నుండి''

''అంటే''

''నేను బడికి వెళ్ళే రోజులలో నా చుట్టూ చేరిన పిల్లలకు, చాక్లెట్లు, గోళికాయలూ మొదలయినవి సృష్టించి యిచ్చెడివాడిని.''

''తాము ఏ వయస్సు నుండి ఈ దివ్య శక్తులను పొందియుండిరి?''

''నేను జన్మించి నప్పటినుండి... అంతేకాదు నేను జన్మించక పూర్వము నుండి'' అనుచు బాబా మందహాసము చేసిరి.

అవును. పుట్టపర్తిలో ఈ క్షత్రియ కుటుంబమున అవతరించుటకు పూర్వము

షిర్డిసాయిబాబాగాను, అంతకు పూర్వము శ్రీకృష్ణుడుగాను అవతరించినది వారేకదా! అయితే బాబా సమాధానములోని అంతరార్థము ఆ సంపాదకునికి బోధపడలేదు.

'అంటే....' తిరిగి అతడు ప్రశ్నించబోయెను.

'అంటే జన్మించుటకు నేనే నిశ్చయించుకున్నాను. నా తల్లి యెవరో నేనే నిర్ణయించుకున్నాను. మానవ మాత్రులు తమ భార్యలను, భర్తలను మాత్రమే ఏఱుకొనగలరు. రామావతారములోనూ, కృష్ణావతారములోనూ వారు తల్లులను ఏఱుకొనలేదా. అప్పుడు కూడ వారు జన్మించుటకు నిర్ణయించుటలోని లక్ష్యము అందరినీ ప్రేమించుచు, అందరి యందూ ప్రేమ పెంపొందించుచు, తద్వారా ధర్మమార్గమున నడిపించుటే, నా చర్యలు నా దివ్యశక్తికి నిదర్శనములు. నా దివ్యత్వమునకు గుర్తులు, సంకేతములు. నేను ప్రేమపూర్వకముగా వస్తువులను ప్రసాదించెదను. నా ప్రేమ అవ్యయము. నాకు ఎట్టి కోరికలూ లేవు. నా మాట ప్రేమ; నా బాట ప్రేమ; నేనే ప్రేమ.''

బృందావన్‌కు తిరిగి వచ్చి బెంగళూరు విశ్వవిద్యాలయమునకు అనుబంధించబడిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి కార్యకలాపములలో బాబా నిమగ్నులైరి. 1969 సం॥ జూన్ 9వ తేదీన ఆ కాలేజి ప్రారంభించబడినది. 18వ తేదీన మైసూరు ప్రాంతమందలి సుప్రసిద్ధ కర్నాటక కవుల సమ్మేళనము బృందావన్‌లో ఏర్పాటయినది. హృదయాలను కదిలించే విషాద గాథలను తన కవిత్వమందు ప్రతిబింబించిన డాక్టరు డి.ఆర్. బెంద్రి కూడ ఆ సమ్మేళనములో పాల్గొనిరి. ఆయన వ్రాసిన పద్యములో వైట్ ఫీల్డ్‌నకు పాండురంగ వైట్=పాండు; ఫీల్డ్=రంగ) అను అర్థమును వాడి ప్రేక్షకులను ముగ్ధులను చేసిరి. డా॥ గోకాక్ కన్నడమందూ ఆంగ్ల భాషయందూ అసమాన పాండిత్యమున్న కవి యగుటచేత, వారిచేత కూడ పద్యములు చదివించిరి. సాంప్రదాయక కవితలో సిద్ధ హస్తులైన డా॥ ఆర్. యస్. ముగలి, బౌద్ధ, జైన మతములను చక్కగా అధ్యయనము చేయుటయేగాక మృదువైన కవిత్వమందు ఆరితేరిన ప్రొఫెసర్ రాజరత్నంగారు, అరవిందుని యోగవిధానములో నిధియైన ప్రొఫెసర్ ఆర్.జి.కులకర్ణి, సుప్రసిద్ధ కర్ణాటక భక్తుల అడుగుజాడలలో నడచుచు, గాంధి, టాగూర్ హృదయస్పందనలను ఆకళించుకొనిన రచయిత డా॥జి. యస్. శివరుద్రప్ప. ప్రకృతి సౌందర్యోపాసనతో తన్మయుడై, స్వతంత్ర భావములతో గంభీరమైన రచన చేసిన మధురకవి శ్రీ కె. ఆర్. శివప్ప మొదలగు వారందరూ పాల్గొనిరి. వారందరూ వారి వారి కవితలను వినిపించిన పిమ్మట శివతాండవ నృత్యము మీద తాము స్వయముగ రచించిన గేయమును బాబా గానము చేసిరి. లయబద్ధమైన ఆ పదముల పొందికలో మృదు మధుర శబ్ద తరంగములలో కవితయే నృత్యము చేయుచూ అభినయము ద్వారా లోకములను ఆకాశమున ఊగించు ఆ దివ్య లీలలను వర్ణించుచున్నదా యనిపించెను. భగవంతుని 'కవినాంకవీ' అని వేదములు వర్ణించినవి. కవులలో కవియే బాబా. జూన్ ఆఖరి వారములో బాబా మద్రాసు వెళ్ళిరి.



వేలాది భక్తులచ్చట బాబా దివ్యోపన్యాసామృతమును గ్రోలిరి.

బాబా బాల్యమందు మద్రాసులో లోకనాథ ముదలియార్ అనునాతని రోగశయ్య ప్రక్కన కనబడి, చేతబడి వలన కలిగిన మనోవ్యాధిని నయము చేసిరి. అప్పుడాతడు ''మీరు భగవంతుడు'' అనుచు బాబా పాదములు పట్టుకొనెను. తరువాత అతడు గిండీలో బాబాకొక దేవాలయము కట్ట సంకల్పించగా, బాబా స్వప్నమున దర్శనమిచ్చి ఆ దేవాలయమున తమ పూర్వ శరీరమైన షిర్డీబాబా విగ్రహమును ప్రతిష్ఠించమని ఆదేశించిరి. అతనికి కలలో యిచ్చిన ఆదేశమును పునరుద్ఘాటించుచూ బాబా జాబు వ్రాసిరి. ఆ ఆలయము పూర్తయిన పిదప 1948వ సం॥లో బాబా స్వయముగ ఆ విగ్రహమును ప్రతిష్ఠించిరి. 1968వ సం॥లో ఆ దేవాలయమును సందర్శించిన హోవార్డ్ మర్ఫెట్, అందలి విగ్రహమును గూర్చి ''రోమ్ నగరములోని చిన్న చర్చిలో మైఖేల్ ఏంజిలో పాలరాతితో చెక్కిన మోజెస్ విగ్రహమువలె నున్నది. చూచిన వెంటనే ఆ శిలా విగ్రహము సజీవమైనట్లు భ్రాంతి గొల్పినది'' అని వ్రాసెను.

విగ్రహము ప్రతిష్ఠించిన రోజున మొదలియార్ కుటుంబము వారు బాబా పాదములు కడిగి పుష్పములతో పూజించు అదృష్టమునకు నోచుకొనిరి. బాబా పాద ముద్రలు గైకొనుటకు వారు పట్టువస్త్రము సిద్ధము చేసుకుని అందులకు బాబా ఆజ్ఞ కోరిరి. బాబా అంగీకరించిన పిమ్మట బాబా పాదములకు పసుపుతో కూడిన చందనపు ముద్ద పూసినారు. బాబా లేచి పట్టువస్త్రముపై కాళ్ళు పెట్టుటకు ముందు ''నా పాదము లెందుకు? ఈనాడు పాత బాబా విగ్రహమును ప్రతిష్ఠించితిని కదా. అందుచేత ఆ పాతబాబా పాధముద్రలే యిచ్చెదను'' అనుచూ పట్టువస్త్రము మీద నిలబడెను. వస్త్రముపై నుండి పాదములు తీయగనే ఏర్పడిన ముద్రలు బాల బాబా యొక్క సుకుమార పాదములు కావు. అంతకు 32 సంవత్సరముల పూర్వము షిర్డీ వీధులలో నడచిన బాగా పొడవు వెడల్పు వున్న భారమైన పాదములవి.

ఆ ఆలయమున ఏర్పాటు చేసిన బహిరంగసభలో బాబా ప్రసంగించుచూ ''నా షిర్డీ రూపమును ఈ దేవాలయములో 21 సంవత్సరముల క్రితము ప్రతిష్ఠించినాను. భగవంతునికి పర్యాయపదము విష్ణువు. విష్ణువు అనగా సర్వత్ర, సర్వకాలములందు ఉండువాడు అని అర్థము. ఒక దేవుని విగ్రహము చూపి ఇది విష్ణువు అనినప్పుడు దీనిని మూఢవిశ్వాసమని కొందరు పరిహసించెదరు. భగవంతుడను అమృతమును గ్రోలుటకు ఒక చెంచాకాని, కప్పుకాని అవసరము కదా! ఆ దివ్య ఆనందము అనుభవించుటకు విగ్రహ మొక సాధనము; ఒక పాత్ర. ఆ పాత్ర ఏ సైజులో ఏ ఆకారములో వున్ననూ, దేనితో చేయబడిననూ అది ఆనందమునకు ఆధారము మాత్రమే. రసోవైసః. భగవంతుడు రసస్వరూపుడు అతడు బలము విశ్వాసము ఆనందము ప్రసాదించును. భగవంతుని అనుగ్రహమును నటరాజు, దుర్గ, గణేశ, లింగము, కృష్ణ

క్రీస్తు, సాయిబాబా అను ఏ పాత్రతోనైనా గ్రోలవచ్చును. మీలో కొందరు యీ విగ్రహ రూపమునున్న పాత్రను అభిలషించినందును ఆ విగ్రహమునే ప్రతిష్ఠించితిని. షిర్డీలోని ద్వారకామాయి మసీదులో కూర్చుని ఉపదేశించిన సాయి రూపమిది'' అని ప్రవచించిరి.

జూలై 29వ తేదీన గురుపూర్ణిమ సందర్భములో భారతదేశములోనేకాక తదితర దేశములలోని సత్యసాయి సేవా సమితులలోని భక్తులకు సందేశ పూర్వకముగా బాబా ప్రహ్లాదుని ప్రార్థన నుదహరించుచూ వ్రాసిరి. ''ఓ భగవంతుడా! మీ పాదపద్మములను సేవించు భాగ్యము ననుగ్రహింపుము. నీ పాద పద్మములను పూజించువారి సహచర్యమును, సమస్త జీవరాసులందలి నిశ్చలమైన ప్రేమను, దయను ప్రసాదించుము. ఈ ప్రార్థన యొక్క ప్రాశస్త్యమును వివరించి "Start the day with love; live the day with love; fill the day with love; spend the day with love, and end the day with love. This is the way to God" అని ఉపదేశించిరి. ఆ సాయంత్రము ప్రశాంతి నిలయమందు తమ దివ్యోపన్యాసములో మతముల ఆదర్శములను సంస్థలకు పరిమితము చేసి సంకుచిత దృష్టితో సమాజమును విభజించకుడు; విశాల దృష్టితో ''అన్ని మతముల ఆదర్శములను గౌరవించుడు. It is good to be born in a Church but it is not good to die in it. మానవుడు తన మనస్సు తార్కిక శక్తుల పరిధుల నధిగమించిన విశాలమైన అనంతమైన పరమాత్మను చేరు జీవనయాత్ర సాగించవలెను'' అని ప్రభోదించిరి.

శ్రీకృష్ణ జయంతి సాయికృష్ణుని సమక్షమున ప్రశాంతి నిలయములో వైభవోపేతముగా జరిగినది. ధర్మమును పునరుద్ధరించుటకై బాబా అవతరించిరి. ఆ లక్ష్యమునేక విధముల సాధించుచున్నారు. బాబా అనుక్షణమూ మానవుల ప్రవర్తననూ దృక్పథమునూ సంస్కరించి ధర్మపథమున ప్రవేశపెట్టుచున్నారు, అవతారములలో శ్రీకృష్ణుని గురించి అనేక దురభిప్రాయములున్నవి. అవతార తత్వము యొక్క దివ్యత్వమును విస్మరించి, సత్యమును కాలదన్ని, సామాన్య మానవుని అభిరుచికి తగినట్లు కామవాంఛను రెచ్చగొట్టు పచ్చి శృంగారముతో రచనలు చేసిన కవులే ఈ అనర్థమునకు కారణమని అవకాశము చిక్కినప్పుడల్లా పండితులకు, కవులకు, సాధకులకు బాబా గుచ్చి గుచ్చి మరీ చెప్పుచుందురు. నేటి నవయువకుల హృదయముల నుండి కృష్ణుని పట్ల అసభ్యపు ఆలోచనలను పారద్రోలి గోకులములోని గొల్లభామల నిర్మల హృదయములలోవలె పవిత్ర భావములతో నింపవలెనని బాబా ఉద్దేశ్యము. ''కృష్ణుడు మీలోనున్నాడు. అతడు సర్వ భూతాంతరాత్మ. అతడు లేని యెడల వ్యక్తిగా నీకు మనుగడ యెక్కడిది?'' అని అడిగిరి. అంతేకాదు ''మీలో శక్తి, ప్రేమ, ఆనందం, ఉత్సాహము, దయ రూపములలో వున్నాడు. ఇతిహాసములలో వుండు అంతరార్థములను తెలుసుకొనుటకు కృష్ణ తత్వమును లోతుగా పరిశీలించవలెను. బృందావనము జీవనవనము; అతడు కాచిన గోవులే జీవులు. గోకులమనగా జీవుల సమూహము.



అన్ని జీవులలోనూ వుండి హృదయములను సద్భావములు సత్సంకల్పములతో పవిత్రము చేయు దివ్యశక్తియే కృష్ణుడు. గోవుల కాపరి గోవులు అటుయిటు పారిపోకుండ ఒక త్రోవకు తెచ్చి గమ్యమును చేర్చును. అట్లే కృష్ణుడు జీవులను ధర్మమార్గమును నడిపించి దీవించి గమ్యము చేర్చెను'' అని బాబా కృష్ణ తత్వమును గూర్చి తెలిపెను. వేదములలో భగవత్తత్వమును నీలమేఘములపై మిరమిట్లు గొల్పు గీతయని వర్ణించిరి. ఈ గీతయే జ్ఞానము, ప్రకాశము, చైతన్యము, సౌందర్య స్రవంతులకాధారము.

తాను సర్వభూతాంతరాత్మయని బాబా ఎన్నో పర్యాయములు ప్రకటించిరి. శ్రీకృష్ణ జయంతి ఉత్సవ సందర్భమున ఆయానందోత్సాహములలో సాయి రూపమున కృష్ణ తత్వమును సందర్శించుట అందరికీ మరపురాని దివ్యానుభూతి.

న్యూయార్కులో వున్న హిల్డాచార్ల్టన్, తన అనుభూతి నీ విధముగా వ్యక్తపరచినది.

వీచు పెనుగాలులు నీ పెదవుల,
ఊచు తరువుల నాట్యాలయముల
ఆ తరువుల ప్రాణంబు నీవుకావె
ఆ గాలుల ప్రణవంబు నీవుకావె

ఆద్యంతంబులు నీవు; ఆదికి యాది నీవు
ఆద్యంతంబుల దేలు నిరంతర జీవినీవు.
ప్రేమవు నీవు. జ్యోతివి నీవు
నేను నీ దానను; నేనే నీవు.
(ఆంగ్లము నుండి అనువాదము)

# ఆనందసీమ

సచ్చిదానంద స్వరూపులయిన బాబాయొక్క దివ్యత్వమును తిలకించి, వారు విశ్వప్రేమ బ్రహ్మతత్వమును గూర్చి చేసిన ప్రబోధనలను వినిన ఆధ్యాత్మిక జిజ్ఞాసులు అదృష్టవంతులు. సర్వసృష్టిని పరివేష్టించిన దివ్యచైతన్యముతో వారి ప్రవచనముల నాచరణలో పెట్టువారు నిజముగ ధన్యులు. ఈ అవతారమునకు సమకాలికులై జన్మించుట వారి జన్మాంతర సుకృతముగా వారు భావించెదరు. అట్టివారెందరో బాబా జన్మదినోత్సవ మును తమ జన్మదినోత్సవముగా భావించెదరు. 1968 సం॥లో చార్లెస్‌పెన్ ''మన ప్రభువు యొక్క జన్మదినం. ఆనంద పర్వదినం. 1965 సం॥లో నేను తొలిసారిగా బాబా సన్నిధి చేరితిని. అందువలన అదే నా జన్మ సంవత్సరము. ఇప్పుడు నా వయస్సు మూడు సంవత్సరములు'' అని వ్రాసెను.

43వ జన్మదినోత్సవము దేశమంతటా సేవాసంస్థలు వైభవోపేతముగా జరుపుకున్నవి. కాకినాడలో 43 దినములు నిత్యనామ సంకీర్తన కార్యక్రమము జరిగినది. అనేక స్థలములలో అనాథశరణాలయములందూ కారాగారములందూ, వికలాంగుల శరణాలయములందూ నామ సంకీర్తన, దరిద్రనారాయణులకు అన్న వస్త్రదానములు ఏర్పాటు చేసిరి. బాలబాలికలకు నృత్య, నాటక, సంగీత, గీతా పఠన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రోత్సహించిరి. అనేక పట్టణములలో ఆ దినమున క్రొత్త సేవాదళ సంస్థలు, అధ్యయన కేంద్రములు, ఆధ్యాత్మిక గ్రంథాలయములు, ప్రార్థనా మందిరములు, వేద, సంస్కృత అధ్యయన తరగతులు, చికిత్సా కేంద్రములు ప్రారంభించిరి. దృశ్యాదృశ్యముగ అనేక రీతులుగా బాబా ఆయా ప్రదేశములందు జరుగు కార్యక్రమములందు పాల్గొని భక్తుల నాశీర్వదించిరి.

ప్రశాంతి నిలయములో 21, 22వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ సత్యసాయి సేవా సంస్థల కార్యకర్తల సమావేశము జరిగినది. ఆ సందర్భములో ''ప్రతివ్యక్తి యందు ఆధార భూతములైన మూడు శక్తులున్నవి. మొదటిది వ్యక్తిత్వము; రెండవది భగవంతునికి తానొక ఆలయముగా నుండుట. మూడవది ఆత్మస్వరూపమున తానే దైవమైయుండుట. హనుమంతుడొక సందర్భమున రామునితో యిట్లనెను. ''ఈ శరీరమే నేను అని భావించినపుడు నీవు నా ప్రభువు. నీవు నాయందే వున్నావని భావించినపుడు నీవు బింబము. నేను ప్రతిబింబము; నేను ఆత్మనను భావన కలిగినపుడు నేనే నీవు, నీవే నేను.'' దైవము సత్యపథమున పయనించును. దైవము యొక్క నీడ అయిన మానవుడు, దైవము పాదములను, గట్టిగ పట్టుకొనిన యెడల కష్టనష్టములు దాటి సురక్షితముగ గమ్యము చేరును. మన సేవాసంస్థలు మనస్సును పరిశుద్ధపరచునట్టి కర్మాగారములు. మీరు పాల్గొనునట్టి ధ్యానము, భజన, సత్సంగము, అన్నవస్త్రదానములు, పూజ మొదలయిన ఏ కార్యక్రమమైననూ లక్ష్యము మాత్రము ఒక్కటే - మీ హృదయముల



నుండి అహంకారము, దురాశ, ద్వేషము, అసూయలను మాలిన్యమును తుడిచి వేసి వాటి స్థానే ప్రేమను నింపుట, అదే సాయి భక్తుల లక్షణము'' అని ఉపదేశించిరి.

నాటి ఉదయము పతాకావిష్కరణకు ముందుగా బాబా తమ దివ్యోపన్యాసములో బాబాను గూర్చి మాట్లాడినప్పుడు, స్తుతించునప్పుడు భక్తులు చూపు మూర్ఖపు ఆవేశమునూ, చేయు ఆర్భాట ప్రదర్శనలను ఖండించిరి. తరువాత బాబాకి భక్తులకు మధ్య నుండు పరస్పరానుబంధము నిట్లు విపులీకరించిరి. ''అన్ని రూపములు నావే. ఇతర రూపనామములను పూజించువారిని వారి విశ్వాసములకు దూరము చేసి నావైపు మరల్చుట నా అభిమతము కాదు. లీలలు మహిమలు చూపి వారు నాదరికే చేరునట్లుగా ఆకర్షించుచున్నాని మీరు భావించవచ్చు. ఇవన్నీ కీర్తిప్రతిష్టల కొరకు చేయు ప్రదర్శనలు కాదు; భూమిని ఆకాశముగను ఆకాశమును భూమిగను మార్చగల దివ్యశక్తికి నిదర్శనము. మీకు యిష్టమైనా లేక పోయినా నేను మీవాడినే. మీరు నన్ను ద్వేషించినా, దూరముగా తొలగిపోయినా మీరు నావారలే. కనుక నా ప్రేమ, నా కరుణ, నా శక్తి ప్రదర్శనలతో మిమ్మాకర్షించవలసిన అవసరము నాకేమున్నది. నేను మీలో వున్నాను. మీరు నాలో వున్నారు. మన మధ్య భేదము లేదు. దూరము లేదు. మీరు మీ స్వగృహమునకు వచ్చిరి. ఇది మీ యిల్లు, నాది కాదు. మీ హృదయమే నా యిల్లు.''

21వ తేదీన సత్యసాయి సంస్థల సమావేశముతో ప్రారంభమయిన జన్మదినోత్సవము 27వ తేదీ వరకు జరుగుచునే యున్నది. డా॥ గోకాక్ ''సత్యం శివం సుందరం అంటేనే బాబా. ఆ తత్వముల పరాకాష్ట బాబాలో తప్ప యింకెక్కడ చూడగలము. వారు ప్రేమ స్వరూపులు. వారి దివ్యతత్వమును కని విని ఎరుగని వారిని కూడా ప్రేమించి లాలించి వారి బాధలు బాపెదరు. నేటి అల్లకల్లోల పరిస్థితులను అదుపులోనికి తెచ్చి నూతన సామాజిక వ్యవస్థను స్థాపించుటకు మానవ రూపమును ధరించిన పరమాత్మయే బాబా. మానవాళియొక్క బరువు బాధ్యతలను తమ భుజస్కంధములపై వేసుకున్నారు'' అని అవతార తత్వమును వర్ణించిరి.

23వ తేదీన జన్మదినోత్సవ సందర్భముగా నాటి ఉదయమున, వేదాధ్యయనము చేయు విద్యార్థులూ, భజన చేయుచు భక్తులూ మంగళ వాద్యములూ, పండితులూ, పురోహితులూ, ముందు సర్వాలంకార భూషితమై, తన జన్మ తరించినదన్న ఆనందమున మెరయు కండ్లతో ఏనుగు సాయిగీత, నెమ్మదిగా అడుగులు వేయుచు వెంటరాగా నిలయము నుండి విశాలమై అలంకార శోభితమై మయసభయా యనిపించు సభాస్థలికి బాబా ఊరేగింపుతో వచ్చిరి. ఈ అవతారమును లోకమునకు ప్రసాదించిన మహాసాధ్వి అయిన మాతృమూర్తి ఈశ్వరాంబ బాబా ప్రక్కనే నడచి వచ్చుచుండిరి.

ఉదయపు సమావేశములో ఆడిటోరియంలో కూర్చున్న 20 వేల మంది ప్రేక్షకులు దర్శించిన ఒక అద్భుత సంఘటన బాబా యొక్క అనుపమానమైన ప్రేమకు తార్కాణం.

బాబా వేదిక మీదకు వచ్చి రజిత సింహాసనము నధిష్టించగానే ఆ మహా జనసందోహం చేసిన హర్షనాదాలతో ఆడిటోరియం మారు మ్రోగింది. ప్రతి జన్మదినోత్స వములోనూ కొందరు భక్తులకు ముఖ్యముగా ఆశ్రమములో వుండు వృద్ధ దంపతులకు బాబా శిరముపై సుగంధ తైలము ప్రోక్షించు భాగ్యము కలిగించెదరు. సాంప్రదాయము ననుసరించి యుగయుగములా మానవాళి కృతజ్ఞతకు పాత్రురాలైన మాతృశ్రీ ఈశ్వరాంబ ప్రప్రథమముగా పుష్పము తైలమున ముంచి, లాంఛనప్రాయముగా ఒకటి రెండు చుక్కలు శిరమున రాల్చి మునివేళ్ళతో బాబా శిరమున రుద్దిరి. తరువాత మిగిలిన భక్తులు ఆమెను అనుసరించిరి. పర్షియన్ ఉర్దు కవయిత్రి శ్రీమతి తాహెరా సయ్యేద్ బీగం, జామ్‌నగర్ రాజమాత, సిరోహి రాజమాత యోగసాధనలో ప్రపంచ విఖ్యాతిగాంచిన శ్రీమతి ఇంద్రాదేవి, వృద్ధుడు, బాబాను ఈ రూపముననేకాక షిర్డీబాబా అవతారమున కూడా షిర్డీలో వుండగా కొలిచిన శ్రీదీక్షిత్, ప్రొఫెసర్ గోకాక్ తదితరులు కూడ నాచేతిలో వున్న తైలపాత్రలో పుష్పమును ముంచి ఆతైలబిందువులను బాబా శిరమున ప్రోక్షించి బాబా పవిత్ర పాదపద్మములపై తమ శిరముల నుంచి నమస్కరించిరి.

అమెరికా నుండి ఈ ఉత్సవమును చూచుటకు వచ్చిన శ్రీమతి ఎండర్సన్, పక్షవాతముతో కాళ్ళు కదపలేని స్థితిలో చక్రముల కుర్చీలో వేదికపై దూరముగా కూర్చుని ఆనందాశ్రువులు నిండిన నయనములతో ఈ దృశ్యమును తిలకించుచుండెను. బాబా దృష్టి ఆమెపై పడెను. ''ఆమె పుష్పమును నూనెలో ముంచిన తర్వాత ఆ పుష్పము నిటు తీసుకునిరా ఆమె సంతోషిస్తుంది'' అని బాబా అనిరి. బాబా అపార కరుణకు నాకు పరమానందము కలిగి బాబా ఆజ్ఞానుసారము ఆమె వైపు రెండడుగులు వేసితినో లేదో, బాబా ''ఉండు నేను ఆమె దగ్గరకు వెళ్ళెదను'' అనుచు సింహాసనము దిగి బాబా ఆమె వద్దకు వెళ్ళుచుండగా, వెనుక తైలపాత్రతో నేను వెంబడించితిని. భక్తులు ఆర్ద్రనయనములతో చూచుచుండిరి. బాబా ఆమెముందు శిరము వంచి నిలబడగా ఆమె పుష్పముతో తైలబిందువులను బాబా సుందర కుంతలములపై మూడు పర్యాయములు చిలకరించెను. ఆమె ఆనందమునకు అవధులు లేవు. ఆ ముదుసలి మోమున ద్యోతకమైన భావోద్వేగము వర్ణనాతీతము. అంతటితో ఆ దృశ్యము సమాప్తి కాలేదు. ''లేచి నిలబడు'' అనుచు బాబా ఆమె చేయి పట్టుకునిరి. ఆమె లేచి నిలబడినది. ''నాతో నడచిరా'' అని ఆదేశించిరి. బాబా ఆజ్ఞను పాలించుచు ఆడుగులలో అడుగులు వేస్తూ నలభై అడుగుల దూరములో వున్న సింహాసనము వరకూ నడచి వెళ్ళింది. ఆమె అవయవములు సంపూర్ణముగ ఆమె స్వాధీనమునకు వచ్చినవి. ఈ అద్భుత లీలకు దిగ్భ్రాంతులైన భక్తుల కరతాళ ధ్వనులతో సభామంటపము దద్దరిల్లెను. తైల పాత్ర చేతిలో వుండగనే ఆనంద పారవశ్యమున వేదిక ముందున్న మైక్ వద్దకు పరుగెత్తి ''ఆమెకు కాళ్ళు వచ్చినవి. ఇన్ని సంవత్సరముల తర్వాత ఆమె తిరిగి నడువగలుగుచున్నది. జన్మదినోత్సవ సందర్భమున



బాబా ఆమెకి యిచ్చిన కానుక ఇది'' అని ప్రకటన చేసితిని. ఎన్నిసార్లు బాబా లీలలు చూచిననూ ఎప్పటికప్పుడవి క్రొత్తగా వుండును కదా!

జన్మదినోత్సవ సందర్భమున స్వామి తమ దివ్యోపన్యాసములో ''లోకమున అయిదు రకములయిన పుత్రులుద్భవించుచుందురు. న్యాస పుత్రుడు. అనగా పూర్వజన్మలో నీవద్ద అతడు దాచిన ధనమును నీవు దుర్వినియోగ పరచుటచే ఆ సొమ్మును వసూలు చేసుకొనుటకు జన్మించిన పుత్రుడు. గత జన్మలో తండ్రికి ఋణపడిన కొడుకు ఈ జన్మలో తారుమారై తాను తండ్రిగానూ తన తండ్రి తన కుమారునిగను జన్మించి ఋణము తీర్చును. అట్టివాడు ఋణపుత్రుడు. క్రిందటి జన్మలో ఋణము తీర్చజాలక ఆ ఋణము తీర్చుకొనుటకై పుట్టినవాడు ధనపుత్రుడు, సుపుత్రుడనగా భగవదనుగ్రహ ఫలితముగా పుట్టినవాడు, తల్లి తండ్రులందు కాని, బంధుమిత్రులందు కాని, ఎట్టి బాధ్యతలూ లేనివారు, అందరి యందు దయాదాక్షిణ్యములు చూపువారు ఉపేక్ష పుత్రులు. వారే అవతారములనిరి. బాబా తమ కన్న తల్లితండ్రులు యెడల ఎటువంటి ప్రత్యేకమైన అభిమానానురాగములు చూపకపోవుటకు కారణము, వారు ఉపేక్షపుత్రులగుట చేతనే అని తేటతెల్లమగుచున్నది.

డిసెంబరు 4వ తేదీన బాబా ప్రశాంతి నిలయము విడిచి బెంగుళూరు వెళ్ళి అచ్చట ఒక నెలరోజులు అమెరికా, ఇంగ్లండ్ మొదలైన దేశముల నుండి వచ్చిన భక్తులకు ఆధ్యాత్మిక సాధనలను బోధించుటలోనూ, బృందావన్ ఆవరణలో క్రొత్తగా నెలకొల్పనున్న బాలుర కళాశాలకు అవసరమైన ఏర్పాట్లు కావించుటలోనూ నిమగ్నులైరి.

క్రిస్టమస్ దినమున క్రైస్తవ భక్తులను ఆశీర్వదించిరి. ఐదుదినముల తరువాత వైకుంఠ ఏకాదశీ పర్వదినమున అమృతము సృష్టించి భజన చేయుచు కూర్చున్న నాలుగు వేల భక్తులకు స్వయముగా పంచి పెట్టిరి. నూతన సంవత్సరమున ప్రవేశించు తరుణమున ప్రతి వ్యక్తి తన గతమును నెమరు వేసుకుని ప్రగతి పథం సాధించుటకు కృషి చేయవలెననీ, దురభ్యాసములనూ, బలహీనతలనూ విడిచి సత్ప్రవర్తనా దీక్ష స్వీకరించవలెననీ బాబా తమ సందేశములో ఉపదేశించిరి. సంక్రాంతి పండుగ ప్రశాంతి నిలయములో జరుపుటకు బాబా 13వ తేదీకి తిరిగి వచ్చిరి. సంక్రాంతినాడు ''ఇది ఉత్తరాయన ప్రారంభ శుభసమయము. సూర్యుడీ దినము నుండి ఉత్తరార్ధ గోళములో ఉత్తర దిశగా ప్రయాణమగును. సత్సంగ, సదాలోచన, సత్కర్మలనెడు ఉత్తమ మార్గమున ప్రయాణము సాగించుచూ జనన మరణ చక్రభ్రమణమనెడి జీవిత కక్ష్య నుండి విడుదలై గమ్యము చేరు ప్రయత్నము చేయండి'' అని తమ సందేశమున పలికిరి.

షిర్డీ అవతార కాలమున నుండి బాబాకు గోదావరి అత్యంత ప్రియమైనది. అనుగ్రహమారుతముతో ఆనంద సముద్రము ఉప్పొంగి కోస్తా జిల్లాలను ముంచి వేయుటకు నాందిగా 1969లో జనవరి 6వ తేదీన బాబా గోదావరి తీరమున వున్న రాజమహేంద్ర

వరమున పాదములిడిరి. పూర్వావతారములో బాబా ఆశీస్సుల కొరకు ద్వారకామాయి వెళ్ళిన భక్తులందరూ ముందు గోదావరి నదిలో స్నానము చేసెడివారు. ఆ విధముగా బాబా దివ్యవైభవమును ఆనాటి నుండి గోదావరి తనలో నింపుకున్నది. తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలు, బాబా సేవా సంస్థల ద్వారా భక్తి ప్రపత్తులనెడి పరిమళమును సంతరించుకొని నూతన సాయిశకారంభము ప్రకటించుచూ శంఖారావము చేయుచున్నవి. తూర్పు గోదావరి జిల్లాలోని భక్తుడొకడు. ''మా జిల్లాలో ఇంటింటా స్వామి చిత్రపటములే; స్వామి నామమే''యని వ్రాయగా దానికి ''చూస్తూ వుండండి, అనతి కాలములోనే ఈ నామ రూపములు జగత్తంతా వ్యాపించగలవు'' అని బాబా సమాధానము వ్రాసిరి. 17, 18 తేదీలలో లక్షలాది ప్రజలు సమావేశమైన బహిరంగ సభలలో బాబా తమ ప్రబోధామృతముతో భక్తుల ఆధ్యాత్మిక దాహము తీర్చిరి. శ్రీ వి. కె. రావు, ఐ.సి.యస్. గౌతమీ జీవకారుణ్య సంఘమును నడుపుచున్న శ్రీకారుణ్యా నందస్వామి తమ ప్రసంగములలో బాబా అవతరించిన ఈ స్వర్ణయుగమున సమకాలీకు లుగా జన్మించిన ఈ తరము వారి అదృష్టమును పలువిధముల కొనియాడిరి.

''సర్వం బ్రహ్మమయమను భావమును మీ శ్రద్ధను కేంద్రీకరించి సత్యమును గ్రహించు యత్నము చేయుడు. పదార్థముల యెడల మీరు చూపు అంగీకార తిరస్కా రములూ, వాటి మధ్యకనబడు వ్యత్యాసములూ ఆ యేకైక పదార్థము యొక్క భిన్న రూపములే; ఆకర్షణ వికర్షణలకు చలించక స్థిరచిత్తులై వుండుడు. ఈ జగన్నాటకమునకు భగవంతుడే సూత్రధారి, అనురక్తి విరక్తులయందు అనాసక్తులై సాక్షి భూతులుగ చరించుడు. మీ కోర్కెలను, ప్రేమను, అన్వేషణను దైవోన్ముఖము చేయుడు.'' అని బాబా చెప్పిరి. ఈ అస్థిర ప్రపంచము నుండి విముక్తి పొందుటకు మనస్సును జయించవలె ననిరి. ద్వేషపూరిత సంభాషణలు, విభేదములు రెచ్చగొట్టు ప్రతిజ్ఞలు, కోపోద్రేకములు, నాస్తికవాదములు దరిచేరనీయవద్దని, హెచ్చరించిరి. ఆంగ్లభాషలోని 26 అక్షరములతో ప్రపంచములో అన్ని పుస్తకములు వ్రాయబడినవి. అక్షరములు మంచివీ కావు చెడ్డవీ కావు. వాటి యొక్క భిన్న కలయికలతో పనికిమాలిన చెత్త పుస్తకములేకాక, అత్యుత్తమ గ్రంథములు కూడ వ్రాయబడినవి. అదే విధముగా మనస్సులోని భావములు మానవుని ఉన్నత పథమునకూ చేర్చగలవు, అధఃపతనమునకూ దారితీయగలవు.'' అని బాబా సెలవిచ్చిరి.

18వ తేదీన రాజమండ్రి పేపర్‌మిల్స్‌లో సంభాషించు సందర్భమున అందలి ఉద్యోగులు కార్మికుల మధ్యవుండవలసిన పరస్పర సానుభూతి సహకారములు, అన్యోన్యతను గురించి వక్కాణించిరి. ఆ సాయంకాలము బాబా పేరుతో స్థాపించిన పాఠశాలకు ప్రారంభోత్సవము చేసిరి. ఆ పాఠశాలయందు బాబా ఆదేశ సందేశములన నుసరించి రూపొందించిన విద్యా విధానము ప్రవేశ పెట్టబడినది. ఆ బాలబాలికల కెదురుగా కూర్చుని వదనమున కరుణారసము తొణికిసలాడుచుండగా ''సనాతన ధర్మమనునది ఒక విశాలభవనము. ఎందరో



మహర్షులు, యోగులు ఎంతో శ్రమించి భావితరముల వారి శాంతియుత సుఖ జీవనముకొరకు నిర్మించిరి. కాని దురదృష్టవశమున ఈనాడు ఆభవనము శిథిలమైనదనియూ వాసయోగ్యము కాదనియూ నిరసించెడి మూర్ఖులు బయలుదేరిరి. ఈ పసి హృదయములలో ద్వేషమునకు, దురాశలకు, అసూయకు తావులేదు కనుక, ఆ మహర్షులు ఆశించిన శాంతి వీరి ముఖములలో ద్యోతక మగుచున్నది. వీరికి సక్రమమైన శిక్షణ, మనోవికాసములు అందించనిచో వీరు ఎదిగిన తరువాత నేడు వారిలో కనబడు ఆనంద శాంతులకు బదులు భయాందోళనలు వారి మనస్సులలో తాండవమాడును. నేటి పెద్దలు శాంతి ఆనందములను అనుభవించి, దాచి యితరులకు పంచిపెట్టు కళనే పోగొట్టుకొనిరి.

''భక్తి గౌరవము, సేవాసక్తి, వినయములతో నిండిన వాతావరణములో పిల్లలు పెరుగవలెను. నేటి పిల్లలు పుస్తకములలోని నీతి వాక్యములను కంఠస్తము చేయుదురు కాని, కించిత్తైననూ ఆచరణయందు చూపరు. పసిపిల్లల సమక్షముననే తల్లితండ్రులీనాడు త్రాగుచున్నారు, జూదమాడుచున్నారు, పరులను దూషించుచున్నారు. పచ్చి అబద్ధము లాడుచున్నారు. ఇదీవారు పెరుగుచున్న వాతావరణము, ఈనవవికసిత హృదయములలో కులమత జాతి విభేదములు నాటవద్దు. మొదట తల్లితండ్రులు, తరువాత ఉపాధ్యాయులు, ఆతరువాత స్నేహితులు, కులమత నాయకులు నిరంతరము తాము చిన్నపిల్లలకు తమ ప్రవర్తనతో మార్గదర్శకులుగా నుండవలెనను ధ్యాసయందుండవలెను. ఈ పాఠశాలకు నాపేరు పెట్టినారు. కాబట్టి బాధ్యత గురుతరమైనది. చుట్టుపట్లనున్న పాఠశాలలకిది అదర్శముగా నుండవలెను. పిల్లలు పరస్పరమూ ప్రేమించుకొనవలెను. పెద్దలు అందరి బిడ్డలనూ సమానముగా ప్రేమించవలెను. వాతావరణము దైవస్మరణ పరిమళముతో నిండివుండవలెను. సత్య ధర్మ శాంతి ప్రేమల శకమారంభమైనదని చాటవలెను'' అని బాబా ప్రబోధించిరి.

20వ తేదీ నుండి అయిదు రోజులు నిర్విరామముగా డెల్టాలో పదిలక్షలమంది బాబాను దర్శించు భాగ్యము పొందిరి. బాబా నూరు గ్రామములు, ఇరవై పట్టణములకు పైగా పర్యటించిరి. ధవళేశ్వరము నుండి గోదావరి జలములు కాలువలుగా ప్రవహిస్తూ ఆ ప్రాంతమునంతనూ సస్యశ్యామలము గావించిన చందనమున బాబా అనుగ్రహవాహిని పొంగిపొరలి బీడువారిన హృదయభూములను ముంచెత్తి చైతన్యమును ప్రసాదించెను. కోన సీమ ఆనందసీమగా మారింది. ఎందుచూచినా ఆనందసందోహమే. బాబా దివ్య సుందరమూర్తిని కనులారా దర్శించుటకు, వారి అమృతవాణితో వీనుల విందుచేసు కొనుటకు, వారి పాద పద్మముల స్పృశించుటకు మారుమూల గ్రామముల నుండి భక్త జనులు తరలివచ్చి బాబా వెళ్ళు మార్గమున కిరుప్రక్కలా నిలబడి, బాటను శుభ్రపరచి నీళ్ళు జల్లి రంగవల్లులతో అలంకరించి బాబా రాకకై నిరీక్షించుచుండిరి. భగవంతుని దర్శించ బోవుచున్నామన్న భావోద్రేకముతో మార్గమంతా పచ్చని తోరణములతో రంగు

రంగుల జండాలతో పూలమాలాలంకరణలతో సిద్ధము చేసుకొనిరి. పట్టణములందూ గ్రామములందూ భక్త్యోత్సాహములతో ఎంతో శ్రమపడి పందిర్లు ఆర్చిలూ నిర్మించిరి. ముందు బాబావున్న కారు, దాని వెనుక సుమారు యిర్వై కార్లు, బాట కిరుప్రక్కలా జేజే ధ్వానాలు చేయుచు మ్రొక్కుచున్న భక్తులు, వారికి అభయమూ ఆనందమూ అందించుచు బాబా తమ దివ్యహస్తమును ఊపుచుండగా ఆ మనోహర దృశ్యము చూచిన వారికి, ఆనందమే ఆయెడ వెల్లువయ్యై ప్రవహించుచున్నదా యనిపించెను.

డెల్టాలో ప్రతి అంగుళము నేల వ్యవసాయము కొరకు ఉపయోగించబడుట చేత కార్లు అగుటకు బహిరంగ స్థలములుండవు. అదీకాక, రోడ్లుకూడా అదే కారణం చేత ఎక్కువ వెడల్పుగా వుండవు. అందుచేత కేశవరము వద్ద మిగిలిన కార్లను అక్కడే నిలుపుకొనమని ఆదేశించి, బాబా మాత్రమే కారులో గ్రామములోనికి వెళ్ళిరి. పొడవైన ఇత్తడి బూరలు వూదుతూ మేళతాళములతో బాబాను ఆహ్వానించి తోడ్కొని వెళ్ళిరి. ఒక ప్రక్క స్త్రీలు ఒక ప్రక్క పురుషులు కూర్చుని వుండగా వారిపై దయార్ద్ర నయనములతో అనుగ్రహము చిందుచూ, నెమ్మదిగా నడచివెళ్ళి వేదిక నలంకరించిరి. వారందరికి నామస్మరణ యొక్క ప్రభావమును తెలిపి బహుభక్తి శ్రద్ధలతో భజనలు జరుపుకొనుచుండమని బోధించిరి. అక్కడ నుండి పాలతోడు గ్రామమునకు వెళ్ళిరి. ''జ్ఞానమను పక్షికి భక్తి విశ్వాసములు రెండూ రెండు రెక్కలు'' అని చెప్పి బాబా ఆ గ్రామస్తులకు కూడ నామ సంకీర్తన ప్రాశస్త్యమును తెలియజేసిరి.

21వ తేదీన బాబా మరొక దిశగా పయనించిరి. ఆ మార్గమందున్న గ్రామములన్నీ ఆనందంతో స్పందించినవి. ఎక్కడ చూచినా రోడ్డుకు రెండువైపులా **జనము** జయజయ ధ్వానాలు చేస్తూండగా అనంతమైన ''గార్డ్ ఆఫ్ ఆనర్''వలె కన్పట్టుచుండెను. బాబా కారు నెమ్మదిగా పోవుచుండగా అనుగ్రహ చిహ్నముగా చేయి నూపుచుండిరి. మధ్య మధ్య కారు కొన్ని క్షణములు నిలిపి కారు తలుపులు తెరచి 'పుట్‌బోర్డు' మీద బాబా నిలబడి తమ దివ్యమంగళ విగ్రహమును తనివితీరా సందర్శించు భాగ్యమును ప్రసాదించు చుండిరి.

కోనసీమ ఆంధ్రప్రదేశ్‌కి ధాన్యాగారమును పేరుగడించినది. మైలు మైలుకూ జనముతో క్రిక్కిరిసిన గ్రామములే. ఎచ్చట చూచినా కనుల విందు చేయు పచ్చని పొలములే. గుమ్మిలేరు, పినపల్లె, గంగవరం, పామర్రు, నరసాపురం, రావూరుపేట, రాజుపాలెం, అనపర్తి, కుతుకులూరు, సోమేశ్వరం, సంపర గ్రామములందు బాబా కారుదిగి కొద్ది నిముషములు గడిపి గ్రామీణుల నాశీర్వదించిరి. సంపర గ్రామము దిగ్విజయముతో తిరిగి వచ్చిన గోపాలునికిచ్చిన స్వాగతము బాబా కిచ్చినది. సంపర గ్రామానికి భాగవతానికి చాలా సంవత్సరములుగా సన్నిహిత సంబంధమున్నది. ఈ గ్రామ వాస్తవ్యులైన శ్రీ కడియాల సీతారామశాస్త్రిగారు తమ అపార పాండిత్యముతో, శ్రద్ధాభక్తులతో భాగవత కథా కాలక్షేపము చేసెడివారు. ఆ సాంగత్య ప్రభావ మింకను వాతావరణమున మిళితమై యున్నది. అక్కడ



మూడుగంటలు గడిపిరి. భక్తులందరూ అమితోత్సాహముతో భజన చేసిరి. బాబా తమ దివ్యోపన్యాసములో మనస్సును అంతర్ముఖము చేసుకుని హృదయవాసియైన దైవమును గూర్చి ధ్యానము చేయమని ఉపదేశించిరి. నాటి రాత్రి తిరిగి రాజమండ్రి చేరుకొనిరి.

22వ తేదీన బాబా తామరాడ, పెద్దాపురము దిక్కుగా ప్రయాణమైరి. పెద్దాపురములో బాబా తమ చిరకాల భక్తుడైన చల్లా అప్పారావు గారింటికి వెళ్ళిరి. మూడు సంవత్సరములుగా అతడు తీవ్రమైన మూలశంక వ్యాధితో మంచము పట్టెను. గత ఎనిమిది మాసముల నుండి రక్తహీనత వలన అతని ఆరోగ్యస్థితి మరింత దిగజారి పోయెను. అతడు బాబా మీదనే విశ్వాసముంచి ఔషధములు సేవించుటకు నిరాక రించెను. శరీరము నీరు పట్టినది. రక్తము యొక్క సాంద్రత 80 శాతమునకు దిగిపోయి పరిస్థితి ఆందోళన కల్గించెను. డాక్టర్లు రక్తము నెక్కించుకొనుమనీ, లేని యెడల ప్రాణాపాయము అనివార్యమనీ హెచ్చరించిరి. అంతకు కొద్ది దినములు ముందు అప్పారావు ఆరోగ్య పరిస్థితిని గురించి, అతడు ఔషధములు నిరాకరించుట గూర్చి అతని ఆప్తులు బాబాకు విన్నవించగా ''ఔషధములు తీసుకొన్నవారు మాత్రము మరణించుట లేదా,'' యని బాబా అనగా వారు నిరుత్తరులైరి.

బాబా అప్పారావు మంచము ప్రక్కనే కూర్చుని కరుణతో అతని శిరస్సును స్పృశించిరి. అప్పారావు ఆనందాశ్రువులు రాల్చుచుండగా బాబా హస్తచాలనముతో ఒక స్ఫటిక లింగమును సృష్టించి, నిత్యము దాని కభిషేకము గావించి ఆ తీర్థమును అప్పారావు కిమ్మనిరి. ''ఆశ్చర్యములలో కల్లా ఆశ్చర్యము, రోగి ఆ క్షణములోనే కోలుకొనుట కారంభించెను. రక్తస్రావము నిలచిపోయినది; అలుపు తగ్గినది; శరీరములో వాపు తీసినది మలమూత్ర విసర్జన మామూలు స్థితికి వచ్చినది'' అని రోగిని పరీక్షించిన డా॥ కేశవరావుగారనిరి. ఒక మాసము రోజులలో అప్పారావు సంపూర్ణారోగ్యము పొందెను. బాబా కరుణా కటాక్షమును గూర్చి శ్రీ అప్పారావు ''బాబా రాకమునుపు నేను శవమును; వారి రాకతో నేను మృత్యుంజయుడనయితిని'' అనిరి.

నాటి బహిరంగ సభ అనంతరము బాబా ఆ గ్రామమున సత్యసాయి సేవా సమితి కేంద్రమునకు శంఖుస్థాపన గావించిరి. అక్కడ నుండి మేడపాడు గ్రామమునకు వెళ్ళి సత్యసాయి మందిరమునకు ప్రారంభోత్సవము జరిపిరి. తరువాత వడ్లమూరు గ్రామమునకు వెళ్ళి సత్యసాయి మందిరమునకు శంఖుస్థాపన చేసిరి.

కొత్తపేట చరిత్రలో అది మరుపురాని దినం. అంత జనసమూహము చేరిన బహిరంగ సభని వారెన్నడూ చూసియుండలేదు. కాలేజి గ్రౌండు ఇసుకవేస్తే రాలనంత జనముతో క్రిక్కిరిసి వున్నది. ఆ సభలో ఉపన్యసించిన పిదప అక్కడకు ఒకటిన్నర మైళ్ళ దూరములో వున్న పలివెల గ్రామము వెళ్ళి అక్కడ భక్తుల నాశీర్వదించి అక్కడ నుండి అంబాజీ పేట వెళ్ళి దర్శన సంభాషణలతో వారి నానందపరచిరి.

నేత పరిశ్రమకు ప్రసిద్ధిచెందిన బండార్లంక గ్రామస్తులు ఈ దివ్య అనుగ్రహ వాహినిని స్వాగతించుటకు తోరణములు, పూవులు, జండాలతో అలంకరించిన పెద్ద పెద్ద అర్చిలు నిర్మించిరి. కొలది నిముషము లచ్చట గడిపి మానవ జీవిత పరమావధిని గూర్చి వారికి బోధించిరి.

అక్కడ నుండి అమలాపురం వెళ్ళిరి. అక్కడ యాభై వేల మంది బహిరంగ సభ యందు సమావేశమై నిరీక్షించుచుండిరి. బాబా దివ్యమంగళ రూపమును దర్శించగనే వారి హృదయ దీపములు వెలిగినవి. సభయందు బాబాకు ఇంగ్లీషులో స్వాగత పత్రము సమర్పించిరి. ఎల్లప్పుడు అందరి హృదయములలోనూ నిండి వుండిన తనకు స్వాగతము, వీడ్కోలు బాబా హాస్యాస్పదమనిరి. కోనసీమ వేదసీమ. భారతీయ సంస్కృతికి వేదాధ్యయనము చేయు పండితులకు పేరుపడ్డ గడ్డ. ఇటువంటి విద్వత్సీమలో ఆంగ్లమున సభ ప్రారంభించుట మన సంస్కృతికి సాంప్రదాయమునకు విరుద్ధమని బాబా ఉద్ఘాటించిరి.

24వ తేదీన బాబా చాలా పెందలకడనే బయలుదేరి మానేపల్లి వెళ్ళిరి. అక్కడ నుండి తాటిపాక వెళ్ళి ఒక వ్యాధిగ్రస్తుడైన వృద్ధ భక్తుని ఆశీర్వదించి రాజోలు వెళ్ళిరి. అక్కడ బహిరంగసభలో ప్రసంగించి వారి భక్తి ఉత్సాహాలను సఫలీకృతము గావించిరి.

కారు వేగముగా పోవుచుండగా దారికడ్డముగా రెండు కొబ్బరిచెట్లు కలుపుచూ ఒక మామిడి తోరణము దాని మధ్య గాలికి రెపరెప కొట్టుకొనుచున్న ఒక కాగితము కనబడినది. ఆ కాగితము మీద ''సుస్వాగతం'' అనే అక్షరములు చిన్న పిల్లవాడు వ్రాసినట్లు వంకరటింకరగా వున్నాయి. ఏభయి గజములు దాటిన తర్వాత కారు ఆపించి వెనక్కి మళ్ళించి ఆ తోరణము వద్ద బాబా కారు ఆపించిరి. ఆ గ్రామము పేరు పోతుమట్ల. వారు ఏ బహిరంగ సభలకూ వెళ్ళు ఓపిక లేకపోవుటచే కాబోలు ఇద్దరు వృద్ధస్త్రీలు ఎండకు ఎండివాడిన దండలు చేత ధరించి అక్కడ నిలబడి వుండిరి. బాబా కారుదిగి నిర్ఘాంతపోయి చూస్తున్న వారి వద్దకు వెళ్ళి ''నేనే సాయి బాబాను'' అని చెప్పి వొంగి వారిద్దరిచేత దండలు మెడలో వేయించుకొనిరి. వారు ఆనందముతో బాబా పాదపద్మముల మ్రోల నేలమీద తల మోపి నమస్కరించగా బాబా వారి శిరములు స్పృశించి ఆశీర్వదించిరి.

మరి కొంతదూరము వెళ్ళిన తర్వాత రోడ్డుమీద ఇద్దరు స్త్రీలు వడివడిగా నడుచుచుండగా బాబా వారి ప్రక్కనే కారు ఆపి దిగి వాళ్ళు చేరువకాగానే ''మీరెక్కడికి వెడుతున్నారు?'' అని అడిగిరి. ''సాయిబాబాని చూడటానికి'' అని వాళ్ళు అన్నారు. ''నేనే సాయిబాబాని, మీకు తెలియదా?'' అని బాబా నవ్విరి. తమను పరిహసించుచున్నారని భావించి వారు ముందుకు పోసాగిరి. అంత బాబా వెంట వున్నవారు దిగి



వాళ్ళని ఆపి వారు నిజముగా బాబాయే అని సరిగా చూడమని చెప్పిరి. వాళ్ళ కళ్ళు వాళ్ళు నమ్మలేని సంభ్రమాశ్చర్యములతో వారు బాబా పాదములపై వ్రాలిరి. వారెవరో ఎట్టి బాధలలో వున్నారో బాబాని దర్శించి ఏమి ప్రార్థించదల్చుకుని ఆతురతతో వెళ్ళు చున్నారో బాబాకి తెలియదా? వారి కొరకు విభూతి సృష్టించి యిచ్చి వాళ్ళకొరకే కారు ఆపినట్లు వారి సమస్యలు త్వరలోనే తీరిపోవుననీ అభయమిచ్చి, పండ్లిచ్చి, వారి కోరిక ఫలించినది కనుక శ్రమపడి ముందుకు వెళ్ళనక్కర్లేకుండా వెనుతిరిగి యింటికి వెళ్ళమని చెప్పిరి. వారెంత అదృష్టవంతులు.

లక్కవరములో భక్తుల కనులకు వీనులకు విందుచేసి ఒకటి రెండు మైళ్ళు ముందుకు పోగానే కారును ఒక మట్టిరోడ్డువైపు మళ్ళించమనిరి. ఆ రోడ్డు నిర్మానుష్యముగా నున్నది. రోడ్డు ఎత్తుపల్లములుగా వుంది. ఆ రోడ్డు ఎక్కడికి వెళ్లునో యెవరికీ తెలియదు. ధైర్యము చేసి ఒకరు అడుగగా బాబా యిట్లు చెప్పిరి. ''ఇక్కడ కత్తికుండ అనే గ్రామం ఒక మైలు దూరములో వుంది. అక్కడ ఒక భక్తుడున్నాడు. అతనికి మొదటి భార్య మరణించిన తర్వాత మరొక వివాహము చేసుకున్నాడు. రెండవ భార్యకి చాలా మంది పిల్లలు పుట్టి శిశు దశలోనే మరణించారు. మొదటి భార్య పిశాచియై ఈమెను వెంటాడుచుండుట చేత ఈమె పిల్లలు మరణిస్తున్నారన్న మూఢ నమ్మకముతో భయపడుతుండగా ఏడవనెల గర్భిణితో పుట్టపర్తి వచ్చింది. ఏడవనెలలో ఆశ్రమము ఆస్పత్రిలోనే ఈమె ప్రసవించింది. మగశిశువు పుట్టాడు. వాడికిప్పుడు మూడేళ్ళుంటాయి. వాని యింటికి వెళ్ళి ఆశీర్వదించి వస్తాను'' జగద్బంధువుకు తెలియని చోటూ తెలియని వాళ్ళూ వుండుట సాధ్యమా!

ఏపుగా పెరిగిన కొబ్బరితోటల మధ్య కడలి అనే కుగ్రామం వున్నది. అది ప్రశాంతి నిలయములోని వేద పాఠశాల ప్రధానాచార్యులయిన శ్రీ కామేశ్వర ఘనాపాటి గారి స్వగ్రామము. వారు అసమాన వేదశాస్త్ర పారంగతులు. ప్రాచీన సాంప్రదాయ విధానములో ఉదాత్త అనుదాత్త. స్వరములలో వేదము పఠించుట యందు సాటిలేని మేటి. ప్రశాంతి నిలయమున జరిగిన మొదటి వేదయజ్ఞ సప్తాహమును ఆయన ఋత్విక్‌గా వుండి నిర్వహించినప్పుడే బాబాను వేద పురుషునిగా గ్రహించిన విద్వద్వేత్త. అంతకు ఏడేండ్ల క్రితమే స్వగ్రామమునకు, స్వజనులకు ''స్వ'' యందభిమానమునకు స్వస్తి చెప్పి బాబా చరణ కమలముల సన్నిధిని ప్రశాంతి నిలయములో వేదపాఠశాల నిర్వహణలో నిమగ్నుడైన ధన్యజీవి. బాబా వారింటికి వెళ్ళిరి. ఆ యింటిముందు ఏర్పాటు చేసిన వేదిక నలంకరించి యించుక సేపు ఉపన్యాస నామసంకీర్తనామృతములతో ఆ గ్రామస్తుల ననుగ్రహించిరి.

కాలువ గట్టుననే కార్లన్నీ ఆగినవి. బాబా మాత్రమే కారులో నాటి దేవాలయ మంత్రిగావున్న శ్రీ రామలింగరాజుగారి గృహము పావనము చేయుటకై సఖినేటి పల్లికి వెళ్ళిరి. నాటి రాత్రికి బాబా రాజమండ్రి తిరిగి వచ్చిరి.

రాజమహేంద్రవరము భక్తులకు జనవరి 26వ తేదీ చిరస్మరణీయమైన పర్వదినము.

ఆ సాయంత్రము మూడు మోటారు బోటులలో రెండు వందల మంది భక్తులతో గోదావరి నదిమీద ప్రయాణం చేసి మూడుమైళ్ళ దూరమున ద్వీపమువలెనున్న విశాలమైన ఇసుకలంక చేరిరి. బాబా భక్తపరివేష్టితులై ఆ పుణ్యనదీ సైకత స్థలిపై కూర్చుని వుండగా ఆకాశము నుండి నక్షత్రములు ఆనందమున మెరయు కన్నులతో చూడసాగినవి; నామ సంకీర్తన మాధుర్యము గ్రోలిన వాటి మేను పులకించెను.

కొందరు భక్తులు సాధనను గురించి ప్రశ్నించగా భాగవతమునుండి ఉదాహరణలతో సమాధానము చెప్పుచూ బాబా తమ యెదుటనున్న యిసుక నుండి చేతితో వెన్న ముద్దతో దోగాడు బంగారు బాలకృష్ణ విగ్రహమును సృష్టించిరి. ఆ సమయమున బాబా శ్రీకృష్ణుడు వెన్నముద్దలను దొంగలించుట యందలి అంతరార్థమును విశదీకరించుచుండిరి.

ఆ తరువాత సంభాషణ శివుని నిరాకార చిహ్నమైన శివలింగమున గురించి సాగినది. ఆ సందర్భమున పృధ్విలింగము, జలలింగము, తేజోలింగయు, వాయులింగము, ఆకాశలింగములను గురించి వ్యాఖ్యానించు చుండిరి.

గాలిలో ఏ యాధారము లేకుండా వ్రేలాడు ఆకాశ లింగమును గూర్చి అది లోహపు ఖనిజముతో చేయబడినదినియూ, ఆలయములో క్రిందా పైనా అమర్చబడిన అయస్కాంత ముల ప్రభావముచే అట్లు నిరాధారముగా గాలిలో నిలబడినదని చెప్పిరి. ''మీరు దానిని చూడదలిచినారా?'' అని అడుగగనే అక్కడవున్న భక్తులందరూ బాబాని మరింత దగ్గరగా చుట్టుముట్టిరి. బాబా గాలిలో చేయి యిటునటు తిప్పి సృష్టించిన ఆ లింగమే ఆకాశలింగునియూ, అప్పుడే రాత్రి సేవలు పూర్తి చేసి అర్చకులు ఆలయమునకు తాళము వేసి వెళ్ళిపోయి యుండుట చేత ఆ లింగము నిక్కడకు రప్పించినట్లు చెప్పిరి. అది మిశ్రమ వర్ణములుగల స్పటిక లింగము. దానిని వెలిగించిన టార్చిలైట్ అద్దము మీద పెట్టి బాబా పైకెత్తి పట్టుకొనగ, అది బహువర్ణముల కాంతితో శోభించెను. తదుపరి ఈ లింగమును బంగారు బాలకృష్ణ విగ్రహమును ఒక పళ్ళెములో వుంచి అందరూ వాటిని తాకి నమస్కరించుకొనుటకు వీలుగా కొందరు భక్తులు ఆ పళ్ళెమును అందరి వద్దకు తీసుకువెళ్ళిరి. తరువాత ఆ రెంటిని ఒక చేతి రుమాలులో భద్రపరచమని ఒక భక్తుని కిచ్చిరి. ఒక గంట తరువాత బాబా ఆ భక్తుని రుమాలు మూట విప్పి చూడమనగా బంగారు బాలకృష్ణుని విగ్రహము మాత్రమే యున్నది. బాబా నవ్వుచూ ఆ పవిత్ర లింగమును ఆలయమునకు తిరిగి పంపివేసినట్లు చెప్పిరి. తదుపరి అందరూ ఆ యిసుకలోనే బారులు తీర్చి కూర్చుని భోజనములు చేసిరి. రాత్రి 11 గంటలకు అందరూ తిరిగి రాజమండ్రి చేరినారు. ఆ భక్తుల ఆనందము ఎవరు ఏమని వర్ణించగలరు.

26వ తేదీన బాబా లైన్స్‌క్లబ్ ఆధ్వర్యమున ప్రత్యేకముగా ఏర్పాటు చేసిన సమావేశములో ఉపన్యసించిరి. ''లైన్ అనగా సింహము'' సింహము పేరు పెట్టుకున్న సంస్థలో మీరందరూ సభ్యులు. సింహము ఏనుగు సహజ శత్రువులు. అరణ్యములో ఏనుగు విచ్చలవిడిగా



తిరుగుతుంది. ఇది కోర్కెల చుట్టూ పరిభ్రమించుచున్న మనస్సునకు చిహ్నము. తమకన్న తెలివయినదీ యుక్తిగలదీ అయిన సింహమునకు లొంగిపోతుంది. ఇక్కడ సింహము బుద్ధికి చిహ్నము. బుద్ధినిత్యానిత్య వివేకము కలిగినట్టిది. మానవుడు బుద్ధి ఆధీనములో వున్నప్పుడు విచక్షణా రహితమైన కోరికల పుట్ట అయిన మనస్సును అదుపులో పెట్టగల సమర్థుడగును. బుద్ధిని విడచి మానువుడు మనస్సునే ఆశ్రయించిన యెడల విచక్షణా శూన్యుడై భ్రమలకు లోనగును. బుద్ధి నిశితమై వికసించిన యెడల, ఒకే సత్యము వెనుకనున్న పరస్పర వైరుధ్యములు కలవర పాటులు తొలగి శాంతి సౌహార్ద్రములు విలసిల్లును. పరోపకారము సేవానిరతి మాత్రమే చాలవు. అశాంతికి దుఃఖమునకు గల కారణములను బుద్ధి నుపయోగించి విచారించి సింహమువలె భయ రహిత మార్గము నవలంబించి మీ సంస్థ సభ్యత్వమనును సార్థకము చేసుకోవలెను'' అని బాబా వారిని ఉత్సాహపరిచిరి. బాహ్యములో కనిపించు అనేకత్వములో అంతర్లీన మైయున్న ఏకత్వమును అభివ్యక్తము చేసుకొను జ్ఞానము లేకుండుటయే యీ అశాంతికి మూలమనియూ, దానిని తొలగించుటకు అవిద్యను, నిర్మూలించవలెననియూ, తద్వారా పరమాత్మను తెలుసుకొనవలెననియూ, వారికి ఉపదేశించిరి.

గోదావరీ తీరము వదలి తిరిగివచ్చుచూ ఏలూరు, గుడివాడ, విజయవాడలందు ఉపన్యసించి, ఆయా సేవా సమితులకు సలహాలిచ్చి ఆశీర్వదించి వేలాది భక్తుల హృదయముల అమృత బిందువులు చిందించి, 27వ తేదీన యించుక సేపు ఆకిరిపల్లి గ్రామమున గడిపి అచ్చట నుండి మద్రాసుకు వెళ్ళిరి.

ఆస్ట్రేలియా దేశస్థుడు, సాధకుడు రచయిత అయిన హోవార్డ్ మార్ఫెట్ ఇట్లు వ్రాసెను. ''ఆనాడు నేనే మార్గమును'' అని క్రీస్తు చెప్పి యుండెను. మానవ రూపమున అవతరించిన బాబా మళ్ళీ నాటికి నేడు అదే దివ్యవాణితో మేల్కొలుపుచున్నట్లు గ్రహించిన వారెంత ధన్యులు. అనతికాలములోనే ఈ యిరువురి సహజమైన పోలికలలోని సత్యము జగద్వితము కానున్నది. ఇంతవరకు ఏ సద్గుణములు, ఏ దివ్యశక్తులు భగవంతు నికి ఆపాదించుచున్నామో ఆ కళలన్నీ మూర్తీభవించిన దివ్యశక్తి సమన్వితులు బాబా. బాబా సన్నిధిలో అందరి హృదయములూ ప్రేమ భరితమైన ఆనందముతో స్పందించు చుండగా లౌకిక వాంఛలు విస్మరింపజేయు అనూహ్యమైన దివ్యవాతావరణము వర్థిల్లును.''

''రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, సత్యసాయిబాబాల వంటి అవతారములకు యుగయుగములుగా భారతావనియే అనువైన స్థానమని ఖ్యాతి గడించినది. ఆధ్యాత్మిక ప్రపంచమునకు భారతదేశము హృదయము, అమెరికా దేశస్థుడైన నాకు సహితము భారతదేశము ఆధ్యాత్మిక జీవనమునకు శ్వాసవంటిది. ఈ విశ్వాసము, శ్వాసలేని యెడల నా జీవతము సజీవ సయాధి సదృశము; నిరాశాభారము.'' అని జాన్ హిస్లోప్ వ్రాసెను.

అనేక మందిలో కుతూహలము రేకెత్తించిన ఒక విషయమును మీ ముందుంచు

చున్నాను. ఈ అంశమును పరిశీలించి వ్యాఖ్యానించిన వారిలో ఒకరు 'కల్కి' సంపాదకులైన శ్రీ ఆర్. గణపతి వారి జాబులో ఈ అంశమునకు సంబంధించిన భాగము నిచ్చట ప్రమరించుచున్నాను. "పరిపూర్ణయోగశక్తితో శ్రీ అరవిందుడు విశ్వాత్మ లోనికి చొచ్చుకుని వెళ్ళి హఠాత్తుగా ధరాచైతన్యములోనికి విశ్వజ్యోతి అవతరించుట గమనించెను. 'Sri Aurabindo on himself and Mother' అను 1963 సం॥పు ప్రతిలో 208వ పుటలో ఇట్లు వ్రాయబడివుంది. "1926వ సం॥ నవంబరు 24వ తేదీ శ్రీ కృష్ణుడు తిరిగి అవతరించినా. ఒక అమోఘమయిన దివ్యశక్తి విశ్వమును నడిపించును. సకల ప్రాణుల హృదయములందు అమరజ్యోతి ప్రకాశించును. దైవవాణిని జనబాహుళ్యము వినకలుగుతుంది. 1928 నవంబరు 23వ తేదీన శ్రీ సత్యసాయి బాబాను గూర్చియే యీ వివరణ వ్రాయబడినదనుకొను సమంజసము...."

శివరాత్రి పర్వదినమున ప్రశాంతి పతాకమును బాబా ఆవిష్కరించుటకు ముందు జాన్‌హిస్లాప్ తన ఉపన్యాసములో యిట్లు చెప్పెను. "ఇది ఎంత వింత సన్నివేశము. మన మెంత అదృష్టవంతులము. భగవంతుని యందుండు సర్వవ్యాపకత్వము, సర్వజ్ఞత, సృష్టిస్థితిలయములందనంత శక్తి కలిగిన యీ సుకుమార సుందరమూర్తి మన మధ్య మనోహరముగ సంచరించుట చూడగలుగుచున్న మనమెంత ధన్యులము."

హిస్లాప్ మాటలలో అతడూహించిన దానికన్న మించిన భావమున్నది. ఆ సాయంత్రమున సంభవించిన అద్భుత లింగోద్భవము, ఈ మాటలలోని భావమును ద్విగుణీకృతము చేసెను. అయద్వితీయ దృశ్యము వర్ణనాతీతము.

ఆ ఉదయము శివరాత్రిని గురించి బాబా 'సాధనతో రాత్రిని శివముగా (మంగళ ప్రదముగా) మానవుడు పరివర్తనగావించుటయూ, భయసందేహ భ్రమలతో కూడి అంధకారమైన రాత్రిని జ్ఞానధైర్య విశ్వాసములతో కూడిన పగలుగా మార్చుటయూ 'శివరాత్రి'కి అంతరార్థములు. ఆ పర్వదినమున చేయు జాగరణ కండ్లు తెరచుకుని నిదుర నాపుకొనుటకు కాదు; బుద్ధిని మేల్కొలిపి అజ్ఞానాంధకారమును పారద్రోలుటకు. ఉపవాసము ఉదరమునకు కాదు; ఇంద్రియములను బుద్ధిబలముతో అరికట్టుకొనుటకు'' అని వ్యాఖ్యానించిరి.

ఈర్ష్యాద్వేష గర్వక్రోధములను విడచి, విశ్వప్రేమను పెంపొందించుకుని, తమోరజోగుణములను విడనాడి సత్వగుణ సంపన్నుడై, వికసించిన హృదయకమలమున కాంతి, ప్రశాంతి, పరంజ్యోతులను ప్రతిష్ఠించుకుని జీవాత్మ స్వరూపుడైన తాను పరమాత్మలో విలీనము కాగలందులకు ప్రయత్నించు సాధనాక్రమమే ప్రశాంతిపతాక చిహ్నము.

ఉదయమున వేద పఠన, వాద్య సంగీతములతో వీనులకు విందు జరుగుచుండగా, కనులకు పండుగగా నిలయము నుండి సభామందిరమునకు ఊరేగింపు, మనోహరమైన ఆ



సభామంటపము, షిర్డీబాబా రజిత విగ్రహమునకు బాబా అభిషేకము చేయుటలో అక్షయముగా ఆవిర్భవించిన దివ్య విభూతియొక్క సౌగంధముతో, నిండిపోయింది.

సాయంత్రము బాబా ఆశీనులై వున్న శాంతి వేదిక యెదుట కూర్చున్న 25000 మంది భక్తులు భజన చేయుచుండగా వారి హృదయములలోని శాంతి వారి ముఖములలో ద్యోతకమగుచుండెను. భగవంతుని నిరాకారతత్వమునకూ, సృష్టి, లయములకూ సాంకేతికమయిన లింగము కొద్ది నిమిషములలో బాబా నోటి నుండి ఉద్భవించు చున్నదని భక్తులందరూ ఆతురతతో ఎదురుచూచుచుండిరి.

ఎందుండి సర్వమూ ఆవిర్భవించు చున్నదో, ఎందు సర్వమూ లయము కానున్నదో అట్టి పరబ్రహ్మమునకు ప్రతీకము లింగము. విప్రతి పక్షములు కాని, ద్వావాభిముఖములు కాని అసంగతములు కాని లేక అమ్యాన పరిపూర్ణగణిత శాస్త్ర చిహ్నమైన గోళాకారము కలిగివుండి, "ఏకోహంబహుశ్యాం" అను ఏకైకత్వము యొక్క సంపూర్ణ సమభావమును రుజువుపరచుటకై విచ్ఛిన్నమై అంధకారము పొందును. ప్రాథమిక భావాభావతత్వమైన శివశక్తిగా ఏకైక పరబ్రహ్మము పొందిన రూపాంతర చిహ్నమే లింగము.

అద్భుతమైన లింగోద్భవ దృశ్యము దర్శించుటకు ఎందరెందరో దూరప్రాంతముల నుండి, బాబా అనుగ్రహమువలన వచ్చియుండిరి. మద్రాసు వాసి, ప్రసిద్ధ నేత్ర వైద్యుడు అయిన డా॥ రంగారావు లింగోద్భవ దృశ్యము కళ్లారా చూడాలన్న యుత్సాహముతో కారులో ప్రయాణం సాగిస్తున్నారు. పతాకావిష్కరణ సమయానికి ప్రశాంతి నిలయానికి 250 మైళ్ళ దూరములో వున్నారు. విభూతి అభిషేక సమయానికి 180 మైళ్ళ దూరంలో వున్నారు. ప్రశాంతి నిలయం 60 మైళ్లు వుండగా కారుకు మరమ్మత్తు వచ్చి ఆగిపోయినది. డ్రైవర్ రిపేరు చేస్తుండగా పెట్రోలు అంటుకున్నది. పెద్ద పెద్ద మంటలు లేచాయి. కారులో నుంచి బయటకు దూకి, రోడ్ ప్రక్కన వున్న మట్టి దోసిలితో తీసి "సాయిరాం" అంటూ మంటపై జల్లగానే మంట ఆరిపోయింది. టాంక్‌లో ముప్పాతికవంతు పెట్రోలు వుంది. ఆ పరిస్థితిలో ఏం చేసినా మంటలు ఆరుటకాని, కారు దహనం కాకుండా కాపాడుట కాని సాధ్యమయ్యే అవకాశం లేదు. సాయంకాలము మూడున్నర గంటల వరకూ అక్కడే వుండి కారు మరమ్మత్తు చేసేరు. ఈలోగా ప్రశాంతి నిలయమునకు వెళ్లే కార్లు ఆపి ఎందరో సానుభూతితో ఆ పరిస్థితిలో తిరిగి కారులో వెళ్ళే ప్రయత్నము ప్రమాదకరమనీ, తమ కారులో రమ్మనీ సలహా లిచ్చేరు. ఇంత ప్రమాదము తప్పించిన బాబా సురక్షితంగా ప్రశాంతి నిలయమునకు చేర్చరా అన్న విశ్వాసముతో అందరి సహాయము నిరాకరించేడు డాక్టర్ రంగారావు. కారు డ్రైవ్ చేస్తూ పెట్రోలు సరఫరాకి టాంక్‌లో పడిన మట్టి అడ్డురాకుండా డిక్కీలో డ్రైవర్ కూర్చుని టాంక్‌లోని పెట్రోల్‌ను మధ్య మధ్య కర్రముక్కతో కదుపుచూ వుండగా, మధ్య మధ్య కారు ఆగిపోయినా నిరుత్సాహ పడకుండా బాబాపై భారం వేసి ప్రయాణము సాగించినారు.

ప్రశాంతి నిలయము నుండి శాంతి వేదిక వద్దకు వచ్చుచున్న బాబా, పద్మవలయము వద్ద నున్న గుంపులో నిలబడివున్న రంగారావువైపు చూచి, చిరునవ్వుతో, ''వచ్చినారా! సంతోషం!'' అని పలకరించిరి. ''కృతజ్ఞతతో నా కన్నులు వెల్లువలైనవి. మనస్సులోనే ''స్వామీ! ఇన్ని వేలమంది భక్తులిక్కడ మీకొరకు వేచియుండగా నా దీనాలాపన మీకు వినబడిందా! మా ప్రాణాలను, కారునూ కాపాడి సకాలములో సురక్షితంగా ఇక్కడికి చేర్చినారా!'' అని ఆ కరుణామయునికి నా కృతజ్ఞాతాభివందనము లర్పించుకున్నాను'' అన్నాడు డా॥ రంగారావు ఆ సంఘటనను వివరిస్తూ.

రెండు విశ్వవిద్యాలయాలకు వైస్‌ఛాన్సలర్ పదవి నలంకరించిన డా॥ భగవంతంగారూ, కేరళ రాష్ట్ర విద్యాశాఖ డైరక్టర్ డా॥ భాస్కర్ నాయర్‌గారు నాటి సమావేశములో బాబా అవతార వైభవమును గురించి ప్రసంగించిరి. ''నా జీవితమే. నా సందేశము'' అను బాబా ప్రకటనలోని అంతరార్ధమును గురించి డా॥ భగవంతంగారు వివరిస్తూ ''బాబాకు కోర్కెలు లేవు, అవసరములు లేవు. భక్తులు ఎక్కడెక్కడ వున్నప్పటికీ, అసంఖ్యాకములైన వాళ్ళ సమస్యలు పరిష్కరించుటలో బాబా నిరంతరం, నిర్విరామంగా నిమగ్నులై వుండుట చూచి వారి అపారకరుణకు ఎన్నోసార్లు దిగ్భ్రాంతి చెందితిని. నిష్కామ కర్మను ప్రభోదించు బాబా దాని ఆచరణలలో నిరుపమాన మార్గదర్శకులు'' అనిరి. డాక్టర్ భాస్కరనాయర్ ''బాబా పాద పద్మముల వద్ద శరణాగతి పొందిన ఫలితముగా నా జీవితమును సార్ధకము చేసుకొను అవకాశము లభించినది. నేనిప్పటికీ సైన్స్‌లో విద్యార్ధినే. సైన్స్ యొక్క పరిమితమైన ప్రభావమును గ్రహించగలిగితిని. బలదర్పములకు కాక, యోగులకు జ్ఞానులకు తలయొగ్గిన మనదేశ పవిత్ర సంస్కృతిని ప్రాముఖ్యతను గ్రహించగలిగితిని. శివాజీ తన గురువైన సమర్ధ రామదాసు పాదముల వ్రాలి తన సమస్తమూ అర్పించినాడు. కేరళ రాజు మార్తాండవర్మ తిరువనంతపురములో ప్రతిష్ఠితుడైన భగవంతునికి తన రాజ్యము నర్పించినాడు. యుద్ధమువలన కలిగిన దుఃఖము ప్రాణ నష్టము చూచి పశ్చాత్తాపము చెంది రాజ్యకాంక్ష విడచి శాంతికామియై కీర్తి గడించినాడు. నేడు నైతిక విలువలు పతనమగుచున్నవి. అరాచకచర్యలు, అవినీతి, అశాంతి విలయతాండవం చేస్తున్నాయి. నేటి యువకులు త్రాగుడు, జూదము మొదలయిన విషయవాంఛలకు బానిసలై భారతీయ సంస్కృతి, సాంప్రదాయముల విలువలు విస్మరించి దుర్బలులగుచున్నారు. ఈ దుస్థితి నుండి దేశమును కాపాడుటకు సనాతన ధర్మమును ప్రజల హృదయముల పునః ప్రతిష్ఠించి సంస్కరించుట అత్యావశ్యకము. ధర్మ స్థాపనార్ధము బాబా అవతరణ శంఖారావం వంటిది. మానవ చరిత్రలో అత్యంత ధర్మగ్లాని సంభవించిన ఈ తరుణంలో బాబా ఆశాజ్యోతివలె అవతరించి మానవాళికి శాంతి క్రాంతి పథములు చూపి నడిపించుచున్నారు'' అని పలికిరి.

బుద్ధి ప్రభావముతో చంచల స్వభావముగల మనస్సును ఎట్లు అదుపులోనికి తెచ్చుకొనవలెనో తద్వారా ఆత్మ సాక్షాత్కారము నెట్లు పొందవలెనో బాబా తమ



దివ్యోపన్యాసములో సుమారు 45 నిమిషములు తమ అమృతవాణితో విశదీకరించిరి. ఉపన్యాసము చటుక్కున ఆగిపోయెను. లింగోద్భవమునకు ముందు కనిపించు సూచనలైన ఎగశ్వాస దిగశ్వాసలు ప్రారంభమైనవి. బాబా కూర్చునిరి. అందరిని భజన చేయమని బాబా సౌజ్ఞ చేసిరి. భజనపై ధ్యాసలేకుండా భక్తులు యాంత్రికముగా భజన చేయు చుండిరి. ఆ దివ్య లింగోద్భవ సంఘటన దర్శించుటకు అందరి సర్వేంద్రియములు నయనేంద్రియములలో కేంద్రీకరించబడినవి.


అమిత కాంతివంతమైన విద్యుద్దీపములు వెలుగులో బాబా ప్రతి కదలిక కనబడుచున్నది. మధ్య మధ్య ముందుకూ వెనకకు ఊగుచు మెలికలు తిరిగి పోవుచున్నారు. అప్పుడప్పుడు గ్లాసులో పోసివుంచిన నీరు కొద్ది కొద్దిగా త్రాగుచుండగా, అవతార మూర్తికి సమకాలికులుగా జన్మించు భాగ్యము పొందిన యాభైవేల కన్నులు సంభ్రమాశ్చర్యములతో క్షణమొక యుగముగా 15 నిమిషములు తదేక దృష్టితో వీక్షించు చుండగా ఒక్క ఉదుటున లింగము ఉద్భవించి, బాబా వారి నోటి నుండి దోసిలిలో పడినది. జయజయ ధ్వానములు మిన్నుముట్టినవి. నీలకాంతిలో తేజరిల్లుచున్న యాస్ఫటిక లింగమును చేతివేళ్ళ మధ్య నుంచి చెయ్యిపై కెత్తి బాబా దాని నందరికి చూపి సంతృప్తి పరచిరి.


లింగోద్భవమైన వెంటనే సాధారణముగా బాబా నిలయములోనికి వెళ్ళుదురు. అట్లు కాక ఆ నాడు కుర్చీలో నిశ్చలముగా కూర్చునియే యుండిరి. మరికొంత సమయములో మరియొక లింగముద్భవించునేమోయని భావించి భక్తులెల్లరూ నిర్విరామ ముగా భజన చేయుచుండిరి. కాని బాబా కుడిచేయి టేబుల్‌మీద అడ్డముగా పడివున్నది. ఎడమచేతి మోచేయి టేబిల్‌మీద మోపబడి వుంది వ్రేళ్ళు కంటికి దగ్గరగా వుండునట్లు నిలువుగా నిలిచివున్నది. శిరము కొద్దిగా ఎడమ ప్రక్కకు వాలినది. బొటన వ్రేలు దూరముగానూ చిటికెన వ్రేలూ ఉంగరపు వ్రేలూ ముడుచుకుని మిగిలిన రెండు వ్రేళ్ళూ తెరచుకుని ఉన్నవి. అంతే అదే స్థితిలో ఉండగా శరీరము బిగుసుకుపోయి చలనము ఆగిపోయినది. శ్వాస నిలచిపోయినది. నేను బాబా కుర్చీకి కుడిప్రక్కనూ డా॥నాయర్, డా॥ భగవంతంగార్లు ఎడమ ప్రక్కనూ కూర్చొని యున్నాము. ఐదు నిమిషముల తర్వాత స్వామి నిశ్చల స్థితిని గమనించి మేము ఒకరి ముఖములు ఒకరు చూచుకొను నారంభించితిమి. ఇరవై నిమిషములు గడచినవి. నెమ్మదిగా ''స్వామీ స్వామీ'' యనుచూ బాబా కుర్చీవైపు జరిగి ప్రక్కకు వంగి పలకరించితిని. నా ఆతురతకు కారణము గ్రహించిన డా॥ భగవంతం, నాయర్‌గార్లు కూడా అటు వైపు నుండి పరిశీలించు చుండిరి. గాలికి బాబా సుందర కుంతలములు కదులుచుండుట తప్ప ఏ యితర చలనమూ లేదు. వారు భౌతిక శరీరమును విడచి సూక్ష్మ శరీరముతో పర్యటించుట క్రొత్త కాదు. అయితే యిట్లు బహిరంగసభలో ఇన్ని వేలమంది ముందు ఇట్లు చేయుట ఇదే ప్రథమము. 30 నిమిషములు గడిచినవి. మా ఆందోళనను గమనించిన భక్తులలో తీవ్రమైన భయ సంభ్రమములతో కూడిన సంచలనము


బయలుదేరినది. కొందరు కండ్లనీరు నింపుకొని కంగారుపడుచుండగా అప్రయత్నముగా నాకు కండ్లలో నీరు తిరిగినది. 40 నిమిషములు గడచినవి. భజన యాంత్రికముగా కొనసాగుచున్ననూ, అందరి దృష్టి బాబామీదనే కేంద్రీకరించబడి వున్నది. ముందు వరుసలో వున్న కొందరు పెద్దలు, సహనము సన్నగిల్లుటచే గబగబ వేదిక మీదకి వచ్చి బాబాను భయ ఆశ్చర్యములతో పరిశీలింప దొడగిరి. ఏవిధమయిన చలనము కాని శ్వాసకాని లేదు. భక్తుల ఆందోళన మితిమీరినది. కొందరు వెక్కి వెక్కి ఏడ్చుట ప్రారంభించిరి.


ఏభయి అయిదు నిమిషములు గడిచినవి. ఆ.... వ్రేళ్ళలో స్వల్ప చలనము.... ఎడమచేయి కదలిక చూచితిని. నా కన్నుల నిండిన నీరు జలజల రాలినవి. బాబా కన్నులు తెరచిరి; మందహాసముతో మా భయసందేహములను పరిహసించిరి. బాబా లేచి నిలబడిరి. ఆ జనసందోహమున ఆనందమునకు అవధులు లేవు.


ఆ శివరాత్రి పర్వదినమున నిర్మల భక్తితో మనసారా ఆరాధనలు జరుపుకొనుచున్న అసంఖ్యాకులైన భక్తులు అనేకచోట్ల జరుపుకొనుచున్న సభా కార్యకలాపములు వీక్షించి అనుగ్రహించుటకై మానవ సంచారియై బాబా కాయమును వీడి చనియుండెను.

















# సర్వం - సర్వమయం

''సాధారణ నీతిసూత్రములు, పిల్లలు ఏ విధమైన మానవులుగా తయారు కావలెనో, ఎందుకు కావలెనో వారికి బోధించవు. కేవలము కొన్ని నియమములను, అవి పరస్పర విరుద్ధములైననూ సరే, వారిపై రుద్దుట జరుగుచుండును. దానితో పసిపిల్లలలో నీతి నియమములన్న ఒక విధమైన నిరసన భావము, భయసంశయాలు ఏర్పడును. పోనీ పెద్దలు అనుసరించెడి మార్గములు నిజముగా అనుసరించదగినవా అని పరిశీలిస్తే వాటి నైతిక విలువల స్థాయి దిగజారివుండును.'' ఇది వ్రాసినది 'ఆబ్జెక్టివిస్ట్' పత్రికా సంపాదకుడైన అయిన్‌రాండ్.

స్వచ్ఛమైన పవిత్రప్రేమను కోరెడివారికి దానిని అందించు బాబా వద్దకు పిల్లలు ఆకర్షింపబడుటలో ఆశ్చర్యము లేదు. ''తల్లి ప్రేమని ఎరుగనివారగుటచే అమెరికన్లు నా వద్దకు వచ్చెదరు'' అన్నారు బాబా.

''బాబా శివస్వరూపులు. ఆదిశక్తి; తల్లీతండ్రి కూడాను. వారినెవరూ అర్ధము చేసుకొనజాలరు. అయినప్పటికీ వారి నుండి ప్రతి ఒక్కరూ ఏదో ఒక ప్రయోజనము పొందుచునే వుందురు. శాస్త్ర గ్రంధములు వారి మహత్తర మహిమాన్వితమూర్తిని నిర్వచించలేవు. వారి దివ్యత్వము తర్కశాస్త్రమున కతీతము. జ్ఞానులూ, నిర్మల హృదయులూ మాత్రమే వారిని తెలుసుకొనగలరు. ప్రపంచములోని మాతృ వాత్సల్య మంతయు చేర్చిననూ సాయి ప్రేమకు సరితూగదు.'' అని శ్రీ వేలూరు శివరామ శాస్త్రిగారు బాబాను అభివర్ణించిరి. శ్రీ శివరామశాస్త్రి అత్యంత ప్రతిభావంతుడైన కవి, ఉద్దండ పండితులు, విమర్శకులు, యోగతంత్ర వేదాంత విషయములలో ప్రబోధకులు. 75వ యేట బాబాను దర్శించి తనువు చాలించు వరకు ఆరు సంవత్సరములు బాబా ప్రేమానుగ్రహమునకు పాత్రుడైన పుణ్యాత్ముడు.

దసరా ఉత్సవము బాబా దివ్యసన్నిధిలో జరుగుటచే పరమపవిత్రమైన వాతావరణం భక్తుల హృదయములలో నిండుతుంది. దేవీ నవరాత్రులు వైభవంగా జరుపుతారు. ఈ తొమ్మిది రోజుల ఉత్సవంలో మొదటి మూడు రోజులూ రక్షకురాలిగా, తరువాత మూడు రోజులూ జగద్ధాత్రిగా చివరి మూడు రోజులూ జగద్గురువుగా, ఆ జగజ్జననిని ఆరాధించు కార్యక్రమములు బాబా ఏర్పాటు చేయుదురు.

బాబా నుద్దేశించి విక్టోరియామిల్స్ ''మాతా! ఇది నీ స్వప్నసీమ, అరుణ వర్ణకుసుమముల నీలాకాశముతో కూడుకున్న స్వప్నము. ఆనందమయ స్వప్నము. సాగుచున్న కాలములో పరిభ్రమించు కాయముల స్వప్నము; హృదయాంతరాళముల కోర్కెలుద్భవించు స్వప్నము. నీ ప్రేమ వాహినిలో మునిగి తిరిగి పునీతులమై పునరుజ్జీవన

మొందుదుము గాక!'' యని ప్రార్థించెను.

ఆధ్యాత్మిక సాధనలో మనము పురోగమించుటకు దసరా ఒక మంచి అవకాశము. ఏలనన బాబా జగజ్జననిగా మనకు దర్శనమిచ్చెదరు. మోక్షమార్గమున గల శత్రువులను నిర్జించి లక్ష్యమును చేరుటకు సనాతన ధర్మము సర్వశక్తి యుతమైనది. ఒక రోజున ప్రశాంతి నిలయ వైద్యశాల వార్షికోత్సవము జరుగును. మరొక రోజున పెద్ద యెత్తున దరిద్ర నారాయణులకు అన్నవస్త్రదానము జరుగును. ఈ జీవిత రంగస్థలిపై ఒక్కొక్కరికి ఒక్కొక్కపాత్ర నిచ్చి బాబా మనలను ఆడింతురు. కొన్ని రోజులు సుప్రసిద్ధ వాద్య గాత్ర సంగీత విద్వాంసులు స్వరమాధుర్యముతో ఓలలాడించెదరు. మరికొన్ని రోజులలో బాలబాలికలచే పురాణగాధల నాధారముగా చేసుకుని బాబా రచించిన నాటకములను ప్రదర్శింప జేయుదురు. మనలోనీ మానసిక వ్యాధులను నయము చేయు లక్ష్యములతో తదనుగుణ్యమైన సదంశములు అందించుచు వివిధ కార్యక్రమములను ఏర్పాటు చేసెదరు. పలువురు పండితులు నిత్యమూ సభలలో వేద వేదాంతములపై ఉపన్యసించుచుండగా సర్వమూ వేదపురుషుడైన బాబా యొక్క వర్ణనయేనని ద్యోతకమై భక్తుల హృదయములు పారవశ్యమున ఉప్పొంగిపోవును.

సభావేదికపై నిర్విరామముగా జరుగు వేదపురుష సప్తాహము యొక్క వైభవము వర్ణనాతీతము. సర్వమూ తన గర్భమున చేర్చుకొని పవిత్రము చేయు అగ్నిహోత్రుని అఖండముగా జాజ్వల్యమానముగా వేదికపై ప్రతిష్ఠించెదరు. అగ్నితోపాటు మంత్ర యుక్తముగా దినకరియైన సూర్యుని కూడ ఆరాధించుటకు ఒకవైపున సూర్యనమస్కారములు కొనసాగుచుండును. వేద పురుషునిలో నిబిడీకృతమైన సర్వశక్తుల చిహ్నములు ఆరాధించబడుచుండును.

మనలో కొందరు అగ్నినికాని, సూర్యునికాని, వటవృక్షమునుకాని, భగవంతుని రూపముగ ఆరాధించక నిర్వికార పరబ్రహ్మ ప్రతీకమైన లింగమును దైవముగా ఆరాధింతురు. నవరాత్రి ఉత్సవములలో నిత్యమూ పండితులు వేయి లింగములను చేసి అర్చించి తిరిగి మరుసటి దినము కొరకు ఆ సహస్ర లింగములను ముద్ద చేయుదురు. నిరాకార తత్వమునకు చిహ్నమైన ఆ ముద్దయే పరమశివుడు. అందు ధ్వనించెడి సృజనాత్మక మహాశక్తియే ఆదిశక్తి.

భగవంతుని శక్తి వైభవములను దర్శించి మహదానందమును పొందువారి కొరకు పుష్ప, చందన, దుకూల, కర్పూర నీరాజనములతో లక్ష్మికి, దుర్గకు, సరస్వతికి బాబా ప్రత్యేక పూజలు ఏర్పాటు గావించెదరు. 'ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ' అను పవిత్ర వాక్యమును జ్ఞప్తికి తెచ్చు ప్రణవనాదము వేదపారాయణమందు, విను వారందరికి వీనుల విందు చేయుచూ ఆధ్యాత్మిక సాధనలో ప్రథమ సోపానమారోహించుటకు దోహదము చేయును.



దసరా ప్రారంభ దినమున బాబా ఇట్లు ప్రకటించిరి. ''ప్రశాంతి నిలయములో జరుపు ఈ దసరా ఉత్సవములు విజ్ఞాన ఆనందదాయకమైన ఒక మహత్తర అవకాశము. అరిషడ్వర్గములను జయించి మీ హృదయములలో శాంతి నెలకొల్పుకొను శిక్షణ మీకు లభించును.'' రాష్ట్ర రవాణా మంత్రి ప్రశాంతి నిలయము చేరుటకు తారురోడ్డు వేయించెదనని ప్రకటించిన సందర్భములో బాబా ఇట్లు పలికిరి. ''శరీరము తారు రోడ్డు మీద అలసటలేని ప్రయాణమును వాంఛించును. మనస్సు భగవంతుని చేరుటకు శాంతియుత మార్గము కొరకు వెదకుచుండును. నా దృష్టిలో ఆ తారురోడ్డు కంటే ఈ రోడ్డు ముఖ్యము. రోడ్డుకు తారువేయడం వలన కలిగే సదుపాయంలో నా కంతగా ఆసక్తి లేదు. దీనివలన రోడ్ మీద ప్రయాణం చేసే వాళ్ళు నెమ్మదిగా, జాగ్రత్తగా వెళ్ళే క్రమశిక్షణ మందగిస్తుంది. జీవితము ఒడుదుడుకులూ ఎత్తుపల్లాలూ లేని చదునైన రహదారి కాదు. ప్రయాణము చేయుటలో తీసుకోవలసిన జాగ్రత్తనే జీవనయానంలో కూడా తీసుకోవడం భారతదేశ సాంప్రదాయం. అందుకే "Start early, drive slowly and reach safely' అనే హెచ్చరిక ఈ రెండు ప్రయాణము లకూ అన్వయిస్తుంది.''

ప్రశాంతి నిలయములో పర్వదినాలలో వుండే వసతి సౌకర్యముల కొరత దృష్ట్యా వేలకొలది భక్తులు తమ సామాన్లు ప్రక్కనే పెట్టుకొని ఆరుబయట నిద్రించుచుందురు. మూడు రాత్రులు దసరా పండుగల్లో ఎడతెరిపిలేకుండా వర్షము కురియుట చేత వేలాది భక్తులు ఎన్నో అసౌకర్యములకు గురికావలసి వచ్చింది. ఈ విషయమును ప్రస్తావించుచూ ''కొందరు నా వద్దకు పరిగెత్తుకు వచ్చి స్వామీ! ఈ వర్షము నాపు చెయ్యండి'' అని ప్రార్థించిరి. వర్షము లేక ఈ ప్రాంతములోని వారు పడుచున్న ఇబ్బందులతో పోల్చి చూస్తే భక్తులకు వర్షము జల్లు వలన కలుగు అసౌకర్యములు ఆత్య ల్పము. వేద పురుషయజ్ఞము జరుపుటలో ఒక ముఖ్య ఉద్దేశ్యము దైవమును మెప్పించి వర్షమును రప్పించుట. పండితులు వేద విహితముగా యజ్ఞము చేసినారనుట కిది ఒక నిదర్శనము. ఈ వర్షము భూమిని సశ్యశ్యామలముగావించుట కెంతో అవసరము'' అని బాబా పలికిరి.

1969 అక్టోబరు 20వ తేదీన పూర్ణాహుతితో యజ్ఞము సమాప్తి అయ్యెను. ఈ క్రతువు నిర్వహించిన ప్రధాన ఋత్విక్కునకు బాబా నవరత్నహారమును సృష్టించి యిచ్చిరి. షిర్డీసాయి అభిషేక సమయమున బాబా ఎనిమిది వజ్రములతో కూడిన సుందరమైన ఒక స్వర్ణపతకమును సృష్టించి షిర్డీ సాయిబాబా రజిత విగ్రహము యొక్క ఫాల భాగమున తిలకమువలె నుంచిరి. అది అక్కడ హత్తుకుపోయింది. దీని నంతనూ డా॥ యస్. భగవంతం, శ్రీ టిడ్‌మన్ జొహాన్సెస్ దీక్షగా వీక్షించు చుండిరి. రజిత విగ్రహమునకు స్వర్ణపతకము అట్లు అతుకుకొనుట వారికి వింతగా తోచెను. వారి హృదయములందలి సందేహము వారు చెప్పక ముందే, సర్వజ్ఞులైన బాబా వారితో ఇట్లనిరి. ''నేనా ఆభరణమును సృష్టించగలిగినప్పుడు దానిని అతికించలేనా? ఒక దానిని మీరు

సంశయించినప్పుడు సమస్తమునూ సంశయించవలసి వుంటుంది. నా తత్వము నెరింగి నన్ను గ్రహింపుడు. అప్పుడు మీ విశ్వాసమున కెట్టి శంకలూ, ఆటంకములూ రానేరావు'' అన్నారు మందహాసముతో.

''భగవంతుడు నిర్దయుడనీ మీ ప్రార్థనలను మన్నించుట లేదనీ మీరు భావించు చుందురు. భగవంతుడు ప్రేమమయుడు. ప్రేమయే భగవంతుడు. విశ్వసించుడు. మీ ప్రార్థనకు జవాబు రాకున్న నిశ్చల విశ్వాసముతో నిర్మల అంతఃకరణతో మీరు ప్రార్థించ లేదన్నమాట. అది కేవలము ఒక నటనే అన్నమాట. భగవంతుడు పరాయివాడనీ, ఎక్కడో వున్న నియంత అనీ, విశ్వాసనీయుడు కాదనీ భావించి సంశయాందోళనలతో ప్రార్థించకూడదు. భగవంతుడు మీ కత్యంత ప్రేమాస్పదుడూ సన్నిహితుడైన బంధువుయనెడి సంపూర్ణ విశ్వాసముతో ప్రార్థించవలెను'' అని బాబా ఉపదేశించిరి.

21వ తేదీన ఉయ్యాలోత్సవం జరిగినది. ఎందరో కవులు ఆనాడు వారి కవితలను గానము చేసిరి. శ్రీదీపాల పిచ్చయ్యశాస్త్రి, విద్వాన్ రామశర్మ, బీగమ్ తహిరాసయిద్, తదితరులు వివిధ భాషలలో ఆ గోష్ఠిలో పాల్గొనిరి. ఆ సందర్భములో ఉపన్యసిస్తూ ''కవీనాంకవి'' అయిన బాబా కవులనందరినీ ప్రతి అణువునందూ, ప్రతి బిందువు నందూ, ప్రతి కిరణమునందూ భగవంతుని కళాభి నివేశమును దర్శించమని ప్రభోదించిరి

అనంతపురం మహిళా కళాశాల చరిత్రలో నవంబరు 7వ తేదీ మరపురాని దినము, ఆనాడు భారత ఉపరాష్ట్రపతి శ్రీ జి.యస్. పాథక్ కళాశాల భవనమునకు శంఖుస్థాపన చేసిరి. ఆనాటి సభలో డా॥ ఎస్. భగవంతం ముఖ్య అతిథిని స్వాగతించిరి. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ కండూభాయి దేశాయ్ కాలేజి హాస్టలు భవనమునకు శంఖుస్థాపన చేసిరి. ఆ సందర్భములో వారు ఇట్లు ప్రసంగించిరి. ''కళాశాల స్థాపనలో దేశ వ్యాప్తముగా నాకెంతో అనుభవం వుంది. ఒక్క సంవత్సరములో 300 బాలికలతో వున్న ఈ కళాశాల పెద్ద గ్రంథాలయముతో, అన్ని సదుపాయములతోనూ పరికరముల తోనూ తీర్చి దిద్దిన ప్రయోగశాలలతో సంసిద్ధముగా నుండుట నన్నాశ్చర్యపరచింది'' అన్నారు కండూభాయి దేశాయ్.

డా॥ గోకాక్ మాట్లాడుతూ ''అరాచకమే నిత్యజీవన విధానముగా నున్న ఈ రోజులలో భగవాన్ అనుగ్రహముతో ఈ కళాశాల క్రమశిక్షణలో ఆదర్శములో మార్గదర్శి కాగలదు'' అన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయము యొక్క వైస్‌ఛాన్సలర్ ''ఈ కళాశాల పాలకవర్గమైన శ్రీ సత్యసాయి ట్రస్టుయొక్క చిహ్నము పవిత్రమైన భారతీయ సంస్కృతిని, సర్వమత వేదాంతసారమును చిత్రరూపకల్పనముతో అందించిన సందేశము'' అన్నారు. ఈ కళాశాల చిహ్నమును గురించి శ్రీ కండూభాయి దేశాయ్ 'మత ప్రసక్తి లేని రాజ్యాంగ విధానము (సెక్యులర్ స్టేట్) అంటే మతరహితమైనది కాదు; అన్ని మతములను గౌరవించునదని యర్థము. అన్ని మతములూ, ఒకే పరమసత్యము యొక్క విభిన్న



వ్యాఖ్యానములని తెలియజేస్తూ సర్వమత సామరస్యమును అభివ్యక్తము చేయు ఈ చిహ్నము ప్రశంసనీయమైన ఆదర్శము'' అన్నారు.

ఉపరాష్ట్రపతి శ్రీ పాథక్ తమ ప్రసంగములో 'ఈ సత్యసాయి సంస్థ వారు భారత జాతికి నేడు అత్యావశ్యకమైన ఆదర్శ విద్యా విధానమును రూపొందించి పెంపొందించుట నాకెంతో ఆనందమును కలిగించినది. ఈ విశాల దేశ బాధ్యతలను సమర్థతతో, ధైర్యస్థైర్యములతో, క్రమశిక్షణతో నిర్వర్తించ గలుగుతున్నట్లు భావితరము వారిని తయారు చేయుట కిటువంటి విద్యాలయము లెంతయిననూ అవసరము. అప్పుడే జాతీయ అంతర్జాతీయ రంగములలో మన భారత జాతి యొక్క కీర్తి, ప్రతిష్టలు నిలబెట్టగల క్రమ శిక్షణాపరులూ వివేకవంతులూ వర్ధిల్లుచుందురు' అని పలికిరి.

ప్రతి రాష్ట్రమందూ ఇట్టి కళాశాలలనూ స్థాపించుట తమ అభిమతమని ప్రకటించుచూ బాబా 'యువతులకు భారతీయ సంస్కృతికి అనుగుణ్యమైన సద్విద్యను గరుపుటయే నా సంకల్పము. వారి కవసరమైన క్రమశిక్షణ, ప్రబోధముల ద్వారా బుద్ధి వికాసము కలిగించి, హృదయములను పరిశుద్ధము గావించి వారి మనస్సులలో ప్రశాంతత, ఆనందములందించు వినూతన విద్యావిధానము రూపొందించబడినది. అధ్యయనము, ధ్యానము, నామసంకీర్తన, సాధన, సాధుసాంగత్యము అలవరచి వారి మానసికాభ్యున్నతికి తోడ్పడవలెను. ఆత్మవిశ్వాసము, ఆత్మజ్ఞానము, త్యాగము జనింపజేయు మార్గములలో నడిపించవలయును. ఈ కళాశాల విద్యార్థినులు సత్ప్రవర్తనులైన ఆదర్శ మాతృమూర్తులుగా, సత్యధర్మములకు అంకితమైన వీరులకు మాతలుగా తయారు కావలెనని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను'' అని జై జై నినాదాలు, కరతాళ ధ్వనులు మిన్ను ముట్టు చుండగా విద్యార్థినులను దీవించిరి.

నవంబరు 23వ తేదీన బాబా జన్మదినము. ఈ విషయమును ప్రస్తావించుచూ ఛార్లెస్‌పెన్‌తో బాబా యిట్లనిరి.'' మీరు జరుపుకొనునది నా జన్మదినము కాదు; మీ జన్మదినము కష్ట సుఖములందు నిరాసక్తి చూపగల స్థాయికి మానవుని కొనిపోవుటయే నా కర్తవ్యము.

''అటువంటి మహోన్నత మానసికస్థితి యందు మానవుడు అనుక్షణమూ జనన మరణములను పొందుచుండును. ఎందువల్లననగా ఈ రెండూ ఒకే స్థితి యొక్క రూపాంతరములు; నిరాకారము నుండి సాకారములోనికి నిర్గమించు స్థితి సాకారము నుండి నిరాకారమున లయమగు స్థితి. ఆ స్థితిలో జయాపజయములు లేవు. సుఖదుఃఖము లుండవు. భక్తుడిట్టి సమైక్య స్థితిని పొందగానే నన్ను చేరు ప్రయాణమంతటితో అంతమగును; అతడు నా యందే లీనమగును.''

**1969** జన్మదినోత్సవమున శ్రీ సత్యసాయి సేవాసంస్థల తృతీయ మహాసభ జరిగింది. ప్రశాంతికి అలవాలమైన ప్రశాంతి నిలయములో భగవంతుని ప్రత్యక్ష దివ్య సమక్షములో

ఈ సమావేశము జరుగుచున్నందుకు ఆ కార్యకర్తల ఆనందము వర్ణనా తీతము. మదరాసులో జరిగిన ప్రథమ సమావేశమున ప్రతినిధులతో బాబా కొన్ని గంటలు మాత్రమే గడుపుటకు వీలయ్యెను. బొంబాయిలో జరిగిన సత్యసాయి సంస్థల ప్రపంచ మహాసభల సందర్భములో ప్రతినిధుల వసతి భవనములకు, భోజనశాలలకు కూడా విచ్చేసి దర్శనమిచ్చిరి. ధర్మక్షేత్రమునకు పిలిచి ప్రతినిధులకు ఆ భవన నిర్మాణ కౌశలమును గురించి అందలి కళాఖండములను గురించి వివరించి వారి నానందపరచి ఆశీర్వదించిరి. ఇప్పుడు ఈ మూడవ మహాసభ బాబా కృపావీక్షణమున వారి దివ్య సమక్షములోనే జరుగు భాగ్యము లభించుట చేత సభ్యులందరూ ఆనందపరవశులైరి.

మహాసభలు నవంబరు 20వ తేదీన ప్రారంభమైనవి. 2000 మంది పైగా ప్రతినిధులు హాజరైరి. భారతదేశము నందలి వివిధ రాష్ట్రముల నుండియే కాక ప్రతినిధులు సిలోను, ఆస్ట్రేలియా, అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఫిజీఐలండ్ నుండి కూడా వచ్చిరి. ఆయా రాష్ట్రములకు చెందిన సేవాసంస్థల అధ్యక్షులు తమ ప్రాంతములలో జరుగుచున్న వివిధ సేవా కార్యకలాపముల గురించి నివేదించిరి.

సాయి సంస్థల ఆదర్శములను వివరించుచూ బాబా ''ఇవి మీ ఆధ్యాత్మిక సాధన కొరకు స్థాపించబడినవి. మీమీ కర్తవ్యములు, బాధ్యతల పట్ల శ్రద్ధ వహించుడు. కులతత్వములతో కాని, రాజకీయములతో కాని, విరాళములు సేకరించుట యందుగాని జోక్యము చేసుకొనకుడు. మీరెక్కడ ఏమి చేయుచున్ననూ మిమ్ము నిశితముగా గమనించుచునే వుందును. గర్వముతో యితరులను పరిహసించక, నమ్రతతో నడుములు వంచి తోటి మానవులకు సేవ చేయుడు. మీ భక్తి శ్రద్ధలను గురించి ప్రచారము చేసుకొనుట మీ చొక్కాలకు తగిలించుకున్న బ్యాడ్జీ అధికార చిహ్నమనుకొనుట మూర్ఖత్వము'' అని హెచ్చరించిరి.

సాయి సంస్థలకు సంబంధించిన ఆధ్యాత్మిక కార్యకలాపములు, సాయి సాహిత్య ప్రచురణలు, మహిళా విభాగ్ కొనసాగించుచున్న కార్యక్రమము పరిశీలించి వాటి అభివృద్ధికి ఉపసంఘముల వారు సమర్పించిన ప్రణాళికల విషయములో కొన్ని ముఖ్యాంశములైన కార్యకర్తల బాధ్యతలు, శ్రద్ధాసక్తులు, క్రమశిక్షణ గురించి బాబా విశదీకరించిరి.

మహాసభలలో తీర్మానించిన ముఖ్యాంశములివి: సభ్యులు కనీసము అరువది శాతము సమావేశములకైననూ హాజరు కావలెను. కార్యకర్తల యెన్నికలు ఏకగ్రీవముగా నుండవలెను. బాబా ప్రబోధనలను తాము ఆచరణలో చూపి, యితరులకు వివరించగల సమర్థులే కార్యకర్తలుగా నుండుట కర్హులు. సాయి సంస్థలలోని సభ్యులందరూ సత్య భాషణమూ, సహనమూ, ప్రేమ, కరుణ, సేవాతత్పరత మున్నగు సుగుణములుగల ప్రవర్తనను అభ్యసించవలెను. తల్లిదండ్రులకు సముచిత సేవలు చెయ్యనివారు, పెద్దల యడల గౌరవ



మర్యాదలు చూపనివారు సాయి సంస్థలలో సభ్యులుగా వుండుటకు అనర్హులు. తోటిమానవులకు సేవలు చేయు కార్యక్రమములను నిస్వార్థబుద్ధితో నిర్వర్తించువారే, ఆత్మజ్ఞానమును గూర్చి ప్రచారము చేయుటకు పాత్రులు. పిల్లలకు దైవభక్తి, పాపభీతి ప్రబోధించు కార్యక్రమములు చేబట్టు మహిళా విభాగములు, సమాజ సేవ యనిన అభిలాషపడు యువతీయువకులకు ప్రత్యేక కార్యక్రమములతో రూపొందించ బడిన సేవాదళములు ప్రారంభించి విస్తృతము చేయుకృషి చేయవలెను.

నవంబరు 22వ తేదీన మహాసభల ముగింపు సమావేశములో ప్రసంగించుచూ ''మీ గమ్యమును గురించి సందేహించకుడు. సంశయ చిత్తులు కాకుండా వివేక విచక్షణలతో విచారణ సల్పి సత్యాన్వేషణ కొనసాగింపుడు. ఆత్మ విశ్వాసముతో, ధైర్యముతో మీ విధులను మీరు నిర్వర్తింపుడు. ఈశ్వరాదేశ పూర్వకమైన కార్యనిర్వహణలో మీరు నిమిత్త మాత్రులని గుర్తుంచుకుని నిశ్చల చిత్తముతో కార్యదీక్షకు పూనుకొనుడు. మీరు ఆచరించు ఆదర్శములనే యితరులకు బోధించుచూ సర్వులనూ ప్రేమించి సేవించుడు'' అని ఉపదేశించిరి.

సమావేశమునకు హాజరైన వారికి బాబా ప్రేమతత్వము యొక్క విశ్వరూపము ఆవిష్కృతమైనది. అందరి కన్నులూ బాబా దివ్యమంగళ రూపమును గాంచుటయందూ, అందరి వీనులు బాబా వాగామృతమును గ్రోలుటయందూ, అందరి మనస్సులూ బాబాను ఆరాధించుటయందూ, లగ్నమైనవి. ఉపసంఘముల సభ్యులు చర్చలు జరుపుచున్నప్పుడు వారి మధ్య కూర్చుని బాబా సలహాలనిస్తూ, ఛలోక్తులతో నవ్విస్తూ, వివిధ రాష్ట్రముల ప్రతినిధులను ఆనందపరచిరి. భోజనములు ఏర్పాటు చేయుట, కార్యక్రమములు చర్చనీయాంశములు. సమాలోచనలకు సమయము సకలమూ బాబాయే పర్యవేక్షించిననూ వారిలో ఎట్టి అలసట కన్పించ లేదు.

నిష్కామ కర్మను తెలుసుకొనదలచినచో బాబాను దర్శించవలెను. వారు నిర్ణయించిన కార్యక్రమములలో పాల్గొను అవకాశము లభించినవారు బాబా ఒక నిర్విరామ అనుగ్రహవాహిని యని గ్రహించెదరు. వారి పాదస్పర్శచే జీవిత సమస్యలను ధైర్య సాహసములతో పరిష్కరించుకొనగల శక్తి ప్రాప్తించును.

నవంబరు 23, 24తేదీలలో బాబా జన్మదినోత్సవము జరుగుటచే ప్రతినిధులు ఆనందోత్సాహములతో అచ్చటనే యుండిరి. ''ప్రేమ స్వరూపునిగా మీ హృదయములందు నేను అవతరించిన సుదినమే నిజమైనా నా జన్మదినము. ఆ ఉత్సవమే నాకు ఆనందము'' అని బాబా జన్మదినోత్సవ సందేశము నందించిరి. పతాకావిష్కరణ సందర్భమున అక్కడ చేరిన 15000 మంది భక్తులనుద్దేశించి ''మానవ రూపములో అవతరించిన శివ శక్తి సమస్త మానవాళినీ తన వద్దకు ప్రేమతో రప్పించుకొనుచున్నది. ప్రతి వ్యక్తి భగవంతుని ఉద్యానవనమున వెలసిన ఒక పుష్పము. ఈ పుష్పము పృథివి నుండి బలము, సూర్యుని నుండి తేజస్సును పొందుచున్నది'' అనుచూ అనేకత్వములోని ఏకత్వమును బోధించుటకు

బాబా మానవులను పూవులుగా పోల్చిన సందర్భమున, బాబా పూర్వ శరీరమైన షిరిడిసాయి ప్రబోధమును అభివ్యక్తము చేయుటకు నాడు దాస్‌గను మహరాజ్ గానము చేసిన గీతము జ్ఞప్తికి వచ్చును.'' వకుళ, కమలము, బంతి, చేమంతి, గులాబి, మాలతి, మల్లెచమేలి, జాజి సంపెంగ వంటి వివిధ పుష్ప సంతతులు ఒకే ఉద్యానవనములో వికసించి ఆ వనమునకు సౌందర్యము చేకూర్చుచున్నవి. పుష్పములన్నీ పృథివీ నుండే ఉద్భవించి ఆ పృథివిలోనే తిరిగి కలసి పోవుచున్నవి. అట్లు లయమగుటచేత వాటి వ్యక్తిత్వమునూ వైవిధ్యమునూ కోల్పోయి ఒకే మట్టిగా మారిపోవుచున్నది'' ఇదీ ఆ గీతము యొక్క సారము.

సమస్త మానవాళినీ ఆధ్యాత్మిక పథములో పురోగమింపజేయుటకు అవతరించిన ఆ పరమాత్మయే బాబా. మనము మన ఆప్తుల జన్మదినములందు వారికి బహుమతులిచ్చు చుందుము. కాని మన మధ్యనే యున్న భగవంతునికి మనమేమి యివ్వగలము? పరమాత్మ స్వరూపులైన బాబాయే నవంబరు 23వ తేదీన మనకు బహుమతులిచ్చెదరు. ప్రశాంతి నిలయ ఆవరణలో మనమందరమూ పంక్తులు తీర్చి కూర్చుండగా మన మధ్య నడుచుచూ మధుర వాక్కులతో, మందహాసముతో, కటాక్ష వీక్షణముతో మనకు మిఠాయి పంచి పెట్టెదరు.

ఈ ఉత్సవముల సమయమునందు, ప్రతిసారి ఉపన్యాసము ముగించిన పిమ్మట బాబా స్వయముగా కొన్ని భజన కీర్తనలను గానము చేయుదురు. బాబావారి మధురాతి మధురమైన కంఠస్వరము, భాగవతమున శ్రీకృష్ణుని వేణువాద ప్రభావమును గూర్చి చేసిన వర్ణన జ్ఞప్తికి తెచ్చును. భక్తులు ఆనందముతో మైమరచి ఆనందమున లీనమయ్యెదరు.

1969 డిసెంబరు 31వ తేదీన మైసూరు సత్యసాయి సేవా సంఘముల ప్రతినిధుల సమావేశము జరిగినది. ప్రతి జిల్లా అధ్యక్షులూ తమ తమ నివేదికలను చదువుచుండగా, బాబా వేదిక మీద వున్న ఆసనము నలంకరించకుండా, షామియానా చివర నిలుచుండిరి. ''మీరెప్పుడు ఎక్కడ ధర్మ సంస్థాపనకు దోహదము చేయు సత్కార్యములను చేయుచుందురో అప్పుడు దూరముగా ప్రత్యేక ఆసనమున కూర్చుండక, ఇట్లే మీతోనే మీవెనుకనే వుండి గమనించుచూ కార్యాచరణయందు ఉత్సాహము, ఉత్తేజము, ఆశీస్సులను అందజేయు చుందును.'' అనుచూ తమ ప్రసంగములో వివరించిరి.

కార్యకర్తల నుద్దేశించి బాబా యిట్లు పలికిరి. ''మీరు ముఖ్యముగా గర్వమును అహంకారమును విడిచిపెట్టవలెను. ఆధ్యాత్మిక సాధకునకు స్వాతిశయము విషతుల్యము. మీ హృదయములు నిర్మలముగా వుంచుకొన్న యెడల ధర్మపరాయణత, తద్వారా సద్వర్తన అలవడును. పరమాత్మ మీ హృదయముల భాసించుచుండగా మీరెట్టి భయ సంకోచములు పెట్టుకొనవలదు. మీ ఆదర్శ జీవితము మీకు మనశ్శాంతిని చేకూర్చుటయేగాక మీ గృహమున ప్రశాంతి చేకూర్చును. సత్ప్రవర్తన ద్వారా ఇట్లు నెలకొను ప్రశాంతి వ్యక్తి నుండి



సమాజమునకు, సమాజము నుండి దేశమునకూ, దేశము నుండి ప్రపంచమునకూ వ్యాప్తించును. అందుచేత మనసా వాచా కర్మణా పరోపకార పరాయణులై మెలగుడు. పాండిత్య ప్రకర్ష, సంపదవలన కలుగు దురభిమానమును దరిచేర నీయకుడు.''

మహిళా సంఘముల ప్రారంభోత్సవ సందర్భమున ''మీ గృహములలోనే ముందు సత్సంగములను ప్రారంభించుడు. మీ గృహములు కలతలకు, కార్పణ్యములకు, అంధ విశ్వాసములకు ఆటపట్టులు కారాదు; సుఖ శాంతులకు ఆలవాలమై యుండవలెను. పరస్పర సహకారము, సహనము ప్రేమాదర భావములతో మానవజాతి అంతా ఒకే కుటుంబముగా మెలగవలెనన్న ముందు గృహము లందలి వాతావరణమును సక్రమముగా తీర్చిదిద్దవలెను. దానికి సాయి సత్సంగములు తోడ్పడును. అందలి సభ్యులు క్రమ శిక్షణతో మెలగుచూ, ఇతరుల ఆనందమే తమ యానందమని భావించుచూ, వారి బాధలను తొలగించుటకు సానుభూతితో ప్రయత్నించవలెను. సేవాతత్పరత నలవరచుకుని, మురికిపేటలూ, ఆస్పత్రులూ, శరణాలయములకూ తరచు వెళ్ళి వారికి యథోచితమైన సేవచేయవలెను. సాధన రూపములో ధ్యానముకన్న సేవయే మిన్నయైనది.

''దిల్‌మే రాం, హాత్‌మేకాం'' హృదయములో దైవము, చేతిలో పని నిండి యుండవలెను.'' అని బాబా ప్రవచించిరి.

1970 మహాశివరాత్రికి వేలాదిమంది భక్తులు ప్రశాంతి నిలయమునకు వచ్చిరి. అసంఖ్యాక జన సందోహము మధ్య అంతా ప్రశాంతతయే. సేవాదళ్ వాలంటీర్లు ఆశ్రమములో పరిశుభ్రత నిశ్శబ్దత నెలకొల్పుటలో శక్తి వంచన లేకుండా పని చేయుచుండిరి.

వివిధరాష్ట్రముల సేవాదళ్ సభ్యుల సమావేశములో ''మీరందరూ నా కొరకు ఏదైనా సేవ చేసి నన్ను మెప్పించుటకు గాఢమైన కోరికతో వున్నారు కదా! అయితే వినండి. నాకు వేయి తలలు, వేయి పాదములు వేయి కన్నులు వున్నవి. సహస్ర శీర్షాపురుషః, సహస్రాక్ష, సహస్రపాద్.....'' అని వేదములు ఉద్ఘోషించుచున్నవి కదా! ఇచ్చట చేరిన వేలాది బాలురూ, వృద్ధులూ, బాధాతప్తుల యందూ నేనున్నాను. వారికి సేవ చేసినచో నాకు సేవ చేసినట్లే'' అని బాబా శెలవిచ్చిరి.

ఎన్నిసార్లు చూచినా ఎప్పటికప్పుడే వినూతనముగా దిగ్భ్రమ గొలిపేటటువంటి బాబా, హస్తచాలనముతో పుంఖానుపుంఖములుగా విభూతిని సృష్టించి షిర్డి సాయి రజిత విగ్రహమును అభిషేకించు మనోహర దృశ్యము శివరాత్రి ఉత్సవములో ఒక ముఖ్య ఘట్టము.

ఆ సాయంత్రం గోవా గవర్నర్ శ్రీ నకుల్‌సేన్, డా॥గోకాక్ ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు శాఖాధ్యక్షులు డా॥ దివాకర్ల వెంకటావధానిగార్లు ప్రసంగించిరి.

బాబా తమ దివ్యోపన్యాసము నొక సంస్కృత శ్లోకముతో ప్రారంభించిరి. ఆ శ్లోకము

యొక్క తాత్పర్యమిది: ''నేను మానవుడను కాను, మానవాతీతుడను కాను, భగవంతుడను కాను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుడను కాను, నేనెవరినని మీరడుగవచ్చు, నేను సత్య ప్రబోధకుడను, నేనే సత్యం, శివం, సుందరం'' వారము రోజులుగా బాబా గర్భమున పెరుగుచున్న శివలింగము బాబా ఉపన్యసించుచున్నప్పుడు ఆవిర్భవించుటకు సిద్ధమైనది బాబా కుర్చీలో కూర్చునిరి. లింగోద్భవ సమయ మాసన్నమైనదని గ్రహించిన భక్త జన సమూహము శివుని స్తుతించు కీర్తనలు పాడనారంభించిరి.

పావుగంట తరువాత లింగము ఆవిర్భవించినది. భక్తులు ఆనందాతిరేకముతో జయ జయ ధ్వానములు చేసిరి. ఆ రాత్రి యంతయూ అఖండనామ సంకీర్తన సాగినది. ఉపవాస జాగరణలు చేయుచున్న భక్తులెల్లరూ ఉత్తేజమును పొందుటకై ఆ పవిత్ర లింగమును అందరికీ కనిపించునట్లుగా వెండి పళ్ళెరములో నుంచిరి.

మరునాడు భజన సమాప్తి అయిన తరువాత బాబా స్వయముగా భక్తులకు ప్రసాదము పంచి పెట్టిరి. భగవద్గీతా సందేశమును గురించి బాబా నాటి ఉపన్యాసమును యిట్లు పలికిరి. ''మొట్టమొదట కర్మ యొక్క ఆవశ్యకత వివరించబడినది. తరువాత కర్మను నిష్కామ కర్మగా రూపొందించవలెనని బోధించినది. తర్వాత ధర్మము యొక్క ప్రాముఖ్యత చెప్పబడింది. కొన్ని అధ్యాయముల తర్వాత ధర్మమును కూడ పరిత్యజించి మోక్ష ప్రాప్తి కొరకు కృషి చేయవలెనని ఉపదేశించినది. చివరకు మోక్షము యెడల వాంఛ విసర్జించవలెననీ, ఆ వాంఛ కూడ బంధమేననీ ప్రబోధించినది. సర్వకాల సర్వావస్థలయందు తాను బంధితుడనని భావించుచున్నప్పుడు కూడ మానవుడు నిజముగా విముక్తుడే యని గీత ప్రకటించు చున్నది. నీవు అజ్ఞానము నుండి మేల్కొనినప్పుడు ఈ భవబంధములు భ్రమయని తెలుసుకొనగలవు. ఇది ఒక స్వప్నము వంటిది. నీవెప్పుడూ స్వతంత్రుడవే; విముక్తుడవే; సృష్టి స్థితిలయములు లేని ఆత్మవే.''

బృందావనములో నూతన కళాశాల భవన నిర్మాణమును త్వరిత పరచుటకు వలయు చర్యల నిమిత్తము బాబా బృందావనమునకు వెళ్ళిరి.

# బహిర్గతమైన జ్యోతి

1970 మే నెల 9వ తేదీ సాయంకాలము బృందావన్ నుండి బొంబాయికి బాబా ప్రయాణ సందర్భమున మూడు కార్లు బయలుదేరినవి. ఒక కారులో నాతోబాటు బొంబాయి సేవా సమితి సభ్యులిద్దరున్నారు. ఆ కారు బొంబాయినుంచి వారు తీసుకు వచ్చినదే. కారు వాలకము చూచి దాని స్థితిగతులను గూర్చి కుశల ప్రశ్న వేసితిని. ఆ మధ్యనే ఇంజనూ బాడీ తనిఖీ చేయించి పటిష్ఠము చేయించినట్లు ప్రయాణములో ఎట్టి యిబ్బందీ కలుగదనీ వారిద్దరూ హామీ యిచ్చిన మీదట మనస్సు స్థిమిత పడింది.

ముప్పయి మైళ్ళు వచ్చితిమో లేదో ఖంగుమని చప్పుడై కారు నిలచి పోయినది. డ్రైవరు కారు క్రింది దూరి క్రింద పడిన అవయవ భాగాన్ని చేత పట్టుకుని తెచ్చి నిర్లక్ష్యముగా తన కాళ్ళ దగ్గిర  పడవేసి తిరిగి కారు స్టార్ట్ చేసెను. ఏభయి మైళ్ళు వెళ్ళితిమి. ఇంజన్ కీచుమంటూ శబ్దము ప్రారంభించెను. కారు ఆపి డ్రైవర్ బోనెట్ ఎత్తి కొంత శల్యపరీక్ష చేసి తిరిగి ప్రయాణము సాగించెను. కొంత దూరము వెళ్ళిన తర్వాత, ఏదో అనుమానముతో కారు ఆపి కారు చుట్టూ వాసన చూచుచూ ప్రదక్షిణము చేసి మొండి ధైర్యముతో మళ్ళీ కారు నడప జొచ్చెను. నాకు ఆందోళన ప్రారంభయమ్యెను. నాతోటి ప్రయాణీకులు మాత్రము నిశ్చింతగా వుండిరి.

డెబ్బై అయిదు మైళ్ళు వెళ్ళుటప్పటికి కారు మళ్ళీ ఆగినది. డ్రైవరు బానెట్ ఎత్తి కారుకి ప్రాణావసరమైన శరీర భాగాలన్నీ పరీక్ష చేసి అందులో ఏదో వూడి వచ్చిన అవయవాన్ని జేబులో వేసుకుని,  మళ్ళీ యధావిధిగా రథాన్ని నడుపుట ప్రారంభించెను. ఆ కారునడక, ఈ డైవర్ నడతలతో నా భయం మిన్ను ముట్టింది.

మా అదృష్టవశాత్తూ వెనుకబడిన మా కారు కొరకు ముందు వెళ్ళిన రెండు కార్లూ కొంత దూరములో ఆగివున్నవి. నేను బాబా వద్దకు పరుగున వెళ్ళి కారు యొక్క ఒక్కొక్క అవయవమే వూడి వచ్చుచూ విరిగి కూలబడే సూచనలు కనబడుచున్నవనీ నన్ను వేరొక కారులోనికి మార్చుమనీ ప్రార్థించితిని. బాబా నవ్వి సర్కస్‌లో బఫూన్ సైకిల్ త్రొక్కుచూ ఒక్కొక్క భాగమే తీసి గిరవాటు పెట్టి చివరకు నేల మీద చతికిలపడు దృశ్యమును వర్ణించి అందరినీ నవ్వించిరి.

జాలిగొల్పు నా ముఖము చూచి నవ్వుచూ ''నీకేమీ భయము లేదు. కారు విరిగి నీవు క్రింద పడగానే మరొక కారులో నిన్నెక్కించే ఏర్పాటు చేస్తాను'' అన్నారు.

అప్పటి నుంచి కారు చాలా బుద్ధిగా ప్రవర్తించింది. అక్కడ నుండి 250 మైళ్ళ దూరములో వున్న ధార్వార్ రాత్రి ఒంటిగంటకు చేరితిమి. వైస్‌ఛాన్స్‌లర్ అడికె గృహము చేరిన పిదప ''మళ్ళీ ఏమైనా కారు అల్లరి చేసిందా?'' అని బాబా అడిగేరు. ''ఎందుకు

చేస్తుంది స్వామీ!'' అన్నాను. మళ్ళీ బాబాకు 'రిపోర్ట్' చేస్తానేమోనన్న భయం కారుకు మాత్రం వుండదా. ఆ తర్వాత అదే కారులో నిరాఘాటంగా పూనా అక్కడ నుండి బొంబాయి చేరితిమి.

బొంబాయి చేరిన తరువాత కారును 'వర్క్‌షాప్'కి 'సర్వీసింగ్' నిమిత్తము పంపగా, అంతా తనిఖీ చేసిన మెకానిక్ కారు డ్రైవరుతో ''ఇందులో ప్రయాణము చేసినవారు సజీవులుగా బొంబాయి ఎట్లు చేరారు? ముందు చక్రముల కాధారమైన స్ప్రింగ్ ప్లేట్లు విరిగిపోయి వున్నాయి.'' అన్నాడు బాబా అనుగ్రహ విశేషమైన ఈ అద్భుతము చెప్పుచుండగా జాయ్ ఐస్క్రీం కంపెనీ అధినేత జావా ''డ్రైవర్ భక్తుడు'' అనెను. ''ప్రయాణీకులు కూడా భక్తులే స్వామీ!'' అన్నాను. ''మీ అందరికంటె కారు గొప్ప భక్తురాలు'' అన్నారు బాబా.

ఆ కారుకొక వ్యక్తిత్వముంది. అది ప్రార్థించి అనుగ్రహము పొందింది. మానవుడు నిర్మించిన ప్రతి వస్తువు నందు జీవ చైతన్యం వుందని బాబా అనుచుందురు. జగదీశ్ చంద్రబోస్ యంత్రములకు అలసట వుండుననీ వాటికి విశ్రాంతి అవసరమని నిరూపించెను. బాబా ఆ సిద్ధాంతమును సమర్థించుటే కాకుండా ''పర్వతములు విలపించును, అంతవరకూ యెందుకు చీరలు విలపించును'' అనిరి. తర్వాత బొంబాయిలో అనంతపూర్ కాలేజి నిర్మాణములో పనిచేయుచున్న కూలీల కిచ్చుటకై 100 చీరలు తెమ్మనిరి. అందులో 96 ఎన్నిక చేసి మిగిలిన నాలుగు వేరే బల్ల మీద వుంచిరి.

ఒక గంట తర్వాత బాబా తిరిగివచ్చి ఆ నాలుగు చీరలున్న బల్ల వద్దకు వెళ్ళి చూడగా అవి విలపించుచున్నట్లు అశ్రువులు కనబడినవి. ''పాపం! ప్రక్కకు పెట్టేనని ఇవి బాధ పడుతున్నాయి. సరే, వీటిని కూడా అనంతపురము కొనిపోతాను.'' అని అన్నారు బాబా.

కొన్ని నెలల తర్వాత ఈ సంఘటనను ప్రశాంతి నిలయములో జరిగిన ఒక సభలో ప్రసంగించుచూ, గోవర్ధనగిరిని గూర్చి చెప్పు సందర్భమున వివరించిరి. లంకకు సేతువు కట్టుటకు వానరదండు చుట్టు ప్రక్కల నున్న పర్వత శిఖరములను పెకలించి ఒకరి చేతుల నుండి మరొకరు అందుకొనుచూ సముద్రమున బడవేయుచుండిరి. వారధి పూర్తయిన పిదప వానరులు తమ చేతులలో ఇంకనూ మిగిలివున్న పర్వతములను వొడ్డుననే గిరవాటు పెట్టిరి. దూరము నుంచి కొనిరాబడి అక్కడనే విసిరి వేయబడిన ఒక పర్వతము శ్రీరామ సేవకుపయోగపడలేక పోయితినన్న ఆవేదనతో దుఃఖించెను.

శ్రీరాముడా విలాపమును వని ''ఇక్కడనే వుండు. రాబోవు అవతారములో నిన్ను చేతితో యెత్తి చక్రమువలె మోసి ఇంద్రుని క్రోధఘాటి నుండి యాదవులను రక్షించుట కుపయోగించుకొనెదను'' అని ఓదార్చెను. ఆ పర్వతమే గోవర్ధనగిరి.

ధార్వార్‌లో బాబా దర్శనము కొరకు తెల్లవారు ఝామున నుండి వచ్చి కూర్చున్న



భక్తుల మధ్య ఉదయమున నడచుచూ కొందరిని పలకరింపులతోనూ, కొందరిని చిరునవ్వులతోనూ, కొందరికి విభూతి ప్రసాదము సృష్టించి యిచ్చుటతోనూ, కొందరు సమర్పించిన జాబులు, పుష్పములు అందుకొనుటతోనూ ఆనంద పరవశులను చేసిరి.

బాబా పదయుగళితో పవిత్రమయిన ఆ పచ్చిక బయలుపైననే ఆ రాత్రి కొందరు పరుండి, ఉదయమున అందరూ భజన ప్రారంభించిరి. కార్యకర్తల సమావేశమునందు ముఖ్యముగా నగర సంకీర్తన ప్రాధాన్యతను గురించి బోధించిరి. మధ్యాహ్నము షామియానాలో ఏర్పాటు చేసిన భజన యందు వేదికపై నిలచి దర్శనమిచ్చి పూనాకు బయలుదేరిరి.

పూనాలో, సిటీ పొలిమేరలో వున్న జామ్‌నగర్ హవుస్‌లో బాబా బసచేసిరి. తెల్లవారే టప్పటికి కాంపౌండంతా భక్తసమూహముతో నిండి పోయింది. సాయినామమును రుచి చూసిన భక్తులు దూరాభారములను లెక్కచేయుదురా! ఉదయము వారందరికీ దర్శనమిచ్చి వారి శ్రమ ఫలింపజేసిరి.

డా॥ అడికె, అతని కుమారుడు మనోహర్ బాబాతో పూనా వచ్చిరి. మనోహర్ భద్రావతిలో ఇంజనీరు. కొన్ని మాసముల క్రితము బాబా అతనికొక పచ్చపొదిగిన ఉంగరమిచ్చిరి. కొన్నాళ్ళకు ఆ ఉంగరములోని రాయి ఒక మూల చిట్లినది. పూనా నుండి తిరిగి వెళ్ళిపోవుటకు సెలవు తీసుకొను సమయమున మనోహర్ ఆ ఉంగరమును బాబాకు చూపెను. ''దానిని రిపేరు చెయ్యాలా?... ఓ! దాని మీద నా బొమ్మ కావాలా? అది యిప్పుడు కాదు. నువ్వు విదేశాలకు వెళ్ళే సమయములో యిస్తాను. ఇప్పుడు మెషీన్లలో పనులుంటుండగా ఆ ఉంగరమిస్తే అదంతా గీతలు పడుతుంది. అప్పుడు మరింత బాధ పడుతావు.'' అంటూ ఆ ఉంగరమును తీసుకొని బొటనవ్రేలు చూపుడు వ్రేలు మధ్య వుంచి పట్టుకొని, ఉఫ్ అని ఊదిరి. చక్కని ''M'' అను అక్షరము చెక్కబడిన ఉంగరముగా మారెను. రాయి పొదిగిన ఉంగరము మాయమయ్యెను. ఆ ఉంగరమును మనోహర్‌కు ప్రసాదిస్తూ ''లక్కీ ఛాన్స్ కొట్టేవు. ఇందులో బంగారం కూడా ఎక్కువుంది. మొరార్జీ బంగారం కాదు.'' అంటూ అతని వ్రేలుకు ఉంగరము తొడిగి ఆశీర్వదించిరి.

ధర్మక్షేత్రమునకు ట్రంక్ టెలిఫోన్‌లో బాబా మధ్యాహ్నము ఒంటిగంటకు వచ్చెదరనియూ, అక్కడ ఉదయము నుంచీ నిరీక్షించుచున్న భక్తులకా వార్త చెప్పి యిండ్లకు తరలి వెళ్ళమని సలహాయిమ్మనియూ వర్తమానము పంపితిమి.

వచ్చిన వందలాది కార్లు అలాగే నిలిచిపోయాయి. వేలాది భక్తులు కదలకుండా కూర్చున్నారు. ఒంటిగంట పదినిమిషములకు బాబా కారు ధర్మక్షేత్రము చేరినది. ఎండతీక్షణతను, కాలుతున్న నేలను లెఖ్ఖ చేయకుండా వేచియున్న భక్తుల వరుసలలో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ధర్మక్షేత్ర ముఖద్వారము నుండి ఎత్తులో వున్న సత్యదీప్ వరకూ ఇటూ అటూ భక్తులపై కరుణాకిరణ ప్రసారము చేయుచూ ప్రవేశించిరి.

బాల వికాస్ సభ్యుల కళా ప్రదర్శన ఏర్పాటు చేయబడినది. బాబా దానిని తిలకించిరి దేశమంతా దైవభక్తిని పసిహృదయములలో పెంపొందించుటకు సత్యసాయి సంస్థల ప్రయత్నములో విజయమునకీ ప్రదర్శన నిదర్శనము. అనాదిగా భారతావనిలో ఎందరో మహాజ్ఞానులందించిన జ్ఞాన సంపదను సులభగ్రాహ్యముగా బాబా అందించుచున్నారు.

ప్రదర్శించబడిన ప్రతి చిత్రమూ ఏదో విధముగా దైవచింతన, ఆధ్యాత్మిక ప్రయోజనము ప్రేరణ చేయునవే. కొందరు బాలబాలికలు వారి కత్యంత ప్రియమైన ప్రశాంతి నిలయము, బాబా చిత్రరచనలు చేసిరి. ఆ చిత్రములన్నింటిలోనూ ఆ పసిడి హృదయముల చిత్రరచనా శిల్పము వెనుకనున్న పవిత్ర భావవాహిని అందరినీ మురిపించి మైమరపించెను. షిర్డిసాయి, దక్షిణేశ్వర్, గోవర్ధన్, సెయింట్ పీటర్స్, జుమామసీద్ మొదలయిన క్షేత్రముల యొక్క మూర్తుల యొక్క ప్రతీకములను తయారు చేసి ప్రదర్శించిరి.

ఆ రాత్రి ఆరు యేడు సంవత్సరముల బాలబాలికలు నవరసభరితముగా నటించుచూ ప్రదర్శించిన నాటికలను చూచి అందరూ ముగ్ధులైరి. శ్రీరాముని ఆజ్ఞానుసారము సీతా దేవిని అడవులకు గొనితెచ్చి అచ్చట విడిచి వెళ్ళు సన్నివేశము నిద్దరు పిల్లలు నటించగా వారి హావభావ ప్రకటనలకు అచ్చెరువొంది ఆనంద భాష్పములు రాల్చని ప్రేక్షకులు లేరు. బాబా ఆ పిల్లల నాశీర్వదించి ఆ నాటికను వారిచేతనే రాబోవు దసరా ఉత్సవ సందర్భముగా ప్రపంచమంతటి నుండి వచ్చు వేలాది భక్తుల యెదుట ప్రశాంతి నిలయములో వేయించెద నని చెప్పి వారిని ఉత్సాహపరిచిరి.

మే 12వ తేదీ బొంబాయి నగరమునకు సత్యసాయి యుగమునకు స్వర్ణాక్షరములతో లిఖించదగిన పర్వదినము. 1968 మే 12వ తేదీన బాబా ధర్మక్షేత్రమునకు ప్రారంభోత్సవము జరిపిరి. అందుచేత ప్రతి యేటా ధర్మక్షేత్రము యొక్క వార్షికోత్సవము పెద్ద యెత్తున జరుగు చుండును. ఒక వైపున బొంబాయిలో ప్రాంతీయవాదుల సంఘర్షణలు భయోత్పాతము కలిగించుచుండగా వివిధ భాషలకు, రాష్ట్రాలకు, దేశాలకు చెందిన వేలాది భక్తులిక్కడ ధర్మక్షేత్రములో నిశ్చలముగా నిర్విరామముగా పదిగంటలు ఆఖండ భజన జరిపిరి.

ఈ ప్రాంతీయ సంఘర్షణల సందర్భముగా జరుగుచున్న దౌర్జన్యమును గురించి బాబా నిరశించుచూ యిట్లుపన్యసించిరి. ''వృక్షములను చూడుడు. వేరులు, మ్రానులు, కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పుష్పములు, ఫలములు వాటి వాటి ప్రత్యేకమైన రంగు, పరిమళము, మృదుత్వము కలిగి ఉండును. అయిననూ అన్నీ ఒకే విత్తనము నుండి ఆవిర్భవించినవే. అన్నీ భూమి సూర్యరశ్మి గాలి ఆధారంగా పెరిగినవే. ''బీజం మాం సర్వ భూతానాం'' అన్నాడు కృష్ణుడు. ''ఈ సృష్టికంతకూ నేనే బీజమును అన్నాడు. ఇటువంటి ద్వేషము, విభజన, హింసాకాండలకు మానవుడు పాల్పడుట ఎంతటి మూర్ఖత్వము. ఇటువంటి



ద్వేషావేశములకు ప్రేమయే ఉపశమనము కలిగించు అంజనము'' శ్రోతల హృదయములపై ఆ వచనములు చల్లని పన్నీరు జల్లువలె పనిచేసెను.

శ్రీ యమ్. యమ్. పింగె అధినేత అయిన పింగే విద్యాలయమునకు మే 13వ తేదీన వార్షికోత్సవము బాబా దివ్యసమక్షమున జరిగెను. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాధికులైన పెక్కుమంది ప్రత్యేక ఆహ్వానితులు అసంఖ్యాకులుగా సమావేశమైన ఆ సభయందు అనుగ్రహ పూర్వక దృక్కులతో వారి మధ్య బాబా నడచుచూ దర్శనా మృతమును పంచుచుండగా వేదికపై బాబాను స్తుతించుచూ ప్రార్థన ప్రారంభమయ్యెను.

వేదికపైపరచిన తివాసిపై కూర్చుని అందరినీ ఆనంద పారవశ్యమున ముంచిన బాబా, డా॥ గోకాక్, శ్రీ బార్డె, శ్రీ సావంత్ వేదికపైకి వచ్చిన పిదప, తమ కొరకు ప్రత్యేకముగ ఏర్పాటు చేసిన ఆసనముపై కూర్చొనగా, వారందరూ తమ తమ కుర్చీలపై కూర్చొనిరి. బాబా సభను ప్రారంభించమని డా॥ గోకాక్‌ను ఆదేశించెను.

ప్రఖ్యాత విద్యావేత్త, బెంగుళూరు విశ్వవిద్యాలయమునకు వైస్ ఛాన్సలర్ అయిన డా॥ గోకాక్ ప్రసంగించుచూ ''బాబా రూపొందించిన విద్యావిధానమును గూర్చి మాత్రమే ప్రసంగించెదను. అత్యంత దుస్థితిలో వున్న నేటి విధానము యొక్క దుష్ఫలితముల నుండి విద్యార్థులను రక్షించుటకు అదే శరణ్యము. బాబా నెలకొల్పిన విద్యావిధానమునకు సత్యమును వచించుట, ధర్మమును ఆచరించుట, శాంతి చిత్తమును సాధించుట, హృదయమును ప్రేమతో నింపుకొనుట యనునవి ఆధారభూతమైన ప్రధాన సూత్రములు. బాబా విద్యావిధానములో ఆత్మ విద్య ప్రధానాంశం. జీవితములోని ద్వంద్వానుభూతులపట్ల సమభావము కలిగించునదే అసలైన విద్య అంటారు బాబా తాను జీవనోపాధి సంపాదించి సమాజములో ఇతరులకు కూడ జీవనోపాధి కల్పించి సమాజాభివృద్ధికి తోడ్పడునట్లు చేయుటయే విద్య పరమావధి. విద్యార్థుల మనస్సులను విధ్వంసక దృక్పథము నుండి దూరము చేసి నిర్మాణాత్మకమైన దృష్టిని ప్రసాదించాలంటే నీతిదాయకములైన పుస్తకములు చదువుట చాలదు; ధర్మవర్తనులు, త్యాగధనులు అయిన పెద్దలతో సన్నిహితముగా వుండే వాతావరణము కల్పించాలి అన్నారు.

బాబా తమ దివ్యోపన్యాసములో విద్యావిధానమునకు ప్రధానమైన విజ్ఞానము, నేర్పు, సమభావము, అంతర్దృష్టిని గురించి వివరించిరి. జ్ఞానేంద్రియములు, పరిశీలనాశక్తి, వివేకముల ద్వారా విజ్ఞానము కలుగును. చరిత్రలో ఈ విజ్ఞానమును దుర్వినియోగము చేసి సంఘ శ్రేయస్సుకు బదులు సంఘవిచ్ఛిన్నము కలిగించిన సందర్భములెన్నో వున్నవి. విజ్ఞానమువలన లభించిన **skill** అక్రమార్గమున ప్రవేశపెట్టుటవలన **kill**గా పరిణమించును. తద్వారా సమదృష్టి విచ్ఛిన్నమై ఆత్మవిద్య నందించు అంతర్ దృష్టిని విడచి, మానవుడు లౌకిక వాంఛలను బాహ్యదృష్టిని వెంబడించి పతనమగును.

పెదగొట్టపాలెం జానకిరామయ్య బాబాను గురించి వినెను కాని, అనేక సాధు

సన్యాసులలో వీరొకరను భావముతో భక్తి విశ్వాసములు కలుగలేదు. వారి గ్రామమున కైదుమైళ్ళ దూరములో ప్రతిష్టింపబడిన శివలింగమే వంశపారంపర్యంగా వారి ఆరాధ్యదేవత. శివరాత్రి దగ్గర పడుచున్నది. ఫిబ్రవరి 15వ తేదీన శివరాత్రి. ఆ పండుగ ఏర్పాట్లలో నిమగ్నుడై వుండగా అతనికి తీవ్రమైన డిఫ్తీరియా జబ్బుతో గొంతు వాచెను. వైద్య సహాయము నిష్ప్రయోజనమయ్యెను. 13వ తేదీన పరిస్థితి శ్రుతిమించెను. ఆహారము లోనికి పోవుట లేదు; నీరు కూడా గొంతుక దిగుట లేదు.

ఆ రాత్రి, లోగడ తన బంధువొకడు తన యింటికి వచ్చి యిచ్చిన సత్యసాయి బాబా విగ్రహము గుర్తుకు వచ్చినది. బాబా అద్భుత శక్తులు జ్ఞప్తికి వచ్చి ఆ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పోత విగ్రహమును మంచము ప్రక్కనే పెట్టుకుని తదేక దృష్టితో దాని వైపు చూచుచూ క్రమముగా నిద్రపోయెను. కలలో బాబా కనిపించి నీరు త్రాగమని చెప్పగా త్రాగలేనని చెప్పి నిరాకరించెను. కాని బాబా బలవంతము చెయ్యగా భార్య తెచ్చిన కూజా నిండా నీరు ఒక్క చుక్క కూడా మిగల్చకుండా త్రాగి వేసెను. ఆఖరి గ్రుక్క త్రాగుచుండగా మెలకువ వచ్చెను. అప్పుడు రాత్రి 11 గంటలయ్యెను. జ్వరము, గొంతుకవాపు మాయమయ్యెను. శివరాత్రి పండుగలో యధావిధిగా పాల్గొనెను. ''బాబా పరమశివుడు. నేను వారి పాదములపై పడవలెను.'' అని వ్రాయుచూ పుట్టపర్తికి వచ్చు మార్గము తదితర వివరములు తెలుపకోరెను.

మద్రాసు నివాసి యూరిచ్ కె. వాడియా, వారి యనుభవము నిట్లు వ్రాసెను. ''ఊపిరితిత్తుల జబ్బు రావడం ఇది మూడవసారి, నేను రకరకముల మందులు వాడి విసుగు చెందితిని. చివరికి బెంగుళూరులో వున్న విక్టోరియా హాస్పిటల్‌లో చూపించు కొనమని వైద్యులు సలహా యిచ్చినారు. బెంగుళూరుకు వెళ్ళే ముందు బాబా దర్శనం కొరకు వెళ్ళినాను. దూరము నుంచే బాబాను ప్రార్థించితిని. తర్వాత వైద్యులతో సంప్రదించుటకు బెంగుళూరు వెళ్ళేను. అన్ని పరీక్షలు చేసి ''ఎవరయ్యా? నీకు ఊపిరి తిత్తుల జబ్బు వున్నదని చెప్పినది.'' అని అడిగారు. పైగా చెడిపోయినదని భయపడిన కుడి ఊపిరితిత్తు ఎడమ ఊపిరితిత్తు కంటే ధృఢముగా వున్నట్లు చెప్పినారు. బాబా దర్శనము నా రోగ నివారణకు కారణమైనది.

హాట్‌లాండర్ నికోలస్ అనుభవం చూడండి. ''నేను బాబాను చూడకముందు నుండీ బాబా అంటే భక్తి కలిగి వారి చిత్రమును గీయుచున్నాను. అది పూర్తి అగునప్పటికీ భారతదేశము వెళ్ళి బాబాను దర్శించవలెనని గాఢమైన కోరిక గలిగినది. భారతదేశము వచ్చి దసరా పండుగకు మూడు రోజుల ముందరే పుట్టపర్తికి వచ్చితిని. ఆ పండుగలో నాకు గలిగిన అనుభూతులు యిక్కడ అప్రస్తుతం. బాబా నన్ను చూడలేదు, పలుకరించలేదు. పండుగ అనంతరం నాకు తీవ్రముగా జబ్బు చేసింది. నాకు మందు యిచ్చే సమయంలో ఆశ్రమం డాక్టర్ ''సాయిరామ్!'' మీరే యితనిని పరీక్షించగలరు'' అనడం విన్నాను. బాబా! యూరప్ తిరిగి వెళ్ళి నా విద్యుక్త ధర్మములను నేను నిర్వర్తించే అవకాశం ప్రసాదించు. నన్నిక్కడనే మరణించనీయవద్దు'' అని ప్రార్థించితిని.



వెంటనే నా యెదుట బాబా కన్నులు తరువాత బాబా శిరోజములు కనబడినవి. నా చుట్టూ ప్రణవనాదం వినబడినది. ఉదయము నా పరిస్థితి బాగా మెరుగయినది. నాకు తెలియని పాశ్చాత్యుడు నా గదిలోకి వచ్చి నన్ను గురించి బాబా అడిగినట్లు చెప్పెను. 'భజనలో అటూ యిటూ ఊగుచుండే వృద్ధుడు డిక్‌ను నువ్వెరుగుదువా అని నన్నడిగి, వెళ్ళి చూసి అలనితో చెప్పు, రాత్రి అంతా అతని ప్రక్కనే వున్నాను. అతనికి గుండెపోటు వచ్చింది.. ఇప్పుడు నింపాదిగా వుంది' అన్నారట బాబా. నాపేరు డిక్ అనికూడా బాబాకి తెలుసునన్నమాట. రాత్రి నాకు కనిపించిన దృశ్యములోని అంతరార్థము అప్పుడర్థమైనది. నా సందేహము తీరి వారాపద్బాంధవులని గ్రహించితిని.''

ఆపదలలో వున్న వారికి తాము వాళ్ళతోనే వున్నట్లు వివిధ రకములైన నిదర్శనల ద్వారా తెలియజేస్తూ వుంటారు. బెంగుళూరు సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేయుచున్న డా॥ రామకృష్ణ ప్రశాంతి నిలయములో వుండగా రాత్రి 9.30 లకు హైదరాబాద్ నుంచి టెలిఫోన్‌లో అతని తల్లి, మెదడులోని రక్త నాళములు తెగిపోవుటవలన చాలా ప్రమాద స్థితిలో వున్నట్లు వార్త వచ్చింది. ఆ వార్త బాబాకు పంపగా, అది విని బాబా నేను హాస్పిటల్‌కి వెళ్ళి వచ్చినాను. ఆమె కులాసాగా వుంది, ఏమీ ఆందోళన పడకుండా రామకృష్ణను నిద్ర పొమ్మను'' అని చెప్పి కబురు పంపిరి.

ఆ సమయమున హైదరాబాద్‌లో అతని తల్లి కండ్లు తెరచి చుట్టూ చూచుచుండగా, అతని తండ్రి గమనించి బెంగుళూరు మదరాసు నగరములలో నున్న కుమారులను పిలిపించ మనెదవాయని యడిగిరి. ''అవసరము లేదు. బాబా యింతవరకూ యిక్కడే వుండి ప్రసాద మిచ్చి ధైర్యము చెప్పినారు'' అని ఆమె చెప్పినది. కొద్ది దినములలోనే ఆమె ఆరోగ్యము పొంది యింటికి వెళ్ళినది.

శ్రీ కె. దత్ గుప్త, ''ఇక్కడకు 30 మైళ్ళ దూరములో నున్న రంగియాలో ప్రిన్సిపల్ బీరేన్ బోర్డొలాయి తన టేబుల్ మీద నున్న అద్దము క్రింద బాబా యొక్క రెండు చిన్న ఫోటోలు పెట్టుకొనెను. అందులో ఒక దాని మీద బాబా స్వదస్తూరితో ''ఆశీర్వచనములతో శ్రీ సత్యసాయి బాబా'' అను అక్షరములు ఏర్పడినవి.'' అని తెలిపినారు.

లండన్ నుండి వచ్చిన సీతారామన్‌ను ''రాత్రి పరుండ బోవునప్పుడు గ్యాస్ మంట అర్పకుండా స్టౌ మీద నూనె గిన్నెనట్టే మరచి వుంచితివి కదా! నేను స్టౌవ్ ఆర్పకున్న ఏమి సంభవించేది.'' అని బాబా అడిగిరి.

కూర్గ్ నుండి సి.యం. అప్పయ్య తెలియజేసిన సంఘటన చూడండి. ''విద్యుచ్ఛక్తి సరఫరా ఆగిపోయినందున పదిహేను రోజులుగా మాకు చీకటి రాత్రులయినవి. కుమార్ భోజనము చేసి పండుకొనినాడు. అతడు మా పురాతన గృహములో వుంటున్నాడు. అక్కడ బాబా పటము ముందు క్రొవ్వొత్తి వెలిగించి దీపముగా పెట్టి అగరత్తులు వెలిగించి కొంచెము సేపు నామ స్మరణ చేయుట అతనికి పరిపాటి. ఆ రాత్రి గాలి హోరున వీచ సాగింది.

కుంభవృష్టి ప్రారంభమైంది. అతని చెవిలో ఎవరో ''కుమార్, లే, పరుగెత్తు'' అని హెచ్చరించిన స్వరం వినబడింది. అతను తలుపు తెరచి రోడ్ మీదకి వచ్చునంతలో ఇల్లు కూలి పోయింది. ఉదయము ఆ యింటి శిథిలములో ఫ్రేములో అద్దముతో బిగించిన బాబా పటమొక్కటే ఎట్టి నష్టము లేకుండా మిగిలి వున్నది.

ఒకనాడు సేతు మాధవన్ నాయర్‌కు రక్తముతో వ్రాసినట్లు ఎర్రని అక్షరములతో ఉత్తరము వచ్చినది. దాని మీద పుర్రె అడ్డముగా రెండు యెముకలుగల నక్సలైట్ చిహ్నము కూడా వున్నది. ఆ వుత్తరములో ''భజనలు ఆపి వేయుము. నీవు ప్రజలను మోసము చేయుచున్నావు. ఈ హెచ్చరిక చేరిన వారము దినములలో భజన ఆపివేయకున్న నీ తల ఎగిరి పోవును. జాగ్రత్త.'' అని వున్నది. కాని నాయర్‌కు తెలిసిన రక్షణ మార్గ మొక్కటే - సాయి నామము. ఏ భయమూ లేకుండా ఆ వారం రోజులూ యధావిధిగా భజన కొనసాగించినాడు. దానికా లేఖకుడు కోపంతో తన హెచ్చరిక అమలు జరుపు నుద్దేశ్యముతో 8వ నాటి వేకువ జాముననే స్నానము గదిలో వున్న ఆ భక్తునిపై గురి చూసి బాకును విసిరినాడు. ఆ తర్వాత ఏమి జరిగినది నాయర్ ఉత్తరములో వున్నది'' ఆరెంజ్ కలర్‌తో కూడిన సుడిగాలి హఠాత్తుగా వీచి ఒక మృదు హస్తము నన్ను మూలకు త్రోసినది. కత్తి క్రిందపడిన శబ్దము ఎవరో పరుగెత్తి పారిపోయిన శబ్దము వినబడ్డాయి.

ఈ ధ్వనికి నాయర్ భార్య, అతని స్నేహితుడు స్నానాల గదిలోకి వచ్చిరి. నాయర్ నోట మాటలేదు. ఆ గదియంతా వింత సువాసనతో నిండియుండుట, నాయర్ శరీరము విభూతితో నిండివుండుట గమనించి సర్వ వ్యాపకులైన బాబాకు ఆనందాశ్రువులతో ప్రణమిల్లిరి.

మంత్రవేత్త అయిన మెయిస్టర్ ఎక్‌హార్ట్ ''నేనెప్పుడూ ద్వారము వద్ద తలుపు తట్టి వేచి వుంటాను. నన్ను లోనికి రానిచ్చిన వారితో కలిసి భుజించెదను అని క్రీస్తు చెప్పెను. భగవంతుని కొరకు మన మెక్కడా వెదకనక్కర్లేదు. అతడెప్పుడూ మన దగ్గరే వున్నాడు. నిర్మలాంతఃకరణలతో ప్రేమించిన స్పష్టముగా చూడగల్గెదము. అతడే సత్యము. అతడెంత వరకు మన యందుండునో అంతవరకే మన ముండుట. నిర్మల హృదయముతో చేసిన మన ప్రార్థనలకు బాబా యెప్పుడూ సమాధానము లిచ్చెదరు'' అని వ్రాసెను.

మహారాష్ట్రములోని నందుర్బార్ గ్రామవాసి శ్రీ ఆర్.జి.ఘోలప్ ఈ విధముగా వ్రాసిరి. ''తెల్లవారు ఝామున 4-15 గం॥లకు నన్నెవరో మేలుకొనమని మూడు సార్లు హెచ్చరించిరి.'' నేనా మాటలను బద్ధకముచే పెడచెవిని పెట్టితిని. ''కనీసము కండ్లు తెరచి ఒకసారి చూడు'' అను తీక్షణమైన స్వరము వినబడినది. కండ్లు అయిష్టముగానే తెరచి చూచితిని. ఎదురుగా నాకు కనబడిన దొక దొంగ. ఇంట్లో వారిని లేపు నిమిత్తము నేను దొంగ దొంగయని యరుచుచుండగనే అతడు పారిపోయినాడు. నన్నెవరు నిద్రలేపి ఆపద నుండి కాపాడితిరాయని ఆశ్చర్యపడితిని. నా పూజాగది నుండి వరండావరకూ పరిమళ



విభూతితో కూడుకున్న బాబా పాద చిహ్నములు కనబడినవి.''

కెప్టెన్ బోస్ అంబాలా నుండి గౌహతికి కారులో ప్రయాణము చేయుచుండెను. తనతో బాటు తన భార్య, మామగారు కూడా వుండిరి. పెద్దగాలి వీచగా మార్గమంతా జలమయమై చెరువువలె నున్నది. హరిహర గంజ్‌వద్ద బురదలో కారు చక్రములు ఇరుక్కున్నవి. అప్పటికే రాత్రి 11-30 గంటలయింది. ఇక ఏ సహాయం దొరకలేదు. ఆ రాత్రి దగ్గరలో వున్న పాఠశాలలో తల దాచుకునిరి. అటువంటి పరిస్థితిలో ఆపాటి వసతి దొరకుట కూడ బాబా యనుగ్రహమేయని బోసు భార్య యెంచినది.

గౌహతిలో ఒక సైనిక న్యాయస్థానమున అతడు అధ్యక్షత వహించవలసియున్నందున ''ధర్మమే భగవంతుడు. కర్మ చేయుటయే భగవంతుని పూజ'' అను బాబా వాక్యములను చెప్పుచూ బోసు మాత్రము ఆ బురద నుండి కారును బయటకు లాగు విధానమును గూర్చి ఆలోచించు చుండగా తెల్లవారినది. ఆ దారిన పోవు ట్రక్కు కాని కారు కాని వారికి సహాయము చేయుటకు నిరాకరించిరి. బోసుకు కించిత్తు స్వాతిశయ భావమున్నది. వెంటనే అతడు త్రాళ్ళు తెప్పించి గ్రామస్తులలో కొందరి సహాయ సహకారములతో కారును బయటకు లాగి ప్రయత్నించెను. తాను కారు డ్రైవ్ చేయుచుండగా వారు త్రాళ్ళతో లాగుచుండగా చక్రములు తిరుగుచూ బురదలో మరింత కూరుకు పోయినవి. గ్రామస్తులు కూడ వినోదముగా చూచుచుండిరి. ఇక అతని శక్తి యుక్తుల మీద విశ్వాసము, ధైర్యమూ పోయి నిరాశతో కూలబడి రక్షించమని బాబాను ప్రార్థించెను.

ఇంతలో ఒక గొడుగు వేసుకుని వచ్చుచున్న అపరిచిత వ్యక్తి అక్కడ ఆగి అంతా చూచి సవినయంగా బోసుగారిని కారు స్టార్ట్ చెయ్యమని చెప్పెను. అతడు కారు స్టార్ట్ చెయ్యకముందే ఆ దృఢకాయుడు బంపరు క్రింద కుడిచెయి పెట్టి ఒక్క కుదుపుకుదపగా చక్రములు ప్రక్క నున్న గట్టి నేలమీద అనుకున్నవి. ఏ సహాయము లేకుండా ఒక్కడుగా యింత సాధించిన ఆ వ్యక్తి వారందరినీ కారు యెక్కి బయలు దేరమని చెప్పి అతడు తన గొడుగును తీసుకుని ముందుకు నడచి వెళ్ళి పోవుచుండెను. వారు ముగ్గురూ కృతజ్ఞతాపూరిత హృదయములై కారు స్టార్ట్ చేసి ముందు పోవుచున్న అతనిని కలసికొనిరి.

నీవెవరు అని అడుగగా తానొక చౌకీదారు అని మాత్రం అతడు సమాధానమిచ్చెను. ఎంత బ్రతిమాలిననూ అతడేవిధమయిన బహుమానమును తీసుకొన నిరాకరించెను. కృతజ్ఞత తెలియజేసి వారు బయలుదేరుటకు ముందు ''నిన్ననే నన్నెందుకు పిలవలేదు?'' అన్నాడతడు కొంత దూరము ప్రయాణము చేసిన తర్వాత ఆ మాటల అర్థము స్ఫురించి, తన స్వాతి శయమునకు సిగ్గుపడి ఆ లీలామానుష వేషధారియైన బాబాను కృతజ్ఞతతో ప్రార్థించిరి.

ఎవరు తన స్వాతిశయమును వీడి నిశ్చల భక్తి విశ్వాసములతో శరణాగతిని కోరెదరో, వారు బాబా యనబడు ఈ చిన్న శరీరములో భగవంతుడే ఉపస్థితుడై యున్నట్లు కనుగొన గలరు. మెక్సికోలో టెకాటె అనే ప్రదేశమున ఇంద్రాదేవిచే నెలకొల్పబడిన యోగాశ్రమము

రెండుసార్లు అగ్నిప్రమాదమునకు గురియైనది. మొదటిసారి మంటలు సాయినిలయము చుట్టూ వ్యాపించి మోటారు కార్లను దగ్ధము చేసినవి. సాధకులందరూ దగ్గరలో వున్న కొండ మీదికి పారిపోయి ప్రాణములు దక్కించుకొనిరి. కాని ప్రార్థన మందిరము చెక్కు చెదరలేదు. రెండవసారి ఇంద్రాదేవి అక్కడే వున్నది. సాయి దేవుని నమ్ముకుని ప్రార్థనాలయము లోనికి వెళ్ళి కూర్చున్నది. మంటలు వెనుకకు మరలిపోయినవి. తరువాత ఆమె భారతదేశము వచ్చినప్పుడు అనుగ్రహ సూచకముగా ఒక చిన్న చక్కని శిల్పముతో వున్న విగ్రహమును బాబా ఆమెకు ఇచ్చి ఇక అగ్ని భయముండదని అభయ ప్రదానము చేసిరి.

బాబా యొక్క కేరళ పర్యటనలో ఆకాశవాణి డైరెక్టర్ మురళీధరన్ బాబా వెంట వుండి ఒక్క మాట కూడా పొరపాటున వదలకుండా బాబా భజనలు, ఉపన్యాసములు టేపు రికార్డ్ చేసెను. ఈ టేపులనన్నీ ఒక వరుస క్రమములో పెట్టి, మా స్వగ్రామమైన త్రిప్పునెట్టూరులో బాలురకొరకై వైద్యశాలకు శంఖుస్థాపన గావించినప్పుడు ఒక వార్తా వాహిని కార్యక్రమమును తయారు చేసెను. ఆ సభకు ఆరోగ్యశాఖ మంత్రి వెల్లింగ్టన్ అధ్యక్షత వహించెను.

ఆ రికార్డ్‌ను తిరిగి పాడించి శివరాత్రి అనంతరము బాబా మరొకసారి కేరళకు వచ్చెదరని, ఈసారి మరికొంచెము తీరుబడిగా కన్ననూరు నుండి తిరువనంతపురము వరకు పర్యటించెదరని యెర్నాకులం టౌన్ హాలులో ఇచ్చిన ఉపన్యాస భాగమును విని ఆనందించెను. ఒక వారము గడచిన తర్వాత ఒక స్నేహితుడు తన ఆఫీసుకు రాగా యీ శుభవార్త అతనికి చెప్పినాడు. బాబా తన మాట నిలుపుకొనకున్న ఈ టేపును పుట్టపర్తికి తీసుకువెళ్ళి బాబా ఎదుట పాడించి వారి వాగ్దానమును గుర్తు చేసెదనని డంబముతో పలికెను. ఆ స్నేహితుడు బాబా వారి కంఠస్వరమును వినుటకు ఉత్సాహపడగా అతనికొరకు మురళీ ధరన్ టేపును తిరిగి పాడించెను. ఆశ్చర్యము. బాబా తిరిగి కేరళ పర్యటన చేయునట్లు వాగ్దానము చేసిన తెలుగు వాక్యము కాని, దాని వెనువెంటనే వుండు మళయాళ భాష తర్జుమాలో కాని, మచ్చుకయినా లేవు. అంతకంటే ఆశ్చర్యము. ఆ మాటలు పలికిన టేపులోని భాగము ఖాళీగా కూడా లేదు. ఆ వాక్యములతోబాటు టేపులో ఆ భాగము కూడా మాయమైంది.

ఆనాడు రక్షాబంధన్ జరుపుకునే వసంత పంచమి. ఆ విషయము వాళ్ళకి తెలియదు. అతను నాగాలాండ్ గవర్నమెంట్‌లో మినిష్టరు. వారికి సంబంధించిన దుఃఖమునకు ఒక్క బాబాయే ఉపశమనము కలిగించగలరన్న విశ్వాసముతో అతని భార్య లఖిమ్‌పూర్ వెళ్ళి అక్కడ నుండి ప్లేన్‌లో గౌహతి, కలకత్తా, మద్రాసు, బెంగుళూరు వెళ్ళి బాబా పాదపద్మములు చెంత చేరెను. ఆమె గౌహతి ఏరోడ్రోంలో వుండగా, భర్త యింటి వద్దనుండి ఆమెకు టెలిఫోన్ చేసెను.

''మన గదిలో వున్న బాబా ఫోటో కేమి చేశావు.''



'' ఏమీ చెయ్యలేదు. ఏమయినది?''

''పటములో బాబా చేతి మణికట్టువద్ద ఎర్రని దారమూ చిన్న పట్టు కుచ్చూ వున్నాయి. నువ్వు అతికించేవా?''

''లేదే సరిగ్గా చూడండి. బాబా ఏమి చేసినా దానికేదో అర్థముంటుంది.''

''చూశాను. అద్దము మీద కూడా కాదు. పటము మీదే వున్నది. అర్థమయినదా?''

''ఆ. అది గుర్తుంచుకుంటాను.'' అన్నది ఆమె ద్విగుణీకృతమైన ఆనందోత్సాహ ములతో.

''నా కరచరణములంతటా నిండియున్నవి'' అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు వచించెను. భగవంతుని కృత్యములలో మనకు గోచరమగు దానిని బట్టి అతడు శాశ్వతుడు, సర్వశక్తి సమన్వితుడు, సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు అని నిర్ణయించ గల్గుదుము'' అని విశ్వ విఖ్యాత సంగీత విద్వాంసుడు బోథోవెన్ స్వదస్తూరితో వ్రాసిన కాగితమును లండన్‌లో వున్న రాయల్ కాలేజి ఆఫ్ మ్యూజిక్‌లో భద్రపరచిరి. అనుభవజ్ఞులకు ఈ వాక్యము చూచిన బాబా జ్ఞప్తికి వచ్చెదరు. అసంఖ్యాకములైన సంఘటనలతో ఈ వాక్యార్థము బాబాకు సహజముగా అన్వయించును.

ఒక కళాశాల పాలకవర్గ సభ్యునకు ఉత్తరములో బాబా ''సాయి సంకల్పము వజ్ర సంకల్పము. నాకై నేను కోరుకొనునదేమీ లేదు. నాకాంక్ష, నా ప్రయత్నము, నా కృషి అన్నీ మానవాభ్యుదయమునకే'' అని వ్రాసిరి. వారి సంకల్పము నిర్వికల్పము. అవి సిద్ధించు విధానములు అనూహ్యము.

లక్ష్మీకుమార్ చాలా తెలివైనవాడు. మూడు యం.ఏ. డిగ్రీలు సంపాదించినా అతనికి విద్యాసక్తి తీరలేదు. ఆగ్నేయ సరిహద్దు ఏజన్సీలో విద్యాశాఖలో డివిజినల్ ఇన్‌స్పెక్టరుగా పనిచేయుచున్నాడు. ఒక రోజున బాబాను గురించి ప్రచురింపబడిన మూడు పుస్తకములు పోస్టులో అతనికి వచ్చినవి. అవి బాబా జీవిత చరిత్ర, బాబా విద్యార్థుల కిచ్చిన సందేశము, బాబా సూక్తులు. ఈతడు బాబాను గురించి Illustrated Weekly of Indiaలో ప్రచురించబడిన వ్యాసమును చదివెను. అందలి బాబా చిత్రము అతనికి నచ్చలేదు. అందువలన ఆ పుస్తకములను నిర్లక్ష్యముగా పుస్తకముల షెల్ఫ్‌లో పడవేసెను.

విద్యార్థి దశ నుండి అర్ధరాత్రి మెలుకువ వస్తే మూడు నాలుగు గంటల పాటు తనకిష్టమైన పుస్తకం తీసి చదువుకుని నిద్రపోవుట అతని యలవాటు. అన్ని గ్రంథముల కన్నా పాణిని వ్రాసిన 'అష్టాధ్యాయి' అనే ప్రాచీన సంస్కృత వ్యాకరణమంటే అతనికి ఎక్కువ యిష్టము. నీషాలోని అతని ప్రశాంత గృహమున ఒక అర్ధరాత్రి వ్యాకరణమునకు సంబంధించిన ఒక సందిగ్ధాంశమును గురించి కన్నులు మూసుకుని ఆలోచనలో నిమగ్నుడై వున్నాడు. కన్నులు తెరచి చూడగా మందస్మిత వదనముతో, కనకాంబరధారియై బాబా

అతని ప్రక్క కుర్చీలో కూర్చుని వున్నారు.

''అర్ధరాత్రి సమయమున గ్రంధ పఠనమున నిమగ్నుడనై వుండగా హఠాత్తుగా ఎదుట ఒక వ్యక్తి ప్రత్యక్షమైతే కలుగవలసిన భయాశ్చర్యములు నాకెందువలననో కలుగలేదు. శాంతముతో ధైర్యముగా వున్నాను. నేను వారెవ్వరని ప్రశ్నించకముందే మృదుమధుర కంఠముతో నేనిక్కడ కొచ్చేనని భయపడవద్దు'' అని రెండుసార్లు పలికిరి. కాని వారెవ్వరు అనే ప్రశ్న అలాగే వున్నది. ఇంతలోనే ''నేను నీకు పుస్తకములు పంపితిని'' అన్నారు. ''అప్పుడాయన బాబాయని ధృవపరచుకొంటిని. అవును ఏవో పుస్తకములు అందేయి.... అను నా అర్ధోక్తిలోనే ''వాటిని చదువు'' అన్నారు. అందుకు నేను ''అందులో ఏమున్నది. అంతా చెత్త, నాకు కావలసినదేమీ లేదు'' అని జవాబిచ్చితిని. సహనముతో అదే మందహాసముతో ''కొంతయినా అందులో పనికివచ్చేది ఉండకపోతుందా. కనీసం ఒకసారి చదివి చూడు'' అని పట్టుపట్టిరి.

డా॥ యం.వి.యస్. మూర్తిచే రికార్డ్ చేయబడిన సంభాషణలో కుమార్ ఈ విధముగా చెప్పెను. ''పుస్తకములు చదువకుండా వాటిని పంపిన వ్యక్తి యెదుటనే అవి చెత్తపుస్తకములని చెప్పినందుకు నాకే బాధ కలిగి, 'నేను చదువుతాను లెండి' అని లేచి ఆ పుస్తకముల కొరకు లోపలికి వెళ్ళి తిరిగి వచ్చి చూడగా అక్కడ బాబా లేరు. నేనిచ్చిన మాట నిలబెట్టుకొనుట నా ధర్మమని తలచితిని. పూర్వ పశ్చిమ వేదాంతములందు నా కభిరుచి యున్నదికాని పూజా విధానమందూ, కర్మకాండలందూ, మత ప్రవక్తల జీవితము లందూ నాకు శ్రద్ధాభక్తులు లేవు. ఈ పుస్తకములు చదివేను. ఉపనిషత్తులలోని సత్యములను, ప్రాక్పశ్చిమ వేదాంత శాస్త్రములందలి సిద్ధాంతములను సరళముగా సుబోధకముగా వాటి యందు వివరించుట గమనించితిని. నేను చదివిన వేదాంత గ్రంధములు వట్టి మాటల మూటలయితే బాబా రచనలు శాశ్వతమైన ఆత్మానుభవము నుండి వెలువడిన అమూల్య వచనములు. మానవుని ఉన్నతపథమున సులభముగా ప్రవేశ పెట్టుటకు దోహదము చేయు ఆ రచనలు నా హృదయము నాకట్టుకున్నవి.

పది దినముల తర్వాత అదే అర్ధరాత్రి సమయమున పాణినిలోని మరొక వ్యాకరణ సూత్రమును గురించి ఆలోచించుచూ కనులు మూసి తెరుచుసరికి బాబా అదే కుర్చీలో నా ప్రక్కనే అదే మందహాసముతో కూర్చున్నారు. ''నీవా పుస్తకములు చదివినట్లు నాకు తెలుసు'' అన్నారు. ''అవును చదివేను'' అన్నాను. 'ఆ పుస్తకములు నీకు నచ్చేయని నా విశ్వాసము, అవి నీకు నచ్చునని నాకు తెలుసు' అన్నారు.

వారి కంఠము ప్రేమానురాగ పూరితము. అంతటి మధుర కంఠము నేనెప్పుడూ వినియుండలేదని అంగీకరింపక తప్పదు. మళ్ళీ బాబా ''వాటిని నీవెందుకు అనువదించ రాదు?'' అని అడిగిరి. అది చాలా కష్టమయిన పని అన్నాను. ''అవును అది కష్టమే. కాని నీవు చేయగలవని నా విశ్వాసము'' అని తిరిగి పలికిరి.



ఆ పుస్తకములు తెచ్చుటకై లోనికి వెళ్ళి తిరిగి వచ్చునంతలో ఆయన అదృశ్యులైరి. ఏ భాషలోనికి అనువదించవలెనో నేనడుగలేదు. హిందీలోనికా లేక 'ఆడి' లోనికా? బాబా భావము ''ఆడి'' అనే విశ్వాసము. ''ఆడి'' ఒక కొండజాతి భాష. అవిరామముగ నేనా పనిని కొనసాగించితిని.

ఆడి భాష క్లిష్టమైన భావములను వివరించుటకు అనువైన భాష కాదు. రెండు వారముల తర్వాత ఒక గూఢార్థముగల పదమునకు సమానమైన పదము కోసం పెనుగులాడు చుండగా బాబా తిరిగి ప్రత్యక్షమయినారు. అదే దరహాస వదనముతో ''అనువాదం ప్రారంభించేవు కదా!'' అన్నారు.

వంచిన నాతల యెత్తి బాబా యొక్క అఖండ దివ్యతేజము నవలోకించి ''నేను చెయ్యలేను. నాకు తృప్తిగా లేదు. ఇది చాలా కష్టము'' అన్నాను. నువ్వు బాగానే చేస్తున్నావు. ఏదయినా చెయ్యదగినది కష్టముగానే వుంటుంది. నీవు అనువదించగలవు. నీవు అనువదించేవు'' అని చెప్పి అదృశ్యమైరి.

దానితో నాకెంతో ఉత్సాహము లభించినది. నా అనువాదము పూర్తి చేసి ఆడిభాష మాట్లాడే నా స్నేహితులకూ, గ్రామీణులకు చదివి వినిపించదలచినాను. నా కృషి సార్థకము కావలెగదా. ఈలోగా బాబా నాకు ప్రసాదించిన మూడు సార్లు దర్శనము, వారి మృధుమధుర సంభాషణ నాలో మార్పు తెచ్చినవి. నా ఉద్యోగ నిర్వహణ యందూ, నా క్రింది ఉద్యోగుల పట్ల నా ప్రవర్తనలోనూ నాకు తెలియకుండానే మార్పు వచ్చింది. నన్నిదివరకు పట్టి పీడించు కోపము, చిరాకు, శిక్షించే స్వభావము మాయమై వాటి స్థానే సహనము, సానుభూతి, సహాయ తత్పరతా అంకురించేయి. నా ధోరణి మారింది. శాంతి సంతృప్తి సాధించేను. ఈ గ్రంధములను అనువదించు కార్యక్రమము బాబా నాకు అప్పగించుటలో ఉండే వుద్దేశ్యం, ఆ ప్రబోధనలను జీర్ణించుకుని తద్వారా నాలో పరివర్తన వచ్చుటకు దోహదమిచ్చు సాధనాక్రమముగా నిర్దేశించారని నా విశ్వాసం.''

బాబా సర్వజ్ఞులు, ప్రేమమూర్తి, తనకు కావలసిన పరికరములుగా భక్తుల నెన్నుకొనుట లోనూ, భక్తులలో పరివర్తన తెచ్చుటలోనూ, వారి ఏకైక ఆయుధము వారి అనన్య ప్రేమ. దీని మూలముగా బాబా యొక్క ధర్మ సంస్థాపనా కర్తవ్య నిర్వహణలో తాము కూడా భాగస్తులమే యనెడి ఆనందము, సంతృప్తి భక్తులకు లభించుచుండును.

నార్వే దేశస్తుడైన టిడ్‌మెన్‌తో ''నీవిక ఏ గురువు కొరకూ వెతుకనవసరము లేదు. ఇకపైన నేనే నీకు గురువును'' అన్నారు బాబా, అతని నొక భయంకరమైన ఆపదనుండి కాపాడిన తర్వాత. ఇంద్రాదేవి శిష్యుడొకడు ప్రశాంతి నిలయమందు ధ్యానములో ఉన్నపుడు తనకు కలిగిన ఆనందతరంగముల అనుభూతిని గూర్చి బాబాను ప్రశ్నించగా, 'నీ సాధనలో నిన్ను ముందుకు తీసుకొనుపోవుటకు ఆ అనుభవం నాంది మాత్రమే' యని వివరించేరు.

''మీరు కోరినవి యిస్తున్నాను కనుక మీరడుగుటలో జాగ్రత్తగా వుండండి. కల్పవృక్షము

వద్ద నుండి క్షుద్రవస్తువులు కోరకండి'' అంటారు బాబా. మనకేది ఎంతవరకు ఎప్పుడు అవసరమో అది బాబాకే తెలియును. మనము కోరనవసరము లేదు. మనము కోరవలసినది ఒకటే, బాబా అనుగ్రహము. చల్లని వారి అనుగ్రహఛాయలో, ఆ జగన్నాటక సూత్రధారి దర్శకత్వములో మన జీవిత పాత్రలను మనము నిర్వహిద్దాము.

భాటియాగారికి ముగ్గురు కుమార్తెలు. అతనికి మరొక కుమారుడు కలుగుననియు ఆ రోజున తాను బొంబాయిలోనే వుండెదననియు బాబా చెప్పిరి. అటు వైద్యులకు ఇటు భాటియాకు తీవ్రమైన ఆందోళన కలిగించుచూ భాటియా భార్య 12 నెలలు గర్భము మోసెను. 13వ మాసమున ఆమె ప్రసవించి మగ బిడ్డను కనెను. కృతజ్ఞతాభి వందనములు తెలుపు నిమిత్తము బాబా ఆ సమయమున యెక్కడ యున్నదీ తెలుసు కొనుటకు భాటియా మినిస్టర్ సావంత్‌గారి ఇంటికి వెళ్ళెను. నాడు బొంబాయి రానున్న బాబాకు స్వాగతమిచ్చుటకు సావంత్‌గారు నగర పొలిమేరకు వెళ్ళినట్లు తెలుసుకొని సంభ్రమాశ్చర్యములు పొందినాడు.

ఈ మధ్యనే ''సాయిబాబా'' అనుగ్రంథమును రచించిన ఆర్నాల్డ్ షుల్మన్‌కు ఒక నీలము పొదిగిన చక్కని బంగారు ఉంగరము ప్రసాదించేరు. శాన్ ఫ్రాన్సిస్కో కస్టమ్స్ డిపార్ట్‌మెంటు వారు దానిపై అధికమైన టాక్స్ వేస్తారేమోనని ఒక క్షణము దానిని అందుకొను సమయములో అతడు తటపటాయించెను. అధికారులు దానిని పరీక్ష చేసి విలువ లేనిదిగా నిర్ణయించేరు. అర్నాల్డ్ దానిని తరువాత రత్నాల వ్యాపారస్తునికిచ్చి పరీక్ష చేయించగా దాని ఖరీదు 125 డాలర్లుగా తేలినది.

అక్షయమగునట్లు ఆశీర్వదించి ఇచ్చిన విభూతిభరిణిలోని విభూతి వాడిన కొలది నిండుతూ వుంటుంది. బాబా చేయు ఈ అద్భుత సృష్టి మనకి ఆశ్చర్యము గలిగించవచ్చు. సర్వం బ్రహ్మమయం; అన్నీ ఒకే పదార్థములోని భాగములే. సర్వజ్ఞులైన బాబా కిది సహజమైనది. ఇది ప్రదర్శన కాదు, మానవరూపధారియైన బాబా యొక్క దైవత్వమునకిది నిదర్శనము. మనయందు భక్తి విశ్వాసములు కలుగజేసి తద్వారా మనలను సంస్కరించు సంకల్పముతో ఇట్టి వస్తువులను సృష్టించి భక్తుల కిచ్చు చుందురు. అధికారైశ్వర్యములందు విపరీతమైన వ్యామోహము, ఈర్ష్యా ద్వేష కలుషితమైన హృదయము, గర్వాంధకారము మొదలయిన వాటి ప్రభావముల బారినుండి భక్తులను రక్షించి వారికి సుఖశాంతులు అందించుటకే బాబా భక్తులకేమి సృష్టించి ఇచ్చినా.

ఉస్మానియా యూనివర్శిటీ జియాలజీ ప్రొఫెసర్ డా॥ వై.జి.రావ్ ఒకనాడు ప్రశాంతి నిలయములో బాబా ప్రక్కనే నడుస్తుండగా బాబా దారిలో ఒక పిడికిలి ప్రమాణమున్న కంకరరాయిని ఏరి రావ్‌కిచ్చి అందులో ఏముందో చెప్పమన్నారు. అతని సాంకేతిక విజ్ఞాన పరిధిలో అందలి రసాయనిక పదార్థముల నాతడు వివరించెను. బాబా యాతనిని మరింత నిశితముగా పరిశీలించి చెప్పమనగా ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు అనుచూ అణువు,



పరమాణువు విభాగములను వివరించెను. ''ఇంకా లోతుగా ఆలోచించి చెప్పు'' అన్నారు బాబా. డా॥ రావ్ నిరుత్తరుడు కాగా, ఆ రాతిని తన చేతిలోనికి తీసుకొని బాబా ఊదగా అది మురళి వాయించుచున్న శ్రీకృష్ణ విగ్రహముగా మారినది. దాని నాతని కిచ్చి ''చూచితిరా. రాతిలో దైవము. మీ భూగర్భ శాస్త్రజ్ఞులు దీనిని మరువరాదు. భగవంతుడు లేని పదార్థము ప్రభవించదు'' అని చమత్కరించిరి.

బాబా యొక్క ప్రతి లీలా, ప్రతి అద్భుతమూ, భక్తుల అధ్యాత్మిక సాధనాభ్యున్నతికి దోహదము చేయునట్టివే. ప్రతి పలుకూ ఒక ప్రబోధము.

ఒక వ్యక్తి ప్రతిరోజూ అష్టోత్తర నామము, ప్రతి గురువారమూ సహస్రనామమూ పారాయణ చేసి పిదప బాబా పటము యెదుట సాష్టాంగ పడి బాబా పాదములు పట్టుకొన్నట్లూహించు కొనుచుండెడివాడు. బాబా పాద పద్మములున్నట్లూహించుకొను ఖాళీ స్థలమును రెండు చేతుల మధ్య వదలిపెట్టుచుండును. అతడు ప్రశాంతి నిలయమునకు వచ్చినపుడు బాబా అతనిని ప్రత్యేక సంభాషణకు పిలిచి ''నా పాదములు రెండూ మోపుటకు ఎంత స్థలమవసరమో ఒకసారి చూడు. నీ రెండు చేతుల మధ్యా వుండు స్థలము యిరుకుగా వుండుటచేత, నిత్యము నీ యెదుట నిలబడునప్పుడు నా కాళ్ళు ఒరుసుకు పోవుచున్నవి'' అన్నారు. అతనికి అంతకంటే ఆధ్యాత్మిక ప్రబోధం ఏమి కావాలి?

బాబా ఒకే సమయములో అనేక రహదారులమ్మట పరుగులెడుతూ హెచ్చరింపులతో, సహాయంతో అమృత హస్తంతో భక్తుల నాపదలనుండి రక్షిస్తున్నారా అని అనిపిస్తుంది.

కోల్ చెస్టర్ నుండి లండన్‌కు కారులో సెప్టెంబరు 12వ తేదీన ప్రయాణము చేస్తున్న. వి. కృష్ణమూర్తినీ... అతని కుమారుణ్ణి సకాలంలో హెచ్చరించి భయంకరమైన కారు ప్రమాదంలో మృత్యువునుండి కాపాడిరి.

1969 డిసెంబరు 23వ తేదీన ప్రొఫెసర్ జి.బి. పిళ్ళైగారినీ అతని కుమారుణ్ణి త్రివేంద్రం నుండి మద్రాసు వెళ్ళుచున్న రైలులో ప్రయాణము చేయుచుండగా పాంబన్ వంతెన మీద నుండి రైలు నదిలో పడిపోగా ''బాబా! బాబా! రక్షించు'' అన్న పిళ్ళైగారి ఆర్తనాదం విని వారిద్దరిని రక్షించేరు.

పసిఫిక్ తీరము నుండి శాంటా బార్బారా, బాబా యొక్క 'మరియొక లీల'ను గురించి యిలా వ్రాసినది. ''ఆత్మహత్య నుండి అద్భుతముగా బాబాచేత రక్షింపబడిన సూసాన్ అనే ఆమెకు కెవిన్ అనే కుమారుడున్నాడు. బాల్యము నందే అతని మెదడుకు శస్త్ర చికిత్స చెయ్యగా ఒక కన్ను గ్రుడ్డిదైపోయింది. బాబా యందామెకు అచంచల విశ్వాసము ఏర్పడిన తరువాత, ప్రతి రాత్రి కొన్ని దినములుగా తన కుమారుని గ్రుడ్డి కన్నులో అతడు నిద్రించుటకు ముందు బాబా విభూతి వేయుచుండెను. తిరిగి ఆ కంటి కిప్పుడు చూపు వచ్చినది.

సుమారు ఇరవై సంవత్సరముల క్రితము బెంగుళూరు నుండి వచ్చిన కాలేజి విద్యార్థులు చిత్రావతి నది ప్రక్కన వున్న కొండమీదకు తీసుకు వెళ్ళమని బాబాను ప్రార్థించిరి. ఆ రోజులలో తరచు భక్తులతో అక్కడకు వెళ్ళి, ప్రస్తుతము కల్ప వృక్షమును పేర పిలువబడుచున్న చింత చెట్టు క్రింద కూర్చుని భక్తులకు కావలసిన వివిధ రకములైన పండ్లు, తిను బండారములు బాబా సృష్టించి యిచ్చుట పరిపాటి. ఆ ఉద్దేశ్యముతోనే విద్యార్థులు వారి వెనుకటి అనుభవములు పురస్కరించుకుని అట్లు ప్రార్థించిరి. వారి అభిమతమును గ్రహించిన బాబా ''ఆ చింతచెట్టే నాకు కావలెనా ఏ చెట్టయిననేమి'' అనిరి. అవును వారి సంకల్పము ముఖ్యము కాని ఏ చెట్టు నుండి ఏ ఫలమును సృష్టించలేదు. బహుశా మరియొక చెట్టునకు కూడ అట్టి కీర్తి ప్రసాదించ నున్నారేమోనని ఆ విద్యార్థులతో బాటు నేనునూ చేరి కుతూహలముతో వుంటిమి. ''అసలు చెట్టు ఎందుకు. చిత్రావతి ఇసుక చాలదా'' అన్నారు బాబా.

మమ్ము చిత్రావతి సైకత స్థలికి తీసుకు వెళ్ళుదురని ఆశించితిమి. కొంత తడవయిన పిదప ''అసలు చిత్రావతి ఇసుకపైననే కూర్చొనవలసిన అవసరమేముంది'' అన్నారు. ఆ సమయంలో ప్రశాంతి నిలయములో మందిర నిర్మాణము కొరకు లారీలలో తెచ్చి ఇసుక మెట్లు వేసి యుండిరి. ఒక ఇసుక దిబ్బ ప్రక్కగా మేము నడుచుచుండగా ''ఈ ఇసుక దిబ్బమీద కూర్చుందామా స్వామీ'' యని నేను ప్రతిపాదించితిని. ''ఇసుకలో నుండి సృష్టించి యిచ్చుటయే లీల అవుతుందా?'' అన్నారు బాబా. హస్త చాలనముతో వివిధ రకములైన వస్తువులను, తినుబండారములను సృష్టించి ఇచ్చుట మాకు అనుభవమే కాబట్టి, మేము వారి రిక్తహస్తముతో సృష్టింపబోవు వింత కొరకు ఉత్సాహముగా వేచి యుంటిమి. ''మీరందరూ చూచుటకు నేనిప్పుడేమైనా సృష్టింపవలెనా! మీ అందరి స్థితీ ఒక లీల కాదా'' అనుచూ చిరునవ్వు చిమ్మి అక్కడ నుండి వెళ్ళి పోయిరి. మేము నిశ్చేష్టులమైనాము. కొంత సేపటికి కాని బాబా మాటలలోని అంతరార్థము బోధపడలేదు. బాబా యొక్క అద్భుత లీలలలో కల్లా అద్భుతమైన లీల యేమిటంటే, తన అనుగ్రహ కిరణములలో మనుషుల ప్రవర్తనలో తీసుకువచ్చే పరివర్తన.

బాబా యొక్క ప్రతి లీల ఒక అనుగ్రహ చిహ్నము. వారి దివ్యహస్తములు సృష్టించిన చిటికెడు విభూతి కావచ్చు, లాకెట్ కావచ్చు. ఉంగరము కావచ్చు, ఫోటోలు కావచ్చు, లేదా భక్తుల గృహములలోని చిత్ర పటముల నుండి ఆవిర్భవించు విభూతి, కుంకుమ, సుగంధ తీర్థం కావచ్చు, లేదా భక్తుల నిద్ర, స్వప్న, జాగ్రదావస్థలలో వారు దర్శన మియవచ్చు, ఇవన్నీ భక్తుల యెడల వారికున్న అనన్య ప్రేమకు, అనుగ్రహమునకు గుర్తులు. ఇవి వారి అద్భుత శక్తుల ప్రచారము కొరకు కాదు ప్రేమతో భక్తుల విశ్వాసమును పెంపొందించు సన్మార్గవర్తనులుగా వారిని సంస్కరించుటకే.'' ఈ యద్భుత లీలలు ''ప్రదర్శనములు కావు, నిదర్శనములు'' అని అన్నారు.



డా॥ భగవంతం గారి కుమారుడు బాబా ఛాయా చిత్రము యిమ్మని ప్రార్థించగా నిరాకార పరబ్రహ్మ స్వరూపమైన లింగమును సృష్టించి యిచ్చి తమ నిజ తత్వాన్ని వ్యక్త పరిచిరి.

ఒక కొండ దిగువ భక్తుల మధ్య పరివేష్టితులై వుండగా చేతికందిన నాలుగు రాళ్ళు తీసి భక్తుల కొరకు విసిరిరి. అవి అన్నియూ కలకండ ముక్కలుగా మారియుండెను. ఒక భక్తుడు ఆ కొండనే కలకండ కొండగా మార్చకూడదాయని యడిగెను. "మార్చవచ్చు. కానీ, ప్రకృతి సిద్ధమైన దాని స్థితిని అనవసరముగా ఎందుకు మార్చాలి!" అన్నారు.

ఏదైన ఒక వస్తువును సృష్టించుటకు వారి దివ్య సంకల్పమే ఆధారము; ఏ విధమైన చలనము కాని వారి హస్తమును కాని ఉపయోగించనవసరము లేదు. ఒకసారి ఒక భక్తునితో ఆధ్యాత్మికగోష్ఠి జరుపుచున్నారు. ఉన్నట్లుండి అతని ఒడిలో ఒక ఎర్రని యాపిల్ పండు కనపడ యాతడు ఆశ్చర్యపడెను. "ఉదయము నుండి ఏమీ తినలేదని నీవు చెప్పితివి కదా! ఇది తిను. మధ్యాహ్న భోజనము కింకా చాలా వ్యవధి వున్నది" అన్నారు బాబా.

బాబా ప్రసాదించే ప్రతిదీ వారి అనుగ్రహ చిహ్నమే. అవి భక్తుల సత్యాన్వేషణలో ఉపకరించే సాధనములు, అనుభవములు. బాబా ప్రసాదించు బహుమతులు అవ్యయం, అనంతం. అవి అందుకొన్న భక్తులు పాత్రతను పెంచుకొని యింకనూ అట్టి అనుగ్రహ పూర్వకమైన బహుమతులను పొందవలెనని ఆకాంక్షించెదరు.

"అశాశ్వతములైన లౌకిక భోగముల భ్రమనుండి వైదొలగండి, ఆ యేకైక పరబ్రహ్మముతో సాంగత్యము నభివృద్ధి చేసుకొను కృషి నిరంతరం సల్పండి. ఆ సచ్చిదానందుని అనుగ్రహములో మీరు శాంతి, ఆనందం అనుభవించెదరు" అంటారు బాబా.

# అంధకారములో ఆశాకిరణము

1968వ సం॥ జూలై 8వ తేదీన ఆఫ్రికా ఖండమునకు హృదయము వంటి కంపాలా నగరములో జరిగిన బహిరంగ సభలో ''ప్రేమ స్వరూపులారా! నిస్వార్థమైన ప్రేమను పెంచుకొనుడు. మీ దేశము యొక్క ప్రేమ - ప్రతిష్టలకు మెరుగుపెట్టు విధముగా నడుచుకొనుడు. విశ్వమానవ భాష ఒకటే, అదే ప్రేమ. దానిని మీ హృదయములలో నింపుకుని ఆచరణలో చూపుడు. మీ చుట్టుప్రక్కల దేశముల వారు మీరు పూజించు దైవాన్నే వారూ పూజించుచున్నారు. వారి భాష, ఆరాధనా విధానము వేరు కావచ్చు. కాని అందరి ఆహార పానీయములూ కోరికలూ ఒక్కటే. ఒండొరుల సుఖదుఃఖములను పంచుకొనుచు పరస్పర సానుభూతిని పెంపొందించుకొనుడు. అదే మీకు శాంతి, ఆనందములను చేకూర్చును. మీ ప్రేమ వాహిని విశాలమై ప్రవహించవలెను. ప్రవహించకుండా నిలచిన నీరు దుర్గంధ భూయిష్టమగును. అందుచేత ప్రేమను ప్రవహించనివ్వండి. ప్రేమయే ఆనందము, ప్రేమయే శక్తి, ప్రేమయే జ్యోతి, ఆ ప్రేమయే దైవము'' అని బాబా ప్రబోధించిరి.

'నా జీవితము నా సందేశము' అని బాబా చెప్పుచుందురు. వారు ప్రేమ స్వరూపులు కాబట్టి, ప్రేమ ద్వారా మానవుడు మాధవుడు కాగలడని, నిస్వార్థ ప్రేమను మనము పెంపొందించుకొనవలెనని బాబా బోధించు చుందురు. ''నాకొక పేరు వుండాలని మీరు తలచితే ప్రేమ స్వరూపుడని పిలవండి'' అన్నారు బాబా ఒకసారి.

నిర్మలానురాగ పథములో బాబా మనలను స్వార్థము నుండి పదార్థమునకు, సంకుచిత్వము నుండి విశాలత్వమునకు గొనిపోవుచున్నారు. కాలిఫోర్నియా రాష్ట్రము (అమెరికా) లోని టస్టిన్ నగరమందున్న శ్రీ సత్యసాయి బుక్ సెంటర్‌కు కార్యదర్శి అయిన డోరిన్‌బాబ్ యీ విధముగా వ్రాసినది. ''నేను భగవంతునికి సేవ చేయగలిగినందులకు నేనెంతో ఆనందపడుచున్నాను. ఈ బుక్ సెంటర్‌కు కార్యదర్శిగా నుండుట నా భాగ్యము. బాబాను గురించి తెలిసికొనినప్పటి నుండి మా జీవితములే మారిపోయినవి. ఇంత ఆనందము మేమెన్నడూ యెరుగము. స్వామిని యే విధముగా సేవించినా ఆనందమే. క్రిస్టమస్ పండుగనాడు, గేరి, షరాన్‌లు వారి యింట భజనలు ఏర్పాటు చేసిన సందర్భములో ఒక అద్భుతము జరిగినది. షరాన్ విభూతి పొట్లములు కట్టుచుండగా హఠాత్తుగా విభూతిలో నుంచి బాబా చిత్రమున్న లాకెట్ చేతిలో కొచ్చినది. బాబా అది వారి కిచ్చిన క్రిస్టమస్ బహుమతిగా యెంచి అమితానందము నొందిరి.

''బాబా చేయు అద్భుతములలో అద్భుత మేమిటనగా, మనలో మనకి తెలియకుండగనే, మార్పు తీసుకువచ్చుట. ఆ మార్పు క్రమము కూడా అతి సున్నితముగా వుండి గ్రహించలేము. కొన్నాళ్లు పోయిన తర్వాత ఏదో ఓ రోజున ఆత్మ పరిశీలన చేసుకొనగా మనము ఎంత మారేమో చూస్తే మనకే ఆశ్చర్యం వేస్తుంది. మనలోని దురభ్యాసముల



పట్ల విముఖత కలుగుతుంది. మన జీవితాలు ఇదివరకు కంటే తేలికగా, ఆనందంగా వుంటాయి. ఇంతకంటే అద్భుతం ఏముంటుంది?'' అంటుంది డోరిన్ బాబ్.

గోదావరి తీరమున రాజమండ్రిలో జీవకారుణ్య సంఘమను సుప్రసిద్ధ సేవా సంస్థను స్థాపించినారు స్వామి కారుణ్యానంద, అనాధులకు, వికలాంగులకు, కుష్టురోగులకు 45 సంవత్సరములుగా సేవచేయుచున్నారు. ఆయన అచంచల భక్తి విశ్వాసములున్న బాబా భక్తులు.

ఒక ఉదయము పలాసా గ్రామము నుంచి వచ్చిన ఒక యువతిని ఆయన ఆశ్రమ హాస్పటల్‌లో చేర్చేరు. ఆమె నిండు చూలాలు, ఆమెతో కూడా రెండు సంవత్సరముల వయస్సున్న కుమార్తె వున్నది. ఆ చంటి పిల్లను ఆశ్రమ పరిచారికులకు అప్పగించి, అటువంటి నిరాధారులైన పిల్లలను పెంచు ఆశ్రమ విభాగము చేర్చిరి.

ఆమె చాలా బలహీనముగా వున్నది. ఆశ్రమం హాస్పిటల్లో ప్రసూతి వార్డులో ఆమెను చేర్చిరి. ఆ వార్డులో గోడకు బాబా చిత్రపటమున్నది. అది బాబా కొబ్బరి చెట్టును ఆనుకుని ఆకుల చాటుగా వుండగా తీసిన ఫోటో ఆ ఫోటోలో బాబా స్త్రీయా యనునట్లు భ్రమగొల్పును. ఆ ఫోటోలో బాబాను 'సాయిమాత' అంటూ వుంటారందరూ

ఆమె ప్రసవించుటకు కింకనూ కొన్నాళ్ళు వ్యవధి వున్నదనుకున్న ఆశ్రమ వైద్య సిబ్బంది, ఒకనాడు సినిమా చూచుటకు వెళ్ళిరి. రాత్రి వారు తిరిగి వచ్చి చూచుసరికి ఆమె ప్రసవించి, బాలింతరాలికి చేయవలసిన పరిచర్యలను పొంది వున్నది. శిశువు స్నానము చేయించబడి, తెల్లని తువ్వాలులో పరుండబెట్టబడి వున్నది. ఆ వైద్య సిబ్బంది ఆశ్చర్యమునకు మేరలేదు. ఇంత నేర్పుతో ఆ పరిస్థితిలో పరిచర్య చేసిన వారెవరని ఆమెను వారడిగిరి. ఆమె బాబా పటమును చూపి ''ఆమె వచ్చి నాకు ధైర్యము చెప్పి పురుడు పోసినది'' అన్నది ఎంతటి కరుణామయుడు.

1969 సం. ఫిబ్రవరిలో నేఫాలోని రుంగాంగ్, సాన్యా, దిసి, జైనింగ్ అనే గ్రామముల నుండి నాలుగు కొండ జాతుల నాయకులు, రాజకీయ సహోద్యోగి అయిన శ్రీ బోకెన్ ఎట్టొ ఒక నేఫా సహాయ కార్యదర్శి, ఒక శిల్ప శాస్త్రవేత్త కలసి ప్రశాంతి నిలయమునకు వచ్చిరి. ఆ సాయంకాలము కొంతమంది విదేశీయులతో, వీరందరిని బాబా ప్రత్యేక దర్శనమునకు పిలిచిరి. షుమారు రెండు గంటలు బాబా వారితో గడిపి వారిని ఆనంద తన్మయులను చేసిరి. ముందు కొంతసేపు ఆధ్యాత్మిక విషయములు ప్రసంగించిరి. తరువాత వారందరినీ ఒక్కొక్కరితో ప్రత్యేకముగా సంభాషించి సంతృప్తిపరిచిరి.

ఆ సహాయ కార్యదర్శి ఈ విధముగా వారి అనుభవమును వివరించుచూ వ్రాసినారు. ''వారికి ప్రత్యేకమైన ఆసన మున్నప్పటికీ, బాబా మాతోబాటు తివాసిపై కూర్చున్నారు. విద్యుత్ శక్తి సరఫరా అంతరాయము కలిగినప్పటికీ బాబా దివ్యసమక్షములో వాతావరణము హాయిగా వున్నది. బాబా ప్రేమ హృదయము నుండి వచ్చు మధుర వచనములు అర్థము

చేసుకొనుటలో భాష ప్రతిబంధకము కాదు. వారి ఆధ్యాత్మిక ప్రబోధనలు వింటూ ఒక్కొక్కరమే ఆత్మపరిశీలన చేసుకొంటిమి. తన మనస్సును కేంద్రీకరించ లేకపోవుచున్నట్లు ఒక ఆంగ్ల వనిత చెప్పగా, బాబా, హృదయాకారములో నున్న ఎర్రని లాకెట్‌ను సృష్టించి ఆమెకిచ్చి ''ఇది నీ హృదయమును సూచించుచున్నది. ఇది నీకు ఏకాగ్రత ప్రసాదిస్తుంది'' అని చెప్పిరి. గోవా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి భార్య కొక రవ్వల ఉంగరము సృష్టించి ఇచ్చి దానిలో ఆమె మాత్రమే బాబా చిత్రమును చూడగలదని చెప్పిరి. ''ఇది డైమండ్ కాదు. డై-మైండ్ అంటే మనో వైకల్యమును చంపునది. భగవధ్యానము అనుచిత వాంఛలను నిర్మూలించి భగవదనుగ్రహము పొందుటకు తోడ్పడును'' అనిరి. ఇంతకంటే అద్భుత ఆధ్యాత్మిక ఉపదేశమేమి కావలయును. మరొక గోవా స్త్రీకి రోగనివారణకు ఒక రక్ష సృష్టించి యిచ్చిరి. హస్త చాలనముతో చేతినిండా మిఠాయి సృష్టించి మా అందరికీ పంచిపెట్టిరి. ఒక కొండజాతి నాయకుని చేతిలో, సృష్టించిన విభూతినుంచి దానిని మా అందరి ఫాలభాగముల మీద పెట్టమని చెప్పిరి. హస్త చాలనముతో ఎనిమిది బాబా చిత్రములు సృష్టించి మా అందరికీ తలకొకటి ప్రసాదించిరి.

తరువాత మమ్ము ఒక్కొక్కరినే ప్రత్యేకమైన దర్శనమునకు పిలిచిరి. మేము చెప్పక ముందే మా సమస్యలు. మా యిబ్బందులు బాబాకు తెలుసు. వాటినన్నిటికీ బాబా పరిష్కార మార్గములు సూచించి, హితములు బోధించి ఆశీర్వదించిరి. శ్రీ బొరెన్ ఎట్టే తమ ప్రాంతములో తమ ఆరాధ్య దైవములయిన సూర్యచంద్రులకు దేవాలయము కట్టుచున్నట్లు చెప్పి బాబా ఆశీర్వచనములు కోరిరి. అది విని బాబా మందహాసముతో ''ఆలయములో ఎట్టి విగ్రహమును ప్రతిష్టించవలెనన్న విషయములో మీలో అభిప్రాయ భేదములు చెలరేగుచున్నవి కదా!'' యనుచు మా యెదుట చేతిని వేగముగా త్రిప్పి ఒక వృత్తాకార ఫలకమును సృష్టించిరి. దానిపై సూర్యచంద్రుల చిత్రములు ఉబ్బెత్తుగా చెక్కబడి వున్నవి. అది పంచలోహములతో చేసినదగుటచే తళ తళ మెరుస్తున్నది. దేవతా విగ్రహములు సాధారణముగా పంచలోహములతో చేయుదురట. ఆ ఫలకమును అతని చేతులలో వుంచి ''దీనిని మీ దేవాలయములో ప్రతిష్టించి ప్రతి ఆదివారము, ప్రతి పౌర్ణమినాడు పూజ చేయండి. ప్రతిష్టించిన వేదిక ముందు ఆఖండ జ్యోతిని వెలిగించండి. జంతు బలి యెన్నడూ భగవంతునికి ప్రీతి కానేరాదు. భగవంతుని శాంతింపచేయుటకు జంతు బలి నిచ్చు దురాచారమును భగవంతుడు ప్రసాదించిన బుద్ధి విచక్షణలతో నిర్మూలించండి'' అని ఉపదేశించిరి. దేవాలయము ఎట్లుండవలెనో బాబా సలహా ఇస్తూ ఒక బొమ్మ గీసి వివరిస్తూ అందొక వృత్తాకారముగల గీత గీసి వారి సాంప్రదాయకమైన సామాజిక నృత్యము కొరకు స్థల విభాగమును సూచించిరి. ఆ నమూనా చూచి అందరికంటే ముఖ్యముగా వారితో వచ్చిన శిల్పశాస్త్రవేత్త దిగ్భ్రమ నొందెను.

''ఈ యాంతరంగిక సమావేశానంతరము ప్రతివారూ బాబా తమతోనే తమలోనే వున్నట్లుగా అనుభూతి పొందుదురు. సర్వజ్ఞులైన బాబా బొరెన్ ఎట్టెతో ''నీవు



డిబ్రూఘర్‌లో రోగపరీక్ష చేయించుకుని సంతృప్తి లేక కలకత్తాలో కూడ వైద్యనిపుణులతో పరీక్ష చేయించు కున్నావు కదా'' అని చెప్పి సర్వరోగ నివారిణి అయిన విభూతి పొట్లములు కొన్ని అతని కిచ్చిరి. మొదటి పొట్లముతోనే అతనికి గుణము కనబడినది. మళ్ళీ ఆ రోగ మాతని దరిచేరలేదు. ''తండ్రి బిడ్డలకు బహుమతులిచ్చుట ప్రతిఫలము కోరి కాదు. ప్రతిభ ప్రదర్శనము కొరకూ కాదు. మీరు ప్రేమను కోరి వచ్చేరు. మీకు ప్రేమ లభించినది'' అన్నారు బాబా. ఆ విధముగా మేమందరము భగవదనుగ్రహ భాగ్యమును పొందితిమి.''

బాబా యొక్క అనంతానురాగమును గూర్చిన ఒక సంఘటన డా॥ బి. జానకి రామారావు చెప్పేరు. ''అర్ధరాత్రి రెండు గంటలకూ నేనూ డా॥ కె. భాస్కరరావూ ఒక రోగి వద్ద వున్నాము. అతని నాడి అందుట లేదు. రక్తపుపోటు రికార్డు చేయుటకు వీలుపడలేదు. అతని స్థితిపట్ల నిరాశతో ఆ రోగిని ప్రత్యేకమైన గదిలోకి మార్చినాము. చేయునది లేక అతని కొరకు బాబా పంపిన విభూతి పొట్లములోని విభూతి కొంచెము అతని నోటిలో వేసినాము. ఇక ఆ స్థితి నుండి కోలుకొనుట అసంభవమని గ్రహించి, ఇక చేయగలిగిన దేమీ లేదని అక్కడ పరిచారకులకు చెప్పినాము.

''మరునాటి ఉదయము అతని నాడి మామూలుగా వున్నది. తెల్లవారుజామున మేము వెళ్ళిపోయిన తర్వాత ఎవరో వచ్చి అతనికి వైద్యము చేసినట్లు చెప్పెను. ఎవరై వుంటారు? అక్కడున్న పరిచారకులు తమ కేమీ తెలియదనీ తామెవరినీ లోనికి రానివ్వలేదని చెప్పేరు. మేము ఆశ్చర్యపడ్డాము. తర్వాత బాబా విభూతి సంగతి గుర్తుకు వచ్చి తలలు వంచు కున్నాము. అతడు సంపూర్ణ ఆరోగ్యముతో యింటికి వెళ్ళేడని వేరే చెప్పవలెనా?''

డా॥ ఎ. రంగారావు మద్రాసు నుండి ప్రశాంతి నిలయమునకు కారు డ్రైవ్ చేసుకొని వచ్చుచుండగా పెట్రోల్ టాంకు అంటుకుంది, ''సాయిరామ్'' అంటూ రోడ్ మీదనున్న దుమ్ము పిడికిడితో తీసి మంటల మీద జల్లగా మంటలు ఆరిపోయినవి. సురక్షితముగా అతని ప్రయాణము సాగి ప్రశాంతి నిలయము చేరుకొనెను.

తేజాపూర్ (నీఫా)లో వున్న తమ బంగళా సమీపములో వున్న వెదురు పొదలు అంటుకున్నాయి. కల్నల్ రాజా ఆ మంటలు విజృభించి పై కెగయసాగుట చూచి సమీపమునందే వున్న నేపాలీ కుటీరములు అంటుకొనునేమోనని భయముతో బయటకు పరుగెత్తిరి. అతని భార్య ''సత్యసాయిబాబా! సత్యసాయిబాబా'' అని ఎలుగెత్తి పిలిచినది. ఐదు సెకండ్లలో మంటలు ఆరిపోయినవి. ''డజను అగ్నిమాపక యంత్రములు కూడా వాటిని ఆర్పలేవు'' అన్నారు కల్నల్ రాజా.

''తిరుచురాపల్లిలో బాబా మా యింటికి వచ్చిన నాటికి ఆరు నెలల క్రితము మా తమ్ముని తొడలోని యెముక విరిగిపోయినది. బాబా వస్తారని తెలియగనే వానిని మా ఇంటికి తీసుకువచ్చి వెనుక గదిలో వుంచితిమి. బాబా మా యింటికి వచ్చిన సమయమున ముందు హాలులో భజన జరుగుచున్నది. బాబా నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ

భజన హాలు దాటి మా తమ్ముని గదిలో ప్రవేశించి విభూతి సృష్టించి కొంత వాడి నోటిలో వేసి మిగిలినది వాడి ఫాలభాగమున రుద్దినారు. హాలులో వున్న నా వద్దకు బాబా వచ్చి ''మీ వాడి కాలు సరి చేశాను'' అని చెప్పిరి. 3 రోజులలో వాడింట్లో నడుచుట ప్రారంభించెను. వారం రోజులలో ఇతరుల సహాయము లేకుండా తోటలోకి వెళ్ళ సాహసించి నాడు. నెలరోజులలో తన మామూలు దినచర్య ప్రారంభించినాడు'' అని తెలియజేసేరు పాండ్యన్ బ్యాంక్ ప్రతి ష్ఠాపకుడు, డైరెక్టర్ అయిన శ్రీ యస్. యస్. కె. సుందరంగారు.

నేత్ర చికిత్స నిపుణుడు డా॥ యమ్.యస్. రామకృష్ణారావు బాబా విభూతి యొక్క మహిమను గూర్చి ఒక సంఘటన తెలియజేసేరు. ''నేత్ర వైద్యానికి వచ్చిన ఒక స్నేహితుడికి ఒక కంట్లో అపాయకరమైన వ్రణము కనబడింది. అమెరికాలో క్రొత్తగా కనిబెట్టబడిన I.D.U. దానికి సరియైన మందు. ఎంత ప్రయత్నించినా భారతదేశంలో దొరకలేదు. ఈలోగా అది రెండవ కన్నుకు కూడా సోకింది. ఆ మందు దొరకని స్థితిలో ఇక యే వైద్యము చేసినా నిష్ఫలమని నాకు తెలుసు. ఆ విషయము నా స్నేహితునికి చెప్పకుండా, బాబాను మనసారా స్మరించి రెండు కన్నులలోనూ విభూతి వేసి బేండేజి వేసి కట్టినాను. మరునాటి రాత్రి మా ప్రొఫెసర్ డా॥ ఆర్. సూర్యప్రసాదరావుగారు ఎక్కడ నుండియో ఒక శాంపిల్ సంపాదించి నాకిచ్చిరి. ఇది బాబా కరుణావిశేషమేయని తలంచి ఆ మందు వేయుటకు బ్యాండేజి విప్పితిని. ఏ కంటిలో కూడా వ్రణము యొక్క చిహ్నములే కనబడవు.''

జాన్ హిస్లాప్ ఆమెరికాలో బాగా చదువుకొన్న వాణిజ్య వేత్త. అతనికి అవతార పురుషులంటే నమ్మకము లేదు. స్వానుభవమువల్ల బాబా అవతార తత్వములో అచంచల విశ్వాసము కలిగినది. ''స్వానుభవముతో భక్తులు బాబా గురించి చెప్పే విషయాలను బట్టి ఒక సుందర రూపముతో వున్న మానవుడు, మానవుడు విశ్వసించలేని అద్భుతములు చేసినట్లు చిత్రంచడం జరుగుతుంది. బాబా మానవుడని నమ్మినంత కాలం అవి నమ్మలేని అద్భుతాలుగానే వుండిపోవడం సహజం'' అంటారు హిస్లాఫ్.

అజ్ఞాన నిదురలో వుండే వారిలో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించుటకు బాబా అనేక అద్భుత మార్గముల నవలంభిస్తారు. అందులో ఒకటి బాబా పటముల నుండి అమృతము, కుంకుమ, విభూతి, అక్షతలు మొదలయినవి రాలుట. ఈ అనుభవంతో కూడుకున్న భయము తర్వాత భక్తి, తద్వారా పరివర్తన సాధారణంగా కలుగుతూ వుంటాయి. ఉనాయ్ నుండి శ్రీ భగవాన్ దాస్, షిల్లాంగ్ నుండి శ్రీ జె. గోగాయి, కలకత్తా నుండి శ్రీ పి. షెరింగ్, భువనేశ్వర్ నుండి ఉపేంద్రదాస్, బరంపురం నుండి డా॥ జె. విష్ణ్వేశ్వర దాస్, ఢిల్లీ నుండి హెచ్. పి. మిశ్రా, సోనాపూర్ టీ ఎస్టేటు నుంచి డా॥ బారువా, శ్రీ మురళీధరన్, (స్టేషన్ డైరెక్టర్, ఆలిండియా రేడియో, కోహిమా) మొదలయిన వందలాది మంది కిటువంటి అనుభవములు కలిగినవి.

న్యూయార్క్ సత్యసాయి సేవా సంస్థకు చెందిన హిల్డాచార్ల్టన్ శిష్యురాలైన మేరి



యనే యువతి ఈ విధంగా వ్రాసినది. మార్ఫియా దురభ్యాసము వలన నాకు లివర్ జబ్బు కూడా వచ్చినది. నాకు బ్రతుకు మీద ఆశ పోయినది. భారతదేశం నుంచి తిరిగి వచ్చిన మార్క్‌షోల్స్ యిచ్చిన బాబా విభూతి తీసుకున్నాను. ఇల్లూ వాకిలి విడిచి, భవిష్యత్తు కనిపించక నిరాశతో కృంగిపోవుచున్న ఆ సమయంలో ఆ విభూతి నా పాలిట అమృతమై నన్ను నా వ్యాధి బారి నుండి వ్యసనము బారి నుండి కాపాడినది. బాబా అనుగ్రహం వల్ల నేను కాలేజిలో చేరే ప్రయత్నంలో వున్నాను. నా స్నేహితులు ముగ్గురు నాలాగే నిషా కలిగించే ఔషధాలను విసర్జించేరు. బాబాకు నేనెల్లప్పుడూ కృతజ్ఞురాల్ని.''

రామావతార, కృష్ణావతారములందు, కార్మిక కర్షకులను గౌరవించు రాజ్యాంగ విధానము నిజమైన సామ్యవాదము. శ్రీకృష్ణుడు గోవులను పాలించెను. బలరాముడు నాగలిని తన ఆయుధముగా స్వీకరించెను. గోసంరక్షణకు, వ్యవసాయమునకు ఆ యుగమున యిచ్చిన ప్రాధాన్యతను తెలియజేయు చిహ్నములవి.

ఆధునిక విజ్ఞాన పురోగమన వేగము ఫలితముగా ప్రపంచమందలి దేశములు బాహ్యముగా దగ్గరైనవి కాని ఈ విశ్వ కుటుంబ సభ్యుల మధ్య పరస్పరానురాగములు దూరమైనవి. విజ్ఞానము ద్వారా బాహ్యమైన ప్రకృతి శక్తులను అదుపులో పెట్టుటకు ప్రయత్నించుచున్నాడు కాని, తన ప్రకృతిని తాను అదుపులో పెట్టుకొను ప్రయత్నము చేయుట లేదు. సనాతన ధర్మాచరణ ద్వారానే అది సాధ్యము.

అక్కడ సమావేశమైన విద్యావేత్తల నుద్దేశించి క్రమ శిక్షణ, పరస్పర సహాయ సహకారములు, నిర్మాణాత్మకమైన సంఘ సేవా తత్పరత, ఆవేశములను, ఉద్రేకములను హద్దులలో వుంచుకొను మనోబలము విద్యార్థుల కందించు విద్యావిధానమును నెలకొల్పు ప్రయత్నము చేయమని ఉద్ఘాటించిరి. నేటి చదువులు కేవలము పొట్టకూటికై ఉద్యోగముల కొరకు కొని పోవు భిక్షా పాత్రలు. నీతి, పాప భీతి, దైవ భక్తి పెంపొందించు ఆధ్యాత్మిక సత్యములు విద్యార్థులకు గరపుట చాలా అవసరము. నీతికి దూరమైన తెలివి హానికరము. ''Politics without Principles, education without character, science without humanity and commerce without morality are useless and dangerous'' అన్నారు బాబా.

14వ తేదీన బాల వికాస్ సభ్యులైన వందలాది బాలబాలికలు సమావేశమై యుండగా వారినందరినీ ఆశీర్వదించి ప్రత్యేకముగా ఏర్పాటు చేయబడిన విమానములో గుజరాత్‌లో వున్న జామ్‌నగర్‌కు ప్రయాణమై వెళ్ళిరి.

ఎండ చాలా తీక్షణముగా వుంది. అయినా వేలాది భక్తులు ఎయిర్ పోర్ట్‌కి వచ్చి ఆత్రముగా ఆకాశము వైపు చూచుచూ బాబా దర్శనముకై నిరీక్షించుచుండిరి. విమానము దిగినది. అదే సమయములో ఒక అద్భుతమైన బాబా యొక్క అనుగ్రహ విశేషాన్ని కూడా వారు తిలకించేరు. అక్కడ అంతవరకూ వున్న ఎండమాయమై నీడ, దానితో బాటు

చల్లని గాలి అక్కడ నిలచిన భక్తుల మేనులు సోకి సేద దీర్చినవి. విమానం దిగుతూ బాబా అభయ హస్తమును వారివైపు వూపగనే ఆనందమున వారి మోములూ హృదయములూ ప్రఫుల్లమయ్యెను. నవనగర్ రాజమాత ఆనందమునకు అవధులు లేవు.

'అమర్ విలాస్' అనబడు రాజ భవనములో బాబాకు పోలీస్ బ్యాండ్ వాద్య సంగీతము వినబడుచుండగా రాష్ట్ర హోంగార్డ్ డివిజన్ బాబాకు స్వాగత వందనమర్పించినది. ఆ సాయంత్రం బహిరంగ సభలో ఈ మహాభాగ్యమునకు ఎంత కాలము నుండియో యెదురుచూచుచున్న పదివేల మంది బాబా దివ్య సందేశమును విని, భక్తి విశ్వాసము లుత్పన్నము చేయు భజనయందు బాబా మధురాతి మధుర సంకీర్తనలతో అందరూ ఆనంద పరవశులై పాల్గొనిరి.

15వ తేదీన జామ్‌నగర్‌కు 150 మైళ్ళ దూరములో వున్న ద్వారకకు తన పరివారములో రాజమాతను కూడ చేర్చుకుని బాబా బయలు దేరిరి. దారి పొడుగునా అక్కడక్కడ కొన్ని కుటుంబములు బాబా దర్శనము కొరకు నిరీక్షించి వుండి బాబా కారును గుర్తించి చేతులు జోడించి జేజే ధ్వానములు చేయుచుండిరి. బాబాతో ద్వారకకు వెళ్ళుచున్న మాకు భాగవత గాథలు కండ్లకు కట్టినట్లు కనబడుచూ తిరిగి కృష్ణుడు ద్వారకకు ఈ రూపమున వెళ్ళుచున్నాడాయన్న భావము కలిగినది.

ద్వారకావాసులు, సాయి భక్తులు, బాబా రాకముందే కృష్ణాలయమున సమావేశమై వేచి యుండుటచే ఆలయము జన సందోహముతో క్రిక్కిరిసి యుండెను. బాబా అక్కడికి వచ్చిన వెంటనే మాకు ముందూ వెనుకా విపరీతమైన జన సమూహముల ఒత్తిడి. బాబా ఆలయమున ప్రవేశించగనే మమ్ము జనులు యిటునటు నెట్టుచుండిరి. మేము ఒక్కొక్క అంగుళమే ముందుకు జరిగి కృష్ణుని దర్శించ ప్రయత్నించు చున్నాము. మా పరిస్థితి గమనించి, బాబా వెంటనే ఆలయము బయటకురాగా ఆలయము నుండి ద్వారకావాసులు, సాయి భక్తులు బయటకు వచ్చి సాయి కృష్ణుని చుట్టుముట్టి కన్నుల పండువుగా దర్శించి తమ అదృష్టమునకు పరస్పరము అభినందించుకొనుచుండిరి.

అక్కడ నుండి బాబా మితాపూర్ వెళ్ళిరి. అక్కడ తాతా కంపెనీ వారు స్థాపించిన 'కెమికల్ అండ్ ఎల్లాయిస్' ఫ్యాక్టరీలో పనిచేయువారందరూ కొన్ని సంవత్సరములుగా నడుపు కొనుచున్న భజన మండలికి వెళ్ళి వారందరినీ ఆశీర్వదించిరి.

సాయంత్రము జామ్‌నగర్ నుండి తిరిగి వచ్చుచుండగా ద్వారకలో ఆలయము వద్ద నున్న జన సమూహము కారణముగా మేము కృష్ణుని దర్శించలేక పోయినందునకు బాబా సానుభూతి వచనములు పలుకుచూ, హఠాత్తుగా ''ఓ! ఇక్కడ సముద్రమున్నది'' అని బాబా యనుట తోడనే కారు నిలువబడినది. అందరమూ కార్లు దిగి బాబా వెనుక సాగర తీరము చేరితిమి. అక్కడ నొక్క మూల ఒక దేవాలయమున్నది. ఆ ప్రదేశము పేరు 'కురంగ' అనగా లేడి. చిరుతరంగములు బాబా పాదముల క్షాళన చేయుచుండగా తీరముననే



నడచుచూ, శంఖములను గవ్వలనూ యేరుచూ, తరంగముల తాకిడిని తప్పించుకొనలేక సముద్రజలముతో దుస్తులు తడిసిన వారిని చూచి నవ్వుచూ, బాబా తమ సహజ క్రీడాభిలాషను తమ చిరునవ్వులో, కదలికలో, మాటలలో అభివ్యక్తము చేయుచూ కొద్ది నిమిషములు గడిపి ఇసుకపై కూర్చొనిరి. చుట్టూ మేమందరమూ కూర్చుంటిమి. అయిదు వేల సంవత్సరముల పూర్వము కృష్ణుడిట్లే కూర్చొని యుండెడి వాడేమో.

బాబా తన ఎదుట నున్న ఇసుకను ఒక మూరెడు ఎత్తున దిబ్బగా చేతులతో చేస్తూ వుండగా మేమందరం ఉత్సాహముగా దాని పైననే దృష్టి కేంద్రీకరించి ఏమి చేయుదురో చూచుటకు ఆతురతతో ఎదురు చూచుచున్నాము. ఆ దిబ్బను చదును చేసి దానిపై మూడు వంకరలతో ఒక గీతను తన వ్రేలితో గీసి దాని తలపై ఒక సున్న చుట్టిరి. ఆ సున్నపై చిన్న త్రిభుజమును గీసిరి. ఆ సున్నలో ఒక అడ్డగీత గీసిరి. తన చేతులకంటు కున్న ఇసుకను దులుపు కొనుచూ ''ఆఁ! తయారైంది'' అన్నారు. వెంటనే దిబ్బలోనికి లోతుగా చేతిని జొనిపి 15 అంగుళముల ఎత్తుగల బంగారు కృష్ణ విగ్రహమును పైకి తీసిరి. దాని సుందరాకారమునకు, నిర్మాణ కౌశలమునకు అందరూ ముగ్ధులైరి. ''పాపము! మీకు ఆలయములో కృష్ణుని దర్శించుటకు వీలులేకపోయింది కదా! ఇప్పుడు దర్శనం చేసుకోండి'' అన్నారు బాబా. మూడు వంకరలు త్రిభంగియని, సున్నా తల యని, అందలి అడ్డు గీత వేణువు అని పైన రచించిన త్రిభుజము నెమలి పింఛమని అప్పుడు గ్రహించితిమి.

విగ్రహ శాస్త్ర ప్రకారము లోపరహితముగా తయారయిన ఆ ముగ్ధ మోహన విగ్రహమును తనివి తీరా ఎంత సేపు చూచితిమో మాకే తెలియదు. ''పదండి. వెడదాము'' అని బాబాయే మమ్ము మేల్కొలిపిరి. జామ్‌నగర్ రాజ భవన్ డ్రైవర్ ముందు లేచెను. అతని కన్నులలోని ఆశ్చర్యానందములను బాబా చూచి ''నీ యిష్ట దేవత యెవరు?'' అని అడిగిరి. ''భవాని'' అన్నాడతను. వెంటనే బాబా హస్త చాలనముతో ఆ దేవతామూర్తి గల బంగారు పతకమును సృష్టించి యిచ్చిరి. రాత్రి 9 గంటలకు జామ్‌నగర్ తిరిగి వచ్చి, అక్కడ భజన చేయుచూ బాబా దర్శనముకొరకు ఎదురుచూచుచున్న భక్త బృందమును కన్నులతో పలకరించి ఆశీర్వదించిరి.

16వ తేదీన బాబా నవనగర్ రాజకుటుంబము స్థాపించి పోషించుచున్న ఆయుర్వేద విశ్వవిద్యాలయమును చూచుటకు బయలుదేరిరి. భారతదేశమున ఆయుర్వేద శాస్త్రమును బోధించునట్టి ఏకైక విశ్వవిద్యాలయమిది. మానవునిలోని సహజమైన వ్యాధి నిరోధక శక్తినీ, బలమునూ, తేజస్సును, జప, ధ్యాన, మంత్ర, యోగాభ్యాసముల ద్వారా అభివృద్ధిచేయు విధానము ఇచ్చట బోధించబడును.

ఆయుర్వేద మనగా ఆయువును గూర్చి తెలుపు శాస్త్రము. ప్రాచీన ఆయుర్వేద గ్రంథములను పరిశీలించి ఓషధులను, చికిత్సా విధానమును కనిపెట్టుటలో నిమగ్నులై

వున్న భిషగ్వరులను, వారి కృషిని అభినందించి బాబా ఆశీర్వదించిరి.

అక్కడ నుండి ఇంద్రప్రస్థ మనబడు భవనము సందర్శించిరి. అక్కడ సత్యసాయి సేవాదళ్ సభ్యులకు సేవా సాధనయందు ఉన్నత స్థాయిలో తర్ఫీదివ్వబడుచున్నది. వారికి విశ్వాసము, సేవాదీక్ష, వినయ విధేయతలు, శరణాగతిని గూర్చి ఉపన్యసించిరి. ''మతముల యొక్క లక్ష్యము శాస్త్రజ్ఞానము కాదు, సర్వులయందు ప్రేమను పెంపొందించుకొనుట'' అన్నారు బాబా.

సాయంత్రం జామ్‌నగర్ టౌన్‌హాలులో రోటరీ క్లబ్ మెంబర్ల సమావేశములో బాబా ప్రసంగించుచూ, ఉపన్యాసములు, డిన్నర్లు పేరు చెప్పి కాలమును, ధనమును వ్యయము చేయవలదనీ సమాజ సేవలో నిస్స్వార్థము, నిరాడంబరత వుండవలెననీ ఉద్ఘాటించిరి. కృత్రిమమైన గర్భనిరోధక సాధనలవలన శారీరకముగాను, మానసికముగాను దుష్ఫలితములు కలుగు అవకాశమున్నదనీ, మానవునిలో అవినీతి పశుత్వము ప్రబలుననీ హెచ్చరించిరి. ఆధ్యాత్మిక క్రమశిక్షణ, ధ్యానము, జపము ద్వారా సత్ఫలితములు పొందవచ్చునని చెప్పిరి.

సముద్రము బాబా దర్శనము కొరకు ప్రార్థించినదేమో. మళ్ళీ రాత్రి 9 గంటలకు బాబా పరివార సహితముగా బాలవాడి సముద్ర తీరమున కూర్చుండిరి. అక్కడకు దగ్గరలో వున్న సైనిక్ స్కూల్ అధ్యాపకులు విద్యార్థులూ అక్క డకూర్చుని భజనలో పాల్గొనిరి. బాబా డా॥వి.కె.గోకాక్‌ను తన పేరులోని 'వి' అనగానేమి యని యడిగిరి. ''వినాయక'' అని యాతడు చెప్పునంతలోనే ఇసుక నుండి వెండి వినాయకుని విగ్రహమును సృష్టించి యిచ్చిరి. తరువాత వినాయకుని పురాణ గాథలోని అంతరార్థమును వివరించిరి. తరువాత ''మీకేమి కావలెనో కోరుకొనుడు'' అన్నారు బాబా, చుట్టూ వున్న వారిని ఎవరికివారే ''స్వామి అనుగ్రహమే చాలు'' అన్నారు. ''అలాగకాదు. ఏదైనా వస్తువు నడగండి, అది సృష్టించి యిస్తాను'' అన్నారు. ఒకరి ముఖములు ఒకరు చూచుకొనుచున్నాము. ఇంతలోనే బాబా అద్భుతమైన వినాయకుని చిత్రము నొక దానిని సృష్టించిరి. ఆ చిత్రమంతా నూరు ఓంలతో రచించబడినది. కళ్ళూ, ముక్కూ, తొండము, చెవులూ, ఒకటేమిటి, గజనాథుని సర్వాంగములు ఓం అను అక్షరములతోనే రచింపబడినవి.

మాలోని ఒక వ్యక్తి ఉంగరము కోరుకొనెను. వెంటనే అనుగ్రహించిరి. ఒకామె జపమాల కోరినది. 108 రుద్రాక్షలు బంగారు గొలుసులో పొదిగిన జపమాల సృష్టించి యిచ్చిరి. సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ తమ స్కూల్‌కి బాబా అనుగ్రహ చిహ్నముగా ఏదైనా వస్తువును యిమ్మని ప్రార్థించెను. బాబా ఇసుకలో వ్రేళ్ళు జొనిపి 5 అంగుళముల ఎత్తుగల 'అన్నపూర్ణ' వెండి విగ్రహమును సృష్టించి దీనిని పిల్లల భోజనశాలలో వుంచండి. పిల్లలకు మంచి ఆకలి కలిగి ఆరోగ్యముగా పెరుగుతారు. అన్న అనగా ఆహారము, పూర్ణ అనగా సంపూర్తిగా అని అర్థము. అయితే యిది కేవలము శరీరమునకు సంబంధించినదే కాదు. 'అన్న' అనగా 'లోనికి తీసుకొనునది' అని అర్థము. నోరేకాకుండా, జ్ఞానేంద్రియములు, మెదడు నరములు-



యివియన్నీ లోనికి తీసుకొనునవి కూడా అన్నము. ఈ అన్నపూర్ణ మీ శరీరము, మనస్సు, బుద్ధికి కావలసిన ఆహారము నిచ్చి మీ స్కూలు విద్యార్థులను, ఉపాధ్యాయులను కూడ రక్షించ గలదు అనుచు ప్రిన్సిపాల్‌కు ఆ విగ్రహము నిచ్చిరి.

17వ తేదీ చరిత్రాత్మిక స్వర్ణదినము. బాబా తమ దివ్యశక్తితో సోమనాథ దేవాలయము యొక్క ప్రభావమును పునరుద్ధరించిరి. కీర్తిశేషులైన నవనగర్ జామ్ సాహెబ్ సోమనాధ దేవాలయ పునర్నిర్మాణమునకు కృషి చేసిన వారిలో అగ్రగణ్యులు. బాబాను ఆ దేవాలయమునకు తీసుకు రావలెనని వారి చిరకాల వాంఛ, రాజమాత దీక్ష ద్వారా నెరవేరినది. మనోహర శిల్ప కళాఖండమైన 'దిగ్విజయద్వార్' అను గర్భాలయ ముఖద్వార గోపురములకు బాబా ప్రారంభోత్సవము చేసిరి.

పురాణ ప్రసిద్ధిగాంచిన పవిత్ర స్థలమందు ఆ ఆలయము వెలసినది. సోమనాథ్ అనగా ఉమాసహితుడయిన శివుడు (స+ఉమ) అనగా శివ శక్తి. అట్టి శివశక్తి దేవాలయమును పునః ప్రభావితము చేయుటకు శివ శక్తి స్వరూపులైన బాబా సంకల్పించుట సహజమే కదా. అది యెంత ప్రమోదము పవిత్రము అయిన సన్నివేశం! 2వ శతాబ్దమందు లకురిస మహర్షి స్థాపించిన పాశుపతోపాసన తెగకు చెందిన శివయోగులు సోమవిద్య నభ్యసించి సోమేశ్వర దేవాలయములను, దేశము నలుమూలలా, రత్నగిరి, తూర్పుగోదావరి, పూర్ణా, జోధ్‌పూర్, మైసూర్, దక్షిణ కర్ణాటక జిల్లాలందు నెలకొల్పిరి.

సోమనాథ్ దేవాలయము భారతదేశములో సుప్రసిద్ధమైనది. భాగ్యవంతమైనది. పంజాబు, సింధు ప్రాంతములను పరిపాలించు మహమ్మదీయ నవాబు లెన్నోసార్లు దీనిని దోచుకుని ధ్వంసము చేసిరి. క్రీ.శ. 1026లో గజనీ మహమ్మద్ దండయాత్రలో దీనిని ధ్వంసము చేసి దోచుకొనెను.

1947 సం॥లో దీపావళి రోజున, భారతీయ సైన్యము జునాగడ్ నవాబు పాలన నుండి శిధిలమైయున్న ఈ దేవాలయమును వశపరచుకొనెను. ఆ రోజున హర్షధ్వానముల మధ్య ''ఈ పవిత్ర ఆలయమును పునరుద్ధరించుటకు నిర్ణయించుకొన్నాము. ఈ బాధ్యత మనందరి భుజస్కంధములపైన వున్నది అన్ని ప్రకటించెను.

ఈ నూతన ఆలయము పేరు మహామేరు ప్రసాద్. మహా మహిమాన్వితమైన జ్యోతిర్లింగము ప్రతిష్టించబడిన ఆ ఆలయ గోపురము గర్భాలయ ముఖద్వారములకు నరరూపమున అవతరించిన సోమేశ్వరుడైన సత్యసాయి భగవాన్ ప్రారంభోత్సవము జరిపిరి.

ఆ దినమున అసలు సోమనాథ్‌ను చూపించెదనని బాబా ప్రకటించిరి. దానితో జామ్‌నగర్ నుండి తండోపతండములుగా వచ్చి చేరిన భక్తులు ఆనందోత్సాహములతో జేజే ధ్వానములు ప్రారంభించిరి.

సోమనాథ్ దేవాలయ ధర్మకర్తలు, రాష్ట్రమండలి ఉన్నతోద్యోగులు, ఇతర పెద్దలూ

దిగ్విజయ ద్వారము ముందు అలంకరించిన షామియానాలో బాబాను అత్యంత భక్తి శ్రద్ధలతో స్వాగతించిరి. మందిర మంగళవాద్యములు మారుమ్రోగుచుండగా, మెట్ల మీద పరచిన తివాసి మీదుగా నడచి వెళ్ళి మనోహరముగా చెక్కబడిన ద్వారమునకు తగిలించబడిన తాళమును వెండి తాళపు చెవితో బాబా తెరచిరి. అక్కడ నుండి తోరణములతో, అరటి చెట్లతో అలంకరించిన మార్గము వెంట, యుగయుగముల నుండి కోట్లకొలది మానవుల విశ్వాసమునకు కేంద్రమైన సోమనాథుని గర్భాలయములోనికి ప్రవేశించిరి.

150 అడుగుల ఎత్తుకలిగిన శంఖాకారములో నున్న పై కప్పు ప్రతి ధ్వనించునట్లు పండితులు వేదపారాయణము చేయుచుండగా బాబా ఒక పళ్ళెము తెమ్మని ఆదేశించిరి. కుడిచేతి వ్రేళ్ళు పరచి పళ్ళెము మీద అదలించినారు. 108 రజిత బిళ్వదళములు, 108 స్వర్ణ పుష్పములు గలగల రాలుచు ఆ పళ్ళెము నిండా రాలినవి. భక్తుల కొరకు, ఆ భక్తుల తరఫున అచ్చట ప్రతిష్టింపబడిన మూడడుగుల లింగమును నూతన తేజస్సుతో నింపుటకు బాబా పూనుకున్నారు. బాబూ రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా ఈ ఆలయమును ప్రారంభించి నప్పుడు ఈ లింగము ప్రతిష్టించబడినది. ఆ రజిత బిళ్వ పత్రములను, స్వర్ణ పుష్పములను, గంగాజలమును గంగా ప్రవాహములోనికి విడిచినట్లు, సోమనాధ్ లింగము మీద అభిషేకించిరి. వెనుక శ్రీశైలములో కూడ లింగము నిట్లే అభిషేకించి తేజమును పునరుద్ధరించిరి.

క్షణములో బాబా తమ దివ్య హస్తచాలనముతో అద్భుతము! బాబా అరచేతిలో కనులు మిరుమిట్లు గొల్పు తేజోగోళము ప్రత్యక్షమైనది. ఆ సమయమున నేను ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రమును మనమున పఠించుచున్నాను. ఈ ద్వాదశ జ్యోతిర్లింగములలో వారణాసియందలి విశ్వేశ్వర లింగము, హిమాలయమందలి కేదారేశ్వరలింగము, రామేశ్వర మందలి, రామలింగము, శ్రీశైలమందలి మల్లిఖార్జున లింగము, ఉజ్జయిని యందలి మహాకాళి లింగము, నాసికయందలి త్ర్యంబకేశ్వర లింగము మొదలయినవి వున్నవి. అయితే ఈ ద్వాదశ లింగములలో మొట్టమొదట చెప్పబడినది సౌరాష్ట్రమునందలి సోమనాధ లింగము. ఈ జ్యోతిర్లింగములలో సోమనాధ లింగము మొక్కటే ప్రకాశ వైభవముతో విరాజిల్లుచున్నది. ఇప్పుడా జ్యోతిర్లింగమును బాబా తమ హస్తమున రావించి చూపించిరి. చిరస్మరణీయమైన ఎంతటి పవిత్ర క్షణములవి!

అసలైన సోమేశ్వరలింగమును జూపెదనన్న బాబా ప్రకటనకి అర్థం అప్పుడు తెలిసింది. పురాణములలో చెప్పబడినటువంటి, బ్రహ్మ చేత ప్రతిష్ఠింపబడినటువంటి, మానవ హృదయమున కథినాయకుడైన చంద్రుని చేత పూజింపబడినటువంటి సోమేశ్వరుని రూప మిదియన్న మాట.

టూరిస్ట్ డిపార్టుమెంట్‌వారు ప్రచురించిన కరపత్రములో ఇట్లున్నది ''సోమనాధ్ దేవాలయములోని స్పర్శలింగము 'స్వయంభు' అనగా స్వీయ సంకల్పము చేత ఆవిర్భవించిన దనీ, సూర్యుని వంటి ప్రకాశవంతమైనదనీ, భూగర్భమున అండాకారమున నున్నదనీ



కొన్నివేల సంవత్సరముల క్రితము స్కంధ పురాణములో రచింపబడివున్నది.'' స్పర్శ వాయువు యొక్క సహజగుణము. మిగిలిన నాలుగు భూతములకు ప్రాతినిధ్యముగా ఇతర లింగములు కలవు. అవి ఆకాశలింగము, తేజోలింగము, జలలింగము, భూలింగములు. ఎన్నో శతాబ్దములుగా భూమియందు నిక్షిప్త మైన పవిత్ర సోమేశ్వర లింగము బాబా హస్తమున వున్నది. బాబా తిరిగి హస్తచాలనముచే ఒక వెండి పీఠమును సృష్టించి దానిపై ఈ స్పర్శలింగము నుంచి ఆలయ ప్రధాన పూజారి చేతులలో వుంచి ''ఇక ముందు దీనిని భక్తులు కనులార దర్శించుటకు వీలుగా వెలుతురు లోనే వుంచుడు. దీనిని భూగర్భమున దాచనవసరము లేదు. అట్టి భయము పారద్రోలుటకే ఈ యవతారము వచ్చినది.'' అని బాబా ప్రకటించిరి.

సోమేశ్వర లింగ విజయాగమున చిహ్నముగా గర్భాలయ గోపురముపై బాబా పతాకము నావిష్కరించిరి. దేవాలయపు మెట్లమీద నిలబడి బాబా దర్శనమీయగా వేలాది భక్తులు 'జై భగవాన్' అనుచు ఆనందోత్సాహములతో నినదించిరి.

అక్కడ నుండి వీరవల్‌లో వున్న రాజేంద్రభవన్‌కు వెళ్ళి, అక్కడ నుండి 2 గంటలకు కెషోడ్ ఏరోడ్రోమ్‌లో బొంబాయి పోవుటకు ఏర్పాటయిన ప్రత్యేక విమానము నెక్కిరి. బొంబాయిలో ధర్మక్షేత్రము వద్ద నాడు తిరిగి రానున్న బాబాను దర్శించుటకై 30,000 భక్తులు నిరీక్షించుచుండిరి.

డా॥ గోకాక్, జామ్‌నగర్, ద్వారక, సోమనాధ్‌లందు బాబా నెరపిన లీలలను మహిమలను గురించి విపులముగా వర్ణించిరి. ప్రతి వ్యక్తి యందు అంతర్భూతమై వున్న భగవంతుని గురించి సాధన, సేవ, అభ్యాసముల గురించి బాబా ప్రసంగించిరి. ''ఈ విశ్వము పరమాత్మని శరీరము. నీకు కన్నులేవున్న ఈ విశ్వమందలి యే అణువును పరిశోధించి ననూ భగవంతుని చూడగలవు. నీవూ ఆ పరమాత్మ యొక్క అంశానివే. అందరూ అంతే. అన్నీ అంతే. ప్రతి ప్రాణియందూ, ప్రతి అణువునందూ, ప్రతి జీవకణము నందూ భగవంతుడున్నాడని భావించుటకు ముందు నీవూ భగవంతుని పూర్ణస్వరూపానివే అనే భావానుభూతి కలిగి నీ మనోవాక్కాయ కర్మలలో అభివ్యక్తం చెయ్యాలి'' అన్నారు బాబా.

20వ తేదీన బాబా బొంబాయి విడిచి బృందావన్ చేరిరి. 25వ తేదీన భారత్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌ను ఆశీర్వదించి ప్రారంభోత్సవము జరుపు సందర్భమున తమ ప్రసంగంలో యజమాని, కార్మికుల పరస్పర ప్రేమదాయక, లాభదాయక సంబంధమును గురించి ముచ్చటించిరి. జూన్ నెల మొదటి తేదీన బాబా 'కలకంటే' అను గ్రామమునకు వెళ్ళిరి. చెట్ల తోపుల మరుగున శ్రమతో కూడిన 12 మైళ్ళు కాలి బాట చివర ఈ గ్రామమున్నది. మార్గమధ్యమున ప్రతి పల్లెయందు గ్రామస్తులు హస్తముల పూలమాలలతో బాబాను దర్శించుటకై వేచియున్నారు.

అక్కడ చేరిన గ్రామ ప్రజలు దూరమందున్న కొండపై బాబా కారున్నచోట ఒక వింతకాంతిని చూచిరి. ఆ కారు సమీపించుకొలది ఆ కారు చుట్టు బంగారు కాంతిని వారు చూచుచుండిరి.

కారు దిగి ముందు పండితులు వేదము పఠించుచుండగా, మంగళ వాద్యములు మ్రోగుచుండగా, గ్రామస్తులు నామ సంకీర్తన చేయుచుండగా, బాబా రెండు ఫర్లాంగులు నడచి, శ్రీ రంజనాధ్ దేవాలయము వద్దకు చేరిరి. అక్కడ పాఠశాల భవన నిర్మాణమునకు బాబా శంఖుస్థాపన చేసిరి. అక్కడ ఉపన్యాసములో ''మీరందరూ కదలుచున్న దేవాలయములు. మీ అందరిలోనూ భగవంతుడున్నాడని తెలుసుకొనుడు. అతడే మిమ్ము రక్షించి, పోషించి దుష్టశక్తుల నుండి కాపాడగలవాడు.'' నూతన పాఠశాల గురించి ''సత్యము తెలుసుకుని, అనేకత్వములోని ఏకత్వమును గ్రహించినప్పుడే ముక్తి సిద్ధించును. నేడు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దలు, వారి ప్రవర్తనల ద్వారా బాలబాలికలు నిర్మల హృదయములను కలుషితము చేయుచున్నారు. ఈ చిన్న వయస్సులోనే వారి హృదయము లందు సత్యము, ధర్మము, త్యాగము అనే బీజములు నాటినట్లయితే వీరు నిర్మల చిత్తులుగా, వీరులుగా, ధీరులుగా పెరుగుదురు. నేటి కలుషిత వాతావరణములో విద్యార్థులు నీతికీ, అటు జాతికీ కూడ సమస్యలై కూర్చున్నారు. వీరి నిప్పటి నుండి భగవద్విశ్వాసములో నిమగ్నులగునట్లు చేయుట నిజమైన సమాజ సేవ'' అని బాబా ఉపదేశించిరి.

ఆ సాయంత్రం బెంగుళూరు కేంద్ర భారతీయ విద్యాభవన్ వారు బాబాను భక్తి పూర్వకముగా ఆహ్వానించిరి. వేదాంత పండితులైన డా॥ఆర్. ఆర్. దివాకర్‌గారు స్వాగత వాక్యములు పలికిరి. వారు ''నేటి ప్రపంచములో మహోన్నతమైన, దివ్యమైన నైతిక శక్తి బాబా ఒక్కరే'' అన్నారు.

''భారతీయ విద్య అనగా ఆత్మవిద్య, దాని ప్రభావమును ఆచరణలో నిరూపించి అది వ్యక్తికీ, సంఘమునకూ శాంతి సంక్షేమములు అందించునని ప్రకటించుటయే భారతీయ విద్యా భవనముయొక్క, తదితర అనుయాయ సంస్థల యొక్క బాధ్యత. మోక్ష మార్గము పదేశించు పవిత్ర గ్రంధములను మధించి పోషకపదార్థమైన జ్ఞానమను వెన్నను కూడబెట్టి మిథ్యైశ్వర్యముల మధ్య జీవనాధారము కొరకు అలమటించు వారికి పంచిపెట్టి మీరును భుజియించుడు. ఈ భవనమునందలి ప్రతి ఉద్యోగి మూర్తీభవించిన భారతీయ విద్యగా తయారు కావలెను. అనగా వివేకముతో అన్ని మతముల యెడల సమ్మతము, ఒడుదుడుకులలో ఓరిమి, పెద్దల యెడల, వృద్ధుల యెడల వినయ విధేయతలు, పవిత్ర చారిత్రక విషయములందు గౌరవము కలిగి వుండి నిగర్విగా జీవించవలెను'' అని బాబా తమ దివ్య సందేశము నందించిరి.

జూన్ 5వ తేదీన బాబా ప్రశాంతి నిలయము చేరిరి.

# ఎంతటి కరుణ!

1970 సంవత్సరములో ప్రశాంతి నిలయమునందు రెండు సమావేశములు జరిగినవి! అక్టోబర్ మాసమున దసరా ఉత్సవములో అఖిల భారత సేవాదళ్ సమావేశము, నవంబరు నెలలో బాబా జన్మదినోత్సవ సందర్భమున అఖిల భారత సత్యసాయి సేవా సంస్థల కార్యకర్తల సమావేశము, బాబావారి దివ్యాదేశానుసారము, వారి ప్రబోధనల కనుగుణ్యముగా రూపొందించబడిన ఈ సంస్థల యొక్క క్రమశిక్షణ, వాటి కార్య కలాపముల అభివృద్ధి పటిష్ఠము చేయుటయే ఈ సమావేశముల యొక్క లక్ష్యము. ఏ విధముగా వేరు వేరు ఏర్లు కలసి నది రూపములో ప్రవహించి తుదకు సాగరమున సంగమించుచున్నవో అదే విధముగా మానవులు తమ వ్యక్తిత్వ శృంఖలములను ఛేదించి పరస్పరానురాగమున ఆధ్యాత్మిక మార్గమున ప్రవేశించి భగవదనుగ్రహ ప్రాప్తియను గమ్యమును చేరవలెను. సోదర మానవులతో సహకరించక సంఘమునకు దూరముగా నిలబడువాడు ఆధ్యాత్మిక సాధకుడు కాలేడు. ఒక నీటి బిందువు సూర్యకిరణముల సంపర్కముచేత ఆవిరి అవుతుంది. అయితే యే ఒక్క బిందువూ తనకుతాను ప్రత్యేకముగా సముద్రమును తిరిగి చేరలేదు. తోటి బిందువు లతో కలసి ఆవిరియై, తన వ్యక్తిత్వమును విడచి సెలయేరై కాలవై, నదియై సాగరగర్భంలో కలసిపోతుంది. సంఘము నొక బోనుగానో, ఖైదుగానో భావించరాదు. సంఘములో తోటి మానవులకు సేవచేయుటయే ప్రేమ యోగము; అదే అత్యుత్తమమైన ఆధ్యాత్మిక సాధన. ఈ సాధన యందు ప్రవేశపెట్టుటకే ఈ సంస్థలు, వాటి కార్యక్రమములూ రూపొందించ బడినవి.

పరమాత్మకు తనకు భేదము లేదనీ, సృష్టికీ సృష్టికర్తకూ మధ్యా, పదార్థమునకూ శక్తికీ మధ్యా భేదములేదని అభివ్యక్తము చేసుకొనిన వానికి సేవాభావము సహజ లక్షణము. నీ వితరుల నుండి యేమి కోరుచున్నావో అటులనే యితరుల యెడల నీవు ప్రవర్తింపుము. 'సర్వమిదమేకం' అను ఉత్తమ అధ్యాత్మిక సూత్రమున కట్టి ప్రవర్తనయే ఆధారము.

''నా సంకల్పముతో ఆనందారోగ్యములు ప్రసాదించుటకాని, పదార్థ సృష్టికాని నా ప్రత్యేక లక్షణములు కావు. వాటి వెనుకనున్న ప్రేమయే నా ప్రత్యేక లక్షణము. వేటిని నా లీలలుగా, దివ్యలక్షణములుగా పరిగణిస్తారో అవి కేవలము నా సహజ లక్షణములు. మిమ్మల్ని నావద్దకు ఆకర్షించేదీ. సత్యాన్వేషకుల వైపు నన్ను త్రోయునదీ. తీర్థయాత్రలలో యిబ్బందిపడు వారిని రక్షించ పురిగొల్పునదీ, నేనే సాయిబాబా యని ప్రకటింపచేసినదీ నా నిజతత్వమైన ప్రేమయే నీ ప్రతిచర్యనూ ప్రేమపూరితము కావించుము. మనసా వాచా కర్మణా ఎవ్వరికీ బాధ కలిగించవద్దు. మీరందరూ ఒక్కటే. నీవితరులను బాధించితే నిన్ను నువ్వు బాధించుకున్నట్లే. నీవు సాయివి. అందరూ సాయి స్వరూపులే. నీ శరీరములో ఒక భాగమైన చెయ్యి మరొక భాగమైన కంటిని పెరికివేస్తుందా. ఈ

భావనయే సరియైన సాధన. మీ హృదయజ్యోతులను ప్రకాశింపజేయుటకే నేను వచ్చినది. ఆ వెలుగునందు మీరు ప్రతి వారిలోనూ సాయిని చూడగలరు'' అని బాబా ప్రకటించిరి.

సేవాదళ్ సమావేశమును ప్రారంభించుచూ బాబా యిట్లు వచించిరి. ''ప్రతి వానిని సంకల్పము - కార్యము - జ్ఞానము, కర్త - విధి - కర్మ, బలము - సుందరము తేజము అనుత్ర్యంబకముగా భావించుము. వీటినే భగవంతునిగా భావించుము. నీవు చేయగలిగిన సేవను విచక్షణతో కూడిన ప్రావీణ్యముతో నిర్బంధము, భయము, సంకోచము, ఫలాపేక్ష లేకుండా అర్పించుము. ఇందుకెట్టి యూనిఫారం దుస్తులూ అవసరం లేదు. ఎటువంటి బ్యాడ్జి అవసరం లేదు. దుఃఖములో నున్న మానవుడు నీ సహాయము యాచించు అవసర ముండరాదు. సానుభూతితో అతని కన్నులలోనికి చూచి సోదరునివలె తోడ్పడు స్వభావమును పెంపొందించుకొనుము. సేవ అను గర్భము నందే ప్రేమ జనించును. సేవ ద్వారా ప్రేమ అభివృద్ధి చెందుతుంది. భగవంతుడు ప్రేమ స్వరూపుడు. ప్రేమయే భగవంతుడు. ఈ సత్యమును బోధించుటకే నేనవతరించితిని. మీ హృదయములలో ప్రేమ బీజములు వెదజల్లండి. అవి అంకురించి పుష్పించి వాతావరణమున ప్రేమ పరిమళములను వ్యాపింప జేయును. ప్రతి శిశువు, పక్షి, పశువు, స్త్రీ, పురుషుడు ఆ ప్రేమ వాహినిలో మునిగి తేలుచూ ఆనంద గీతముల నాలాపించెదరు'' ఆ నాడు బాబాయొక్క ప్రేమపూరిత సందేశమును వెయ్యిమంది యువతీ యువక సేవాదళ్ ప్రతి నిధులు తన్మయత్వముతో వినిరి.

వీరియందరి భావావేశములను సమీక్షించుచూ ఒక అమెరికన్ యువకుడీ విధముగా తన ఉపన్యాసమున చెప్పెను. ''సాయి భావముతో మన హృదయములు నింపుకుని, ఆ దివ్య తత్వమును చేరు యోగశాస్త్రము నభ్యసించు సేవా సాధనకు అంకితమయ్యే కార్యకర్తలుగా మనము రూపొందెదముగాక'' వివిధ జిల్లాలో సేవా దళములు చేసిన కృషిని గురించి నివేదికలు చదువబడినవి. ఉపసంఘముల వారు తమ అభిప్రాయములను వ్యక్తపరచిరి. శ్రీ నకుల్‌సేన్ తమలో వున్న అధ్యాత్మిక చైతన్యమును సేవాదళ సభ్యులు హృదయములందు నింపుకొనవలెనని నుడివిరి.

''సేవాదళ సభ్యులు జపధ్యానములందు శ్రద్ధ చూపవలెను. ఇవి మానసిక శాంతిని చేకూర్చును. శాంతి అత్యంత విలువైన సంపద. శాంతిని మీరు పొందనిదే యితరుల కెట్లు సమకూర్చగలరు అని బాబా జపధ్యానము వలన శాంతి లభించు వైనము, విధానము వివరించిరి.

ఉపసంఘముల వారు ప్రోత్సహించిన రక్తదానము, ప్రథమ చికిత్సలో తర్ఫీదు, వైద్యశాలల్లో రోగులకు ధైర్యము ఉత్సాహము కలిగించు హితవచనములతో పరిచర్యలతో సేవచేయుట, జైళ్ళలో ఖైదీలకు ఆత్మవిశ్వాసములకు, దైవచింతన కలుగునట్లు సత్సంగములు, భజనలు ప్రారంభించి, యాత్రాస్థలములందు యాత్రికులకు



సహాయపడుట, మురికివాడలలో స్వయముగా శుచి శుభ్రతలను నెలకొల్పి అక్కడ వారికి వాటి ప్రాముఖ్యతను సంరక్షించుకొను విధానమును బోధించుట మొదలయిన కార్యక్రమము అభినందించి బాబా ''ఇటువంటి నిర్ణీతమైన కార్యక్రమములే కాకుండా, వ్యక్తిగతముగా కాని, సామూహికముగా కాని తోటి మానవులకు అవసరమైన ఏ సేవా కార్యమునైననూ నిస్వార్థబుద్ధితో, సాయి నారాయణుని సేవగా భావించి కొనసాగించవలె''నని ఉపదేశించిరి.

ఈ సందర్భములో హిల్డా ఛార్ల్‌టన్ వ్రాసిన ఉత్తరములోని కొంతభాగము తెలియ జేయుట సమంజసము. బాబా తనకు చెప్పిన విషయముల నందామె పేర్కొన్నది. ''ఉత్సాహము ఉరకలు వేస్తుండగా హృదయకవాటము దైవ ప్రేమకొరకు తెరచి శివమెత్తి భూమిమీద నడువుము. నీయందూ, నీయందే వున్న భగవంతుని యందూ సదా విశ్వాసము కలిగి యుండుము. అప్పుడు అంతా శుభప్రదముగా నుండును. నీవు చూచిన ప్రతి పదార్థమందూ నీవు నడచిన ప్రతి ప్రదేశమందూ, నీవు కలసిన ప్రతివ్యక్తి యందూ నేనున్నాను. అన్నిటా నేనున్నాను. నన్నొకచోట చూచి మరొక చోట చూడకుండ నుండలేవు. ప్రతి దాని నుండి నేను ప్రతివచన మివ్వగలను. నేను సర్వవ్యాపకుడను. నీవు నానుండి తప్పించుకొనలేవు. ఏదీ రహస్యముగా చేయలేవు, నా దగ్గరెట్టి రహస్యములూ లేవు. నా ప్రబోధన ననుసరించి నడుచుకొనుము. అన్నీ అద్భుతములే. అంతా ఆనందమే.''

ఈ వెయ్యిమంది సేవాదళ్ సభ్యులు ప్రతినిధులు దసరా పండుగ పూర్తియగువరకూ ప్రశాంతి నిలయములోనే వుండి బాబా ఆదేశముల నాచరణలో పెట్టినారు. సాయంకాలపు సమావేశములలో ఆత్మను గురించీ, అద్వైతతత్వమును గురించీ, జీవాత్మల సంబంధమును గురించి బాబా ఉపదేశించుచుండిరి. ''నేడు ప్రతి విద్యార్థి ఈ యనంత విశ్వములో ఎంతో దూరమున వున్న సూర్యుడు, చంద్రుడూ తదితర గ్రహములూ నక్షత్రముల గురించి తెలుసుకొనుచున్నాడు. అయితే విజ్ఞాన సర్వస్వమును జీర్ణించుకున్న విద్వాంసులు కూడా ''నేనెవ్వరు?'' అను ప్రశ్నకు సమాధానము చెప్పలేకున్నారు. 'నేను' అను పదము యెప్పుడూ వాడేదే. ప్రతి సంభాషణలోనూ ఈ పదము రాక తప్పదు. నేను చూచినాను, నేను వెళ్ళినాను, నేను ఇట్లు చెసినాను, నేను విన్నాను, నేను ఆనందిస్తున్నాను, నేను ద్వేషిస్తున్నాను- ఇన్నిటికీ కర్తను నేను. ఈ 'నేను ఎవరు? ఉపనిషత్తులు ఈ 'నేను' అనునది ఒక వ్యక్తి రూపము కాదని ఘోషించుచున్నవి. ఈ 'నేను' అనునది ఏ యొక్క శరీరములో వున్నదో లేక ఏ శరీరమును నడిపించుచున్నదో దానికి మాత్రమే పరిమితము కాలేదు. ఇది అన్నిటియందు సర్వసామాన్యమై, నిత్యమై, సర్వవ్యాపకమై వున్న ఆత్మ. అదే సత్-చిత్-ఆనందము.

సచ్చిదానంద స్వరూపమైన ఈ నేను అను చైతన్యమును గురించి మరొక దినమున బాబా ఇట్లు వివరించిరి. 'నేను' అను చైతన్యమెక్కడ వుంటుందో అక్కడ ముఖ్యమైన మూడు ప్రేరణలుండును.

1. నేను బ్రతకవలెను - ఇది అమృతత్వము యొక్క అంతరాంతరము నుండి వచ్చిన ప్రేరణ - దీనినే సత్ అందురు.

2. నేను తెలుసుకొనవలెను - ఇది సర్వవ్యాపకత్వము యొక్క స్మృతి చిహ్నము. దీనినే చిత్ అందురు.

3. నేను ఆనందముగా వుండవలెను - ఇది ప్రతిజీవిలోనూ సహజముగా నుండు ప్రేరణము - ఇదే ఆనందము.

విజయదశమి ఉత్సవము అనంతరము భక్తులు తిరిగి వెళ్ళిపోవుచున్న సందర్భమున బాబా తమ దివ్య సందేశము నందించిరి. ''నా కొరకు కాదు. మీ కొరకు నేను మీవలె మాట్లాడుచున్నాను. తిరుగుచున్నాను. భుజించుచున్నాను. మీకు అర్థమగు రీతిగా ప్రవర్తించు చున్నాను. మీలో వుండి, మీలో ఒక్కడినై మీ విశ్వాసమును, ప్రేమను, విధేయతను చూరగొని మిమ్ము దైవత్వము వైపు మరలించు చున్నాను. మీ యందు అధ్యాత్మిక జిజ్ఞాస కలిగించుటయే నా ఆశయము. మీ నిజతత్వమును గ్రహించి తద్వారా ఈ విశ్వ సత్యమును గుర్తించెదరు. ఈ చరాచర సృష్టికంతకూ నేనే అంతర్వాహినిని, అన్నిటిని ప్రేరేపించు శక్తి నేను, నేనే జ్ఞానిని. జ్ఞానము, జ్ఞేయము నేనిచ్చవచ్చినట్లు నా శక్తిని ప్రదర్శించి మిమ్ము తికమక **పెట్టను.** నేను ఏమి చేసినా నా ప్రబోధనలను ఆచరణ రూపములో మీకు చూపుటకే, మార్గదర్శకుడనై మిమ్ముత్సాహ పరచుటకు నా జీవితమే నా సందేశము.

1970వ సంవత్సర జన్మదినోత్సవము సత్యసాయి సేవా సంస్థలను, భజన మండలులనూ, సేవాదళములనూ, బాల వికాస్‌లనూ, సత్సంగములనూ, పఠన కేంద్రములనూ, మహిళా విభాగములనూ స్థాపించమని బాబా ఆదేశించిరి. ''ఈ సంస్థలు నలుమూలలకు వ్యాపించినవి. ఒక్కొక్క సంస్థ తరపున ఆధ్యక్షుడు, ఒక్కొక్క కార్యదర్శి, ప్రతినిధులుగా వచ్చినప్పటికి, ఇక్కడ మీరు మూడు వేల మంది సమావేశమైనారు. బాగుగా పరిశీలించి మీ విశ్వాసమును దృఢపరచుకొనుడు. అటుపై ఆ విశ్వాసమును సడలనీయకుండా గమ్యము చేరువరకూ మార్గము నంటి పెట్టుకుని వుండుడు. నిత్యజీవితములో ప్రేమ, అహింసా, సిద్ధాంతములను ఆచరణలోనికి తీసుకు వచ్చుటకే సాయి సంస్థలు ఏర్పాటయినవి. నాలుగు ముఖ్యమైన అంశములను మీరు తత్వ విచారణతో గ్రహించవలెను. దేహం ఏమిటి? నేను ఈ దేహమా? నాహం; కాదు. మరి నేనెవరు? కోహం? (తత్వమసి) నేను అదేనా? లేక ఇది వేరు అది వేరునా? వీటన్నిటికీ ఒక్కటే సమాధానము - 'సోహం' అదే నేను - అంటే ఆ పరమాత్మ నేనేను. నశ్వరమైన శరీరముతో అస్థిరమైన మనస్సుతో తాదాత్మ్య భావము విడచి ఈ క్షణికమైన నాటకమునకు నేను సాక్షిని మాత్రమే అని గ్రహింపుము.



''అన్ని మతములు అహింసను, ప్రేమను బోధించును. సాయి మతము సర్వమత సామరస్యమును బోధించును. అందువలన ఎట్టి భేదభావము పెట్టుకొనక అందరితోను కలసి పని చేయవలెను. నీలో ప్రేమ వున్న నిన్నందరూ గౌరవించెదరు. లోక సంరక్షణార్థమే నేను వచ్చినది. మీరందరూ పరస్పరానురాగముతో జీవించిన యెట్టి కలతలు వుండవు. అట్టి ప్రవర్తనయే నాకు ఆనందము కలిగించును.'' ఈ ప్రబోధమే సాయి సేవా సంస్థల ప్రాథమిక సిద్ధాంతం. సమావేశాంతమున ప్రతినిధుల ప్రశ్నలు గల పెద్ద జాబితా బాబాకు అందింపబడినది. వివరముగా బాబా వాటికి రెండు గంటల ఉపన్యాసములో సమాధానము లిచ్చిరి. మనస్సు స్వభావమెట్టిది? సృష్టి ఏ విధముగా ప్రారంభమైనది? ఇతరులకు చేసిన సేవ ఆధ్యాత్మిక సాధన యెట్లగును? జపమునకు ఏ నామము ప్రశస్తమైనది? ఏ యోగము వలన త్వరగా పరమాత్మ సన్నిధానము చేరవచ్చును? ధ్యానమునకు శిక్షణ అవసరమా? మహమ్మదీయ కార్యనిర్వాహక సభ్యుడు భజనలో పాల్గొనుట కిచ్చగించునా? ఇటువంటి ఎన్నో ప్రశ్నాపరంపరలకు బాబా సమాధానము లిచ్చిరి. ఏ వ్యక్తి కూడా తన విశ్వాసమునకు వ్యతిరేకముగా, ఆత్మ వంచన చేసుకుంటూ ప్రవర్తించకూడదు. అందరికీ అందుబాటులో ఉన్నదీ సమ్మతమైనదీ ప్రేమ యోగము. ఇదే భగవంతుని దరికి త్వరితముగా మానవుని జేర్చునది. ఎవ్వరూ ధ్యానములో ఇతరులకు శిక్షణ ఇవ్వలేరు; చాంచల్యము మనస్సు యొక్క స్వభావము. నిర్మల చిత్తము నభివృద్ధిపరచుకొను మార్గములన్నియూ సాధనలే. ఎవరు ఏ రూపనామములను ఆరాధించినను భగవంతుడొక్కడే. అతడు నిర్వికారుడు. నామము మార్చినంత మాత్రమున భగవంతుడు మారడు. అనేకత్వమును భ్రమను తొలగించుటకు సేవయే మార్గము, నిద్ర స్వప్నమునకు కారణము. భగవంతుని సమ్మోహిత శక్తియైన మాయ అసత్యమైన అనేకత్వమునకు కారణము. స్వాతిశయము చుట్టూ గూడుకట్టు కొన్న కోర్కెల పుట్టయే మనస్సు. జపము, ధ్యానము, భజన సేవాతత్పరతల ద్వారా హృదయ నైర్మల్యమును సాధించుము. మీ ప్రవర్తనలలో ఇతరులకు మార్గదర్శకులుగా ఉండుడు. అదే ఇతరులకు ఉత్సాహము, ఉత్తేజము కలిగించును.

''విశృంఖలముగా విజృంభించే అహంభావముతో నిండిన నీ మనస్సును సాధనతో సమభావ స్థితికి తీసుకురావలెను. చిత్తవిభ్రమములకు గాని, వికారములకుగాని లొంగి పోరాదు. ఇంద్రియముల మీద, ఇంద్రియచోదితమైన ప్రపంచము మీద నున్న ఆసక్తిని భగవంతుని యందు భక్తిగా మార్చుకొనుడు. అందువలన హృదయము ఆనంద మాధుర్యము చేత పరిపూర్ణమౌతుంది.

''నేను సర్వాంతర్యామిగా అందరిలోనూ వున్నాననీ, సర్వసాక్షి భూతునిగా అన్నీ గమనించు చున్నాననీ మీ మనస్సులలో దృఢముగా విశ్వసించుట ద్వారా మీ సేవా సాధనలోనూ, అధ్యయనములోనూ, ప్రవర్తనలోనూ ఆదర్శప్రాయముగా పురోగమించెదరు. మీరింతవరకూ సాధించిన విజయానందముతో ద్విగుణీకృత నూతనోత్సాహ

ముతో మరింత శ్రద్ధాసక్తులతో ముందు ముందు మీ కార్యకలాపములు కొనసాగించవలెనని నా ఆశయము, నా ఆశీర్వాదము, ప్రేమ, గౌరవము, సహనము, పరస్పర సహకారములు ప్రతి హృదయము నుండి ప్రతి హృదయములోనికి ప్రవహించవలెను. మీరందరూ ఒకే ఒక శరీరమందలి - సాయి శరీరమందలి అంగములే''. ఇట్టి అమృత బిందువులతో సత్యసాయి సేవా సంస్థల కార్యకర్తల హృదయములు ఆనందోత్సాహములతో స్పందించునట్లు చేసిరి.

పాశ్చాత్య భక్త బృందమువారు, తమ వెంట తెచ్చుకున్న సంగీత వాయిద్యములతో, వారుత్సాహముతో, ఎదురుచూచిన అవకాశము ఫలించగా, ఈ దిగువ గీతమును దసరా సందర్భములో వీనులకు విందుచేయుచూ, సమావేశానంతరము సభలో గానము చేసిరి.

'సాయిబాబా! ఓ దయానిధీ! నీవే తల్లివి. సోదరుడవు, సోదరివి. పంచ భూతములూ నీవే. మా సర్వస్వమూ నీవే. దారిచూప నిన్నే నిరంతరము ఆశ్రయించుదుము' ఇదీ సంక్షిప్తముగా ఈ పాటకు అర్థము.

Sai Baba ! Sai Baba! So kind! So kind!
He is our mother, sister and brother -
All in One!
He is the earth, air and water
Moon and Sun
Sai Baba! Sai Baba! So kind! So kind!
He is the all we shall ever be -
That we have ever been -
We are here today and tomorrow.
So that He can help-us see!
Sai baba! Sai Baba! So kind! So kind!

స్థూల సూక్ష్మకారణములలో బంధింపబడినట్లు కనబడు మన నిజత్వమును కనుగొనుటకు ఆధ్యాత్మిక సాధన తోడ్పడునంటారు బాబా. మనమందరమూ పంచభూతముల ఆకర్షణకు లోబడి **వుంటాము.** అవతార పురుషులు వీటికి వెలుపల వుండి వీటిని తమ స్వాధీనములో ఉంచుకొందురు. ఎప్పుడు మనమీ పాంచభౌతికములైన శక్తులకు ఆధీనులమై నిత్యానిత్యమైన జీవన విలువలను విస్మరించెదమో అప్పుడే మనము పతనము చెందెదము. ఈ పంచభూతముల ప్రభావమును వివేక, విచారణ, వైరాగ్యముల ద్వారా ఎప్పుడు జయించగల్గుదుమో అప్పుడే మృగ్యమైన జీవన స్థాయి నుండి ఉన్నత స్థితికి చేరగలము. ఈ పరిణామ స్థితియందు మానవుని అహంకారము పరమశత్రువు; భగవదనుగ్రహమునకు దూరము చేయు శక్తిగలది. బాహ్యమైన ఇంద్రియాకర్షణల నుండి మనస్సును దూరము చేసి నిశ్చల నిర్మలస్థితిని చేకూర్చుటచేతనే శాంతి లభించును.

జన్మదినోత్సవము తర్వాత బాబా బెంగుళూరు వెళ్ళి బృందావనములో వుండిరి. తదుపరి డిశెంబరు నెలలో జరిగిన సంఘటన చరిత్రలో ఒక దివ్య ఘట్టము.



# ప్రేమయే జీవనసారం

''కొందరు వాదించుటలో తమకుగల తెలివితేటకు వారే మురిసి పోతూ ఇతరుల నెత్తి పొడుచుతూ మాట్లాడెదరు. కొందరు తామే మహాపండితులైనట్లు కనుబొమ్మలెగుర వేసెదరు. ఇలాంటివారు ఇతరులను దూషించుటయందూ, తమను తాము స్తుతించుకొనుట యందూ ఎంతో ఆసక్తి చూపుచుందురు. ఎత్తుగా ఆకాశమున విహరించుచూ భూమిమీద వున్న మృతకళేబరముల కొరకు వెదకుచుండు రాబందువుల వంటివారు వీరు'' అని సద్గురువు కొరకు భారతదేశమంతా వెదకి వేసారిన ఒక సాధకుడు వ్రాసియున్నాడు. ప్రేమ ద్వారానే భగవంతుడు అవతరించును. అందుచేత అవతార పురుషుని ముఖ్య లక్షణము ప్రేమ. అట్టివారిని కనుగొనుట కొకటే మార్గము. భగవంతుని నిత్యము ప్రార్థించుము. మానవ రూపమున అవతరించిన భగవంతుని కనుగొనగలుగుట కాతడే నీకు త్రోవ చూపును. పాల్ బ్రంటన్ అందుకున్న సలహా ఇది.

అందరిలోనూ నిన్ను చూచుకొను ప్రయత్నము చేయుము. అప్పుడు ఒకరిని తక్కువ ఒకరిని ఎక్కువ ప్రేమించకుండా అందరినీ సమానముగా ప్రేమించగలుగుదువు. ప్రేమను సమముగా పంచుకొన్నప్పుడు శాంతి ఫలిస్తుంది. లౌకిక ప్రపంచమందలి సంబంధ బాంధవ్యములు ఇచ్చిపుచ్చుకొనుట యను సూత్రముపై ఆధారపడియున్నవి. ఉత్తమోత్తమైన ప్రేమ భగవంతునికి భక్తునకు మధ్య వుంటుంది. భక్తుడెప్పుడూ భగవంతునియందు లీనము కావలెనని కోరుచుండును. అందుచేత అతని ప్రేమ భగవంతుని స్వరూపమైన ప్రతి ప్రాణిమీద ప్రవహించుచుండును. బాబా చెప్పున దేమనగా, భగవంతుడే ప్రేమ; వ్యక్తి ప్రేమికుడు, ప్రేమించబడునది ప్రకృతి; ప్రకృతి సంపూర్ణముగా భగవంతుని ఆధీనములో వున్నదని క్షుణ్ణముగా తెలిసికూడా ఎందుకు సృష్టికి లోబడివుండాలి భగవంతుడు సర్వవ్యాపకుడనీ, సృష్టి భగవంతుని అభివ్యక్తము చేయుచున్నదనీ తెలుసుకుని ఆ సృష్టికర్త అయిన భగవంతునే ప్రేమించవలెను. మన ఆలోచనలన్నియు భగవంతునికే అంకితము చేయవలెను. మన మనస్సుల నధీనములో ఉంచుకొనగలిగినప్పుడే అది సాధ్యము; లేకున్న అసాధ్యము. సాధన చేయగా చేయగా భగవంతునిలో జీవించు స్థితి అనగా ప్రేమలో జీవించు స్థితిని పొందగలుగుదుము; అదే భగవదనుగ్రహము.

స్వార్థ తలంపులు పరార్థ తలంపులను అణగద్రొక్కుటచేత మానవులలో పరస్పర ప్రేమానురాగములు తగ్గిపోవుచున్నవి; పారమార్థిక చింతకంటె ఉదరపోషణకు ప్రాధాన్య మివ్వబడుచున్నది; ఎవరైతే అందరి యందూ ప్రేమను అభివృద్ధి చేసుకొనునో అతనికే ఆనందము లభించును. స్వార్థపరునకు ఆనందము దుస్సాధనము.

భగవంతుని అనుగ్రహము పొందుటకు ప్రేమయే మార్గము. భగవద్గీతలో కృష్ణ పరమాత్మ ''మన్మనాభవమద్భక్తో మద్యాజీమాం నమస్కురు మామేవైష్యసి....'' అని అర్జునునికి బోధించెను. భగవంతుడనిన భయపడనవసరము లేదు. ప్రేమ భయసందేహములను పారద్రోలును. భక్తుడై భగవంతుని పూజించవలెను. స్నేహితుడట్లు ప్రేమించవలెను. బాబా బాలురలో బాలురై, పండితులలో పండితులై, వైద్యులలో వైద్యులై మెలగుచుందురు. దానికి కారణము వారి అవ్యాజమైన ప్రేమ. అందరికీ సన్నిహితులుగా వుండి తమ అనుగ్రహమునకు పాత్రులగునట్లు వీలు కలిగించుటయే బాబా లక్ష్యము.

బీదలకు, ఖైదీలకు, కుంటి గ్రుడ్డి, మూగ, చెవిటి, అవిటి వారికి కుష్టురోగులకు, మతి భ్రమించిన వారికి సేవ చేయుటయే ఉత్తమోత్తమమైన ఆధ్యాత్మిక సాధన అని బాబా పదే పదే చెప్పుచుందురు. ''నీవు పూజ చేయుచున్నప్పుడు కాని, ధ్యానము చేయుచున్నప్పుడు కాని సహాయము కొరకు పిలుపు వినబడిన తక్షణమే విడిచివెళ్ళి సహాయము చెయ్యి. ధ్యానము, పూజలవల్ల నీవు సంపాదించు ఆధ్యాత్మిక ఫలముకన్న అట్టి సేవవలన లభించు ఫలము ఉత్కృష్టమైనది'' అంటారు బాబా.

భక్తులపై తమకున్న ప్రేమను అనేక విధములుగా వ్యక్తపరుస్తారు బాబా. ధర్మక్షేత్రమందలి సత్యదీప్‌లో ఒకసారి బాలవికాస్ కేంద్రోపాధ్యాయులందరూ సమావేశమైరి. సమావేశానంతరం దిగువనున్న వారిని కూడ భజనలో పాల్గొనుటకు అనుమతిచ్చిరి. ఎత్తైన కొండ ఎక్కి వచ్చుటలో చాలామంది అలసిపోయిరి. అందులో ఒకామె మిక్కిలి ఆయాసపడుచుండుట చూచి ఆమెను ఫ్యాన్ క్రింద గోడకు ఆనుకొని కూర్చుండజేసి బాబా లోపలికి వెళ్ళి స్వయముగా ఒక గ్లాసుతో మంచి నీళ్ళు తెచ్చి ఆమెకు యిచ్చి త్రాగమనిరి.

భక్తులు దర్శనముకొరకు నిరీక్షించుచూ ఎండలో వున్నా, వర్షములో తడయుచున్నా బాబా చాలా బాధపడుదురు. భజన సమయములో మాత్రమే ప్రవేశము ననుమతించెడి భజన మందిరములో, వేసవి కాలమున మధ్యాహ్నము వృద్ధులూ, వ్యాధిగ్రస్తులూ అయిన స్త్రీలు విశ్రాంతి తీసుకొనుటకు అనుమతించుదురు. వేలకొలది వాలంటీర్లు, ఇతర భక్తులు సహాయము చేయుటకు సిద్ధముగానున్ననూ, బాబాయే స్వయముగా ప్రసాదమును పంచిపెట్టెదరు.

వృద్ధులు, రోగులు, పేదలపట్ల బాబా ప్రత్యేకమైన శ్రద్ధతో అనుగ్రహించెదరు. ''వడ్డించువాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్ననూ ఫరవాలేదు'' అన్న సామెత గుర్తుకు వచ్చునట్లు, ఎంత వెనుక వరుసలలో దూరముగా కూర్చున్ననూ, అట్టివారిని ఆదరముగా పలుకరించుటయో వారికి ప్రసాదమిచ్చుటయో, ప్రత్యేక దర్శనమిచ్చుటయో సాధారణముగా చేయుచుందురు. నిర్మల చిత్తముతో ప్రార్థించువారెల్లప్పుడూ బాబా



దృష్టిలోనే వుందురు. ''నీవు సాయి శరీరములో ఒక భాగమే. అందు నీవొక అంగమైనందుకు ఆనందించుము. నీవందులో పాదమైనందుకు కృంగనూ వద్దు, శిరస్సయినందుకు పొంగనూ వద్దు. ఒకే రక్తము రెండు అంగములందు ప్రవహించి పోషించుచున్నది'' అంటారు బాబా.

''హృదయములో నాటిన ప్రేమబీజము మొలకెత్తి పెరుగుచూ బంధుమిత్రులవరకూ, గ్రామము వరకూ, జాతి వరకూ క్రమముగా వ్యాపించి ఆపైన మానవాళినంతనూ తన నీడ క్రిందకు తీసుకురాగలదు.'' ధ్యానమును గూర్చి యిట్లు ఉపదేశించిరి. ''దృష్టి నొక జ్యోతి లేక దీపిక మీద కేంద్రీకరించుము. ఆ జ్యోతి భ్రూమధ్యము ద్వారా నీ హృదయ కుహరము ప్రవేశించుచున్నట్లూహింపుము. నీయందున్న ఈర్ష్య, ద్వేష, అసూయ, అహంకారములు ఈ జ్యోతిచే భస్మీపటలమవునని ఊహింపుము. ఈ జ్యోతి అంగ అంగము నందూ నీ శరీరమంతటా వ్యాపించనిమ్ము. తదుపరి ఆ జ్యోతిని కపాలము ద్వారా బహిర్గతము చేసి దానిని సమస్త మానవాళికి, మిత్రులు, శత్రువులు అను భేదము చూపక, అందరికీ ప్రసరింపజేయుము.''

కొన్ని సంవత్సరముల క్రితము కొన్ని రోజుల 3800 అడుగులు ఎత్తున్న హార్స్లీహిల్ మీద బాబా సన్నిధానములో గడుపుభాగ్యము లభించినది. నిత్యము మమ్ము క్రొత్త క్రొత్త దృశ్యముల కడకు కొనిపోయి అక్కడ ఆధ్యాత్మిక ప్రబోధనలు సలుపుచుండిరి. కొండల మధ్యలో మేమున్న విశ్రాంతి భవన ముండుటవలన దానిని చేరుటకు జీప్ ఒకటే అనుకూలమైన వాహనము. మాకు నిత్యావసర వస్తువులూ, నీరూ క్రింద నుండి తేవలసినదే. ఒక దున్నపోతు రోజూ రెండు మూడు సార్లు తోలుతిత్తులలో నీరు నింపుకుని మోసుకు వస్తుండేది. మేమందరమూ తిరిగి వెళ్ళే సమయము వచ్చినది. అందరూ నడచుచూ కొండ దిగి వెళ్ళవలెననీ, అందులో ఎవరు తొందరగా దిగుదురో తాము పరీక్షించెదరనియూ బాబా చెప్పగా అందరూ ఆ పందెములో ఆనందముగా పాల్గొనుటకు సంసిద్ధులమై నిలబడి యున్నాము. ఇంతలో ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు బాబా బంగళాలోనికి వెళ్ళి అక్కడ నుండి వెనుకనున్న పెరడు లోనికి వెళ్ళినారు. బాబా ఎందుకు వెళ్ళిరో అర్థము కాక మాలో కొందరము నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళితిమి. ''నీవు చాలా శ్రమపడి మాకు సేవచేసితివి బంగారూ!'' అను మాటలు వినబడిన వైపు చూచితిమి. బాబా ప్రేమతో ఆ దున్నపోతు వీపు తట్టుచూ కనబడిరి.

నీలగిరి కొండలలో బిక్కట్టి అనే గ్రామములో కుట్టాన్ అనే ముసలి కుక్క వుండేది. అది చాలా విశ్వాసముగలది. ముసలిదయినప్పటికీ క్రొత్తవారు వచ్చిన మెలకువతో కాపలా కాయుచుండును. 1962 సం॥లో బాబావారా గ్రామమునకు వెళ్ళిరి. అక్కడ పరచిన తివాసి మీద బాబా నడచివెళ్ళుచుండగా దూరముగా త్రాడుతో కట్టివేయబడిన

ఆ కుక్క మెడను చాచి, త్రాడును లాగుచూ బాబా వైపు చూచుచుండెను. బాబా ఆ కుక్కను సమీపించి ''బంగారు... బంగారు'' అనుచూ దాని శరీరము నిమురుచూ దాని త్రాడు విప్పించి, దానిది చాలా పరిశుద్ధమైన హృదయము అని కొనియాడిరి. కుట్టాన్ బాబాను వెంబడించి భజన జరుగుచుండగా బాబా ప్రక్కనే వేదిక మీద కూర్చున్నది. తర్వాత వండిన పదార్థములను దీవించుటకు బాబా లోపలికి వెళ్ళగా కుట్టాన్ కూడ వెంబడించెను. బాబా ముందు దానికి భోజనము పెట్టి తరువాత అందరికీ వడ్డించమని అదేశించిరి. అది భోజనము ముగించి తిరిగి వేదిక మీదకు వచ్చి బాబా ఆసనము ప్రక్కన నిలబడి పంక్తులు తీర్చి భోజనము చేయుచున్న గ్రామీణులను ఆనందముగా తిలకించుచుండగా బాబా అనుగ్రహము నకు పాత్రురాలైన దాని అదృష్టమును స్తుతించుచుండిరి. కొంతసేపటికి కుట్టాన్ నిశ్శబ్దముగా బాబా పాదములుంచిన పీటమీద తల ఆనించి పరుండి కొన్ని నిమిషములలో ప్రాణములు విడచెను. ఆ వేదిక ప్రక్కనే పుష్పములతో కప్పి దానిని సమాధి చేసిరి. నోరు లేని ఆ మూగజీవుల భాష, భావములు బాబాకు తెలుసు.

ప్రశాంతి నిలయములోనూ, బృందావన్‌లోనూ ఎన్నో పెంపుడు జంతువులున్నాయి. కుక్కలు, కుందేళ్లు, నెమళ్ళు, చిలుకలు, ముఖ్యముగా సాయి గీతయను ఏనుగు వున్నాయి. స్వామి ఎంతో మక్కువతో వాటి పెంపకము విషయములో శ్రద్ధ తీసుకొందురు. నిత్యము, సాయంత్రము సాయి గీత బాబాను దర్శించి పూలమాల వేయును. అట్టి సమయములందు ప్రత్యేకముగా తెచ్చి వుంచిన పండ్లను బాబా స్వయముగా నోటికి అందించుచూ ప్రేమతో తొండమును నిమురుదురు. బాబా దీర్ఘ పర్యటనలలో వున్నప్పుడు సాయిగీత బెంగపెట్టుకుని కంటినీరు కార్చుచూ, ఒక్కొక్కప్పుడు తిండి తీర్థములను కూడ నిరాకరించును. బాబా దర్శనమే దానికి మందు. వేసవిలో బాబా బెంగుళూరులో వున్నప్పుడు సాయిగీతను కూడ అక్కడికి రప్పించెదరు.

''సమత్వము, శాంతి, ప్రేమ, సహనముల కొరకు కృషి చేయకుండా కేవలము నా నామరూపములను పూజించిన ఫలమేమి. ప్రతి ఉపన్యాసాంతమున మీ కొరకు - నా కొరకు కాదు - కీర్తనలు పాడుచున్నాను. అందుచేత నామ మాధుర్యమును మీరు గుర్తించగలరు. ఆ భగవన్నామ కీర్తనా మాధుర్యము చేత మీ మనస్సులందలి మాలిన్యమును దూరము చేసి సమత్వము, శాంతి, ప్రేమ, సహనమును ప్రతిష్ఠించుకొను ప్రయత్నము చేయవలెను. భగవంతు డెప్పుడూ మీతో వున్నాడను భావమును అది భౌతికముగా కాని, ఆధ్యాత్మికముగా కాని మీ హృదయములలో స్థాపించుటయే నా లక్ష్యము'' అని బాబా తరచు చెప్పుచుందురు.

భగవంతునికి రెండు విధములైన భ్రమింప చేయగల శక్తులున్నవి. అవిద్యామాయ,



విద్యామాయ యనునవి. కొన్ని సందర్భములలో ఈ మాయవలన భగవంతుడు సామాన్య మానవుడే అను భావన కలిగి అహంకారము పెరిగే అవకాశమున్నది. పదవి, పలుకుబడి, అధికారము, ఐశ్వర్యము గర్వమునకు దారి తీయును. గర్వమను పొగమంచు సత్యమును మరుగు పరచును. భగవంతుని సంకల్పమునకు మనము బద్ధులమని త్రికరణశుద్ధిగా నమ్మిన అతడే మనకు సక్రమమైన మార్గమును చూపించును. మన వ్యక్తిత్వమును భగవంతుని దివ్యతత్వమునకు అర్పించిన యెడల అతడే మనలో వుండి నడిపించు చున్నాడను భావన కలుగును. ఆ భావన మన హృదయములను పరిశుద్ధము గావించి భగవంతుని సత్యతత్వమును గ్రహించునట్లు చేసి సృష్టిలోని ద్వంద్వానుభూతులను సమన్వయము చేసుకొనుచూ శాంతియుత జీవనము గడుపుటకు దోహదము చేయును.

సార్థకమైన భగవన్నామ స్మరణద్వారా మనమందరమూ భగవంతుని చేతులందు ఆట బొమ్మలమని గుర్తించగలము. అప్పుడే మనము భగవంతునిలో, భగవంతుని ద్వారా, భగవంతుని కొరకు జీవించుట ప్రారంభించెదము.

బాబా పాద పద్మముల సన్నిధిలో వుండే మహదవకాశము పొందిన అన్ని దేశముల ప్రజలు, వారి జీవిత దృక్పథమునూ, జీవన విధానమునూ సంస్కరించుకొనుచున్నారు. ఈ నిశ్శబ్ద మానసిక విప్లవము లక్షలాది ప్రజలలో నేడు కనిపించుట భగవదనుగ్రహశక్తికి మరొక తార్కాణము. ''హృదయమే క్షేత్రము పనికిరాని మొక్కలనెడి దురాలోచనలను తీసి వేసి, సాధనతో దున్ని, సదాలోచనలను బీజములను నాటి, ప్రేమయను ఏరును చల్లిన, బీజములు మొలకెత్తి, జ్ఞానమనే పైరుగా పెరిగి, ఆనందమనే పంటను అందించును'' అని బాబా ప్రబోధించుచుందురు.

# మరొక అద్భుతము

సిలోన్ వెళ్ళి అక్కడ పట్టణములందూ పల్లెలందూ వున్న భక్తులను కలుసుకొని వారి ఆనందానుభవములలో పాల్గొనుటకు నాకు వచ్చిన ఆహ్వానమును అంగీకరించుటకు బాబా నాకు అనుమతిచ్చిరి. తదనుగుణ్యముగా రైలులోనూ ప్లేనులోనూ చేయవలసిన ప్రయాణమునకు కావల్సిన రిజర్వేషన్లు ఏర్పాట్లు చేసుకుని మరో గంటలో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళవలసియుండగా అనుజ్ఞ తీసుకొనుటకు వచ్చి బాబా పాదముల మ్రోల శిరము నుంచి నమస్కరించితిని. ''ఎక్కడికి వెడుతున్నావు?'' అని అడిగిరి. ''సిలోన్ స్వామీ''యని చెప్పితిని. ''సిలోన్ ప్రయాణం రద్దు చేసుకొనుచున్నట్లు టెలిగ్రాం యిచ్చి నాతో రేపు గోవాకు బయలుదేరడానికి సిద్ధంగా వుండు'' అన్నారు.

''సిలోన్‌కు వచ్చెదనని మీరిచ్చిన వాగ్దానమును రద్దుచేసుకుంటూ ఇచ్చిన మీ టెలిగ్రాం బాబా యందు మాకున్న విశ్వాసమును ద్విగుణీకృతం చేసినది'' అంటూ సిలోన్‌లోని ప్రధాన సేవాసమితి కార్యదర్శి యిచ్చిన జవాబులోని వ్యంగ్యధోరణి నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసినది. అయితే కార్యదర్శి శ్రీత్యాగరాజయ్యగారు తమ జవాబును వివరించుచూ వ్రాసిన జాబును చూసిన తర్వాత ఉపశమనం కలిగింది. జరిగినది ఇది; పది దినముల నా పర్యటన యొక్క కార్యక్రమమును అందుకొన్న రోజున అది బిగ్గరగా చదివిన స్వతస్సిద్ధముగా మితభాషియైన నల్లయనాధన్ అప్రయత్నముగా... ''అవుననుకోండి. శ్రీ కస్తూరి దయతో పదిదినముల పర్యటన కంగీకరించేరు. కాని వినండి. వారసలు రాకనే పోవచ్చు.'' అన్నారట. వారం రోజులలో ప్రెసిడెంట్ నల్లయ్యనాధన్‌గారి మాటలు అక్షరాలా నిజం చేస్తూ టెలిగ్రాం రానేవచ్చినది. ''ఆనాడు ఆ మాటలు నల్లయ్యనాధన్ నోట బాబాయే పలికించేరని గ్రహించేము'' అని త్యాగరాజయ్య వుత్తరములో వివరించేరు.

భవిష్యత్తులో జరుగబోవు కార్యక్రమములు కనుగుణ్యముగా పరిస్థితులను రూపకల్పన చేస్తూ వుంటారు. ఒక్కొక్కప్పుడు రాబోవు ఐదునిముషములలో బాబా ఏమి చేయుదురో ఎవ్వరూ చెప్పలేరని అనుభవరీత్యా నేను గ్రహించితిని. మన భవిష్యత్తును గురించే మనకు తెలియదు. వారి లీలలను గురించి ఏమి జోస్యము చెప్పగలము.

గోవా వెళ్ళుటకు మూడు కార్లలో బయలుదేరితిమి. ఒక కారులో ముగ్గురు పాశ్చాత్య స్త్రీలు కూడా వున్నారు. ప్రపంచ విఖ్యాతి చెంది " The first lady of Yoga in America" అనబడే భారతీయ నామము ధరించిన ఇంద్రాదేవి, పిల్లల పాఠశాల నడుపుచున్న జాన్ ష్యూలర్ అనే మధ్యవయస్కురాలు, ఇటలీలో పుట్టి భారతీయుని వివాహమాడి అమెరికాలో నివసిస్తున్న మిసెస్ రాజగోపాలన్. బాటకిరుప్రక్కలా వినమ్రులై చేతులు జోడించి నమస్కరిస్తున్న భక్తుల వరుసలవైపు



అనుగ్రహ సూచకముగా బాబా చేయి వూపుచుండగా కార్లు బృందావనము వీడినవి.

ఆ సాయంకాలము ప్రకాశముగా ప్రశాంతముగా వున్నది. ''గ్రామీణ ప్రాంతాలలోని ఆ నిర్మల వాతావరణములో ప్రవేశించగానే నా మనస్థితిని గూర్చిన ఆలోచన కలిగింది. నమ్మశక్యము కానంతటి శాంతితో నా మనస్సు నిండినది. నా జీవితము అస్తవ్యస్తమై నిరాశతో ఒక్క భగవంతుడే నాకు శాంతి నివ్వగలడన్న వుద్దేశ్యముతో నేనిక్కడికి వచ్చినాను. అవును ఆ భగవంతుడే నా వ్యధల భారాన్ని తొలగించి శాంతిని ప్రసాదించినాడు'' అని వ్రాస్తున్నది జాన్‌ష్యూలర్.

మెయిన్‌రోడ్ వదలి ప్రక్క రోడ్డుకు మళ్ళించమని బాబా ఆదేశించేరు. కొంతదూరం వెళ్ళిన తర్వాత ఒక చెరువుగట్టున చెట్ల క్రింద కార్లు ఆగేయి. అక్కడ అందరికీ బాబా స్వయముగా డబ్బాలు ఫ్లాస్క్‌లలో తెచ్చిన కాఫీ ఫలహారములు పంచిపెట్టేరు. మా అందరితో బాటు డ్రైవర్లు, అక్కడ చేరిన కొద్దిమంది వ్యవసాయదారులు కూడా ఆనందము పంచుకున్నారు.

మేము తిరిగి ప్రయాణము సాగించినప్పుడు బాబా కూర్చున్న కారు కదులుటకు నిరాకరించినది. నెమ్మదిగా రోడ్‌మీదకు నెట్టగా స్టార్ట్ అయినది. అయితే తర్వాత 15 మైళ్ళలోనూ మూడుసార్లు సత్యాగ్రహము చేసినది. అక్కడకు జోగ్ వాటర్‌ఫాల్స్ నూరుమైళ్ళున్నది. రాత్రి ఎనిమిదైనది. కారు ఆగిపోయింది. దాని మరమ్మత్తు కొరకు దగ్గరలో వున్న టిప్టూర్‌కు తీసుకెళ్ళవలసి వచ్చినది. అప్పుడందరూ బృందావన్‌కు వెళ్ళుటకు నిశ్చయించినాము.

మేము బృందావన్‌కు రెండు కార్లలో తిరిగి వచ్చుచుండగా బాబాలో ఏ విధమైన నిరుత్సాహమూ విసుగూ లేవు సరికదా ఆనందముగా కబుర్లు చెప్పుచూ, పాటలు పాడుచూ మమ్మానందమున ముంచిరి. రాత్రి 12 గంటలకు బృందావన్ చేరితిమి. భోజనములు సిద్ధముగా నున్నవి. మా భోజనముల విషయములో బాబా ఎంతో శ్రద్ధ చూపిరి. ''మాపై చూపించుచున్న ఈ శ్రద్ధ ద్వారా బాబాకు విసుగు కలిగించుచున్నామేమో ననిపించినది. బాబా శరీరము అది వర్షించు ప్రేమతోనే పోషించబడుచున్నదా యన్న భావము కలుగక మానదు'' అంటున్నది జాన్‌ష్యూలర్.

జాన్ ష్యూలర్ ఇంకా ఇలా వ్రాసినది. ''ఆదివారము ఉదయమున నిద్ర లేచినప్పటి నుండి నా మెదడులో ఎన్నో ఆలోచనలు. నిన్న ప్రయాణము రద్దు అయినది. కనుక బాబా ఈనాడు ప్లేన్‌లో వెళ్ళిపోయెదరేమో, స్వల్పకాలము పాటయినా బాబా సాన్నిధ్యములో గడుపగల అదృష్టమును మరమ్మత్తు వచ్చిన కారు మూలముగా పోగొట్టుకుంటున్నాము కదా. అసలు దివ్యశక్తి సమన్వితులైన బాబా కారును ఎందుకు తమ సంకల్పముతో మరమ్మత్తు చేయలేదు? దీనిని ముందే ఎందుకు ఊహించి

నివారించలేదు? సర్వశక్తులకు మించినది దైవశక్తి కదా? దీని జవాబు వెతుకుటకే యీ ప్రశ్న నాలో ఉత్పన్నమైనదేమో. ఈ కారును బాబాయే ఆగిపోవునట్లు చేశారేమో అన్న ఆలోచన కలిగినది. వెంటనే బాబా మాటలు జ్ఞప్తికి వచ్చినవి. జోగ్ వాటర్‌ఫాల్స్ మీదుగా గోవాకు వెళ్ళు దారి చాలా చుట్టుదారి. జోగ్‌ఫాల్స్ మీదుగా వెళ్ళుటకు ప్రతిపాదనలు జరిగినప్పుడు బాబా సుముఖముగా లేరు. జోగ్‌ఫాల్స్‌ను 'జోక్ ఫాల్స్' అనీ జోగ్ **false** అనీ పరిహసించిరి. దూరమెక్కువయుని రాత్రి అనేక పల్లెలమీదుగా వెళ్ళినప్పుడు తమకు దర్శనము లభించ నందుకు పల్లె ప్రజలు బాధ పడెదరని బాబా అన్నారు. అవును, జోగ్ ఫాల్స్ చూచుట బాబా సంకల్పములో లేదు. ఫలహారము చేయువరకూ బుద్ధిగా వున్న కారు తర్వాత మొండికెత్తినది. చివరకది జోక్ ఫాల్స్ అయింది.''

మరునాడు మేమందరము రెండు కార్లలో గోవా బయలుదేరినాము. కార్లు ఏ ఇబ్బందీ పెట్టలేదు. రాత్రి రెండు గంటలకు ధార్వార్‌లోని కర్నాటక యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అడికెగారి భవనము చేరినాము. అక్కడ షామియానాలో కూర్చుని ఆ సమయమున 500 మంది భజన చేయుచున్నారు. వారికి బాబా ఆగమనము గురించి ముందుగా తెలిసినది. భోజనానంతరము బాబా వారి మధ్య కూర్చుని వారికానందము చేకూర్చిరి.

ఆ విశ్వవిద్యాలయాధికారులంతా పసి బిడ్డలవలె ముఖములు పెట్టి బాబాను చూచుచున్న దృశ్యము నా హృదయ వీణను మీటినది. ఒక గంటసేపు బాబా వారందరికీ పురాణములలోని ఉపాఖ్యానములను, నీతి కథలను చెప్పిరి. ''భగవంతుడెప్పుడూ భక్తుల పిలుపులకు సిద్ధముగా వుంటాడు. మీరు భగవంతుని అనుగ్రహము కోరెదరు. దుఃఖితులకు మీరు సహాయము చేయకున్న మీ కనుగ్రహమెట్లు లభించును. సూర్యకాంతివలె భగవంతుడు భక్తుల వాకిట నిలబడి సందు దొరికితే లోన ప్రవేశించి చీకటి వున్నచోట వెలుగును, చలి వున్నచోట వేడిమిని, కలిగింపవలెనని వేచివుండును. మీరు కూడ అదే విధముగా తోటివారికి చేయగలిగిన సేవ చేయుటకు సంసిద్ధముగా నుండవలెను. ఇతరులకు మీ ఆనందోత్సాహములను పంచు ప్రయత్నము చేయవలెను'' అని వారికి పలు తెరంగుల ప్రబోధించి, అంత్యమున బాబా ''నగర సంకీర్తన ద్వారా భగవంతుని వైభవము చాటుచూ ప్రజలను నిద్ర లేపండి'' అని ఉపదేశించిరి.

''యూనివర్శిటీ ప్రొఫెసర్లతో బాబా మరొక గంట ప్రసంగించిరి. మధ్య మధ్య గది అంతా గొల్లుమని నవ్వులతో ప్రతిధ్వనించుచున్నది. హాస్యముతో, ఉత్సాహముతో అనుక్షణము ఉర్రూత లూగించే దేవుడితడు. ఒక క్షణము కూడా మందకొడిగా గడపనివ్వడు. జీసస్ క్రీస్తు కూడా యిలాగే వుండేవాడేమో. విసుగు విరామం లేని ఉత్సాహము సున్నితమైన హాస్యము. ఉత్తేజ పరిచే ప్రబోధలు. నా కర్థముకాని భారతీయ



భాషలో మాట్లాడినప్పటికీ, మాట్లాడే విషయము నాకు తెలియనప్పటికీ ఆ దివ్యశక్తి ప్రభావం ఆజ్ఞాతంగా నాకు వెలుగు ప్రసాదిస్తూనే వున్నది'' అంటుంది జూన్‌ష్యూలర్.

నేనూ యన్.డి.హెచ్. నాధన్‌గారూ బాబా కూర్చున్న కారులో ఉన్నాము. మార్గమంతా రాళ్ళతో గతుకులుగా వున్నది. కారు కుదుపు చుండగా బాబా డ్రైవర్‌ని మందలించిరి. ''ఈ కుదుపులతో నా కడుపు ఎంత నొప్పిగా వున్నదో తెలుసా?'' అని. ఇంతకన్న అధ్వానముగా వున్న రోడ్‌మీద వెళ్ళినప్పుడు కూడా బాబా కుదుపును లెక్క చెయ్యరు. ఎందుకిలా మందలించేరో నా కర్థము కాలేదు.

మేము గోవా పొలిమేర చేరునప్పటికి చీకటిపడినది. గోవా గవర్నర్ శ్రీ నకుల్ సేన్ I.C.S. అక్కడకి వచ్చి బాబాకు స్వాగత మిచ్చి మమ్ము విశ్రాంతి భవనమునకు తీసుకు వెళ్ళిరి. అక్కడ మేమందరమూ కాఫీ త్రాగి తిరిగి బయలుదేరితిమి. బాబా గవర్నరుగారి కారులో కూర్చొని యుండిరి.

వంకరటింకరగా వున్న మార్గముల గుండా తీసుకొచ్చి పాంజింనగరములోని 'కాజో రాజ్‌నివాస్' భవనమునకు చేర్చిరి. ఈ భవనము పోర్చుగీసువారిది. కొన్ని శతాబ్దములుగా గవర్నర్ జనరల్ యొక్క నివాస భవనము. అప్పటికి రాత్రి గం॥ 9.15 అయింది. ఉదయము నుండి ఆరోజు 385 మైళ్ళు ప్రయాణము చేసినాము. మేడమెట్లెక్కి తమ విశ్రాంతి గదిలోకి వెళ్ళుచుండగా బాబా ఎట్టి అలసటా లేకుండా నవ వికసిత పుష్పమువలె నుండిరి. త్వరలోనే బాబా మా అందరితో కలిసి భోజనము చేయుటకు వచ్చిరి. అక్కడే వున్న పోర్చుగీసు వారు తెచ్చి వుంచిన అందమైన పింగాణి పాత్రలను బాబా పరిశీలించుచుండిరి.

శ్రీమతి సేన్ తరచు ధైర్యము చేసి హెచ్చరించినప్పటికి బాబా యే మాత్రమూ భుజించలేదు. అనంతరము ''వెళ్ళండి వెళ్ళండి చాలా అలసిపోయినారు. వెళ్ళి విశ్రాంతి తీసుకోండి'' అనుచు మమ్ము పదే పదే బాబా హెచ్చరించుచుండిరి. శ్రీమతి సేన్‌తో మరునాడుదయము ఎనిమిది గంటలకు కాఫీ కావలెనని చెప్పిరి. ప్రశాంతి నిలయమున రోజూ ఉదయం 6 గంటలకే కాఫీ తీసుకొందురని ఆమెకు తెలుసును. అందుకు ఆమె తటపటాయించుచుండగా ఉదయం 8 గంటలకు కాఫీ పంపవలసినదని మరల చెప్పి బాబా మెట్లెక్కి తమ విశ్రాంతి గదికి వెళ్ళిరి. వారి గదిలో బాబా ఒక్కరే వున్నారు. వారు పిలిచిన పలుకుటకు దగ్గరలో వుండేటందుకు నకుల్‌సేన్‌గారు కోరగా అవసరములేదని వారి గదికి వారిని పంపివేసిరి. బెంగుళూరు నుండి వచ్చిన మేమందరమూ క్రింది గదులలో పండుకొంటిమి.

ఆ రాత్రి ఏమి జరిగినది డా॥ భగవంతముగారికి అయిదు రోజులు తర్వాత బాబా వ్రాసిన ఉత్తరములో వున్నది. ''7వ తేదీ రాత్రి నేను పరుపుమీద కూడ పండుకోలేకపోతిని. కూర్చొనలేకపోయినాను. ఒక ప్రక్క నుండి మరొక ప్రక్కకు

తిరగలేకపోయినాను. ఎవరికి యెట్టి ఆందోళన కలుగజేయుట కిష్టము లేక ఎవరినీ పిలువలేదు. అంతా సవ్యముగానే వుంటుందని అట్లే వుండిపోయితిని.''

మరునాటి ఉదయము సేన్ దంపతులు వాస్తవ పరిస్థితిని గ్రహించినప్పుడు బాబా రాత్రి భోజన మెందుకు చెయ్యనిదీ, ఉదయము కాఫీ ఆలస్యముగా ఎందుకు తెమ్మన్నదీ, రాత్రి పండుకొనమని అందరినీ ఎందుకు తొందరపెట్టినదీ అర్థము చేసుకొనిరి. ధార్వార్ నుండి నిర్విరామంగా ప్రయాణము చేసి తొందరగా యిక్కడికి వచ్చుటకు కారణము, డ్రైవర్‌ను మందలించుటకు కారణము మాకు బోధపడింది. ప్రయాణమైనది మొదలు బాబా దేహమునందు అస్వస్థత ప్రారంభించినది.

బాబాకు అనారోగ్యము కలిగినందుకు 'కాబోరాజ్ నివాస్' దురదృష్టవంతమైన భవనమను కొన్నది శ్రీమతి సేన్. వెంటనే బాబా ''ఈ భవనము చాలా మంచిది. ఇక్కడ విడిచి పెట్టుటకే నా వ్యాధి నింత దూరము తీసుకువచ్చినాను'' అన్నారు. ఆమె నిర్ఘాంతపోయినది.

6వ తేదీ ఉదయమున బాబాకు బాధ తీవ్రరూపము దాల్చినది. గోవా మెడికల్ కాలేజీలోనూ, నగరములోనున్న ప్రఖ్యాత వైద్యులను గవర్నర్ పిలిపించెను. వారు బాబా మంచము చుట్టు చేరి ఉద్రిక్తమగు చున్న జ్వరము, కడుపునొప్పిని గురించి రకరకములుగా వ్యాఖ్యానించు చుండిరి. ఎట్టి నిర్ణయమును చేయజాలకుంటిరి. బాబా కిది వినోదముగా నుండెను.

చారిత్రాత్మక ఖ్యాతితోనూ ఆధ్యాత్మిక శక్తితోనూ అలరారుచున్న గోవాయందలి ప్రాచీన చర్చి చూచిరమ్మని బాబా అమెరికా వనితలను సిటీకి పంపిరి. సేన్ దంపతులు పరిస్థితుల ఈ పరిణామానికి దిగులుపడ జొచ్చిరి.

కాబో మందిరములో భోజన ఫలహారములు విషాదకర వ్యవహారములుగా యాంత్రికముగా కొనసాగుచుండెను. ప్రతివారూ బాబా ఎందుకురాలేదని ఆశ్చర్య పడసాగిరి. కొందరికి తెలిసినప్పటికి వారేమీ చెప్పలేని పరిస్థితిలో వున్నారు. కొద్దిమందికి మాత్రమే బాబా దేహ పరిస్థితి తెలుసు. తెలియనివారు బాబా దర్శనము కొరకు, ప్రశాంతి నిలయము లోవలె, అనుక్షణమూ ఎదురుచూచుచుండిరి.

బాబా ఆగమనము తెలిసిన వేలాది గోవా ప్రజలు కాబోనివాస్ ఎదుటనున్న బహిరంగ స్థలములో వారి దర్శన భాగ్యము కొరకు సమావేశమై యుండిరి. వారికి దర్శన మిచ్చుటకు బయటకు వచ్చినప్పుడు తాము కూడ దర్శనము చేసుకొనవచ్చునని జూన్ షూ్యలర్, ఇంద్రాదేవి మొదలయిన అమెరికన్ వనితలు క్రొత్త దుస్తులలో ముస్తాబై సిద్ధముగా సింహ ద్వారము వద్ద వేచియుండిరి.

జూన్ షూ్యలర్ ఆ సమయములో తనలో కలిగిన ఆలోచనల నీ విధంగా



వ్రాసినది. ''నా ఆలోచన మొట్టమొదటిసారిగా నా మిత్రురాలు బాబాను గురించి చెప్పిన సంగతిపై మరలినది. ''నాకు జీసస్ అంటే విశ్వాసమున్నది, జీసస్‌నే కొలుస్తాను. బాబానెట్లు పూజింగలను? అతనితో నాకేమిపని? నీవు వర్ణించినంతటి మహాత్ముడే అయిన యెడల బాబా తప్పక నా భావముతో ఏకీభవించును'' అన్నానామెతో. మొదటిసారి నేను బాబాను కలుసుకున్నప్పుడు వారు జీసస్‌ను గురించి చెప్పిన మాటలు వినుచుండగా నాకు కలిగిన ఆనందాశ్చర్యములు గుర్తుకు వచ్చినవి. నా సంశయములు తీరినవి. జీసస్ బాబా ఒక్కరే అన్న దృఢమైన విశ్వాసము కలిగింది. ఇలా ఆలోచించుకుంటూ బాబా గదివైపే చూచు చుంటిని. తలుపులు తెరచుకున్నవి. బాబా దర్శనము కొరకు నిరీక్షించుటలో, గడియారము టిక్కు టిక్కుమనుచున్నట్లు, క్షణక్షణమూ హృదయము స్పదించుచున్నది. కస్తూరిగారొక్కరే బయటకు వచ్చినారు. బాబా రాలేదు. పశ్చిమాంబుధిలో గ్రుంకు సూర్యబింబమువలె అందరి శిరములూ వ్రాలిపోయినవి.''

అంతమంది కాచుకుని వుండగా వారందరినీ నిరుత్సాహపరుచుట కిష్టపడక బాబా లేచి దుస్తులు మార్చుకొనుటకుద్యమించిరి. మేడకు లిఫ్టు కూడా లేదు. 28 మెట్లు దిగి వెళ్ళవలెను. డాక్టరు మంచము దిగుటకు వీలులేదని, ప్రమాదమని చెప్పిరి. సేన్ దంపతులూ తదితరులూ అశ్రునయనములతో ప్రార్థించి ఆ ప్రయత్నము నుండి బాబాను విరమింప జేసిరి. ఎల్లుండి బహిరంగసభలో ఉపన్యసించెదరని వారందరికీ చెప్పి పంపివెయ్యమని నన్ను బాబా ఆదేశించిరి.

బాబా ఒక భక్తుని వ్యాధిని స్వీకరించిరనియూ, అనేక పర్యాయము లిట్లు చేసిరనియూ, ఎల్లుండి బాబా ఉపన్యసించెదరని వారి ముందు ప్రకటించితిని. నా ప్రకటన వారందరూ ప్రశంసావిస్మయములతో విన్నారు.

అక్కడ సమావేశమయిన వారిలో చాలామంది బాబాను గురించి వ్యాప్తిలో వున్న కథలూ లీలలూ విన్నారు. అయితే, ఇతరుల వ్యాధులను వారు స్వీకరించుట యనునది వారికి అనూహ్యము. అది సాధ్యమా! వారే విధముగా భరించెదరు? ఏ విధముగా వ్యాధిని విసర్జించెదరు? ఇదివరలో యిట్లు చేసిరాయను సందేహములతో కుతూహలముగా, ఆశ్చర్యముగా అడిగిన ప్రశ్నలకు అట్టి దృష్టాంతములను, ముఖ్యముగా కొద్ది సంవత్సరములు క్రితము చరిత్రాత్మకమైన గురుపూర్ణిమనాటి సంఘటనను వర్ణించి బాబా ఎనిమిది రోజులు తీవ్రమైన పక్షవాతము, గుండెజబ్బు స్వీకరించిన విధానము వివరించితిని. భక్తులు నిర్మల చిత్తముతో ప్రార్థించిన యెడల ''పరిత్రాణాయ సాధూనాం....'' అను వాగ్దానము నెట్లు ఈ అవతారము చెల్లించుకొనునో వారికి చెప్పితిని.

ఆ రాత్రి ఎనిమిది గంటలకు వైద్యులు జ్వరతీవ్రత, పొత్తికడుపు వాపు, వాంతులు తదితర వ్యాధి లక్షణములు పరీక్షించి 'ఎక్యూట్ ఎపెండిసైటిస్' అని నిర్ధారణ చేసిరి. విపరీతమైన నొప్పి కలుగచేయుచున్న దనియూ, మత్తుమందుకు కాని, శస్త్ర చికిత్సకు కాని బాబా విముఖులుగా వున్నట్లూ, పరిస్థితి ఆందోళనకరమైనదనియూ వైద్యబృందము ప్రకటించిరి. ఈ వార్త అన్ని పట్టణములకూ పత్రికల ద్వారా వ్యాపించింది. వ్యాధిని ఉపసంహరించుకోమని, ఆ వ్యాధిని తామే స్వీకరించుటకు సిద్ధముగా వున్నామనీ ఇందరిని బాధపెట్టే బాధను వెంటనే నివారించుకుని అందరికీ ఉపశమనము కలిగించవలెననీ, ఆవేదనతో భక్తుల వద్ద నుండి అసంఖ్యాకములుగా టెలిగ్రాములు, టెలిఫోన్‌లూ వచ్చినవి. బాబా సమాధానమొకటే. ''నేను దీనిని ప్రేమతో తీసుకున్నాను. ప్రేమకు నొప్పి తెలియదు''

''శ్రీమతి నకులసేన్ సలహా మీద ఆమెతో మేమందరము బాబా వద్ద చేరి, వారొక్కరే ఈ బాధ ననుభవించకుండ మా అందరికీ పంచి పెట్టమనీ అప్పుడు ఏ వొక్కరూ అమితముగా బాధపడ నవసరముండదనీ ప్రార్థించితిమి. మందస్మిత వదనముతో ''నా కెట్టినొప్పి లేదు. ఉన్నా బాధను ప్రసాదముగా పంచిపెట్టు అలవాటు నాకు లేదు'' అన్నారు అని వ్రాసినది జూన్.

ఇంద్రాదేవి వద్ద ఒక వెండి విభూతి భరిణె వున్నది. అది యెప్పుడూ అక్షయమవు తుందనీ, వ్యాధి, బాధ పీడితులకు దానిని వినియోగించమని ఆమె కిదివరలో యిచ్చిరి. ఆ విభూతిని ఆమె బాబా కొరకే వినియోగించ చూచినది. బాబా చిరునవ్వుతో ''ఇతరుల కొరకుపయోగించ మని యిచ్చిన విభూతి కాదు, నేను కోరునది మీ యందలి ప్రేమ మాత్రమే'' అన్నారు.

9వ తేదీ ఉదయము పరిస్థితి మరింత దిగజారిపోయినది. విపరీతమైన జ్వరము, వాంతులతో బాటు ఎక్కిళ్ళు వచ్చినప్పుడల్లా ఎపెండిక్స్ వున్న భాగమున కండరములన్నీ బిగుయుచుండుట చేత బాధ విపరీతమగు చున్నదనీ, ముక్కులో గుండా గొట్టమును పంపి కడుపులో నున్న విషవాయువును వెలికి తీయవలెననియు, వెంటనే వాచినచోట రంధ్రము చేసి చీమును బయటికి తీయవలెననియు లేని యెడల ఎపెండిక్స్ పగిలి చీము నెత్తురులో కలియుటయూ తద్వారా ప్రాణహాని తథ్యమనియూ వైద్యులు చెప్పిరి. బాబా కండ్లూ, బుగ్గలూ లోతుకుపోయి చాలా బలహీనముగా వున్నారు. దానికి సాయము ఎక్కిళ్ళూ వాంతులూ, వారే పరిస్థితిలోనూ ప్రక్క నుండి లేవకూడదని వైద్యులు చెప్పిరి. వారెట్టి చికిత్సకూ ఒప్పుకొనలేదు. చేయునది లేక డాక్టర్లు ఒక్కొక్కరే వచ్చిన దారినే తిరిగి వెళ్ళు చుండిరి.



''మేమందరము బాబా వద్దకు వెళ్ళి వైద్యుల సలహాను పాటించమని ప్రార్థించితిమి. ''డాక్టర్లకేమి తెలియను? వారేమి నిర్ణయించగలరు?'' అనుచూ ప్రక్కమీద నుండి లేచి ప్రక్క గదిలో విచారముగా గుమికూడి వున్న భక్తుల వద్దకు వచ్చి కొన్ని నిమిషములు నిలబడి వారికి ధైర్యము చెప్పి వెళ్ళి పడుకొనిరి. ఈ కదలిక మరింత ఆందోళన కలుగ జేసింది.

''కాబోనివాస్‌లోని నిలువెత్తునయున్న బాబా వర్ణచిత్రములోని పొత్తికడుపు కుడిభాగమున ఇంద్రాదేవి తన భరిణెలోని విభూతి తీసి ప్రార్థిస్తూ రుద్దుతుంది. శ్రీమతి సేన్ అందోళన ఆశ్చర్యముల మధ్య వూగిసలాడుతూ అటూ యిటూ తిరుగుతుంది. తమకూ తాము స్వీకరించిన ఈ వ్యాధిని తమ సంకల్ప మాత్రమున మాయం చేసి వైద్యులనూ గోవా ప్రజలనూ ఆశ్చర్యచకితులను చేసి తమ లీలను చూపెదరని ఆమె ధృఢ విశ్వాసము.

''ఓ దయామయా! ఇంతటి దారుణమైన బాధ నివారించుట. ఈ రుగ్మతను మీ కాయము నుండి తొలగించండి అని ప్రార్థించేను. ఓ జీసస్! ఈ బాధను బాబా విడిచి పెట్టనియెడల నీవైననూ తీసివేయలేవా అని ప్రార్థించేను. నా ప్రార్థనకు జవాబు రాదని గ్రహించేను. బాబాయే క్రీస్తు క్రీస్తే బాబా కదా!

''మే మందరము యింత దిగులుగా వున్న కస్తూరిగారిలో మాత్రం ఏ యాందోళనా కనబడలేదు. ఆయనలో పరిపూర్ణ విశ్వాసము వెల్లివిరుస్తున్నది. భక్తుడు కొన్ని వారముల భయంకర యాతన ననుభవించ వలసి యున్న ఆ బాధనంతనూ ప్రోగుచేసి కొన్ని గంటలలోనే బాబా దానిని అనుభవించి భక్తునికి రోగముక్తిని ప్రసాదిస్తారని కస్తూరిగారు మాకు చెప్ప సాగిరి. ఇలా మాకు ధైర్యము చెప్పుట కొరకే సిలోన్ ప్రయాణము మాన్పించి గోవాకు తీసుకు వచ్చిరేమో అన్న ఆలోచన కొంత మా మనస్సులకు ఊరట కలిగించినది'' అని జూన్ వ్రాసింది.

పదవ తేదీనాడు బహిరంగసభ జరుగునన్న వార్త గోవా అంతా వ్యాపించింది. ప్రజలు తండోపతండాలుగా కాబో రాజ్‌నివాస్ యెదుట నున్న బహిరంగ స్థలములో చేరుకున్నారు. ''అవును పాపం. ఏర్పాటు చెయ్యండి'' అన్నారు బాబా. బాబా ఆ సభలో ఉపన్యసించె దరన్న వార్త విని డాక్టర్లు దిగ్భ్రాంతి చెందిరి. అన్నమాట ప్రకారము తప్పక వచ్చి ఉపన్యసించె దరని ఆనంద విశ్వాసములతో, ప్రజ లెదురు చూచుచుండిరి. బాబా అనారోగ్య స్థితిని విని నిరుత్సాహములో మునిగిపోయిన గోవా ప్రజలకీ శుభవార్తతో ఆనందము కట్టలు త్రెంచుకొనెను. మధ్యాహ్నము టీ సమయమునకు శ్రీమతిసేన్ హృదయము సంశయాశ్చర్యాందోళనలతో నిండిపోయెను.

సభా స్థలి చక్కగా అలంకరించబడినది. సాయంత్రము ఆరు గంటలకు సభయని ప్రకటించగా మూడు గంటలకే బహిరంగ స్థలము నిండి పోయి కిటకిటలాడుచున్నది.

ఎత్తైన వేదిక నుంచి కాబోనివాస్ వరకూ 200 అడుగుల పొడగునా బాబా నడచుటకు పూలబాట పరచిరి. బయట ఆనంద కోలాహలము. కాబోనివాస్‌లో నిశ్శబ్దము, సంశయము, క్షణక్షణము పెరుగుచున్న కంగారు.

సాయంత్రము నాలుగు గంటకు చీఫ్ సర్జన్ డా॥ వర్మగారు 200 అడుగుల పొడువున వున్న పూలబాట చూచి ఆవేశముతో పరుగు పరుగున వచ్చి ఆ యేర్పాట్లను తీవ్రముగా ఖండించిరి. బాబా నడచుటయూ, అంత యెత్తున వున్న వేదిక ఎక్కుట అసంభమనియూ వేదిక ఎత్తులేకుండా నేల మీదనే ఆసనము వేసి భవనమునకు దగ్గరగా సభాస్థలిని జరిపంచమని అట్లయినా 200 అడుగులూ 40 అడుగులకు తగ్గి బాబాను తీసుకు వెళ్ళుటకు వీలుండు ననియూ సలహా యిచ్చెను. సలహాలకూ సంప్రదింపులకూ సమయము కాదు. ఎవ్వరూ సుముఖముగా లేరు. బాబా ఏమి చెప్పుదురో ఏమి చేయుదురో ఎవరికీ తెలియని ఆ స్థితిలో ఏమి జరుగనున్నదో అదే జరుగునన్న ధోరణిలో ఏర్పాట్లు అలంకరణ యధా తథముగా యాంత్రికముగ యాంత్రికముగా కొనసాగుచుండెను.

ఆ సమయమున బాబా దేహస్థితి ఎట్లున్నదో బాబా మాటలలోనే వివరించెదను. ''డాక్టర్లు పరీక్ష చేసి ఎపెండిక్స్ బ్రద్దలయినదనీ, వెంటనే ఆపరేషన్ చేసితీరవలెననీ చీము రక్తములో చేరినదనీ ఆపరేషన్ చేయని యెడల ప్రాణము దక్కుట అసంభవమనీ, ఈ పరిస్థితిని విశదపరచుట తమ బాధ్యత అనీ, ఏకగ్రీవముగా ప్రకటించిరి.''

సాయంత్రము అయిదు గంటలకు ఇద్దరి సహాయముతో స్నానముల గది చేరిరి. ఇరవై నిమిషముల తర్వాత బయటకు వచ్చిరి. గెడ్డము గీసుకుని, స్నానము చేసి, క్రొత్త దుస్తులు ధరించి వికసించిన గులాబివలె సమ్మోహన రూపముతో చిరునవ్వుతో ప్రత్యక్షమైరి. ఆ సమయమున తిరిగి వైద్యులు పరీక్షించి దిగ్భ్రాంతి చెందిరి. ఎట్టి వ్యాధి లక్షణములూ లేవు. పొత్తి కడుపు ఉపరితలముపై ఎపెండిక్స్ వున్న భాగమున వాచి గడ్డ కట్టిన కండరములు మృదువై మెత్తగా మామూలుగా నుండెను.

ఆనాటి ఆనందోత్సవమును జాన్ ష్వ్యాలర్ ఈ విధముగా వర్ణించెను. ''భజన ప్రారంభమైంది. ఏదో శుభము జరుగనున్నదని నా మనస్సు ఉరకలు వేయుచున్నది. ఆ స్థలమంతా బాబా యందలి ప్రేమతో నిండి పోయినది. ఏ సహాయము లేకుండా రాజాధి రాజువలె బాబా నడచి వచ్చుచున్నారు. వారి అడుగులు ఎప్పటివలె దృఢముగా మనోజ్ఞముగా పడుచున్నవి. లోగడ నే చూచినప్పుడున్న లోతుకు పోయిన కళ్ళూ, లోపలికి పోయిన బుగ్గలూ కావు. నిండు బుగ్గలతో, నమ్మ శక్యము కాని తేజస్సుతో వచ్చుచుండగా అందరి మోములలోనూ ఆనంద తరంగములుప్పొంగెను. మా కనుల వెంట ఆనంద భాష్పములు జల జల రాలెను. దారిలో వ్యాధిగ్రస్తుడైన బిడ్డను ఎత్తుకుని గోడవారగా నిలబడిన స్త్రీ వద్దకు వెళ్ళి హస్త చాలనమున విభూతి సృష్టించి ప్రసాదించిరి.



వేదిక నెక్కి సింహాసనము నలంకరించి ఒక పరి కరుణార్ద్రనయనములతో అంతటా కలియ జూచిరి. శ్రీమతి రాజగోపాలన్ నా చెవిలో ''చూడు ఆ కన్నులు మామూలు కన్న అందముగా ఆనంద తరంగములతో తొణికిసలాడు చున్నవి. ఈ అనుభవము నిజముగా దైవ సాక్షాత్కారము. సందేహము లేదు'' అన్నది.

బాబా వేదిక నలంకరించగనే ఆనందోద్రేకముతో గవర్నర్ నకుల్‌సేన్ ''చూడండి! ఎంత ఠీవిగా బాబా సింహాసనము నలంకరించి నారో!'' అన్నారు. తన ఉపన్యాసములో శ్రీ సేన్ ''వైద్యులందరూ అత్యంతాందోళన ప్రకటించిరి. భగవాన్ నాతో చెప్పిన మాటలతో వారు ఏకీభవించరైరి. గోవా ప్రజలకు తన లీల నొకదానిని దర్శించు నవకాశ మిచ్చుచున్నారనీ, ఆ వ్యాధి నెంత వేగముగా తీసుకొనిరో అంత వేగముగా భగవాన్ దానిని విడిచి పెట్టగలరనీ, ఏదో అజ్ఞాతవాణి నాలో పలుకుచునే యున్నది'' అని పేర్కొనెను.

''జీసస్ సిలువ వేయబడుట కెందు కంగీకరించిరి? అని నేను బాబాను ఒకనాడు ప్రశ్నించగా మహాత్ములు తమ ఆధ్మాత్మిక శక్తిని తమ కొరకుపయోగింపరు అని బాబా సమాధాన మిచ్చిరి'' అని జాన్ వ్రాసి యుండెను.

గోవా పర్యటన ముగిసిన కొన్ని దినముల తర్వాత బొంబాయిలో బాబా తమ ఉపన్యాసమున ''ఈ మధ్య గోవాలో వున్నప్పుడు ఈ శరీరము తీవ్రమైన వ్యాధికి గురి అయ్యెను. చాలామంది భక్తులు వ్యధ చెందినారు. ఏ వ్యాధి కూడా ఈ శరీరము నేమీ చేయలేవు. కొన్ని సమయములందు ఏ వ్యాధియైననూ వచ్చినట్లయిన, నమ్మండి. అది ఇతరులదే కాని నాది కాదు. నా సంకల్పముననే వచ్చును, నా సంకల్పముననే పోవును. దానితో నా కెట్టి సంబంధము లేదు; దానివలన నాకేమీ కాదు'' అని వివరించిరి.

ఆనాటి బహిరంగ సభలో శ్రీనకుల్‌సేన్ ''బాబా తన భక్తుల హృదయాంత రాళములలో నివసించెదరు. భక్తుల కొరకు బాబా చేయనిదంటూ లేదు. ఇదే రూపములో ఒకే సమయమున అనేకచోట్ల ప్రత్యక్షమై ఆపదలో నున్న భక్తులను ఆదుకొనుట లేదా రానున్న ఆపదల నుండి రక్షించుట వారి స్వభావము. వారి సంకల్పము ద్వారా తన భక్తుల రోగములను తన మీదకు రప్పించుకుని వారికొరకు తాము ఆ బాధ ననుభవించెదరు. అటువంటి సందర్భములలో ఆ వ్యాధిని బాబా తీసుకొనకపోయిన దానిని భరించలేక ఆ భక్తులు మరణించి యుండెడివారు.

''ప్రస్తుతము ఈ గోవా పర్యటన సందర్భముగా బాబా యొక్క మహాద్భుత లీలను చూచినాము. ఈ లీల గోవా నగరమందలి వైద్యనిపుణులను సయితమూ దిగ్భ్రాంతులను చేసినది. భగవాన్ బాబా, వారి శక్తికి అతీతమైనదేదీ లేదని, వారు భక్తులయెడల చూపు అపారకరుణను రుజువు చేసినారు. బాబా లీలలు అద్భుతములు, రోమాంచ కారిణులు, అత్యంత మధురములు, మంగళ మయములు, మనోహరములు,

మనస్సు సత్యం శివం సుందరం వైపు మరలించు ఆనంద ప్రదాయకములు'' అని పలికిరి. వారి ఉపన్యాసములో గోవాయొక్క పౌరాణిక ప్రాముఖ్యత, పూర్వ వైభవము, రామ, కృష్ణ, పరుశురామాతావరము లకు ఆ నగరముతోగల సన్నిహిత సంబంధము, కాబో రాజ్‌నివాస్ సమీపమున సముద్రమందు సంగమించు మాండవి, అఘనాశి అను పుణ్య నదుల పురాణ గాధలను వివరించి పూర్వావతారములలో ఈ నగరముతో నున్న సంపర్కమును పురస్కరించుకుని ఈ యవాతారముననూ ఇట్టి అనుగ్రహమును ప్రసాదించినట్లు చెప్పిరి.

బాబా తమ సహజ మృదుమధుర కంఠ స్వరముతో నలభై నిమిషములు దివ్యోపన్యాస మిచ్చిరి. సభాసదులెల్లరూ సమ్మోహితులై వినిరి. అదియొక విజయాశీర్వాద కారుణ్య పూర్వక దివ్య సందేశము. అత్యంతాశ్చర్యము కలిగించిన ఆ సంఘటనను కూడ అంత్యమున యిట్లు వివరించిరి. ''దైవము లేడనీ, దైవమనునది యొక మూఢ విశ్వాసమనీ చెప్పువారున్నారు. అట్టివారి సందేహములు తీర్చి సంస్కరించుటకు భగవంతుడు సహజ వాత్సల్యముతో తన దివ్య వైభమును వ్యక్తపరచుచుండును. తట్టకుండనే తలుపులు తెరచుకొనునట్లు, వారడుగకుండనే, యిట్టి అనుభవముల ద్వారా వాస్తవమును గ్రహించగలరు. లోప భూయిష్టమైన ఆహారమువలననూ, దురభ్యాసమువలననూ, తెలివితక్కువ ప్రేరేపణ వలననూ శరీరములో రోగములు ప్రవేశించును. గడచిన రెండు రోజులలో మీరు చూచిన రోగ మటువంటిది కాదు. నేను నాకుగా నా శరీరముపై రప్పించుకొనినది. నే నా విధముగా చేయకున్న ఆ భక్తుడు జీవించి ఉండెడి వాడు కాదు. అతడు మంచి ఆరోగ్యముతో జీవించుట నేనాతనిని నియోగించిన పవిత్ర కార్యనిర్వహణకు అవసరము. భక్తి ప్రపత్తులు కలిగిన వారి నాదరించి అనుగ్రహించుట అవతారము యొక్క కార్యక్రమములలో ఒకటి. ఫెపెండిక్స్ బాగా వాచినది. అది వ్రణముగా మారినది. శస్త్ర చికిత్స తప్ప గత్యంతరము లేదు. అతడు దానిని తట్టుకుని బ్రతుకలేడని నాకు తెలుసు. అట్టివారి బాధలను తొలగించి రక్షించుటకే కదా నేనీ శరీరముతో వచ్చినది. ఈ శరీర మెప్పుడూ ఆరోగ్యముగనే యుండును. రోగ మీ శరీరమును తాకదు.

''విచక్షణతో సహా నాకు తన సర్వస్వమూ అర్పించిన ఒక భక్తుని నేను రక్షించవలసి వచ్చినది. అతని వ్యాధిని నేను తీసుకుని అనుభవించితిని. ఇంకా ఈ వ్యాధి అతనిలో తిరగ బెట్టకుండ చేసితిని. ఈ సంఘటనను మీరు లీల అనుచున్నారు. కాని ప్రతి కార్యమును ఒక లీలగానే గుర్తించండి. ప్రతి శ్వాస భగవంతుడున్నాడనుటకు సాక్ష్యము. ప్రతి సంఘటన ఆ సర్వశక్తి స్వరూపుని చిద్విలాసము. ఎక్కడ సత్యము, ధర్మము, సౌశీల్యము, జ్ఞానము, సౌందర్యము, సౌహార్ద్రమూ కనబడునో, అక్కడ భగవంతుడున్నాడు. భగవంతుడిచ్చిన కన్నులు మూసుకుని, భగవంతుడిచ్చిన శ్వాసతోనే



భగవంతుడు లేడనువారినిట్టి అద్భుత సంఘటనల ద్వారా దైవోన్ముఖులను చేయవలసి వుంటుంది.''

బాబాను భక్తితో కొలుచునట్టి మనకూ, ఈ అవతార మహాత్మ్యము ద్వారా సత్ఫలితములు పొందిన మానవాళికీ, డిసెంబరు 10వ తేదీ ఒక మరుపురాని పర్వదినము. బాబా యొక్క దివ్య విభూతి, భక్త రక్షణ, ధర్మ సంస్థాపనోద్యమము గ్రహించే మహత్తర అవకాశము సర్వులకూ ప్రాప్తించింది.

బాబా తన సహజ శ్రావ్య గాత్రముతో సంకీర్తనము చేసి గోవా ప్రజల హృదయములను భక్తి పారవశ్యముతో రంజింపజేసి తమ గదికి తిరిగి వచ్చిరి. గవర్నర్ దంపతులు, డాక్టర్లు, మేము, బాబా చుట్టూ చేరి గదిలో కూర్చుని వుండగా డాక్టర్లు వేసిన ఆధ్యాత్మిక అంశము లకు సంబంధించిన ప్రశ్నలకు తీరికగా విపులముగా సమాధానము లిచ్చి వారి సందేహములు తీర్చిరి. ఆ గోష్టిలో సంభాషణ త్రిమూర్తి తత్వమైన దత్తాత్రేయుని వైపు మరలగా హస్త చాలనముతో ఎలిఫెంటా గుహలలో వున్న దత్తాత్రేయ శిల్పమునకు ప్రతీకమైన చిత్రము హస్తములో ప్రత్యక్షమయ్యెను. తామే దత్తాత్రేయ స్వరూప మనునట్లు అందలి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల మూర్తులు బాబా చిత్రములతోనే రచింపబడి యున్నవి.

11వ తేదీ సమావేశమైన డాక్టర్లు నందరినీ అనుగ్రహించి, తిరిగి సంభాషించి వారందరికీ ప్రత్యేకమైన బహుమానములు సృష్టించి ప్రసాదించిరి. నాటి నుండి నేటి వరకు నిత్యమూ సాయంత్రము కాబో రాజ్‌నివాస్ మందిరమున నామ సంకీర్తన కార్యక్రమము జరుగుచున్నది.

ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారి సమ్మె గోవా ప్రజలకు వరప్రసాదమైనది. నిత్యము ఉదయమూ సాయంత్రమూ వేలాది భక్తులు బాబా దర్శన భాగ్యమును పొందుచుండిరి. 18వ తేదీ సాయంత్రము అసంఖ్యాకులైన జనముతో బ్రహ్మాండమైన బహిరంగ సభ ఏర్పాటయినది. అధ్యక్షత వహించిన శ్రీ నకులసేన్ మానవ రూపమున అవతరించిన నిరాకార పరబ్రహ్మమే బాబాయని ఉపన్యాసమున పేర్కొనిరి. బాబా తమ దివ్యోపన్యాసములో 'యోగము' 'ఉద్యోగము' అను అంశములను గూర్చి ప్రసంగించిరి. భగవదర్పిత భావముతో చేయు కార్యమే ఉద్యోగమనియూ అదియే యోగము యొక్క ఉత్తమ పరిణామమనియూ పేర్కొనిరి.

21వ తేదీన ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారి సమ్మె యింకనూ కొనసాగించుటచే, ప్రత్యేకముగా ఏర్పాటు చేసుకున్న ప్లేన్‌లో సపరివారముగా బొంబాయి వెళ్ళిరి.

# కాంతి పథము

బాబా ఎపెండిసైటిస్ వృత్తాంతమును చిత్రవిచిత్ర కల్పనలతో వార్తాపత్రికలు వ్యాఖ్యానములు చేసి ప్రచురించినవి. శస్త్ర చికిత్స జరిగినట్లూ, బాబా కోలుకొనుటకు కొన్ని మాసములు పట్టవచ్చుననీ కొన్ని పత్రికలలో ప్రచురించబడినది. వివరములు తెలియని చాలా మంది బొంబాయిలోని భక్తులు సంశయాందోళనకు గురియైరి. క్రిస్టమస్ దినమున బొంబాయిలో ధర్మక్షేత్రము వద్ద ఏర్పాటు చేయబడిన బహిరంగసభలో బాబాను దర్శించుటతో భక్తుల భయ సందేహములు మటుమాయమయ్యెను. నాడు బాబా చేసిన సుదీర్ఘమైన ఉపన్యాసము, తదుపరి సంకీర్తనము వినిన భక్తుల హృదయములు తిరిగి ప్రఫుల్లమైనవి; జరిగినదంతా గ్రహించి తమ సంశయములకు సిగ్గుపడిరి. 'ఒక భక్తుని రక్షించుటకు తాము అతని వ్యాధిని స్వీకరించి తిరిగి సంకల్ప మాత్రమున తొలగించుకొను ప్రేమ స్వరూపులైన బాబాను ఏ వ్యాధి మాత్రము ఏమి చేయగలదు' అన్నమాటలే ఏ నోట వినినను.

''ఒక కదలుచున్న మేఘమువలె వచ్చినది, పోయినది. ఆ వ్యాధితో నాకెట్టి సంబంధమూ లేదు. కాని కొందరు నన్ను అది చేయమని, ఇది చేయమని సలహాలిచ్చుటకు సాహసించిరి'' అన్నారు బాబా. ఇతరుల బాధలు పంచుకొనుమను బాబా ప్రబోధమును ఆచరణ రూపములో చూపించుటకే ఈ సంఘటన కల్పించబడినది. ఆచరణ రూపముననే దర్మమును ప్రబోధించుట బాబా అభిమతము. క్రీస్తు తనయందు విశ్వాసమున్న వారి కొరకే శిలువ వేయబడెను. అతనికి భయములేదు, బాధలేదు, మరణము లేదు. త్యాగము ప్రేమకు పరాకాష్ఠ. త్యాగమే భగవంతుడు, ఇదే బాబా యొక్క సందేశము. ఈతి బాధలకు మూలమైన భవబంధముల నుండి విముక్తులను చేసి కాంతి పథమున నడిపించి ఆనంద శాంతుల నందించుటకే బాబా అవతరించెననెడి విశ్వాసము సర్వుల హృదయములను ఉత్తేజపరిచెను.

బొంబాయిలో ఒక భాగమైన కుర్లాలో బాబాకు స్వాగతము నిచ్చు భాగ్యము ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలయిన కమానీ సోదరులకు లభించినది. వారి పారిశ్రామిక ఆవరణలో సభా మంటపము (Community Hall) నకు ప్రారంభోత్సవము చేయమని బాబాను ప్రార్థించిరి. ఆ విశాల ఆవరణలోనికి ఆహ్వానితులకు మాత్రమే ప్రవేశము పరిమితమైనప్పటికి లోపల జనసమూహముతో కాలు కదుప వీలులేనట్లు కిటకిటలాడుచుండెను. అక్కడ చేరిన వారందరూ కార్మికులూ వారి కుటుంబసభ్యులూ, నిరాడంబరముగా హాలంతా అలంకరించినారు. అక్కడ వున్న వారందరికీ వేదిక మీద జరుగుచున్న కార్యకలాపములు, ముఖ్యముగా బాబాను దర్శించుటకు వీలుగా వుండునట్లు టెలివిజన్ సెట్లు ఏర్పాటు చేయబడినవి. అందరూ కన్నులకు, వీనులకు విందుగావించుకొనుచూ ఆ ప్రారంభోత్సవమున అనందముగా పాల్గొనిరి.



ఈ సంఘటన గురించి భవన్స్ జర్నల్ ఈ విధముగా వ్యాఖ్యానించెను ''మోక్షానందము నందించు మహోన్నత స్థాయినున్న మహాపురుషుడు, యాజమాన్యము-కార్మికుల పరస్పర సంబంధముల విషయము ప్రస్తావించుట, ఈ ప్రాపంచిక విషయమునకొక ఆధ్యాత్మిక ప్రాముఖ్యత చేకూర్చినట్లయినది.''

1971వ సం॥ జనవరి 1వ తేదీన ఒక ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థ యొక్క ఆవరణలో నాడు బాబా చేసిన ఉపదేశము నేటి యావద్భారత దేశమునకంతకూ ఒక సందేశము. శ్రామికులు తమ విద్యుక్త ధర్మములను సక్రమముగా నెరవేర్చి అప్పుడు ఉత్సాహముగా వారి హక్కులు దక్కించుకొనుట న్యాయము. అదే విధముగా యజమానులు తమ ఉద్యోగస్తుల యొక్క యోగక్షేమములు దృష్టిలో నుంచుకొనుటయే కాక శ్రామికుల బిడ్డలకు కూడ సరియైన సదుపాయములు కలిగించి ప్రోత్సహించి వారిలో సచ్ఛీలము, సత్ప్రవర్తన పెంపొందించుట వారి ధర్మము. ఇదీ బాబా ఆనాడు చేసిన ప్రబోధము. ఈ దర్శనము అన్ని సంస్థలకు అన్వయిస్తుంది.

సమరస భావమునకు ప్రేమ ప్రధాన సూత్రము. భగవంతుని దరికి చేరు మార్గమునకు సత్కర్మ, సదాచారము, సద్విద్య అనునవి మూడు ఘట్టములు. బాబా మాటలలో చెప్పవలెనన్న ''ఆనందము, శాంతి, ప్రేమతో నిండిన క్షేత్రములలోనే అంకురించును''.

''పవిత్ర ప్రేమను అమూల్యఫలముగా జీవిత వృక్షము ప్రసాదించును. మధురమైన ఫలముల ఉపరితలము చేదుగా ఉండును. జీవిత ఫలము కూడా అత్యాశ, కోపము, మమకారము, అహంకారము, ద్వేషము, అసూయ అను ఆరు చేదు పొరలతో కప్పబడి వుంటుంది. ఆ తొక్కలను వొలిచినప్పుడే ఆ ప్రేమ ఫలమును భుజించి జీర్ణించుకో గలుగుదుము. అంతర్యామునందున్న ఈ ప్రేమఫలమును అన్వేషించి అందుకొన్నవారే శాంతి ఆనందములు పొందగలరు. తనయందే వున్న ఆ ప్రేమనిధిని సేకరించి అందరికి పంచిపెట్టు ప్రక్రియనే సాధన అందురు.

''వివిధ సంపదలు, ఆస్తులు, అధికారములు, పేరు ప్రఖ్యాతులు అంత విలువైనవి కావు. ప్రేమ అనే అమూల్య ఐశ్వర్యం మానవుని జీవిత సర్వస్వము. ప్రేమ శూన్యమైన హృదయము విభిడాంధకారమైన శిధిల మందిరమువంటిది. అందు దుశ్చింతలను గబ్బిలములు నివసించును. అశాంతియను దుర్వాసనకది అలవాలము కాగలదు. ప్రేమయనెడి జ్యోతి హృదయమున నిండెనా, దుశ్చింతలు మటుమాయమై శాంతి నెలకొనును.

''ఇక్కడ కమాని కర్మాగారములో పనిచేయు వేలాదిమంది కార్మికులు చేరియున్నారు. పారిశ్రామిక, వ్యావసాయిక, వాణిజ్య, రాజకీయ, రాజ్యాంగ పాలనాక్షేత్రములు అయిదూ మానవ సమాజమునకు ముఖ్యమైనవి. ఇవియన్నీ ఆరోగ్యముగా సమరస భావము కలిగియున్నప్పుడే మానవాళి శాంతి అభ్యుదయములతో మనగలదు. ఈ అయిదు శాఖలు పరస్పరాను బంధమును గ్రహించి సమిష్టిగా ప్రేమతో వ్యవహరించినచో ఈ దేశమేకాక ఈ

ప్రపంచమే నిత్యము పండుగలు జరుపుకొనవచ్చును. కాని నేడు అట్టి ప్రేమ సూత్రముపై నాధారపడిన పరస్పర సహాయ సహకారములు లేవు. ప్రతిరంగములో రాజకీయ కుతంత్రములు, ముఠా రాజకీయాలు. అందుకే దేశమున రానురాను అశాంతి అధికమౌతున్నది. ప్రజలు భవిష్యత్తును గురించి భయాందోళనలకు గురియగుచున్నారు.

''ఉద్రేకములు, ప్రకోపములు మంటలవలె పైకెగయుచున్నవి. తాను సంస్థలో ఒక భాగమని అధికార పూర్వకముగా ప్రకటించుటకు ముందు తన పాత్రతను గూర్చి ఆత్మ పరిశీలన చేసుకొనవలెను. అట్లుగాక ఈనాడు తమ విద్యుక్త ధర్మములను బాధ్యతలను అలక్ష్యము చేసి తమ అధికారములు హక్కులూ అనుచూ ఉద్రేకము చూపుట పరిపాటయినది. ఈనాడు బాధ్యతలపట్ల నిర్లక్ష్యము, హక్కుల పట్ల మక్కువ కనబడుచున్నది.

"Work is worship, Duty is God అను పవిత్రమైన ఆశయములను హృదయముల నింపుకుని ఉద్యోగులు తమ తమ విధ్యుక్త ధర్మములను, బాధ్యతలను, దైవారాధనవలె భావించి, సక్రమముగా నెరవేర్చవలెను. అప్పుడే మన హక్కులు అధికారములు ధర్మబద్ధమయిన వగును. ప్రతివ్యక్తి తన బాధ్యతను గుర్తించి వర్తించిన యెడల తాను ఆనందముగా ఉండుటయే కాక సమాజమున ఆనంద శాంతులు నెలకొల్పుటకు దోహదము చేసినట్లగును.

''కమాని కంపెనీవారు ట్రాన్స్‌మిషన్ స్తంభములు (Transmission Towers) తయారు చేయుచున్నారు. ఇందులో పాల్గొను ప్రతివ్యక్తి తన పనిని తాను సక్రమముగా జాగ్రత్తగా చేయవలసి వున్నది. అప్పుడే స్తంభము పటిష్ఠముగా నిరపాయకరముగా ఉండగలదు. ఇది అందరియొక్క ఉమ్మడి బాధ్యత. ఇందు ఏపని ముఖ్యమయినది అని నిర్ణయించుట అసాధ్యము, అవాంఛనీయము. అన్ని పనులూ అవసరమైనవే, ముఖ్యమైనవే. ఈ పని ముఖ్యమైనది, అదికాదు అను భావము కార్మికుల మధ్య పరస్పర మనస్పర్థలకు, తద్వారా ద్వేషములకు దారితీస్తున్నది.

''దీనికొక ఉదాహరణ చెప్పెదను. ఒకబాటసారికి దారిలో ఒక ఫలవృక్షము కనబడినది. అతని కండ్లు పక్వమైన పండ్లను చూచినవి. అవి తినిన రుచిగా ఉండునని, ఆకలి తీరునని మనస్సు చెప్పినది. చెట్టువద్దకు అతని కాళ్ళు తీసుకువెళ్ళినవి. నడుమును వొంచి నేలపైన వున్న రాయి వైపు చెయ్యి వెళ్ళినది. వ్రేళ్ళు ఆ రాతిని పట్టుకున్నవి. భుజకండరముల సహాయముతో చెయ్యి ఆ రాతిని చెట్టుమీద వున్న పండ్లవైపు విసిరినది. ఒక పండు క్రింద పడినది. తరువాత కాళ్ళతో నడచి, చేతితో పండును అందుకుని నోటికి అందించగా, పండ్లు నాలుక సహాయముతో నమిలినవి. ఆ పదార్థమును గొంతుక కడుపులోనికి పంపినది. ఇప్పుడు జరిగిన మొత్తము ప్రక్రియలో ఏది ముఖ్యము? ఏ శరీరభాగము ముఖ్యమైన పని చేసినది? ఆయా అవయవములన్నీ సకాలములో అవసరమై నంతవరకు సహకరించుట వలననే కదా చెట్టు మీదవున్న పండు పొట్టను చేరి ఆకలి తీర్చినది. ఇందులో ఏ అంగము



ఏ కార్యము చేయక పోయినను ఫలితము దక్కెడిది కాదు. అందుచేత ప్రతి ఒక్క కార్మికుని ఈ పరిశ్రమలో బాధ్యత పంచుకొను ఒక భాగస్వామిగా గౌరవించవలెను. అందరియందు దైవమున్నాడనీ, అందరూ సమానముగా ప్రేమకు పాత్రులేనని భావించి చరించవలెను. అదే వ్యక్తికీ సమాజమునకూ ఆనందమునందించు సాధన.

''ప్రతి వ్యక్తి తన జీవితమును సార్థకము చేసుకొనుటకు శక్తి వంచన లేకుండా తన విద్యుక్త ధర్మమును తాను నెరవేర్చవలెను. మానవ రూపమున జన్మించినందుకు నీ విధి నిర్వహణ ద్వారా నీ ఋణము తీర్చుకొనవలెను. తినుటకు త్రాగుటకు ఈ ప్రపంచమునకు మనము రాలేదు. జీవించుటకు మనము తిని త్రాగవలెను కాని తిని త్రాగుటకు జీవించరాదు. మన మందరము ప్రేమ మార్గము ద్వారా అత్యున్నతమైన గమ్యమును చేరవలసి యున్నది. అదే భగవద్దర్శనము. మానవజన్మ యెత్తినందుకు మనశరీరమును, శక్తిని, ప్రవీణ్యతను ఇట్టి గమ్యము చేరు నిమిత్తముపయోగించుటయే మనకు ఉత్తమ కర్తవ్యము.

''అయితే ఒక ప్రశ్న అడుగవచ్చు. భగవంతుడెవరు? అతడెక్కడుండును? ఎవ్వరైనా చూచిరా? దీనిని వివరించుట కొక కథ వున్నది. కాషాయవస్త్రములు ధరించిన ఒక సన్యాసి నిరీశ్వరవాదులకు ప్రసిద్ధికెక్కిన ఒక గ్రామము వెళ్ళెను. అతని దుస్తులు చూడగనే అతనిని హేళన చేయుట కొక గుంపు చేరినది. అందు ఒకడు అతనితో ''మాకు భగవంతున్ణి చూపించగలవా?'' యని ప్రశ్నించెను. ''అట్లే చూపించెదను'' అని చెప్పి తన అలసట తీర్చుకొనుటకు కొంచెం పాలు తెప్పించమని వారిని కోరెను. పాలు తెచ్చి యివ్వగా ఆ పాత్రను చేతులలో వుంచుకుని తదేక దృష్టితో ఆ పాలవైపు చూడసాగెను. విసుగు చెంది పాలవైపు ఎందుకంత సేపు చూచుచున్నావని అడిగిరి. ''పాలలో వెన్న వున్నదందురు కదా! అది ఎక్కడ వున్నదో చూచుచున్నాను'' అని అతడు సమాధాన మిచ్చెను. అతడు వెర్రివాడన్న వుద్దేశ్యముతో ''ఈ మాత్రము తెలియదా! పాలు కాచాలి. చల్లార్చాలి. తోడుపెట్టాలి. పెరుగు కావాలి. అప్పుడు ఆ పెరుగును చిలికి వెన్నను వేరు చెయ్యాలి. అప్పుడు వెన్న కనబడుతుంది'' అన్నాడందులో ఒకడు పరిహాసిస్తూ ''అదే మీ ప్రశ్నకు సమాధానము. పాలల్లో వెన్నవలె అతడు సర్వవ్యాపి. మీరు భగవంతుని చూడవలెనన్న అనేక సాధనలు చెయ్యాలి. అప్పుడు కనబడును. ఇప్పుడు కాదు'' అని అతడు జవాబు చెప్పెను.

''సాధనకు ప్రధానమైనది ప్రేమ. ప్రేమరహితమైన సాధన ద్వారా కనబడునది దైవము కాదు; దయ్యము. దీనిని మరికొంత వివరించెదను. ఇప్పుడు బొంబాయి ఆకాశవాణి వారు ప్రసారము చేయుచున్న శబ్దతరంగములు గాలిలో వున్నాయి. ఇదే సమయములో ఢిల్లీలోనూ, ప్రపచంములో మరెన్నో కేంద్రములవారు ప్రసారము చేయుచున్న శబ్దతరంగములు కూడా ఈ గాలిలో వున్నవి. కాని వాటిని మనము వినలేము, చూడలేము. మన వద్ద రేడియో వున్నట్లయితే ఏ కేంద్ర ప్రసారమును వినదల్చితిమో ఆ కేంద్రమువైపు ముల్లు త్రిప్పిన, ఆ కేంద్రము నుండి వచ్చు తరంగములు వినగల్గుదుము. అది సంగీతము కావచ్చు. వార్తలు

కావచ్చు). మరియే కార్యక్రమమైననూ కావచ్చు). ఇక్కడా అక్కడా అంతటావున్న భగవంతుణ్ణి మంత్రముల ద్వారా స్పష్టముగా గుర్తించవచ్చును. రేడియో యంత్రముతో కేంద్రమువైపు శృతి చేసినట్లే మంత్రముతో ప్రేమయను కేంద్రముపై ముల్లు నుంచినప్పుడు, గాలి అంతటా వ్యాపించిన శబ్దతరంగములను వినగలిగినట్లే, సర్వవ్యాపకుడైన భగవంతుని కనుగొనగలము. సరియైన కేంద్రమువైపు జాగ్రత్తగా ముల్లుత్రిప్పి న్యూస్ వినదల్చుకున్న వినవచ్చును, లేదా వినబడునది న్యూస్‌కాదు న్యూసెన్స్. అదే విధముగా ప్రేమయను కేంద్రమువైపు మంత్రమును ప్రయోగించినే దైవమును కనుగొనవచ్చును, లేనియెడల కనబడునది దయ్యము.

''కాబట్టి ప్రేమ ఒక్కటే భగవంతుని అనుగ్రహమును పొందుటకు ఉత్తమ మార్గము. నీ స్వంత సోదరీ సోదరులను నీవెట్లు దగ్గరకు చేర్చుకొనెదవో ప్రతివారిని అట్లే చేరదీసి వారియెడల శ్రద్ధా బాధ్యతలను వహింపుము. నిజముగా కార్మికుని జీవితము చాలా విలువైనది, ప్రధానమైనది. కర్మభక్తి జ్ఞానములు భగవంతుని చేర్చునట్టి మార్గమున మూడు ఘట్టములు. చిత్తశుద్ధితో, పరులయెడల గౌరవముతో, భక్తితో చేసిన కర్మ ప్రధానమైనది. శరీరము, మనస్సు ఎంత సన్నిహితముగా నుండునో యజమాని కార్మికుడు అంత సన్నిహితముగా నుండవలెను. యజమాని హృదయము, కార్మికుడు శరీరము వంటివాడు. శరీరము లేక హృదయము, హృదయము లేక శరీరము ఉండజాలవు. రెండూ ఒకదాని కొకటి అవసరము యజమాని సేవకుల సంబంధము తండ్రి బిడ్డల సంబంధము వంటిదిగా నుండవలెను. అటువంటి ఆదరానురాగము సహజముగా వుండి, భ్రాతృత్వ వాతావరణముతో కార్మికులు పనిచేసిన పరస్పర సహాయ సహకారములతో పరిశ్రమ వృద్ధిగాంచును యజమానీ సేవకులూ అన్యోన్య భావముతో శాంతి సంతోషములు పొందగలరు.

''కార్మికుల కేవేని సమస్యలు బాధించుచున్న, వాటిని యాజమాన్యము యెదుటనుంచి సమరస భావముతో పరిష్కరించుకొనవలెను. కోపోద్రేకముతో, ఈర్ష్యా ద్వేషములను రెచ్చ కొట్టుకొనకుండా వారి వారి బాధ్యతలను గుర్తించి పరిష్కరించుకొనవలెను. ఇది చాలా ముఖ్యమైన విషయము.

''ఈ సాంఘిక సంక్షేమ భవనాన్ని ఇప్పుడే ప్రారంభించితిని. మీరందరు నెలకొక పర్యాయము, అంతకంటే తరచుగా, పక్షమునకో, వారమునకో, ఒకసారి మీరందరు యిక్కడ సత్సంగము కొరకు కాని, భజన కొరకు కాని, ఆధ్యాత్మిక కార్యకలాపముల కొరకు కాని, సమావేశము కావలెనని నాయభిమతము కార్మికుల బిడ్డల కిక్కడే ఒక పాఠశాలను ఏర్పాటు చేసి క్రమశిక్షణ, భగవద్భక్తి, సచ్ఛీలసంపద వారిలో అభివృద్ధి అగునట్లు చూడ గోరుచున్నాను.

క్రమశిక్షణ మానవుని ప్రతి ప్రయత్నమందును అత్యంత అవసరమైన పరికరము. క్రమశిక్షణతో మెలగినప్పుడే మానవుడేమైన సాధించి జీవితము సార్థకము చేసుకొనగలుగును.''

''మీ అందరితోనూ వున్నందుకు నాకు చాలా ఆనందముగా వున్నది. ఈ నూతన సంవత్సరాది మీ అందరి హృదయములను శాంతి ఆనందములతో నింపగలదని ఆశిస్తూ



ఆశీర్వదించుచున్నాను'' ఇదీ ఆనాడు కమానీ సంస్థయొక్క యాజమాన్యమునకు, అందు పనిచేయువారికి బాబా అందించిన దివ్య సందేశము.

1971 సం॥ జనవరి 1వ తేదీ బొంబాయి భక్తులకు వినూతన చైతన్యముతో ప్రారంభమైన నూతన సంవత్సరాది శుభదినం. ఆ సాయంత్రము ధర్మక్షేత్ర ఆవరణలో జనసముద్రము అంచులు దాటి పెల్లుబికినది. ఆనాటి బహిరంగసభలో బాబా ఉపన్యసించిరి. బాబా సన్నిధానములో వున్నప్పుడు జాన్ హిస్లోప్ వద్ద కాగితము కలము సిద్ధముగా వుంటాయి. బాబా బోధించు ఆధ్యాత్మిక విషయములను గూర్చి నోట్సు వ్రాసుకొనుట అతని అలవాటు. 'పాశ్చాత్య దేశములో పుట్టి పెరిగి విద్యనభ్యసించి ఏ జాతికి చెందని నావంటివానికి బాబా యెడల గలిగెడు భావమేమి?' అను తన ప్రశ్నకు తానే సమాధానము ఇస్తూ ఇట్లు వ్రాసెను. ''బాబా హృదయాధిపతి. ఎన్నో సంవత్సరములుగా నా హృదయముతో పేరుకు పోయిన కాఠిన్యమును తొలగించిరి. మనస్సును నిర్మలము, నూతనము, ఆనందమయము కావించిరి. బాబా దైవత్వ మవేద్యము, అనన్యము, మానవుని మేధాశక్తికతీతమైన మాయ. బాబా పరమోత్తమమైన గురువు, మానవాళికి ముక్తిమార్గ నిర్ణేత.''

నాటి సభలో బాబా నూతన సంవత్సరాది సందేశముగా విశ్వ మానవ సౌభ్రాతృత్వమే లక్ష్యముగా కృషిచేయుచూ సమస్త జనులకు సుఖశాంతులను భగవంతుడు ప్రసాదించవలసినదిగా నిత్యము ప్రార్థించవలెనని ఉపదేశించి ఆశీర్వదించిరి

బాలవికాస్ తరగతులలో చేరిన చిన్న పిల్లలు నాటకములు, పురాణేతిహాసములలోని కథలు చెప్పుట, బాబా ప్రవచనములు, పద్య పఠనము, నామ సంకీర్తనము మొదలయిన కార్యక్రమములు నిత్యమూ, బాబా దివ్య సన్నిధానమువలన కలిగిన ఆనందోత్సాహములతో ఆ పసిపిల్లలు నాటకములలో వారి వారి పాత్రలయందు లీనమైయుండగ వారికి ప్రేక్షకులకు ఆనంద బాష్పములు రాలెడివి. వారి హావభావములలోని సహజత్వము ప్రహ్లాదుని జ్ఞప్తికి తెచ్చుచుండెను. ఒక విద్యార్థి సాయికృష్ణుని ప్రక్కన నిలబడి భగవద్గీత పఠించుచు పారవశ్యమున భావోద్వేగముతో కన్నుల నీరు కారుచుండగా రోదించెను.

బాలవికాస్ సంస్థల కార్యకలాపములను గురించి ''సత్యసాయి బాలవికాస్‌లందలి పిల్లలు వారి హృదయములందు సత్యసాయి నివసించుచున్నాడనివారు తెలుసుకొనవలెను. ఇందలి ఉపాధ్యాయులు కూడా ఈ పవిత్రమైన బాధ్యతను సాయి రాముని పూజగా భావించవలెను. ఆ పసిపిల్లల హృదయములందు సాయి వున్నాడన్న భావ చైతన్యమును ఏ విధముగా అభివృద్ధి చెయ్యవలెనో, ఎట్టి కార్యక్రమములు వారి మనస్సులను వికసింపజేయునో యన్న విషయములను ఉపాధ్యాయినులు పరిశీలించు చుండవలెను. ఈ పిల్లలను దైవోన్ముఖులుగా తీర్చి దిద్దు ఈ ఉపాధ్యాయినులు సమాజమునకు సాటిలేని సేవ చేస్తున్నారు. ఈ మనోభావములతో పెరిగే పిల్లలు ఈ పవిత్రమైన వాతావరణమును వారి గృహములందూ

పరిసరములందూ ప్రవేశ పెట్టి సంస్కరించగలరు'' అని బాబా పలికిరి.

సేవా సంస్థల సభ్యులనుద్దేశించి మాట్లాడుచూ బాబా సేవా సాధన యొక్క ప్రాధాన్యతను గూర్చి వివరించి అదే భగవత్సాక్షాత్కారమునకు ముఖ్యాధారమనిరి. ఆడంబర ప్రదర్శనలూ ప్రచారమూ వద్దని హెచ్చరించిరి. భగవంతుని లీలలు మననము చేసుకొనుచూ భగన్నామమును స్మరిస్తూ ప్రేమయనే గొలుసుతో భగవంతునితో బంధమేర్పరచుకొనవలె ననియూ, అట్లుగాక అవిశ్వాసముతో నిర్లక్ష్యముగా భగవంతుని స్మరించిన అట్టి గొలుసు తెగిపోవుననియూ చెప్పిరి.

జనవరి 7వ తేదీన వైకుంఠ ఏకాదశి; వైకుంఠము యొక్క ద్వారములు తెరచుకొను దినము, పర్వదినముల అంతరార్థము తెలుపుటకే బాబా ఉత్సవములు జరుపుదురు. ఆ రోజున అఖండనామ సంకీర్తనానంతరం ఏకాదశి యొక్క అంతరార్థమును బోధించిరి. ఎప్పుడు దశేంద్రియములు పరస్పరానుబంధముతో దైవోన్ముఖమగునో, అప్పుడు ఏకాదశి యనెడి భగవంతుని చేరు ద్వారములు ఆహ్వానించుచూ తెరచుకొనునని వివరించిరి.

బొంబాయి నుండి తిరిగి వెళ్ళు దినమున బాబా సేవాదళ్ సభ్యుల నుద్దేశించి ''ద్వేషము అసూయ యనెడి కారు మేఘములు నిన్ను చుట్టుముట్టినప్పుడు, నీవు విశ్వసించిన వారు నీ దరిచేరక నిన్ను విడిచిపెట్టినప్పుడు, ఒక్క క్రమ శిక్షణే నీకు రక్ష. కరుణ అనే సిలువ మీద నీ అహంకారమును బలియిచ్చి, నీ శక్తి సామర్థ్యములతో ఇతరులకు సేవ చెయ్యి. నీ వెట్టి కార్యములందు నిమగ్నుడవైనప్పటికీ నామ స్మరణ, జపధ్యానముల ద్వారా అహంకారమును విసర్జించు'' మని బోధించిరి. ప్రవర్తన యందు వేష భాషలందు నిరాడంబరత్వము వుండవలెననీ, ఇతరుల పట్ల నీ ప్రవర్తనలోనూ, ధరించే వస్త్రముల ఎన్నికలోనూ సభ్యతా సంస్కారములు లేక పోయినట్లయిన తోటి మానవులకు నీవు దూరమౌతావు అని హెచ్చరించి, వేష భాష ప్రవర్తనల విషయములో 'ఇలా వుండుట స్వామికి యిష్టమా అనే ప్రశ్న వేసుకొనుటయే వాటికి గీటురాయి' అని చెప్పిరి.

బాబా బొంబాయిలో వున్నప్పుడు బాబా స్థాపించిన అఖిల భారత విద్వన్మహాసభ యొక్క మహారాష్ట్ర శాఖవారు బాబా ప్రసంగములలోని ప్రబోధములను ఒక గ్రంథ రూపమున ప్రచురించి బాబాకు అంకితము చేసిరి. ఆ సభకు అధ్యక్షులుగా వున్న శ్రీ సావంత్ ఆ గ్రంథము భగవంతుని దరిచేర్చు మార్గమున వెలుగు చూపుతుంది అనిరి. మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ అధ్యక్షుడయిన శ్రీ పాగె ధర్మక్షేత్రమున ఆ గ్రంథమును బాబాకు సమర్పించుచూ ''నేను బాబా పాదపద్మముల వద్ద కూర్చుండి అనేక ఆధ్యాత్మిక విషయములను గురించి ప్రశ్నించగా దయతో సమాధానముల ననుగ్రహించిరి. నాతో బాటు మరికొందరు సభ్యులు కూడా ప్రశ్నలు వేసి సమాధానములు పొందిరి. ఈ గ్రంథములో ఆ ప్రశ్నోత్తరములు పొందుపరచబడినవి'' అని చెప్పిరి.



ఆ గ్రంథావిష్కరణ సందర్భముగా బాబా ''ఈ గ్రంథము అజ్ఞానాంధకార కూపమున చిక్కుకున్న వారికి వెలుగు చూపగలదు. భక్తుని జీవితములో స్థూలముగా మూడు దశలున్నవి. మొదటిది 'తవైవాహం' అనగా నేను నీ వాడను అను స్థితి. ఈ దశలో భక్తుడు దైవమునకు సంపూర్ణ శరణాగతుడగును. రెండవ దశ 'మమైవాహం' అనగా నీవు నావాడవు. ఈ స్థితిలో భక్తుడు తానే భగవంతుని యొక్క ప్రత్యేకాభిమానమునకు పాత్రుడని భావించును. మూడవ దశ 'త్వమేవాహం' అనగా నీవే నేను. నీవే వున్నావు నేను లేను. ఈ స్థితిలో భక్తుడు తనతో సహా సర్వత్రా భగవంతునే దర్శించును'' అని బోధించిరి.

ధ్యాన విధానమును బాబా ఇట్లు వివరించిరి. ''ఒక ఆలోచన అంతమై మరొక ఆలోచన ఉద్భవించుటకు మధ్యనున్న వ్యవధిలో ప్రశాంతముగా వుంటుంది. అటువంటి క్షణము కొరకు వేచి వుండి అందు స్థిర చిత్తముతో విలీనమయిన యెడల అనంతమైన శాంతి లభిస్తుంది. ఆలోచనలు నీటిలోని చిరుతరంగముల వలె లేస్తూ పడుతూ వుంటాయి. నీ దృష్టిని నీటిమీద వుంచాలి; తరంగముల మీద కాదు'' శ్రీ పాగే ఈ విషయములో సంభాషణ పొడిగించుచూ ''ఈ స్థితి నిర్వికల్ప సమాధి కదా. అలలు అలజడి లేని నీటి వలె నుండు స్థితి నిర్వికల్ప సమాధి. అలలు వున్నప్పుడు కూడా నీటిపై దృష్టిని వుంచుట సాధ్యమా? గాఢమైన శాంతిని అనుభవించుటలో ఎప్పుడో ఒకప్పుడు నిర్వికల్ప స్థితియొక్క అనుభవము కలుగక మానదనుకుంటాను'' అన్నారు. బాబా దానికి ''అవును, ధ్యానసాధనలో నిమగ్నుడైన వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు నిర్వికల్ప స్థితిని అనుభవించును. అయితే ఆ స్థితికి చేరుట చాలా కష్టము. భక్తుడు, కర్మయోగి కూడా తరచు ఇట్టి స్థితిని సహజమైన రీతిగా పొందుచుందురు. అంతేకాదు. ఆ స్థితి యొక్క అనుభవము జ్ఞప్తి యందుంచుకుని, ప్రయత్న పూర్వకముగా మధ్య మధ్య ఆ స్థితిని పొంది తాదాత్మ్య భావములో ఆనంద మనుభవించుదురు'' అని సమాధాన మిచ్చిరి. ఇటువంటి సువిదితమైన సంతృప్తికరమైన వివరణను యింతవరకు ఏ గ్రంథములోనూ ఎవ్వరూ యిచ్చి వుండలేదనీ, ఇది తనకే కాకుండా తనవంటి అనేక సాధకుల కుపకరించునని పాగే సంతోషమును తెలియజేసిరి.

తరువాత 'నేతి - నేతి' (న + యితి = నేతి) అను పదముతో పరబ్రహ్మమును అభివర్ణించుట గురించి బాబా ఇట్లు విశదీకరించిరి. 'నేతి' అనగా 'ఆదికాదు' అని అర్థము చెప్పుట సమంజసము కాదు. బ్రహ్మము వ్యాకోచము చెందు బెలూన్ వంటిది. దాని పరిణామము అనంతము. అది అవిచ్ఛిన్నము. 'నేతి' అను పదమునకు అక్కడ 'అంతేకాదు, ఇంతకంటే ఇంకా ఎంతో వున్నది' అనే భావార్థము నన్వయించుకొనవలెను''.

'ఆత్మ', 'అహం'ల వ్యత్యాసము నీ విధముగా బాబా వివరించినట్లు శ్రీ పాగె చెప్పిరి. ''నిర్గుణ నిర్వికారమైన నేను అను తత్వము ఆత్మ. అనగా దైవము, స్థూల సూక్ష్మ కారణ శరీరములతో చేరిన నేను అను తత్వం 'అహం'. ''దైవం ఒక్కడే కదా! అందరిలోనూ ఒకే అహం తత్వము కదా ఉండేది!'' అని శ్రీ పాగే అడుగగా విభిన్నమైన ''అహం''

తత్త్వములన్నీ ఆత్మ తత్త్వము యొక్క ప్రతిబింబములే' యని బాబా అనిరి. శరీరమువలె మనస్సు కూడ పదార్థమేనా? దానికి వస్తుస్వరూపమివ్వగలమా? యనెడి ప్రశ్నకు ''అవును, మనస్సు కూడ పదార్థమే. అది అతి సూక్ష్మము. దానికి పొడుగూ వెడల్పూ బరువూ అనెడి కొలతులు నిర్ణయించలేము. సంకల్పము ద్వారా దానికి వస్తుస్వరూపము నివ్వవచ్చును'' అని బాబా సమాధాన మిచ్చిరి.

వారి మహిమలను గూర్చి అడుగగా బాబా ''భగవంతుడు తన సంకల్పముచేత ఈ జగత్తును సృష్టించెననుటకు ఈ మహిమలు నిదర్శనము'' అని యిచ్చిన సమాధానమునకు తాము నిస్సంకోచముగా సంతృప్తి పడినట్లు పోగోరు చెప్పిరి.

1971 సం॥ ఫిబ్రవరి 23వ తేదీన మహాశివరాత్రి పండుగ. నాడు ప్రశాంతి నిలయము అసంఖ్యాకులైన భక్తజనులతో క్రిక్కిరిసి వున్నా అక్కడ వుండే పవిత్ర వాతావరణ ప్రభావము చేత ప్రశాంతికెట్టి భంగమూ వాటిల్లదు. శాంతి వేదిక నుండి అనుగ్రహించు తమ దివ్యోపన్యాసములో బాబా శివరాత్రినాడు తమ గర్భము నుండి లింగము నెందుకుద్భవము చేయుదురు? అను ప్రశ్నకు వారే సమాధాన మిచ్చిరి. ''భగవత్తత్త్వమును మీరు గ్రహించలేరు. ఆ దివ్య శక్తినీ ఆ మహాత్మ్యమునూ మీరు ఇంతింత యని కొలవలేరు, అది అగమ్యము, అగోచరము. మీ మధ్యనున్నది ఆ దివ్య తత్త్వమేయని మీరు గ్రహించుట కొక నిదర్శనముగా లింగముద్భవించుచున్నది. ఇది మీకు అనుగ్రహముతో కూడుకున్న గొప్ప అదృష్టము. ఈ పాటి స్వల్పమైన మహిమలను చూచు అదృష్టమునైననూ అనుగ్రహించకున్నచో లోకములో అసూయ, ద్వేషము, క్రౌర్యమూ విజృంభించి తద్వారా సద్గుణ సంపన్నులు, నిరాడంబరులు, పుణ్యాత్ములు, అగౌరవమునకూ హింసలకూ గురి అయ్యెదరు. లింగము అనంత నిరాకార పరబ్రహ్మమునకు చిహ్నము'' అని బాబా నుడివిరి.

దూర ప్రాంతముల నుండి వచ్చిన అనేకులకు దర్శన పాదస్పర్శన, సంభాషణ భాగ్యములు ప్రసాదించుటకు శివరాత్రి యనంతరము కొన్ని రోజులు ప్రశాంతి నిలయమందు గడిపి, తరువాత బృందావన్ వెళ్ళిరి. అనంతపురం మహిళా కళాశాలను నూతనముగా నిర్మించిన విశాల కళాశాల భవనమునకు త్వరలో తరలించు ఏర్పాట్లను చేయుటలో అక్కడ బాబా నిమగ్నులైరి.

బొంబాయి సత్యసాయి సేవాసమితివారు మేనెల 11,12 తేదీలలో అఖిల భారత బాల విహార్ ఉపాధ్యాయుల సమావేశము నేర్పాటు చేసిరి. అక్కడ భక్తులు ప్రార్థించగా ఆ సందర్భమున బాబా అక్కడకు వచ్చి ఆ సభను ప్రారంభించుట కంగీకరించిరి. ఆ సమావేశమున సాయి ఆదర్శములతో రూపొందించబడిన నూతన విద్యావిధానములో సుశిక్షితులైన 404 ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందులో పాల్గొనిరి. ఒక బాలుడు 'గురుర్ బ్రహ్మ గురుర్విష్ణుః....'' అని గానము చేసిన ప్రార్థనా శ్లోకమునే ముఖ్యాంశముగా తీసుకుని బాబా తమ దివ్య సందేశములో వివరించిరి. బోధన సృజనాత్మకమైనది కాబట్టి



గురువు బ్రహ్మ, విద్యార్థికి వివేకవిజ్ఞానములందించి సంరక్షించువాడు కావున గురువు విష్ణువు, దురభ్యాసములను దుశ్చింతలను నిర్మూలించువాడు కావున గురువు మహేశ్వరుడు. గురువును మహేశ్వరుడు. గురువును స్తోత్రము చేయుటకు ఈ శ్లోకమును పఠించుట సాంప్రదాయము. అయితే బాబా ఆ శ్లోకార్థమును వివరించుటతో అందరికీ కనువిప్పు కలిగెను. ''గురువు సాక్షాత్పర బ్రహ్మ. ఎందుచేతనంటే అతడు విద్యార్థుల హృదయములందు సాధనయను బీజములను నాటి వారు బంధవిముక్తులగుటకు కావలసిన తత్వజ్ఞానము నుపదేశించును'' అన్నారు బాబా. పిల్లలలో నిద్రావస్థలో వున్న శక్తిని గుర్తించి వారికి మనోవికాసము కలుగుటకు తోడ్పడవలెను'' అని బాబా బోధించిరి.

పిల్లలకు ఆటలు వినోదముల కంటే ముఖ్యము వారిలో వుండే సహజమైన మంచి తనము, సత్య పాలన, సౌందర్య పిపాస వికసింప జేయుటకే ఈ తరగతులు నడుపబడు చుండుట చేత 'బాలవిహార్' అనుటకు బదులు 'బాలవికాస్' అని పిలుచుట ఈ ఉద్యమము నకు సముచితమనీ పేరు అట్లు మార్చమనీ బాబా ఆదేశించిరి. సభలలో, సమావేశములలో ధైర్యముగా ఉపన్యసించు తర్ఫీదును బాలబాలికలకివ్వలెననియూ, పిల్లల పలుకులను నిర్లక్ష్యము చేయు పెద్దలను సహితము ఈ పిల్లల ముద్దు మాటలలోని వివేకము, సద్భావములు సంస్కరించుననియూ బాబా పలికిరి. సినిమాలు, వాటి ప్రచారమునకు సంబంధించిన గోడల మీద అసభ్య చిత్రములూ వాటి ప్రభావమును గూర్చి ఒక బాలుడు చెప్పిన మాటలను బాబా మెచ్చుకొనిరి. సాంఘిక జీవితము నెంతవరకు ఈ సినిమాలు కలుషితము చేయుచున్నవో వివరించిరి.

ఇప్పుడు దేశమంతటా ఈ బాలవికాస్ కేంద్రములందలి బాలబాలికలు భజనలు జరుపుచున్నారు. చిన్న చిన్న కథలూ, చిత్రాలూ రచించుచున్నారు. భక్తుల పవిత్రగాథలు చదువుచున్నారు. పురాణేతి హాసములు ఉపనిషత్తులలోని ప్రబోధాత్మకమైన ఇతివృత్తముల నాధారముగా రచించిన నాటికలను ప్రదర్శించుచున్నారు. సంఘ సంస్కరణకు దోహదము చేయు ఒక మహత్తరమైన భావ విప్లవము అతివేగముగ వ్యాపిస్తున్నది.

మహారాష్ట్ర సంస్థల ప్రాంతీయ సమావేశము బొంబాయిలో మే నెలలో జరుగుట చేత బాబా వెళ్ళి ఆశీర్వదించిరి. అదే సమయమున జరిగిన గుజరాత్ రాష్ట్ర సంస్థల సమావేశమునకు బాబా తమ ఆశీస్సులను పంపుచూ ''నేను మీ సమావేశ కార్యక్రమములన్నిటినీ గమనించుచునే వున్నాను. నేను ప్రత్యక్షముగా మీ మధ్య లేకుంకోవచ్చు, నేను నిరంతర సర్వసాక్షిని'' అని వ్రాసిరి. బొంబాయి నుండి తిరిగి వచ్చుచూ మైసూరు రాష్ట్ర సంస్థల సమావేశము నందు ధార్వార్‌లో పాల్గొనిరి. రాష్ట్రమంతటి నుండి మూడు వందల మంది పైగా కార్యకర్తలచ్చట సమావేశమైరి. భక్తి విశ్వాసములను పెంపొందించుకొనుచు సంస్థల కార్యకలాపములను సక్రమముగా కొనసాగించుకొనుమని బోధించి బాబా వారందరినీ ఆశీర్వదించిరి.

''అనంతపురంలోని కళాశాల విశాల సుందర భవనము మానవాతీతమైన శక్తికి రూపకల్పన, నలభై లక్షల రూపాయల వ్యయముతో స్వల్ప వ్యవధియైన పదినెలలలో, ఒక విశ్వవిద్యాలయమునకు సరిపడు నంతటి భవనము నిర్మించబడింది. ఎవరు ఇదంతా చేసిరి? దీనికి కావలసిన ధనము ఎక్కడ నుండి సమకూరినది? దైవ శక్తిని కార్యరంగమున చూడవలె నన్న అనంతపురం కాలేజియే ప్రజలకు నిదర్శనము. ఇది మానవమాత్రుల శక్తికీ, ఊహకూ అతీతమైన కార్యము'' అన్నారు డా॥ భగవంతం. 1971వ సం॥లో జూలై 8వ తేదీన రాష్ట్రపతి శ్రీ వి.వి.గిరి ఆ కాలేజి నూతన భవనమునకు ప్రారంభోత్సవము చేసిరి. ఆ కాలేజి నిర్మాణము అంత శీఘ్రముగా పూర్తి అగుట అసంభవమను వారే అందరూ. ప్రారంభోత్సవ మునకు వారము రోజుల ముందర వచ్చిన ఒక ప్రఖ్యాత పారిశ్రామిక వేత్త ''నా సర్వ శక్తినీ, నా సిబ్బంది యావత్తును ఉపయోగించినా మరో ఆరు నెలలకు కాని ఈ కాలేజి నిర్మాణము పూర్తి కాదనుకున్నాను'' అన్నాడు.

సాయి యుగమందు వ్యక్తిగతమైన సాంఘికమైన అభివృద్ధికి ఈ కళాశాల తలమానికము వంటిది. నిర్మాణ కౌశలములో దానికదే సాటి. మానవుడు తన సహజ దివ్యతత్వమును తెలుసుకొను సాధనాక్రమమును అభివ్యక్తము చేయు సాయి చిహ్నము గోపురముపై విజయ ధ్వజమై ఎగురుచున్నది. కళాశాల భవనము మనోజ్ఞమైన సంపూర్ణ వృత్తాకారములో నిర్మించ బడినది. మతము అను అన్వేషణ యొక్క సాఫల్యమునకు, ఆద్యంతములు లేని పరబ్రహ్మ స్వరూపమునకు వృత్తము సాంకేతికము. అందు భారతీయ సంస్కృతి యొక్క పరిమళము, సనాతన ధర్మవాణియొక్క ప్రతిధ్వని అలరారుచున్నవి. ఆకాశము నంటుచున్నదా యన్నంత ఎత్తున గోపురముపై వికసించిన పెద్ద పద్మము ప్రతిష్ఠితమై వున్నది. అరుణ కిరణములు సోకగనే వికసించు పద్మము జ్ఞానముతో వికసించు హృదయమునకు చిహ్నము. గోపురముపై నున్న గడియారము కాలేజి యొక్క దైనందిన చర్యలు సక్రమముగా జరుగునట్లు పరిరక్షించుచూ పర్యవేక్షించు చుండును. బాబా సంకల్పమునకు రూపకల్పన చేయు శిల్పు లెంతోమంది చుట్టూ వున్ననూ సంకల్ప సిద్ధులైన బాబాయే పరమోత్తమ శిల్పి.

హృదయము నుండి పైకెగసివచ్చు ప్రార్థన యొక్క రూపాంతరమే ఈ కాలేజి భవనము. ఈ భవనము సర్వశ్రేయోదాతను స్తుతించుచూ, చలువరాయి, యిటుక, కాంతులతో రచించిన మధుర కావ్యము.

ప్రారంభోత్సవ దినమున అంతర్జాతీయ ప్రముఖులెందరో పాల్గొని యుండగా ఆ సమూహ మొక నక్షత్ర మండలివలె శోభిల్లియుండెను. రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరి, వారి సతీమణి శ్రీమతి సరస్వతీగిరి, మైసూరు గవర్నరు శ్రీ ధర్మవీర, గోవా గవర్నరు శ్రీ నకులసేన్, ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి, మంత్రులు శ్రీ పి.వి. నరసింహారావు, శ్రీ లక్ష్మీనరసయ్య, శ్రీ వెంకన్నగార్లు, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డా॥ జగన్నాధరెడ్డి, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన డా॥ సూరి భగవంతం, డా॥ వి.కె. గోకాక్ మొదలయినవారి సమూహము, అధికారము, ప్రావీణ్యము, దేశభక్తి, త్యాగము వంటి వివిధ రంగముల నుండి ఏరికూర్చిన పుష్పగుచ్ఛములవలె నుండెను.



ఇక అన్నిటికీ మించిన అతి ప్రధానమైన ఆకర్షణ బాబా. నవవికసిత పుష్పము వలె కరుణారసభరిత మృధుమధుర మందహాసముతో నాటి ఉదయ భానుని కాంతిని ద్విగుణీకృతము చేయుచున్న బాబాను చూచుటకు వేయకళ్ళు చాలవు.

కర్నాటక యూనివర్సిటికీ మాజి వైస్‌ఛాన్సలర్, సిమ్లాలో వున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్స్‌డ్ స్టడీస్ యొక్క డైరెక్టరూ అయిన డా॥ గోకాక్ ముఖ్య అతిధుల నందరినీ స్వాగతించి ఆ నూతన శకారంభ శుభ ఘడియ యొక్క ప్రభావమును విశదీకరించిరి. ''ఈ కళాశాల, ఇక ముందు ప్రతి రాష్ట్రమందూ బాబా నెలకొల్ప సంకల్పించిన కళాశాలలు భారతీయ సంస్కృతి యొక్క నిర్మలత్వ మును, ప్రభావ వైభవములను ప్రబోధించగలవు. ఈ కళాశాలలు విజ్ఞానమును, పాండిత్యమును అభివృద్ధి చేయుటయేకాక, అంతర్ దృష్టిని, సర్వులయందూ సమభావమును, సర్వమత సామరస్యమును పెంపొందించి అనేకత్వములోని ఏకత్వమైన సత్యమును తేటతెల్లము చేయగలవు.'' భారత ప్రభుత్వమునకు సైంటిఫిక్ ఎడ్వైజర్‌గానూ, ఉస్మానియా యూనివర్సిటీకి మాజీ వైస్‌ఛాన్స్‌లర్ గానూ వున్న డా॥ భగవంతం ''ప్రారంభ దినమునకే సర్వసదుపాయములతోనూ, సర్వాంగ సమన్వితమై, అపురూప సౌందర్య శోభితమైన ఇట్టి కళాశాల చరిత్రలో సాటిలేనిది'' అన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయిన డా॥ జగన్నాధరెడ్డిగారు ఈ కాలేజి గత మూడు సంవత్సరములలోను గాంచిన అభివృద్ధిని గురించి వివరించిరి. ''ఆంధ్ర దేశమునకు భారత సంస్కృతికి ఇది చిరస్మరణీయమైన పర్వదినము'' అన్నారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు. ''బాబా స్థాపించిన ఈ మహిళా కళాశాల అన్ని కళాశాలల వంటిది కాదు. ఇది విద్యార్థులకు, విద్యావేత్తలకు కూడా ఆదర్శమైన నమూనా. ఇది ఒక పాఠము; ఇది ఒక మార్గదర్శి'' అన్నారు విద్యాశాఖా మాత్యులు శ్రీ నరసింహారావుగారు. స్త్రీకి ఆదర్శమైన విద్య అందుతుందన్నారు శ్రీ ధర్మవీర. బాబా లక్షలాదిమందికి ఆధ్యాత్మిక ప్రబోధనతోపాటు సక్రమమైన విద్యా విధానమును ప్రసాదించుట శుభదాయకమన్నారు శ్రీ గిరి.

1971 జూలై 8వ తేదీ గురుపూర్ణిమ. ఆది గురువైన వేదవ్యాసునకంకితమైన పర్వదినము. సాధకులు వారి వారి ఆధ్యాత్మికోపదేశకులను పూజించు రోజు. ఇది లక్షలాదిమంది బాబాను దర్శించగోరు పవిత్ర దినము, ప్రాచీన భారతీయ గురుశిష్య సంబంధమును పునరుద్ధరించుటకో అనునట్లు ఈ కళాశాల ప్రారంభో త్సవము గురుపూర్ణిమ నాడు జరుపుటకు గదా సంకల్పించిరి.

''మానవుని ప్రధాన వాంఛ భగవంతుని సాక్షాత్కరించుకొనుట దైవ లక్షణ ములైన సత్య ధర్మశాంతి ప్రేమల నభివృద్ధి పరచుకొనుట అయిననూ భూగర్భము నుండి

బయల్వెడలిన లావావలె నీచ వాంఛలు పెల్లుబికి మానవుని దహించి వేస్తున్నవి. మానవుని అంతర్యములో ఆనందము, శాంతి, ప్రేమ, ధైర్యము లనెడి అవ్యయమైన నిధి వున్నది. వీటిని ఆచరణ సాధనల ద్వారా అనుభవము లోనికి తెచ్చుకొను ప్రయత్నము చెయ్యండి. అప్పుడే విద్యావంతులైన స్త్రీ- పురుషులు జీవితాంతము శాంతిభద్రతలతో మనగలరు'' అని బాబా బోధించిరి.

''భారతదేశ మీనాడు ఆకాశము నందుకొను భవనములతో, నిల్వ చేసిన ఆహారములతో, రేడియో, టెలివిజన్ మొదలయిన యంత్రములతో భోగ భూమిగా తయారగుచున్నది. భారతీయులు అనుకరుణకు బానిసలై క్రమశిక్షణా రహితులై నిర్లక్ష్యమైన మూకగా తయారగుచున్నారు. వేరులు లేని మొక్కల వలె వారు ఇతర దేశముల జీవన విధానమును పట్టుకుని ప్రాకులాడుచున్నారు. ఇది భారతీయ సాంప్రదాయమునకే అవమానము, చరిత్ర పట్ల ద్రోహము. పవిత్రమైన కాలమును, కాయమును వృధా చేయుచూ భ్రష్టులగుచున్నారు. అందుకే గురుకులము వంటి ఈ కళాశాలను, గురువారము నాడు గురు పూర్ణిమ పర్వదినమున ప్రారంభించ సంకల్పించితిని'' అని బాబా ప్రకటించిరి. ఉపన్యాసాంతమున ''విత్తనము నాటబడినది. అది అంకురించి పెరిగి మహా వృక్షమై దరిచేరిన వారందరికి నీడ, రక్షణ, ఫలము అందిస్తుంది'' అని ఆశీర్వదించిరి.

బాబా ఆశీస్సులతో ప్రారంభమైన విద్యాసంస్థలలో అనుకరణ పోటీ, బలత్కారములకు తావు లేదు. పరస్పర ప్రేమ సహకారములతో నిర్మితమగు నూతన సాంఘిక వ్యవస్థ కిది ఆధారము కాగలదని ఆశిస్తూ ఎదురు చూచెదము గాక!



# ఏ నామమైననేమి!

బాబాను ఆరాధించే లక్షలాది ప్రజలు బాబాను గూర్చి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అను నామముతోనే వ్యవహరించెదరు. తన 14వ యేట 1940 సం॥ మే 23వ తేదీన తానే సాయిబాబాయని వారు ప్రకటించిరి. ఆ సమయమున వారి తండ్రిగారు నిలబెట్టి యడుగగా తాను అసంఖ్యాకముగాగల భక్తుల అనుగ్రహించవలెననియూ, అసంపూర్తిగా నున్న కార్యములను పూర్తి చేయవలెననియూ బాబా చెప్పిరి. తల్లిదండ్రులు పెట్టిన పేరు సత్యనారాయణ; వంశాచారముగా వచ్చిన ఉపనామము 'రాజు' ఈ నామము 'సత్య'గా మారినది. ఆ పేరుతోనే బాల్యమున ఇంటా బయటా పిలుచుచుండెడివారు. తరువాత వారు ప్రకటించిన సాయిబాబాయను నామమునకు ఈ 'సత్య' చేర్చబడినది. ఆ నామము స్వీకరించిన ఐదారు సంవత్సరములకు భక్తులందరు వారిని షిర్డి సాయిబాబా అవతారముగా విశ్వసింపజొచ్చిరి. అయిననూ షిర్డి బాబాను కొలిచెడి భక్తులను ఈ నామముతో కలవరపరచలేదు. హిందీ మరాఠీ భాషలలో 'బాబా' అను పదమును ఋషిసత్తములను సంబోధించినప్పుడు వాడెదరు. బాబా అనగా తండ్రియని యర్థము. యువకుడుగా షిర్డి ప్రవేశించిన బాబాను ఖండోబా దేవాలయములోని పూజారి ఆనాడు 'సాయి' అని సంబోధించెను. 'సాయి అనగా యజమాని అని అర్థము. 'స్వామి' అను సంస్కృత పదము నుండి ఉద్భవించినదే ఈ 'సాయి' అను పదము.

దేవతలు, పవిత్ర గ్రంథములు, ప్రఖ్యాత పురుషుల నామముల ముందు 'శ్రీ' చేర్చుట అనాదిగా వచ్చు సాంప్రదాయము. 'శ్రీ' అనగా శుభకరమైనదని అర్థము, ఈనాడు 'శ్రీ' అనునది సర్వజనులకు వాడుట ఒక డంబాచారమైనది. మఠముల యొక్కయూ, ఆశ్రమముల యొక్కయూ అధిపతుల నామముల ముందు వరుసగా 108 శ్రీల వరకూ తగిలించుచున్నారు.

ఐశ్వర్యము, ధైర్యము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము ఇవియన్నియు భగవత్శబ్దమునకు సంస్కృతమున చెప్పబడిన అర్థములే.

బాబా ఐశ్వర్యము లేదా అధికారము స్వయం విదితమైనదే. డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, కళాకారులు, వైజ్ఞానికులు ఆయా రంగములలో నిష్ణాతులైన వారికే వారి వారి లోపములను తెలియజెప్పి సంస్కరించగల అనంత జ్ఞాని బాబా. వారెక్కడికి వెళ్ళిననూ యశశ్రీలు వాటికి అవే వారిని వెంటాడి వచ్చును. ఇక ధైర్యజ్ఞాన వైరాగ్యములు మూర్తీభవించిన స్వరూపము బాబా. 1963వ సంవత్సరమున బొంబాయిలో జరిగిన సత్యసాయి సంస్థల ప్రపంచ మహాసభలో బాబా ఈ విధముగా ప్రకటించిరి. ''గత అవతారమున ప్రజలు చూపిన వినయ విధేయతలకు భక్తి ప్రపత్తులకు కారణము వారందరూ ఆ యవతారములో చూచిన మానవాతీత శక్తులు, వారు పొందిన భయాశ్చర్యము లతో

కూడిన అనుభవములు. ఈ సత్యసాయి అవతారమునకీ ఉపాంగములన్నీ సహజముగా వున్నవే. అయితే ఈ అవతారమునకు ముఖ్యమైన అంగము ప్రేమ. అందుకే నాస్తికత్వము, అనాత్మవాదము, ఉన్నత విలువలపట్ల అలక్ష్య వైఖరి, పెద్దల యెడల అవిధేయత ప్రబలిన ఈనాడు సత్యసాయి అవతారము లక్షలాది భక్తజనుల ప్రేమారాధనలను పొందుచున్నది.'' తమ దివ్య ప్రేమ సందేశమును అవిశ్వాస శూన్యవాదుల వద్దకు సయితము కొనిపోవుటయే ఈ యవతారము యొక్క ప్రత్యేక లక్ష్యము. అంధకార బంధురమైన హృదయ కుహరములోనికి వెలుగు చొచ్చుకొని వెళ్ళునట్లుగా చేయుచూ, ప్రేమ జ్ఞానములతో సర్వదా నిండియున్న నిశ్చల తటాకమువలె వుండి దూషణ భూషణలయడల నిరాసక్తుడగుటయే ఈ అవతారము యొక్క ముఖ్య లక్షణము.

ఇరవై సంవత్సరముల ప్రాయములో ఒకసారి తన అన్నగారికి వ్రాసిన లేఖలో తనకొక వూరుకాని పేరుకాని ప్రత్యేకముగా లేవనియూ అన్ని వూర్లు అన్ని పేర్లూ తనవేననియు బాబా వివరించిరి. వాంఛా రాహిత్యమునకు మహోన్నత ఉదాహరణ అయినటువంటి బాబాకు ఒకే ఒక కోరిక గలదు. అజ్ఞానాంధకారములో న్ను ఈ ప్రపంచము నుద్ధరించుటయే ఆ కోరిక. అందులకే ఈ అవతారము. ప్రాథమికమైన షడ్ రహస్యములను స్వాధీన మందుంచుకొనిన వారిని శాస్త్రములు భగవంతునిగా నిర్ణయించుచున్నవి.

ఉత్పత్తించ వినాశంచ
భూతానాం ఆగతిం గతిం
వేత్తి విద్యాం అవిద్యాం చ
సవాత్స్య భగవాన్ ఇతి.

సకల ప్రాణుల యొక్క సృష్టిలయముల రహస్యములను, వాటి వినాశోద్ధరణ రహస్యమును, వాటి జ్ఞానాజ్ఞాన రహస్యమును ఎవరెరుగుదురో వారే భగవంతుడని తెలుసుకొనవలెను.

ఈ వర్ణన సంపూర్ణముగా బాబాకు అన్వయించు న్న విషయము అందరికీ తెలిసినదే. ఆర్నాల్డ్ షల్మన్‌తో బాబా ఈ విధముగా చెప్పిరి. ''నాకు నీ భూత భవిష్యత్తులు తెలుసు. నీవెందుకు బాధ పడుచున్నది, ఈ బాధ నుండి నీకెప్పుడు విముక్తి లభించెడిది, పూర్తిగా ఎప్పుడు విముక్తుడయ్యెడిది నాకు తెలుసు. ప్రతి ఒక్కరి విషయములోను గతములో జరిగినది, వర్తమానములో జరుగుచున్నది నాకు తెలుసు. ప్రతి వ్యక్తి ఈ జన్మలో ఎందుకు బాధపడుచున్నది మరుసటి జన్మలో ఈ బాధ కారణముగా ఏమి జరుగనున్నది నాకు తెలుసు.'' బొంబాయిలోని పటేల్ స్టేడియంలో ప్రజాసముద్రము మధ్య ప్రసంగిస్తూ ''అందరి కష్టసుఖములు నాకు తెలుసు. దానికి కారణము నేను అందరిలోనూ వుండటయే. ఈ సాయి అను కరెంటు ప్రతివ్యక్తి అనే బల్బులోనూ ప్రవహిస్తు న్నది. ప్రతి హృదయములోను నేను ప్రకాశిస్తున్నాను. మీ అందరి హృదయములలోనూ వున్న చైతన్య



శక్తిని నేనే'' అని బాబా ప్రకటించిరి. బాబా అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో ''చతుర్దశ భువనములు ఏకమైనా ఈ శరీరము ధరించిన నేను చేయ సంకల్పించిన కార్యమున కవరోధము కలుగజాలదు. నా సంకల్పము నిర్వికల్పము. నేను చేపట్టిన కార్యమునకు ఎట్టి జాప్యమూ నష్టమూ సంభవించవు'' అని పలికిరి. 1965లో ప్రశాంతి నిలయ మందు జరిగిన ఒక సభలో ''ఏ అవతారమూ ఈ విధముగా చేయలేదు. గ్రామసీమలలోని ప్రజల మధ్యకు వెళ్ళుట, నిద్రావస్థలో వున్న వారిని మేల్కొల్పుట, స్తబ్దులైనవారిని ఉత్తేజపరుచుట, ఆపదలో వున్నవారిని కాపాడుట, లక్షలాదిమందికి అనుగ్రహము ప్రసాదించుట, సత్యధర్మ శాంతిప్రేమ పథము లలో నడిపించుట, ముందెన్నడూ జరుగలేదు. నేను గురువును కాను, దైవము కాను, నేను సముద్రమును, మీరందలి అలలు. మీరే నేను. మీరు గమ్యమును చేరునప్పుడు, ఈ సత్యమును గ్రహించ గలరు'' అని ఉద్ఘాటించెను. ''నేను చేయు పనులు గారడికాదు, మాయకాదు; మంత్రము కాదు; తంత్రము కాదు; ఇది వాస్తవమైన దైవశక్తి. ఈ దివ్యతత్త్వము అల్పజ్ఞులకు అర్థము కాదు. మాయతో వారి కన్నులు మూయబడి వుండుటచేత భగవత్తత్త్వమును వారు గుర్తించలేరు. అందుచేత ఈ శక్తిని వారు హేళన చేయుదురు; దూషింతురు. దైవశక్తికి అతీతమైన దేదీలేదు. ఇది తరుగునవది కాదు. అన్ని శరీరములవలె నేను ధరించిన ఈ శరీరము అశాశ్వతమే అయినప్పటికీ నా సంకల్పమూ నా చర్యలూ శాశ్వతములు'' అని 1970 క్రిస్ట్‌మస్‌నాడు ధర్మక్షేత్రమున ప్రకటించి భక్తుల కండ్లు తెరపించిరి.

1963 దసరా ఉత్సవ సందర్భములో ''మరణమునకు సిద్ధముగా వున్న వ్యక్తి నాలో లీనమగుటకు ప్రార్థించుచుండగా వాని బంధువులు అతనిని బ్రతికించ మని ప్రార్థించెదరు. ఈ రెండు అంశములను గమనించుచుందును. వ్యక్తుల భూత వర్తమానములు, నేరము శక్తి, ఘనత, బహుమానములు నాకు తెలుసు. నా అనుగ్రహశక్తితో ధర్మబద్ధముగా వ్యక్తుల భవిష్యత్తులలో వారికి విధించబడిన శిక్షలను నేను ఒక్కొక్కప్పుడు మార్చుచుందును. ఒకరి జననముకాని ఒకరి మరణము కాని నన్ను చలింపజేయవు. నిర్వికార పరమానందమే నా స్వభావము'' అని బాబా పలికిరి.

'భగవాన్' అనగా పరమాత్మ స్వరూపుడని అర్థము. విష్ణు పురాణములో 'భ' అను అక్షరమునకు విశ్వకర్త లేక భర్త అనీ 'గ' అను శబ్దమునకు అధి నాయకుడు లేక మార్గదర్శియనీ 'వ' శబ్దమునకు సర్వభూతాంతరాత్మయని అర్థములు చెప్పబడినవి. షిరిడీ బాబా జీవిత చరిత్రను వ్రాసిన గుణాజి (103పే) ''బాబా తాను సర్వాంతర్యామిననీ, పంచభూతములందు తానున్నాననీ (155 పే) ''నేను నిరంతరము సర్వత్రా వుందును. నాకు రూపము లేదు. నేను ప్రవేశించుటకు ద్వారమవసరము లేదు'' అని చెప్పినట్లు పేర్కొనిరి. ఈ ప్రస్తుత అవతారమునందు కూడా స్వామి అభేదానందను అనుగ్రహించి ఆయనలో దివ్యతేజము వెలుగొదించుటకు, బాబా రమణమహర్షి ఆశ్రమములో నున్న గదికి గడియ వేసియున్నప్పటికి అందు ప్రవేశించిరి. అదేవిధముగా బెంగుళూరు లో వున్న

హాస్పిటల్‌లో భక్తునికి ఆపరేషన్ జరుగుచుండగా, ఆపరేషను గది గడియ వేసివున్నప్పటికి లోపల ప్రవేశించి అతనిని ఆశీర్వదించిరి.

ప్రాచీన సంస్కృత గ్రంథములలో భగవాన్ అను పదమునకు మరికొన్ని నిర్వచనమును కలవు. 'శరణాగతిగద్య'లో ఈ విధముగా చెప్పబడివున్నది. భగవంతుడు అనంత ఆనందస్వరూపుడు. ఆ అనందము సకల జీవకోటికి వెలుగును ప్రసాదించును. గద్యలో యింకా యిట్లు వివరింపబడినది; భగవాన్ అసాధారణ జ్ఞాననిధి. ప్రకృతి రహస్యములన్నిటిని తెలుసుకుని ప్రకృతి శక్తులను తన ఆధీనములో ఉంచుకొనగల్గును. అతనియందు శక్తి, సౌందర్యము, మాతృవాత్సల్యము, కరుణ, ఔదార్యము, ధైర్యము, ఉత్సాహము, ప్రావీణ్యము, సత్యము. నిశ్చలత మొదలయిన సద్గుణములు మూర్తీభవించియుండును. డా॥ గోకాక్ అనేక పర్యాయములు బాబాను గూర్చి ఈ విధముగా చెప్పి యుండెను. ''బాబా సర్వశక్తి సమన్వితులు. వారు పాఠశాలలో చదువుకున్నది అత్యల్పమైన దైననూ, వారి పాండిత్య ప్రావీణ్యములు అనూహ్యములు, అమోఘములు, అణుశాస్త్రము, వేదమంత్రములు, వైద్యవిజ్ఞాన శాస్త్రము, తాంత్రిక విద్యల యందలి క్లిష్టమైన అంశములు సహితము వారికి కరతలా మలకములు. అవతార పురుషులకు, యోగులకు భేదము **తెలియజేయునవీ** మహత్తరశక్తులే.''

భగద్గీతోపన్యాసములు అను తమ గ్రంథములో అరవిందో **ఇట్లు** చెప్పిరి. ''ప్రతి అవతార పురుషుడు మానవులకు సద్వర్తనలో తానే మార్గదర్శియై వారిని నడిపింపవలెను. శ్రీ కృష్ణుడు, క్రీస్తు, బుద్ధుడు నరాకారమున జన్మించి మార్గదర్శకులై మానవాళిని సంస్కరించిరి. మానవ దైవతత్వముల సమ్మిళితమే అవతారము. నరాకారమును స్వీకరించిన దైవమే అవతారము. పరిమితమైన మానవశక్తితో దివ్యమైన కార్యములు చేయుటలో మానవులు సాధనములు కాగలరని నిరూపించుటయే అవతారము యొక్క లక్ష్యము.''

ఈ సందర్భము ఘల్మన్‌తో బాబా చెప్పిన మాటలు స్ఫురణ యందుంచు కొనవలెను. ''చతుర్భుజములతో నారాయణుని రూపమున నేనవతరించి వుంటే నన్ను సర్కస్‌లో పెట్టి ప్రదర్శించి డబ్బు చేసుకుని వుందురు. అందరివలె సాధారణ మానవునిగా **వుండివుంటే** నేను చెప్పెడిది ఎవరు వింటారు! అందుచేత మానవ రూపములో మానవాతీతమైన శక్తి జ్ఞానములతో అవతరించినాను.''

1971 జన్మదినోత్సవ సందర్భములో బాబా అవతార తత్వమును గూర్చి వివరించిరి. ''మీరందరూ అవతారులే. రక్తమాంసములతో కూడిన ఈ శరీరమును కవచమును ధరించిన దివ్యతత్వములే. అయితే అది మీకు తెలియదు. జన్మాంతర కర్మల ఫలితముగా ఈ శరీరములలో మీరవతరించేరు. అయితే నేను నా సంకల్పముతో ఈ శరీరము స్వీకరించినాను. మీరు మీ శరీరములతో త్రిగుణములను త్రాళ్ళతో బంధింపబడ్డారు. నేను గుణాతీతుడను; బంధరహితుడను. మీరు కోరికలతో ఇటూ అటూ చలిస్తారు. మిమ్మల్ని కోరికలు లేని



నిశ్చల స్వభావులను చేయవలెనని కోరిక తప్ప నాకు కోరికలులేవు.''

కాలకారణ వ్యవధానములను శృంఖలములచేత బంధించబడిన దైవత్వమే మానవుడు. అందుకే బాబా ''నీవు నీ ఆత్మతత్వమును ప్రకటించిన క్షణమందే నీవు భగవంతుడవయ్యెదవు. మీరు ప్రతి ఒక్కరూ ప్రత్యగాత్మను పరమాత్మలో లీనము చేయగలిగినపుడు భగవత్స్వరూపులగుదురు'' అని చెప్పుచుందురు.

కాలకారణ వ్యవధానములను శృంఖలములచేత బంధించబడిన దైవత్వమే మానవుడు. అందుకే బాబా ''నీవు నీ ఆత్మతత్వమును **ప్రకటించిన** క్షణమందే నీవు **భగవంతుడవయ్యెదవు**. మీరు ప్రతి ఒక్కరూ ప్రత్యగాత్మను పరమాత్మలో లీనము చేయగలిగినపుడు భగవత్స్వరూపులగుదురు''. అని చెప్పుచుందురు.

అవతరణ అను మాటకు దిగివచ్చుట అని అర్థము. మానవాళిని ఉన్నత స్థితికి గొనిపోవుటకై అపరిమిత తత్వము తనకు తానుగా తనకు పరిమితిని విధించుకొనుటయే అవతరణ. కొన్ని సంవత్సరముల క్రితము శివరాత్రి పండుగనాడు ఉపన్యాస ప్రారంభమున స్వయముగా రచించిన పద్యమును చదివిరి. ఈ పద్యము నందు పుట్టపర్తి అవతారము యొక్క లక్ష్యములను వివరించిరి. దాని తాత్పర్యమిది; 'సర్వాంతర్యామియైన వాసుదేవుని శరీరముతో కలియుగమున ధర్మ మార్గమును చూపించుటకు, పేరాస ద్వేషముల నుండి తొలగించుటకు, బాధా అవమానముల నుండి సాధుసత్పురుషులను రక్షించుటకు, ప్రాచీన వేదాంత గ్రంథములలో దాగి యున్న జ్ఞానసారమును బయట పెట్టుటకు. అల్పుల ఆర్భాటములను అణచివేయుటకు,మానవజాతి **కిచ్చిన** వాగ్దానము చెల్లించుటకు, ఈ కలియుగమునకు సత్యమును ప్రబోధించుటకు, పుట్టపర్తి యందు ఈ రూపమున అవతరించిని.

పీడిత మానవలోకమునకు బాబా ఇచ్చు సందేశము ఇది. ''నేనిక్కడ వుండగా మీకు భయమెందుకు? బాధలతో వుండువారందరూ నావద్దకు రండు'' మనము బాబా వైపు ఒక అడుగు వేస్తే బాబా మన వైపు పది అడుగులు వేసెదనని హామీ యిచ్చిరి. ఆర్తితో మనము ఎలుగెత్తి పిలిచినపుడు మన మాటలు బాబా ఆలకింతురు. భగవద్గీతలో ''దైవమును చేరుటకు గాఢమైన వాంఛ మనలో వున్నప్పుడు, భగవంతుని కరచరణములు, నయనములు, కర్ణములు, జిహ్వ, శిరస్సు, సర్వత్రా వుండి మనకు సహాయము, రక్షణ అందించును'' అని చెప్పబడి వున్నది. ఈ లోకములోని మానవుల వలెనే అవతార పురుషుడు కూడా పంచేంద్రియముల మనస్సు, విచక్షణ, ఉద్రేకము, అహంకారము కలిగి వుండును. ఇవి కాక అవతార పురుషునకు సృష్టి, స్థితి, లయములపై అధికారము, 'తిరోధన' అనగా వస్తువులను అదృశ్యము చేయు శక్తి వుండును. అతని అనుగ్రహము రెండు రకములు; పాత్రులైన వారిపై ప్రసరించునది, యోగ్యతతో నిమిత్తము లేకుండా ప్రసరించునది. తన నామ మెక్కడ స్మరించబడునో, తన రూప మెక్కడ పూజింపబడునో అక్కడ తప్పక వేచి యుండును.

ప్రపంచమున అనేక చోట్ల బాబా పటముల నుండి విభూతి రాలుట చూచుచున్నాము. ''మా గృహమున భగవాన్ సత్యసాయి బాబా యొక్క పటములతో, ధ్యానమునకు ఒక గదిని అలంకరించితిమి, రాత్రి నిదురించుటకు ముందు అక్కడ కూర్చుని ధ్యానము చేసుకొనెదను సాయిభక్తలు యిక్కడికి వచ్చి తరచు ప్రార్థనలు సలిపెదరు. ప్రతి రాత్రి విభూతి ఆవిర్భవించునేమోనని మేము ఎదురు చూచుచుంటిమి. అట్లేమీ జరుగలేదు. ఒక నెల క్రిందట బాబా భక్తులైన మా స్నేహితులు కొందరు మాతో ఆ గదిలో ప్రార్థన చేయుటకు వచ్చిరి. అప్పుడా గది యంతయూ సుగంధ పరిమళముతో నిండి పోయినది. బాబా మా కనుగ్రహించిన వరములలో ఇది యొకటి. గదిలో సువాసనకు మా స్నేహితులు ఆశ్చర్యపడిరి.

''మే మందరము ఒక చిన్న వేదికపై బాబా పటమును వుంచి భజన చేయుచుండగా బాబా పెద్ద వర్ణ చిత్రము నుండి ఎనిమిది కిరణములు గల ఇంద్ర నీలమణి (Saphire) బాబా కంఠము వద్ద వజ్ర హారమువలె ప్రత్యక్షమైనది. ఈ వార్త వాయు వేగముతో వ్యాపించి సాయి భక్తులెందరో వచ్చి భగవానుని లీలను చూచి ఆనందించిరి'' అని అమెరికా, ఆరెంజ్ కైంటిలో వున్న కోవన్ తెలియ బరచెను.

ఇండియా, అమెరికా, ఆఫ్రికా, సిలోన్ మొదలయిన దేశములలో ఎన్నో వేల గృహములందు సామాజిక ప్రార్థనా మందిరములలో బాబా పటముల నుండి సర్వరోగ నివారిణియైన విభూతి రాలునట్లు అనుగ్రహించిరి. కోవన్ గృహమందు జరిగిన ఈ లీలను చూచి, హాలీవుడ్‌లో వున్న ఫిల్మ్ రచయిత జోయిర్ రియార్డిన్ ఇట్లు తెలియజేసెను. ''కోవన్స్ దంపతుల యింటిలో పటము నుండి విభూతి రాలుచున్నదని చెప్పి నా భార్య వెళ్ళిపోతూ అణుచుకో లేనంత కుతూహలమును నాలో ఆమె కలిగించింది. నిజా నిజములు పరీక్షించు ఉద్దేశ్యముతో ఆదివారం ఉదయము జాన్ హిస్లాప్ దంపతులు వెళ్ళుచున్న కారును వెంబడించి, ఆ ఇంటికి వెళ్ళితిని. మా ఇంటికి మూడు మైళ్ళ దూరంలో చర్చి వున్నది, అక్కడికి నేనెప్పుడూ పోలేదు. ఇప్పుడు నేనెక్కడికి వెడుతున్నాను, ఏమిటి ఈ భ్రమ, అనే సంకోచము నన్ను వెంటాడినది.

''అక్కడ అందరూ సమావేశమై కొంత సేపు రాగతాళ యుక్తముగ భజన చేసిరి. తరువాత, తపాల బిళ్ళ అంటించిన ఉత్తర మొకటి, బాబా వ్రాసినది, టపాలో వచ్చిన వింతను గురించి హిస్లప్ ఉపన్యసించేడు, తపాలా బిళ్ళ ఊడిపోయి పోస్టుమాన్ సంచిలో పడిపోయి వుండవచ్చు. ఇంతకీ నా మనస్సంతా ఆ పటము మీదే వున్నది ఆ పటమెక్కడ వున్నదో చూడదలచేను. ఒక చిన్న దేవాలయమువలె నున్న ప్రార్థన గదిలో మేము వెళ్ళితిమి. ఇతరులు నన్ను గమనించియే యుందురు కాని, నేను ఎవరికీ కనపడకుండా వుండునట్లు ప్రయత్నించి ఆ పటము అన్ని ప్రక్కలూ, పై నుండి క్రిందికి, వెనుక నుండి ముందునుండి పరీక్షించితిని. బూటు లేసు ముడి వేసుకొనుచున్నట్లు నటించి, క్రిందికి వొంగి అడుగున



యేమైన వున్నదేమోనని పరీక్షించితిని. కోవన్ భార్య ఇద్దరు బాలురతో గుసగుసలాడుట, ఆ ముగ్గురూ నా వైపు అనుమానాస్పదముగా చూచుచుండుట గమనించితిని. తప్పుచేసిన వానివలె అక్కడినుండి వెళ్ళి పోయినాను.''

నాడి గ్రంధములను పేరతో దక్షిణాదిని, భృగు సంహిత పేరుతో ఉత్తరాదిని జ్యోతిష శాస్త్ర గ్రంథములు చాలా కాలముగా ప్రసిద్ధి కెక్కినవి. వాటియందు అనేకుల జాతకములు వివరింపబడినవి. వాటిలో ఎందరివో విదేశీయుల జాతక వివరములు కూడా నున్నవి. డా॥ కె.యం. మున్షి శ్రీమతి లీలావతి మున్షీని ఎప్పుడు ఎక్కడ వివాహము చేసుకొనునది అందు తెలుపబడినది. ఈ జాతక వివరములన్నీ కొన్ని వేల యేండ్ల క్రితము తాటియాకు గ్రంథములో వ్రాయబడి వుండెను. హర్యానా మాజీ ముఖ్యమంత్రి శ్రీ శర్మను గురించి, భృగు సంహితలో, అతడు ప్రశాంతి నిలయములో మానవ రూపమున వున్న భగవంతుని దర్శించగలడు అని వ్రాయబడి వున్నది. బాబా అతనికి అనుగ్రహ పూర్వకముగా నటరాజ ప్రతిమను ఇచ్చిరి. అతడు దానిని ఎల్లప్పుడు ధరించు చుండును. ఆ జ్యోతిష గ్రంథములో బాబాను గురించి ''సర్వలోకములకు తండ్రి, క్షణములో వ్యాధులను కుదుర్చు మహత్తరమైన వైద్యుడు, మహోన్నత విద్యను ప్రసాదించుటకు విద్యాలయములు వైద్యశాలలనూ స్థాపించువాడు'' అని వర్ణించబడి యుండెను.

1967 నవంబరు 4వ తేదీన, శ్రీ జె.పి.మారూ, దైవమును ప్రత్యక్షముగా దర్శించును, అని భృగుసంహితలో వున్నది. అదే తేదీన బాబా 'ఉషా కిరణ్' అను పేరుతో బొంబాయిలో వున్న మారూ గృహమునకు వెళ్ళి వారి నను గ్రహించిరి.

1970 జూన్ మాసములో శాన్‌ఫ్రాన్సిస్కో నుండి, సిలోన్ నుండి వచ్చిన భక్తులతో వైట్ ఫీల్డ్‌లోని బృందావన్‌లో సంభాషించు సందర్భమున ఆత్మ పరమాత్మల పరస్పర సంబంధమును వివరించిరి. ప్రత్యగాత్మ పరమాత్మలో లీనముగట కెంత ఆతురతతో వుంటుందో అంత ఆతురతతోనూ పరమాత్మ తనలో ప్రత్యగాత్మను విలీనము కావలెనని కోరుతుంది. దీనిని విశదపరచుటకు సున్నపురాయి గుహలలో పై నుండి క్రిందికి వ్రేలాడు స్టెలక్మైట్‌కి క్రింద నుండి ఊర్ధ్వముఖముగా చూచుచున్నట్లు పైకి ఎగసి యుండెడి స్టెలక్మైట్‌కి గల పరస్మర సంబంధముతో పోల్చిరి. ఈ రెండూ ఒకే పదార్థము యొక్క రూపాంతర **ములే.** పైనున్న స్టెలక్మైట్ నుండి ద్రవించిన బిందువు క్రిందపడి ఘనీభవించి స్టెలక్మైట్‌గా మారుతుంది. ఇంతటితో తృప్తి చెందక దీనినే ప్రత్యక్షమానముతో బోధపరచుటకు బాబా హస్తచాలనముతో ఒక నల్లని రాయిని సృష్టించిరి. అది గుండ్రముగా వుండి పైన క్రింద కొంత భాగము చదునుగా వున్నది. చాలా బరువుగా వున్నది. అది బాబా చేతిలోకి వచ్చు సమయమున జూంయ్‌మని మృదువైన శబ్దం వినబడి దాని బరువు తాకిడికి బాబా చెయ్యి అదిరినట్లు కనబడినది. ఆ రాయి నున్నగా వుండి మెరుస్తున్నది. బాబా దానిని ఎత్తి పట్టుకుని దాని ఉపరితలము మీద నోటితో ఊదిరి. ఒక దాని నొకటి ఛేదించుకొను

రెండు వృత్తాకారముల మధ్య రంధ్రము ఏర్పడెను. దాని సహాయముతో ఆత్మ పరమాత్మల విలీన విధానమును బోధించి పిదప ఆ అద్భుత శిలను అక్కడ సమావేశమైన వారిలో ఒక్కరైన గిల్ అను అమెరికన్ సాధకునకు బహుకరించిరి. ఒక సంవత్సరము తరువాత కొందరు భారతీయ మిత్రులకు దానిని చూపగా అది భారతీయులకు ఆరాధ్యమైన సాలిగ్రామమని చెప్పి, బాబా ఊదగా ఏర్పడిన చిహ్నము యొక్క గూఢార్థమును వివరించిరి. ఒక నల్లరాయిని పవిత్రమైన సాలిగ్రామముగా క్షణములో తన కండ్ల యెదుట మార్చిన ఆ సంఘటనను గూర్చి ఆశ్చర్యపడెను. నాడు సమావేశితులైన వారిలో ఒకడైన హోవర్డ్ మెర్విన్ ఈ ఉదంతమును నాకు చెప్పెను.

ముఖ్యముగా మనల నాశ్చర్య చకితులను చేయునది బాబా యొక్క బహుముఖ ప్రజ్ఞా దురంధరత్వము. ఒక పెద్ద పారిశ్రామిక సంస్థ యొక్క అధినేత బాబాను దర్శించిన పిదప బాబాయొక్క పారిశ్రామిక పరిజ్ఞానము ముందు తన విజ్ఞానము అనుభవములు అత్యల్పములని గుర్తించెను. రోగ నిర్ణయ విజ్ఞానములో బాబాతో సమానమైన వైద్యుడుండడని ఒక ప్రఖ్యాత డాక్టర్ తన ఆశ్చర్యమును వ్యక్తపరిచెను. ఎంత అనుభవజ్ఞుడైన ఇంజనీరైనా బాబా అభివ్యక్తము చేయు నిర్మాణ కౌశలమునకు, సాంకేతిక విజ్ఞాన ప్రతిభకు ఆశ్చర్యపడి శిరము వంచును; తాను క్రొత్త పాఠములు నేర్చుకున్నందుకు ఆనంద కృతజ్ఞతలు తెలుపును. ఎందరో సంగీత విద్వాంసులు బాబా యొక్క స్వరకల్పనా నైపుణ్యమును, ప్రణవ నాదము వంటి మధుర గాత్రమును గుర్తించి, కీర్తించిరి. బాబా యొక్క గానమాధుర్యమును పొగుడుచూ అలనాటి త్యాగ రాజుతో పోల్చగా ''ఆ త్యాగరాజుకు సంగీతం నేర్పిన దెవరు?'' అని బాబా చమత్కరించిరి. బాబా కవులందరి తలదన్నిన మహాకవి. కవులకు బాబాయే ఒక అద్భుత కవితా వస్తువు. వారితో ప్రసంగించుటతో కవుల హృదయాంత రాళములో దాగియున్న భావ సౌరభం బహిర్గతమై రూపము దాలుస్తుంది. వేదాంతోపన్యాసకుడు, అతిక్లిష్టమైన ఆధ్యాత్మిక తత్వమును సున్నితముగా బోధించు విధానమును బాబా వద్ద నేర్చుకొనును. క్షణక్షణము మారే బాబా ముఖకవళికలలోనూ, కన్నుల దృక్కులలోనూ ద్యోతకమయ్యే భావ విన్యాసము లెంతటి చిత్రకారునకైననూ రచింపనలవికాదు. సుశిక్షితులూ అనుభవజ్ఞులూ అయిన ఉపాధ్యాయులు బోధనా విధానములో బాబానే గురువుగా పాటిస్తారు. గీతలో చెప్పబడినట్లుగా ''భగవంతుడు అందరినీ మించిన ఉత్తముడు. బలాఢ్యుడు, ప్రజ్ఞాశాలి, సుందరుడు, అవాఙ్మానస గోచరుడు. ఈ సకల సద్గుణముల సమ్మిళితమే దివ్యతత్వము.''

''చేప ఆకాశ స్వరూపము నెలా గ్రహించగలదు.'' అన్నారు బాబా ఫుల్మన్ తో మరో సందర్భములో బాబా ''నేను సర్వదేవతా స్వరూపుడను. ఈ మానవాళి యావత్తూ కలసి కొన్ని వేల **సంవత్సరములు** అన్వేషించినా, నా నిజతత్వమును గ్రహించలేదు'' అని ప్రకటించిరి.



'కృష్ణ- అవతార తత్వ పరిశీలన' అను తాను రచించిన గ్రంధములో భగవాన్‌దాస్‌గారు భగవంతుడవతరించుటకు కారణమగు పరిస్థితులను ప్రస్తావించిరి. అసత్యవాదులు ఆత్మకంటే దేహమే ముఖ్యమని బోధించునపుడు అవినీతి, అరిషడ్వర్గములు, సప్తమహాపాపములు, దురాశ, స్వార్థము, దౌష్ట్యము ప్రబలి విలయ తాండవము చేయుచున్నప్పుడు, భగవంతుడవతరించును. అసత్యవాద ప్రాబల్యము నుండి కాపాడుటకు భగవంతుడవతరించి మానవాళి హృదయములలో జ్ఞానజ్యోతిని తిరిగి వెలిగించును. దురహంకార దుర్భావముల బారినుండి రక్షించుటకు నిరహంకార ప్రవృత్తిని ప్రోత్సహించు నిరుపమాన ప్రేమను ఆయుధ ముగా ధరించి అవతరించును లోకమున దుర్మార్గము, అవినీతి ప్రబలినప్పుడు యధోచితముగా వారి వారి కర్మలను సంస్కరించి సన్మార్గ వర్తనులుగా పరివర్తింప జేయును.

ఈ మార్గముల సమ్మేళనము బాబా చర్యలలో అభివ్యక్తమౌతుంది. సువిదితముగా మధురముగా వేదాంతసారమును ప్రబోధించు సద్గురువుగా ఈనాడు బాబా విశ్వవిఖ్యాతి గాంచిరి. నామ సంకీర్తనము ద్వారా ప్రజలకు ప్రేమను పంచి పెట్టుచున్నారు. మానవుల నిత్య జీవితములో ఆధ్యాత్మిక తత్వ సారమును తిరిగి ప్రవేశపెట్టిరి. ప్రొఫెసర్ పి. శంకరనారాయణ రచించిన 'శ్రీరామచంద్ర' అనుగ్రంధములో శ్రీరామునిగూర్చి వ్రాసిన అంశములు బాబాకు అన్వ యించును. ''భగవంతుని ఆశయము పట్ల మానవుడు ఉత్సాహము చూప వలెనన్న భగవంతుడు మానవాకారము ధరించవలెను. అతని దివ్యత్వములో మానవత్వము, మానవత్వములో దివ్యత్వము అభివ్యక్తము కావలెను. మానవుని అనంతునిగా చేయుటకుగాను అపరిమితుడైన భగవంతుడు పరిమితుడుగా మారవలెను.

# మరొక్కమాట

ఈ పుస్తకమూ ఇంతకు పూర్వము వెలువడిన రెండు భాగములు చదివిన వ్యక్తిలో కొంత సంచలనం కలుగుతుంది. అతనిలో మార్పు వస్తుంది. తన సంతృప్తి కొరకైనా ఇందలి అంశములలోని సత్యాసత్యములు పరిశీలించుటకు **ఉద్యుక్తుడవుతాడు.** 'కేన్సర్ కేన్సిల్ చేసెను'' అని కేన్సర్‌ని బాబా అదృశ్యం చేయగలరు. ఇక్కడ తమ ఆశ్రమములో వుండి ''ఇంక మంటలుండవు'' అని వారనుటయే తడవుగా మెక్సికో సరిహద్దులలో వున్న 'కుచుమ మౌంట్' మీద అగ్నిజ్వాలలు చల్లారిపోయాయి. బాబా విభూతి భరిణను సృష్టించి యిస్తే అందులోని విభూతి అక్షయమౌతుంది. వారి హస్త స్పర్శ మాత్రముచే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుంది. వారికి ప్రతివ్యక్తి యొక్క భూత భవిష్యత్తులు తెలుసును. మనమూ వారూ ఒక్కటేయనీ, కాదనుకొనుట మన భ్రమయని చెప్పుచూ వుంటారు.

ఆర్నాల్డ్ షుల్మన్ రచించిన 'బాబా' అను గ్రంథమును సమీక్షిస్తూ 'పబ్లిషర్స్ వీక్లీ' అను పత్రిక ఈ విధంగా వ్రాసినది. ''సత్య సాయిబాబా తాను భగవదవతారమని చెప్పుచున్నారు. అరవై లక్షలకు పైగా వున్న భక్తులు దక్షిణ భారత దేశములో పుట్టపర్తి గ్రామములో వున్న ఆశ్రమమునకు వెళ్ళి వారి పాదములచెంత కూర్చుని నామ సంకీర్తనము చేయుచు వారి మహిమల కొరకు ప్రార్థించెదరు. వారు నయము కాని వ్యాధులను నయము చేయుదురు. వివిధ వస్తువులను,పవిత్ర విభూతిని సృష్టించి యిచ్చి సందేహములను బాపి విశ్వాసమును వృద్ధి చేయుదురు.''

ప్రతి మానవ కాయమందూ విరాజిల్లు దివ్యతత్వమే బాబా యను సత్యమును విస్మరించి బాబా కూడా మనవంటి మానవుడేఅని పొరపడుతూ వుంటాము. షిరిడి సాయిబాబా తనూ ఒకే దివ్యత్వము నుండి ఉద్భవించిన అవతరాములని చెప్పుదురు. ఇంతవరకు వచ్చిన అవతారములలోను రాబోవు అవతారములలోను వుండే ఒకే దివ్యతత్వమే బాబా.

బాబాకు దగ్గిరివారు దూరంవారు అంటూ యెవరూ లేరు. మానవాళి యావత్తు వారికి సన్నిహితులే. విషయ వాంఛలు దురభ్యాసముల బారి నుండి, మూర్ఖత్వము బారి నుండి అసంఖ్యాకులైనవారు రక్షించబడి సన్మార్గవర్తనులుగా సంస్కరించబడిరి. అనతికాలములోనే సాయి నామము ప్రతి హృదయమును అలంకరిస్తుంది.

తాను అవతరించి అమరత్వము చేకూర్చిన పుట్టపర్తి గ్రామములో వున్న ప్రశాంతి నిలయము బాబా నివాసము. నిజానికి ప్రశాంతి నిలయము వారి నివాసము కాదు. వారు చెప్పునట్లు ''నీ హృదయమే నా నివాసము, నా ప్రశాంతి నిలయము నీలోనే వున్నది.

బాబా భజనలు ఇంటింటా వ్యాపించినవి. భక్తులు నగర సంకీర్తనముతో ప్రజల హృదయములలో దివ్యజ్యోతులు **వెలిగిస్తున్నారు.** భగవంతుని అనేక రూపనామములలో



ఏ రూపనామముతోనైనా బాబాను ఆరాధించవచ్చు.

ప్రకృతి సిద్ధాంతముల నధిగమించిన మహోజ్వాల దివ్యశక్తిని మనము బాబాలో చూడగలము. మనలో ఎన్ని లోపములు, దోషములున్ననూ దగ్గరకు చేర్చుకుని మన కన్నీరు తుడిచి దుఃఖమును బాపెదరు. 1962 సం॥లో బాబా జన్మదినోత్సవమునకు ముందే, మనపై దండయాత్ర కొనసాగించుచున్న చైనా వారు తిరోగమించెదరని ముందే చెప్పిరి. నవంబరు 22వ తేదీన చైనావారు హిమాలయముల వెనుకకు మరలి పోయిరి. 1965 సం॥లో పాకిస్తాన్ దండయాత్ర కారణముగా అమలులో వున్న అత్యవసర పరిస్థితి సందర్భముగా దసరా ఉత్సవము ఉండదని నిరుత్సాహపడుచుండగా యధావిధిగా జరుగునని బాబా ప్రకటించిరి. దసరా పండుగకు మూడురోజుల క్రితమే కాల్పులు విరమించి సంధికి ఒప్పుకున్నారు. 1971 సం॥ డిశంబరు 22, 23 తేదీలలో మద్రాసులో అఖిలభారత సత్యసాయి సేవాసంస్థల మహాసభ జరుగునని ప్రకటించిరి. డిశంబరు 3వ తేదీన పాకిస్తాన్ విమానములు మన విమానాశ్రయాల మీద దాడిచేయుట వలన కలిగిన రాజకీయ ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఈ సభలు వుండునా వాయిదా పడునాయను ప్రశ్నలతో టెలిగ్రాములు వచ్చు చుండెను. యుద్ధము అంతవరకూ వుండదనీ, నిర్ణయించిన తేదీలలోనే మద్రాసులో సభలు జరుగుననీ బాబా ప్రకటించిరి. యుద్ధము డిశంబరు 17వ తేదీన ముగిసింది.

**బాబా సర్వులయందు** హృదయ నివాసి. నిత్యము ఎందరెందరో చుట్టూ చేరుచుండగా ఆ కారుణ్యమూర్తి అందరితోనూ అవ్యాజమైన ప్రేమతో వ్యవహరించు చుందురు. శారీరక అస్వస్థత, మానసిక రుగ్మత, వ్యధలు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహములు వృత్తి వ్యాపారములలో ఒడుదుడుకులు- ఒకటేమిటి, రకరకములైన ఆశ్రితుల సమస్యలను అత్యంత నైపుణ్యంతో పరిష్కరించెదరు.

అలెగ్జాండర్లూ వారి ఆశయాలూ సామ్రాజ్యాలు ఏమయ్యాయి. అందరూ చివరకు భస్మము కావలసినవారే. పవిత్రమైన విభూతి బాబా ప్రసాదించుటలో అంతరార్థము అదే. ఆ విధముగా అందరికీ వైరాగ్యము ప్రబోధిస్తున్నారు. ప్రాపంచిక వైభవ సంపదల అంతిమ పరిణామమును విభూతితో గుర్తు చేస్తూ మనలోని దురాశా ద్వేషములను నిర్మూలించెదరు.

నమ్మకములేని షుల్మన్ కూడా బాబాయొక్క సర్వజ్ఞతను అంగీకరించక తప్పలేదు. బౌద్ధమత సిద్ధాంతములను అధ్యయనము చేయుటకు షుల్మన్ జపాన్ వెళ్ళి పొందిన అనుభవములను బాబా చెప్పుచుండగా, ఈ వివరములన్నీ డా॥ గోకాక్‌ద్వారా బాబాకి తెలిసియుండ వచ్చునని భావించెను. ఇది గ్రహించిన బాబా తనకు డా॥ గోకాక్ ఈ వివరములేవీ చెప్పలేదని పలికిరి. తన ఒక్కనికే తెలిసిన తన భార్యయొక్క జబ్బును గురించి, అతడు భారతదేశమునకు వచ్చుటకు ముందు తమ అనుగ్రహము వలననే ఆ జబ్బు నయమైనదని బాబా వివరించగా షుల్మన్ నిర్ఘాంత పోయెను. బాబా తెరచిన పుస్తకము వంటివారు; అందరూ వారిని గూర్చి తెలుసుకోవచ్చు. బాబా మానవాళికి మార్గమూ, గమ్యమూను.

# శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్

దిగుమతి / ఎగుమతిదారు కోడ్ నెం. 2001198

ప్రస్తుతం మా వద్ద లభ్యమయ్యే తెలుగు పుస్తకముల జాబితా

| వనెం. | పేరు | ధర(రూ॥లు) | బరువు (గ్రా॥లు) |
|---|---|---|---|
| | **శ్రీవారి రచనలు, దివ్యోపన్యాసములు** | | |
| 01. | ఉపనిషత్‌వాహిని | 15.00 | 160 |
| 02. | గీతావాహిని | 28.00 | 300 |
| 03. | ధర్మవాహిని | 19.00 | 140 |
| 04. | ప్రశాంతివాహిని | 17.00 | 175 |
| 05. | ప్రశ్నోత్తరవాహిని | 12.00 | 120 |
| 06. | భాగవతవాహిని | 33.00 | 405 |
| 07. | రామకథారసవాహిని (1వ భాగం) | 45.00 | 508 |
| 08. | రామకథారసవాహిని (2వ భాగం) | 36.00 | 360 |
| 09. | లీలాకైవల్యవాహిని | 7.00 | 75 |
| 10. | సత్యసాయివాహిని | 32.00 | 285 |
| 11. | జ్ఞానవాహిని | 17.00 | 145 |
| 12. | ధ్యానవాహిని | 16.00 | 150 |
| 13. | ప్రేమవాహిని | 14.00 | 165 |
| 14. | విద్యావాహిని | 13.00 | 145 |
| 15. | సూత్రవాహిని | 8.50 | 55 |
| 16. | ప్రబోధపంచామృతము | 28.00 | 130 |
| 17. | శ్రీసత్యసాయి దివ్యబోధ(1978) | 35.00 | 215 |
| 18. | మనస్సు - మర్మము | 17.00 | 155 |
| 19. | సందేహనివారిణి | 18.00 | 195 |
| 20. | చిన్నకథ (1వ భాగం) | 21.00 | 230 |
| 21. | చిన్నకథ (2వ భాగం) | 20.00 | 205 |
| 22. | చిన్నకథ (3వ భాగం) | 25.00 | 230 |
| 23. | చిన్నకథ (బొమ్మల పుస్తకం 1వ భాగం) | 20.00 | 194 |
| 24. | చిన్నకథ (బొమ్మల పుస్తకం 2వ భాగం) | 24.00 | 200 |

| | | |
|---|---|---|
| 25. చిన్నకథ (బొమ్మల పుస్తకం 3వ భాగం) | 18.00 | 152 |
| 26. చిన్నకథ (బొమ్మల పుస్తకం 4వ భాగం) | 24.00 | 202 |
| 27. చిన్నకథ (బొమ్మల పుస్తకం 5వ భాగం) | 23.00 | 198 |
| 28. చిన్నకథ (బొమ్మల పుస్తకం 6వ భాగం) | 19.00 | 196 |
| 29. చిన్నకథ (బొమ్మల పుస్తకం 7వ భాగం) | 19.00 | 175 |
| 30. చిన్నకథ (బొమ్మల పుస్తకం 8వ భాగం) | 20.00 | 185 |
| 31. చిన్నకథ (బొమ్మల పుస్తకం 9వ భాగం) | 22.00 | 205 |
| 32. వచనామృతము (1984) | 45.00 | 410 |
| 33. శ్రీసత్యసాయి దివ్యబోధ (1993) | 27.00 | 250 |
| 34. శ్రీ సత్యసాయి గీతామృతం | 41.00 | 490 |
| 35. మధురోపన్యాసాలు (వేసవి తరగతులు, 1995) | 23.00 | 295 |
| 36. శ్రీ సత్యసాయి సూక్తులు | 30.00 | 390 |
| 37. వాక్యవిభూతి | 10.00 | 70 |
| 38. శ్రీసత్యసాయి వచనామృతం (1961-62) | 45.00 | 345 |
| 39. శ్రీసత్యసాయి వచనామృతం (1963-64) | 46.00 | 360 |
| 40. దసరా యజ్ఞసప్తకం (1997) | 22.00 | 210 |
| 41. దసరా యజ్ఞసప్తకం (1998) | 20.00 | 180 |
| 42. దీనసేవే దైవసేవ (దసరా సందేశాలు,2000) | 30.00 | 165 |
| 43. ప్రవృత్తి-నివృత్తి (దసరా సందేశాలు,2001) | 21.00 | 165 |
| 44. శ్రీసత్యసాయి వచనామృతం (1990) | 46.00 | 390 |
| 45. శ్రీసత్యసాయి వచనామృతం (1991) | 48.00 | 405 |
| 46. ఆధ్యాత్మిక భారతి (వేసవితరగతులు, 2000) | 25.00 | 307 |
| 47. రామాయణ దర్శనము (వేసవితరగతులు, 2002) | 23.00 | 250 |
| 48. సత్యదర్శనము (దసరా సందేశాలు, 2002) | 18.00 | 190 |
| 49. ఈశ్వరుని అమ్మ ఈశ్వరమ్మ | 11.00 | 100 |
| 50. శ్రీ సత్యసాయి సూక్తిముక్తావళి | 19.00 | 160 |
| 51. శ్రీ సత్యసాయి వేదవాణి | 47.00 | 542 |
| 52. శ్రీ సత్యసాయి పద్యసూక్తులు | 16.00 | 150 |
| 53. 'నేను నేనే' (దసరా సందేశాలు, 2004) | 10.00 | 65 |
| 54. ఏకత్వమే దైవత్వము (దసరా సందేశాలు, 2005) | 10.00 | 50 |
| 55. భగవాన్ శ్రీ సత్యసాయివాణి (ప్రథమ భాగం) | 37.00 | 405 |
| 56. భగవాన్ శ్రీ సత్యసాయివాణి (ద్వితీయ భాగం) | 30.00 | 310 |
| 57. 'అహం సత్యబోధకః' (జన్మదిన సందేశాలు) | 42.00 | 480 |
| 58. భగవాన్ శ్రీ సత్యసాయి స్వీయ చరిత్ర | 25.00 | 250 |
| 59. నిత్య జీవితంలో ఆధ్యాత్మిక సాధన | 44.00 | 470 |

**నూతనంగా వెలువడిన పుస్తకములు**

| | | |
|---|---|---|
| 60. శ్రీ సత్యసాయి వచనామృతం 2000 | 49.00 | 380 |
| 61. శ్రీ సత్యసాయి వచనామృతం 2001 | 43.00 | 390 |
| 62. శ్రీ సత్యసాయి వచనామృతం 2002 | 40.00 | 450 |
| 63. శ్రీ సత్యసాయి వచనామృతం 2004 | 31.00 | 325 |
| 64. శ్రీ సత్యసాయి వ్రత కల్పము | 9.00 | 70 |
| 65. శ్రీ సాయిబాబా నా మార్గం, నా గమ్యం | 50.00 | 485 |
| 66. సకల వేదసారమే రుద్రము (అతిరుద్ర మహాయజ్ఞం దివ్యోపన్యాసాలు) | 15.00 | 105 |
| 67. ప్రేమతరంగిణి | 39.00 | 320 |
| 68. ప్రేమబంధం | 19.00 | 175 |
| 69. శ్రీ సత్యసాయిదేవుని దివ్యసూక్తులు | 43.00 | 415 |
| 70. బాలవికాస్ నాటికలు | 35.00 | 370 |
| 71. సత్యోపనిషత్ | 33.00 | 360 |
| 72. శ్రీ సత్యసాయి దివ్య కృపాశ్రయం | 43.00 | 370 |
| 73. కాంతిరేఖలు | 45.00 | 390 |
| 74. చైతన్య ప్రవంతి | 26.00 | 235 |
| 75. శ్రీకృష్ణ చరితామృతం (కృష్ణాష్టమి దివ్యోపన్యాసాలు) | 54.00 | 490 |
| 76. శ్రీ సత్యసాయి - ఆర్తత్రాణపరాయణుడు | 42.00 | 410 |
| 77. భాష్యార్థ గోప్యములు | 21.00 | 220 |
| 78. మానస భజరే గురు చరణం (గురుపూర్ణిమ దివ్యోపన్యాసాలు, 1975 - 2005) | 55.00 | 476 |

**భక్తుల రచనలు**

| | | |
|---|---|---|
| 01. సత్యం శివం సుందరం (1వ భాగం) | 45.00 | 420 |
| 02. సత్యం శివం సుందరం (2వ భాగం) | 45.00 | 400 |
| 03. సత్యం శివం సుందరం (3వ భాగం) | 35.00 | 295 |
| 04. సత్యం శివం సుందరం (4వ భాగం) | 50.00 | 530 |
| 05. సత్యం శివం సుందరం (5వ భాగం) | 69.00 | 800 |
| 06. మణిమాల | 20.00 | 215 |

| | | |
|---|---|---|
| 07. భక్తోద్ధారక శ్రీ సత్యసాయి | 28.00 | 220 |
| 08. ప్రేమజ్యోతి | 36.00 | 400 |
| 09. మాతృశ్రీ ఈశ్వరమ్మ | 27.00 | 280 |
| 10. శ్రీసత్యసాయి ప్రేమసుధా ప్రవంతి | 50.00 | 550 |
| 11. సాయిభాగవతం | 20.00 | 180 |
| 12. భజనావళి | 25.00 | 300 |
| 13. శ్రీ సత్యసాయి ఆనందదాయి | 65.00 | 680 |
| 14. శివశక్తి సాయి | 12.00 | 120 |
| 15. శ్రీ సత్యసాయిమార్గంలో పిల్లల పెంపకం | 43.00 | 410 |
| 16. శ్రీ సత్యసాయి అవతార వైభవం | 14.00 | 155 |
| 17. ప్రశాంతినిలయ సమాచారదర్శిని | 12.00 | 105 |
| 18. స్వామి నా ప్రత్యక్ష దైవం | 39.00 | 410 |
| 19. వేద పుష్పాంజలి | 23.00 | 284 |
| 20. యజ్ఞవేది (వేదపండితుల వ్యాస సంకలనము) | 50.00 | 505 |
| 21. నివేదన (శ్రీవారి 80వ జన్మదినోత్సవ సావనీర్) | 47.00 | 340 |

**గమనిక:** మీకు కావలసిన పుస్తకాల ధర, పోస్టు ఖర్చులు కలిపి మనియార్డరు ద్వారాగాని, డ్రాఫ్ట్‌ద్వారాగాని **"కన్వీనర్, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్టు, ప్రశాంతినిలయం, అనంతపురం జిల్లా, పిన్ - 515134"** అనే చిరునామాకు ముందుగా పంపిన మీదట మావద్ద లభ్యమౌతున్న పుస్తకాలను పంపుతాము. పోస్టు ఖర్చులకు పుస్తకాల బరువుతో పాటు ప్యాకింగ్ మెటీరియల్ బరువునుకూడా పరిగణనలోకి తీసికొనవలెను.

**ప్యాకింగ్ మెటీరియల్ బరువు** : 100 గ్రాములు (రెండు కిలోలలోపు ప్యాకెట్‌కు); 300 గ్రాములు (రెండు కిలోల నుండి ఐదు కిలోల ప్యాకెట్‌కు)

**పుస్తకాలను రిజిస్టర్డ్ పోస్టులో మాత్రమే పంపడం జరుగుతుంది. వి.పి.పి. ద్వారా పంపించటం జరుగదు.**

**పోస్టు ఖర్చుల వివరాలు (ప్యాకింగ్ ఛార్జీలతో కలిపి):** 500 గ్రాములలోపు ప్యాకెట్‌కు రూ.లు 37; 500 గ్రాములనుండి ఒక కిలో ప్యాకెట్‌కు రూ.లు 42; ఒక కిలోనుండి రెండు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 52; రెండు కిలోలనుండి మూడు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 72; మూడు కిలోలనుండి నాల్గు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 82; నాల్గునుండి ఐదు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 92.




యుగావతారి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి [illegible]
వారి అవతార కార్యక్రమము 1969 - 1972 [illegible]
ముఖ్యంగా స్త్రీ విద్యయొక్క ప్రాధాన్యతను [illegible]
విద్యాసంస్థలను నెలకొల్పడం 'సత్యం శివం సుందరం' [illegible]
ఈ తృతీయ భాగములో [illegible]

Prasanthi Nilayam

T00TEL001906
SSSBPT
7474
Rs. 35

ISBN: 978-81-7208-[illegible]
978-81-7208-[illegible]

1969 to 1972
సత్యం శివం సుందరం 3వ భాగం



# సత్యం శివం సుందరం

3వ భాగం